బుధవారం
17•7•2019
కరీంనగర్
• వెల. రూ.6.50
• సంపుటి 9 • సంచిక 22
• పేజీలు: 16 + 16 + 8 పేజీల నిపుణ ప్రత్యేక అనుబంధం

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE
PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD







మంగళవారం అన్నారం బరాజ్ వద్ద జల జాతర కార్యక్రమంలో గోదావరిలో పూలువేస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యేలు బాల్క సుమన్, దివాకర్‌రావు, చందర్



అన్నారం బరాజ్ వద్ద గోదావరి జలాలను తిలకించేందుకు వస్తున్న ప్రజలకు స్వాగతం పలుకుతూ కళాకారుల విన్యాసాలు

# కాళేశ్వర జలజాతర

## వనభోజనాలకు పెద్దసంఖ్యలో హాజరైన ప్రజలు

- బోనాలు, బతుకమ్మలతో ర్యాలీగా బరాజ్‌వద్దకు
- గోదావరి నీళ్లకు పూజలుచేసిన ప్రజాప్రతినిధులు
- ఆడిపాడిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు
- ఉత్సాహంగా అన్నారం బరాజ్ సందర్శన


**మంచిర్యాల, జయశంకర్ జిల్లా, మంథని ప్రతినిధులు, నమస్తే తెలంగాణ:**

ప్రాణహిత నుంచి కొనసాగుతున్న వరదనీటితో మేడిగడ్డ బరాజ్, అక్కడి నీటిని కన్నెపల్లి పంప్‌హౌస్‌నుంచి నిరంతరాయంగా ఎత్తిపోస్తుండటంతో అన్నారం బరాజ్ భారీ జలాశయాలను తలపిస్తున్నాయి. మేడిగడ్డ బరాజ్‌లో మంగళవారం సాయంత్రానికి 7.50 టీఎంసీలు, అన్నారం బరాజ్‌లో 5 టీఎంసీల నీరు చేరుకున్నది. అన్నారం బరాజ్‌లో బ్యాక్‌వాటర్ పెరుగుతుండటంతో అన్నారం పంప్‌హౌస్‌లో మోటర్ల వెట్‌రన్‌కు అధికారులు ఏర్పాట్లుచేస్తున్నారు. స్వభావానికి విరుద్ధంగా ఎదురెక్కి వస్తున్న గోదావరి జలాలతో నిండుతున్న అన్నారం బరాజ్ వద్ద మంగళవారం వైభవంగా జలజాతర నిర్వహించారు. నృత్యాలు.. డప్పుచప్పుళ్లు.. బోనాలు.. ర్యాలీగా తరలివచ్చిన జనంతో మంచిర్యాల జిల్లాలోని అన్నారం బరాజ్‌వద్ద ఉత్సాహపూరిత వాతావరణం నెలకొన్నది. కాళేశ్వరం జలజాతర పేరుతో నిర్వహించిన వనభోజనాల కార్యక్రమానికి చెన్నూరు నియోజకవర్గంనుంచి దాదాపు 15 వేల మందివరకు వాహనాలు, ఎండ్లబండ్లలో జాతరను తలపిస్తూ తరలివచ్చారు. మహిళలు బోనాలు, బతుకమ్మలతో వచ్చారు. అతిథులకు డప్పుచప్పుళ్లు, బతుకమ్మలు, బోనాలు, తెలంగాణ సంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికారు. అన్నారం బరాజ్ వద్ద ఎక్కడ చూసినా జనమే కనిపించారు. మేడిగడ్డ బరాజ్‌నుంచి అన్నారం బరాజ్ వరకు పెద్దఎత్తున వరద నీరు వచ్చి చేరుతున్న నేపథ్యంలో గోదావరి తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆ బరాజ్ వద్దనే వనభోజనాలు చేయాలని ఎమ్మెల్యే బాల్క సుమన్ ఈ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు.

### నృత్యాలు చేసిన మంత్రులు, ఎమ్మెల్యేలు

కార్యక్రమం ప్రారంభానికి ముందు కళాకారుడు సాయిచంద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధూం-ధాం సభికులను ఉర్రూతలూగించింది. కాళేశ్వరం ప్రాజెక్టు, సీఎం కేసీఆర్‌పై సాయిచంద్ పాడిన పాటలు అందరినీ అలరించాయి. ఆయన పాటలకు జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, ఐసీడీఎస్ ఆర్గనైజర్ అత్తి సరోజ, ఇంచార్జి మూల విజయారెడ్డి నృత్యాలుచేశారు. అందరి ప్రసంగాలు ముగిసిన తర్వాత మళ్లీ పాటపాడటంతో మంత్రులు అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీలు పురాణం సతీశ్, నారదాసు లక్ష్మణ్‌రావు, ఎమ్మెల్యేలు బాల్క సుమన్, నడిపెల్లి దివాకర్‌రావు, కోరుకంటి చందర్, ఆత్రం సక్కు, పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్టమధు, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు తదితరులు నృత్యాలు చేసి సభికులను అలరించారు. సభానంతరం ఎమ్మెల్యే బాల్క సుమన్ మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా పరిషత్ చైర్మన్లు, ప్రజలతో కలిసి కాలినడకన అన్నారం బరాజ్‌వద్దకు వెళ్లి

మిగతా 2వ పేజీలో



జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిండుకుండలా కనిపిస్తున్న మేడిగడ్డ బరాజ్

- కన్నెపల్లిలో నిర్విరామంగా ఎత్తిపోత
- బరాజ్‌లలో పెరుగుతున్న నీటినిల్వ
- అన్నారం బరాజ్‌లోకి ఐదు టీఎంసీలు
- మేడిగడ్డ బరాజ్‌లో 7.50 టీఎంసీల నీరు
- అన్నారంలో పెరుగుతున్న బ్యాక్‌వాటర్
- వెట్‌రన్‌కు సిద్ధమవుతున్న పంపుహౌస్
- ఆల్మట్టికి తగ్గుతున్న వరద
- 104 టీఎంసీలకు పైగా నీటినిల్వ
- నారాయణపూర్ నుంచి లేని ఇన్‌ఫ్లో
- వరద నీటికి నోచుకోని జూరాల



మంగళవారం హైదరాబాద్‌లో వర్షం కురుస్తుండగా స్కూటీపై గొడుగుపట్టుకుని వెళ్తున్న మహిళలు. రాజధానిలో కురిసిన వానకు వాతావరణం ఒక్కసారిగా ఆహ్లాదకరంగా మారింది.

## ఎల్లుండినుంచి భారీ వర్షాలు

### రెండ్రోజుల్లో బలపడనున్న రుతుపవనాలు

**రాష్ట్రంలోని** పలు జిల్లాల్లో మంగళవారం తేలికపాటి వర్షాలు కురువగా, హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో అత్యధికంగా 3.6 సెం.మీ. వర్షపాతం నమోదైంది. నల్లగొండ జిల్లాలోని పలుప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్, భూదాన్ పోచంపల్లిలో అరగంటపాటు వానపడింది. రంగారెడ్డి జిల్లాలో ఓ మోస్తరు వర్షం కురిసింది. రాష్ట్రంలో మరో రెండ్రోజుల్లో విస్తారంగా వానలు కురిసే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

వివరాలు 2, 8వ పేజీల్లో

## రికార్డు స్థాయిలో సభ్యత్వాలు

కొనసాగుతున్న గులాబీ పార్టీ జోష్
ఇంటింటికి వెళ్తున్న శ్రేణులు

7




- దేశ చరిత్రలోనే సరికొత్త రికార్డు


5

## 2,80,616 డబుల్ బెడ్‌రూం ఇండ్లు



పారదర్శకతకు, జవాబుదారీతనానికి పెద్దపీట
జాప్యం లేకుండా కాంట్రాక్టర్లకు చెల్లింపులు
నిర్మాణాలు చేపట్టేవారికి ప్రత్యేక ప్రోత్సాహకాలు

## అడ్డుకోవడమే ఏకైక ఎజెండానా?



కొత్త అసెంబ్లీ, సచివాలయ నిర్మాణాలు అవసరం
వేర్వేరు చోట్ల ప్రభుత్వ ఆఫీసులతో అవస్థలు
కిరాయిలకే ఏటా రూ.32 కోట్లు చెల్లింపులు
విపక్షాల తీరుపై ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ ఆగ్రహం

3



ముంబైలోని డోంగ్రీ ప్రాంతంలో కూలిన వందేండ్లనాటి భవనం శిథిలాల్లో చిక్కుకున్న వారిని వెతుకుతున్న ఎన్డీఆర్‌ఎఫ్ బృందం

## కుప్పకూలిన భవనం

11 మంది మృతి
40 మందికిపైగా శిథిలాల కింద
రక్షించేందుకు తీవ్రంగా శ్రమిస్తున్న ఎన్డీఆర్‌ఎఫ్ బృందం
ముంబైలో ఘటన

9

2

## నేడు రాష్ట్ర క్యాబినెట్ భేటీ

కొత్త మున్సిపల్ చట్టం బిల్లును ఆమోదించనున్న మంత్రివర్గం




## తల్లీబిడ్డ భద్రం

రాష్ట్రంలో తగ్గుతున్న మాతాశిశు మరణాలు ▪ ఎస్‌ఆర్‌ఎస్ ప్రత్యేక బులెటిన్ వెల్లడి
పదివేల ప్రసవాల్లో తొమ్మిది మరణాలు ▪ శిశు మరణాల్లోనూ గణనీయ తగ్గుదల
టీఆర్‌ఎస్ సర్కారు చర్యలతో మార్పు ▪ ఫలితాలనిస్తున్న కేసీఆర్ కిట్స్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**




ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన నాటినుంచి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు నాయకత్వంలోని ప్రభుత్వం వైద్యరంగంలో తీసుకువస్తున్న మార్పులతో తెలంగాణలో మాతాశిశు మరణాల రేటు తగ్గుతున్నది. ఉమ్మడి రాష్ట్రంలో పేదలు పడ్డ అవస్థలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ దవాఖానాల్లో ప్రసవాలు జరిగేలా తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రత్యేక కార్యక్రమాలు సత్ఫలితాలనిస్తున్నాయి. రాష్ట్రంలో ప్రసూతి మరణాల శాతం, నవజాత శిశువుల మరణాల సంఖ్య గణనీయంగా తగ్గుతున్నాయని మెటర్నిటీ మోర్టాలిటీ ఇండియా శాంపిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (ఎస్‌ఆర్‌ఎస్) ద్వారా విడుదల చేసిన ప్రత్యేక బులెటిన్ పేర్కొన్నది. భవిష్యత్‌తరాలకు ఆరోగ్యవంతమైన నవజాత శిశువులను అందించి తెలంగాణలో

మిగతా 2వ పేజీలో

## ఉద్యోగాల్లో మనమే టాప్

తెలంగాణ, ఏపీకి దేశంలోనే అగ్రస్థానం
సెంటర్ ఫర్ పాలసీ రిసెర్చ్ సర్వేలో వెల్లడి


**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఉద్యోగాల కల్పనలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో కొనసాగుతున్నట్టు సెంటర్ ఫర్ పాలసీ రిసెర్చ్ సర్వేలో వెల్లడయింది. తెలంగాణతోపాటు ఏపీ కూడా ముందు వరుసలో నిలిచింది. తెలుగు రాష్ట్రాల్లో ఉద్యోగులకు సౌకర్యాలతోపాటు పింఛన్లు, ఇన్సూరెన్స్ లాంటి సదుపాయాలు మెరుగ్గా ఉండటమే ఇందుకు కారణమని

మిగతా 2వ పేజీలో

## కాస్తులో ఉన్నా కాటేశారు!

- విచారణ లేకుండానే భూమార్పిడి
- అధికారుల తప్పులకు అన్నదాతకు అవస్థలు
- రికార్డుల సవరణకు రెవెన్యూ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు
- ప్రొసీడింగ్ ఇచ్చి చేతులు దులిపేసుకొన్న అధికారులు
- ధర్మగంటను ఆశ్రయించిన జోగుళాంబ గద్వాల జిల్లా రైతు

4




పాస్‌బుక్ చూపుతున్న బాధిత రైతు తట్టిపల్లి తిక్కయ్య

నిన్నమొన్నటి వరకు అంతా బాగానే ఉన్నది. జోగుళాంబ గద్వాల జిల్లాకు చెందిన ఓ రైతు తనకు వారసత్వంగా సంక్రమించిన భూమిని సాగు చేసుకొంటున్నారు. ఆర్థిక అవసరాల కోసం కొంత భూమిని అమ్ముకొన్నా.. మిగతా భూమిని మాత్రం తానే కాస్తులో ఉండి ఉన్నకాడికి పంటలు పండించుకొని బతుకుతున్నారు. ప్రభుత్వం నిర్వహించిన భూరికార్డుల ప్రక్షాళన జరిగేంతవరకు కూడా ఇబ్బందులేం రాలేదు. రికార్డుల ప్రక్షాళనలో అధికారుల అలసత్వం సదరు రైతుకు ప్రాణసంకటంగా మారింది. ఈ రైతుకు చెందిన భూమినంతా ముందూవెనుకా చూడకుండా.. విచారణ చేయకుండా వేరే వ్యక్తిపేరిట మార్చేశారు. ఇదేమని అడిగితే చూద్దాంలే అంటారు. ఒకట్రెండు రోజుల్లో చేయాల్సిన పనికి నెలల తరబడి తిప్పుకొంటుండటంతో గద్వాల జిల్లా చిన్నతాండ్రపాడుకు చెందిన రైతు తిక్కయ్య 'ధర్మగంట'ను ఆశ్రయించారు.

## కబ్జాల డీఎస్పీ!

నల్లగొండలో పోలీసు అధికారి భూ దాహం
'ఆడబిడ్డల భూమిపై డీఎస్పీ కన్ను' కథనంతో.. వెలుగులోకి మరికొన్ని దురాగతాలు


5

## ఏపీ గవర్నర్‌గా బిశ్వభూషణ్

ఒడిశా బీజేపీ సీనియర్ నేతకు బాధ్యతలు
రాష్ట్రపతి భవన్ ఉత్తర్వులు జారీ
తెలంగాణకు గవర్నర్‌గా కొనసాగనున్న నరసింహన్
ఛత్తీస్‌గఢ్ గవర్నర్‌గా అనసూయ ఊకే నియామకం

9









రెండో షిర్డీగా పేరుగాంచిన జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని సాయిబాబా ఆలయంలో మంగళ వారం గురుపౌర్ణమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. వేలాదిమంది భక్తులు సాయిని దర్శించుకున్నారు.

# హాస్టళ్లలో అగ్నిప్రమాద నివారణ చర్యలు

- ఖమ్మం విద్యార్థిని మృతి ఘటనలో పరిహారం రూ.5 లక్షలకు పెంపు
- ఎస్సీ అభివృద్ధిశాఖ డైరెక్టర్‌కు మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదేశాలు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/ మామిళ్ల గూడెం:** ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనా ర్టీ, విక లాంగుల సంక్షేమ హాస్టళ్లలో అగ్నిప్రమా దాలు జరుగకుండా ఫైర్‌సేఫ్టీ ఏర్పాటుచే సేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వ ర్ మంగళవారం తెలిపారు. అగ్నిప్రమాదాల నివారణకు శాశ్వత ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని, ఇందు కోసం ఎలక్ట్రికల్ ఇంజినీర్లు, ఫైర్‌సేఫ్టీ అధికారుల ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి 15 రోజుల్లో తని ఖీలు జరుపాలని ఆదే శించినట్టు మంత్రి పేర్కొన్నారు. అవసర మైనచోట అగ్నిప్రమా ద నివారణ పరిక రాలను అదనంగా సమకూర్చుకోవాలని సూచించామని పేర్కొన్నారు. ఆదివారం రాత్రి ఖమ్మం పట్టణంలో జరిగిన ప్రమా దంలో ఎస్సీ హాస్టల్ విద్యా ర్థిని మృతి ఘటన తనను కల చివేసిందన్నారు. బాధిత కు టుంబానికి ఇంతకుముందు ప్రకటించిన పరిహారం రూ.2 లక్షలను 5లక్షలకు పెంచు తూ ఉత్తర్వులు జారీచేయా లని ఎస్సీ అభివృద్ధిశాఖ డైరెక్ట ర్‌ను మంత్రి ఆదేశించారు. వసతిగృహ బాలిక స్పందన (9) మృతిపై రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఎర్రోల్ల శ్రీనివాస్ విచారణకు ఆదేశించారు.



# నేడు రాష్ట్ర క్యాబినెట్ భేటీ

## కొత్త మున్సిపల్ చట్టం బిల్లును ఆమోదించనున్న మంత్రివర్గం

- వివిధ ఆర్డినెన్సులను కూడా ఆమోదించే అవకాశం
- రేపు, ఎల్లుండి అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పురపాలక శాఖ నూతన బిల్లుకు ఆమోదం పొంది చట్టంగా తీసుకురావడమే ప్రధాన ఎజెం డాగా రాష్ట్ర మంత్రివర్గం బుధవారం సమా వేశంకానుంది. సాయంత్రం నాలుగు గంట లకు ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కే చంద్ర శేఖర్‌రావు అధ్యక్షతన భేటీకానున్న మంత్రి వర్గం.. మున్సిపల్ బిల్లుతోపాటు గతంలో జారీచేసిన పలు ఆర్డినెన్స్‌లకు ఆమోదం తెలిపి, చట్టరూపం ఇచ్చే అవకాశం ఉన్నది. నూతన పురపాలక చట్టం తీసుకొచ్చేందుకు గురు, శుక్రవారాల్లో అసెంబ్లీ ప్రత్యేక సమా వేశాలు నిర్వహించాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. ఈ సమావేశాల్లో ప్రవేశపె ట్టేందుకు పురపాలకశాఖ సిద్ధంచేసిన ముసా యిదా బిల్లుకు న్యాయశాఖ ఆమోదం కూడా లభించింది. ఈ నేపథ్యంలో బుధవారం సమావేశంకానున్న మంత్రివర్గం బిల్లుపై చర్చించి ఆమోదం తెలియజేయనున్నది. కొత్త చట్టం ఉద్దేశం, దాని లక్ష్యాలు, తన మనసులోని ఆలోచనలను ముఖ్యమంత్రి కేసీఆర్ తన మంత్రివర్గ సహచరులకు వివరి స్తారు. క్యాబినెట్‌లో ఆమోదించిన బిల్లును ఈ నెల 18న అసెంబ్లీలో ప్రవేశపెడతారు. 19న ఆమోదం పొందనున్నారు. అదేరోజు కౌన్సిల్‌లోనూ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదం పొందనున్నారు.



పెద్దపల్లి జిల్లా మంథనిలో గోదావరి వద్ద పర్యాటకుల సందడి



జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని కన్నెపల్లి పంప్‌హౌస్‌లో గోదావరి జలాలను ఎత్తిపోస్తున్న 1, 3, 4, 5వ నంబర్ మోటర్లు

జలాభిషేకం

# కాళేశ్వర జలజాతర

మొదటిపేజీ తరువాయి...

గోదావరి నదికి ప్రత్యేక పూజలుచేశారు. అతి థులను ఎమ్మెల్యే శాలువాలతో సన్మానిం చారు. అనంతరం ప్రజలతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. రామగుండం సీపీ సత్య నారాయణ భద్రత ఏర్పాట్లు పర్యవేక్షించారు.

### కన్నెపల్లిలో నిర్విరామంగా ఎత్తిపోత

కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నిర్విరామంగా నీటిని ఎత్తిపోస్తుండటంతో అన్నారం బరా జ్‌లో నీటినిల్వ రోజురోజుకు పెరుగుతున్నది. మంగళవారానికి జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం మేడిగడ్డ బరా జ్‌లో 7.50 టీఎంసీలు, అన్నారం బరాజ్‌లో 5 టీఎంసీల నీరు నిలిచింది. కన్నెపల్లి పంపు హౌస్‌లో ఒక మోటర్‌కు సాగునీటిశాఖ ఇంజి నీర్లు మంగళవారం విరామం ఇచ్చారు. నాలు గు (1, 3, 4, 5వ నంబర్) మోటర్లతో ఎత్తి పోత కొనసాగింది. 0.8 టీఎంసీల నీరు గ్రావి టీ కెనాల్ ద్వారా అన్నారం బరాజ్‌కు చేరింది. సాయంత్రానికి అన్నారం బరాజ్‌లో నీటినిల్వ ఐదు టీఎంసీలకు చేరినట్టు కాళేశ్వరం ఎత్తిపో తల ప్రాజెక్టు ఇంజినీర్లు తెలిపారు. మంగళ వారం నిలిపివేసిన ఆరోనంబర్ మోటర్‌ను నేడో రేపో తిరిగి ప్రారంభించనున్నట్టు చెప్పా రు. రెండోనంబర్ మోటర్‌ను కూడా ప్రారం భించేందుకు ఇంజినీర్లు సన్నద్ధమవుతున్నారు. ఈ రెండూ ప్రారంభమైతే మొత్తం ఆరుమోట ర్లు నీటిని ఎత్తిపోయనున్నాయి. ఇదిలాఉంటే.. వరదప్రవాహ సామర్థ్యాన్ని (లోడ్ టెస్టింగ్) పరీక్షించేందుకు మేడిగడ్డ బరాజ్‌లోని రెండు గేట్లను మూడుమీటర్ల మేర ఎత్తినట్టు ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రాణహిత నుంచి గోదావరిలోకి ఇన్‌ఫ్లో నిలకడగా ఉంది. గోదావరిలో ప్రాణహిత కలిసిన కాళేశ్వరం వద్ద మంగళవారం 11 వేల క్యూసెక్కుల ప్రవాహం నమోదైంది. మేడిగడ్డ బరాజ్‌లో బ్యాక్‌వాటర్ కన్నెపల్లి పంపుహౌస్ మీదుగా గోదావరిలో త్రివేణి సంగమం వరకు విస్తరించింది. మంగ ళవారం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో ప్రజలు మేడిగడ్డ, అన్నారం బరాజ్‌లను, కన్నెపల్లి పంపుహౌస్‌ను సంద ర్శించి సంతోషం వ్యక్తంచేశారు.

### వెట్‌రన్‌కు సిద్ధంగా అన్నారం పంప్‌హౌస్

ఎదురెక్కుతున్న జలాలతో అన్నారం బరా జ్‌లో బ్యాక్‌వాటర్ 35 చదరపు కిలోమీటర్లలో విస్తరించింది. కన్నెపల్లి నుంచి ఎత్తిపోస్తున్న నీటితో కాసిపేటలోని అన్నారం పంప్‌హౌస్ కాఫర్‌డ్యాం నుంచి హెడ్ రెగ్యులేటరీ గేట్ల వద్దకు నీళ్లు వచ్చి చేరడంతో పంప్‌హౌస్‌లోని మొత్తం ఎనిమిది మోటర్లకుగాను.. నాల్గింటిని ఏకకాలంలో నడిపేందుకు కాళేశ్వరం ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు, నీటిపారుదల సలహాదారు పెంటారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. నీటి స్థాయినిబట్టి శుక్రవారం మోటర్లకు వెట్ రన్ నిర్వహించనున్నారు.

### సీసీ కెమెరాలతో పర్యవేక్షిస్తున్న సీఎం

అన్నారం పంప్‌హౌస్ గ్రావిటీ కెనాల్, డెలివరీ సిస్టర్న్ దగ్గర ఏర్పాటుచేసిన సీసీ కెమెరాల ద్వారా సీఎం కేసీఆర్ రోజూ పనులను పరిశీలి స్తూ సమీక్షిస్తున్నారు. ఇంకా చేపట్టాల్సిన పను ల గురించి సూచనలుచేస్తున్నారు. మోటర్ల నుంచి డెలివరీ సిస్టర్న్ దాకా నీటిని తీసుకు వచ్చే పైప్‌లైన్లను ఇంజినీర్లు పూర్తిచేశారు. శుక్ర వారంలోగా పనులను పూర్తిచేసి పంపులను నడిపేలా సీఎం దిశానిర్దేశం చేస్తున్నారు.



నిండుకుండలా కర్ణాటకలోని ఆల్మట్టి జలాశయం

## ఆల్మట్టికి తగ్గుతున్న వరద

### 104 టీఎంసీలకు పైగా నీటినిల్వ

**హైదరాబాద్/ మహబూబ్‌నగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** వరుసగా ఆరురోజులపాటు ఆల్మట్టి ప్రాజెక్టుకు లక్షకు పైగా క్యూసె క్కుల వరద ఉధృతి కొనసాగగా.. ఏడోరోజు తగ్గింది. సోమవారం ఈ సీజన్‌లోనే అత్యధికంగా 1,11,560 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమో దుకాగా.. మంగళవారం ఉదయానికి ఇన్‌ఫ్లో 82,808 క్యూసెక్కు లకు పడిపోయింది. సాయంత్రానికి 56,502 క్యూసెక్కులకు తగ్గిం ది. లక్షకుపైగా క్యూసెక్కుల ఇన్‌ఫ్లోనుంచి ఒక్కసారిగా సగానికి తగ్గి పోవడంతో జూరాలకు వరద మరింత ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఆల్మట్టిలో ప్రస్తుతం 104 టీఎంసీలకు పైగా నీటి నిల్వ ఉన్నది. మరో 26 టీఎంసీలు వస్తే జలాశయం నిండుతుంది. ఈ నేపథ్యంలోనే కర్ణాటక అధికారులు నాలుగైదు రోజులుగా ఆల్మట్టి వద్ద విద్యుత్ ఉత్పత్తి మోతాదును పెంచుతున్నారు. మంగ ళవారం 33,128 క్యూసెక్కుల అవుట్‌ఫ్లోతో కరంటును ఉత్పత్తి చేస్తుండటంతో 40 వేల క్యూసెక్కుల వరదతో నారాయణపూర్ రిజర్వాయర్‌లో నీటిమట్టం పెరుగుతున్నది. నారాయణపూర్ నుంచి 1632 క్యూసెక్కుల నీటిని కాల్వలద్వారా వదులుతున్నారు. ఆల్మట్టికి ఇన్‌ఫ్లో తగ్గిపోతుండటంతో ప్రస్తుత వరద కర్ణాటకకే పరి మితమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆల్మట్టి నుంచి విద్యుత్ ఉత్పత్తికోసం నారాయణపూర్‌కు నీటిని వదులుతున్నా.. నారాయ ణపూర్ నుంచి విద్యుత్ ఉత్పత్తి కూడా ప్రారంభించలేదు. కాల్వల ద్వారానే నీటిని వదులుతున్నారు. దాంతో జూరాలకు చుక్కనీరు రావడంలేదు. రాబోయే రెండురోజులు ఇదే పరిస్థితి కొనసాగే అవ కాశం ఉన్నదని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఈఈ హెచ్‌టీ శ్రీధర్ నమస్తే తెలంగాణకు తెలిపారు. మరోవైపు ఉజ్జయిని, తుంగభద్ర కూడా నిరాశపరుస్తున్నాయి. భీమా ప్రధాన ప్రాజెక్టు అయిన ఉజ్జ యినికి ఇన్‌ఫ్లో 4వేల క్యూసెక్కులకు పరిమితం కాగా, తుంగభద్ర డ్యాంకు 12,875 క్యూసెక్కుల వరద వస్తున్నది. గోదావరిలోనూ వరద తగ్గుముఖం పడుతున్నది. పేరూరు వద్ద 60-70 వేల క్యూసె క్కుల ప్రవాహం ఉండగా.. మంగళవారం అది 30వేల క్యూసెక్కు లకే పరిమితమైంది. భద్రాచలం వద్ద గోదావరి మరింత తగ్గు ముఖం పడుతున్నది. దిగువన ధవళేశ్వరంవద్ద కూడా ఇన్‌ఫ్లో 49 వేల క్యూసెక్కులకుపైగానే ఉన్నది. దీంతో అధికారులు దిగువన సముద్రంలోకి 34,743 క్యూసెక్కులను వదులుతున్నారు.

## తుంగభద్ర ప్రాజెక్టుకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

**అయిజ:** కర్ణాటకలోని తుంగభద్ర జలా శయానికి వరదనీటి ప్రవాహం కొనసా గుతున్నది. కర్ణాటకలోని ఎగువన ఒక మోస్తరులో కురుస్తున్న వానలకు తుంగ నదికి వరదనీరు వచ్చి చేరుతున్నది. దీంతో 12,875 క్యూసెక్కుల నీరు తుంగభద్ర డ్యాంలోకి చేరుతున్నది. 182 క్యూసెక్కులను తాగునీటి అవస రాలకు విడుదలచేస్తున్నారు. 100.855 టీఎంసీల సామర్థ్యం కలిగిన ఈ డ్యాంలో ప్రస్తుతం 13.388 టీఎంసీ లు నిల్వ ఉన్నట్టు డ్యాం సెక్షన్ అధికారి విశ్వనాథ్ తెలిపారు.



కర్ణాటకలోని బళ్లారి జిల్లా హోస్పేటలో ఉన్న తుంగభద్ర ప్రాజెక్టులో నీటి నిల్వలు



భద్రాచలం వద్ద గోదావరిలో జలకళ

# ఎల్లుండినుంచి భారీ వర్షాలు

నేడు, రేపు ఓ మోస్తరు వానలు

- రెండ్రోజుల్లో బలపడనున్న రుతుపవనాలు
- పశ్చిమ, నైరుతి దిశలనుంచి బలమైన గాలులు
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో కొన్నిరోజులుగా మందగించిన నైరుతి రుతు పవనాలు మరో రెండ్రోజుల్లో బలపడను న్నాయి. ఆ తర్వాత పుంజుకొని వారంపాటు భారీ వర్షాలు దంచికొట్టనున్నాయి. నైరుతి రుతుపవనాలు బలపడి రాష్ట్రంలో విస్తా రంగా వానలు కురిసే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం డైరెక్టర్ వై కరుణాకర్‌రెడ్డి వెల్లడించారు. బుధ, గురువా రాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు పడి, శుక్రవారం నుంచి వారంపాటు ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపారు. రాష్ట్రంలో రుతుపవనాలు క్రమం గా అనుకూలంగా మారుతున్నాయని చెప్పా రు. బంగాళాఖాతం మీదుగా అనుకూల పవ నాలు.. ప్రధానంగా నైరుతి, పశ్చిమ దిశల నుంచి బలంగా వీస్తున్నాయని తెలిపారు. గాలిలో తేమ కూడా పెరుగడం వల్ల నైరుతి రుతుపవనాలు చురుకుగా ముందుకు కదల నున్నాయని పేర్కొన్నారు. మరో వారంవ రకు రుతుపవనాలు చురుకుగా ఉండే అవ కాశం ఉన్నదని విశ్లేషించారు. గత వారం రోజులుగా మేఘాలు దట్టంగా కమ్ముకొం టున్నా తేలికపాటి వానలే కురుస్తున్నాయి. కొన్నిచోట్ల మాత్రమే ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. వాస్తవానికి జూలై నెలారంభంలో వర్షాల జోరు పెరిగినట్టే అని పించినా అది నాలుగురోజులకే పరిమిత మైంది. ఆ తర్వాత రుతుపవనాలు మంద గించాయి. బంగాళాఖాతం మీదుగా నెల కొన్న ప్రతికూల పవనాలతో రుతుపవనాల జోరు తగ్గింది. అదే సమయంలో రుతుపవ నాలు ఉత్తర భారతం వైపు బలంగా కది లాయి. గాలిలో తేమ కూడా తగ్గిపోవడంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో నైరుతి రుతుపవనాలు బలహీనపడ్డాయి. ఈ కార ణంగా రాష్ట్రంలో వర్షపాతం లోటు 48 శాతా నికి పెరిగింది. కాగా, మంగళవారం హైదరా బాద్‌తోపాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి వానలు కురిశాయి.

## ముహూర్తం

సూర్యోదయం: 5.54 గంటలకు

సూర్యాస్తమయం: 6.50 గంటలకు

వికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, కృష్ణపక్షం, పాడ్యమి, నక్షత్రం: ఉత్తరాషాఢ రాత్రి 10.59 వరకు, తదుపరి శ్రవణం, అమృతఘడియలు: మధ్యాహ్నం 3.59 నుంచి సాయంత్రం 5.35 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 12.22 నుంచి 1.59 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 11.56 నుంచి మధ్యాహ్నం 12.48 వరకు, వర్జ్యం: తె.జా. 5.29 నుంచి ఉదయం 7.05 వరకు.

## ఓయూ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలు విడుదల

**ఉస్మానియా యూనివర్సిటీ:** ఓయూ వర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదలచేసినట్లు ఉస్మానియా యూనివ ర్సిటీ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. మూడేండ్ల ఎల్ఎల్‌బీ, ఐదేండ్ల బీఏఎల్ఎ ల్‌బీ కోర్సుల సెమిస్టర్, బీఏ ఓరియంటల్ లాంగ్వేజెస్ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను విడు దల చేసినట్లుచెప్పారు. వీటితోపాటు దూర విద్య ద్వారా అందించే ఎంబీఏ మొదటి, మూడో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను విడుద లచేసినట్లు పేర్కొన్నారు. అన్ని కోర్సుల ఫలి తాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.in లో అందుబాటులో ఉంచినట్టు తెలిపారు.

## లోకం పోకడ





పరాయి మనుషుల్ని కూడా మా సొంత కుటుంబ సభ్యులుగా భావించే గొప్ప మనసు సార్ మాది.. అందుకే వాళ్ళ తాత మా తాత కాకుండా పోతాడా అని..

# తల్లీబిడ్డ భద్రం

మొదటిపేజీ తరువాయి...

ఆరోగ్య సమాజాన్ని సాధించడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ అనేక కార్యక్రమాలను చేపట్టారు. ప్రత్యేకించి తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న కేసీఆర్ కిట్స్ పథకం సత్ఫలి తాలనిస్తున్నది. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ప్రభుత్వ దవాఖా నాల్లో ప్రసవాల సంఖ్య గణనీయం గా పెరుగుతున్నది. గతంలో ప్రభు త్వ దవాఖానల్లో 25% ఉన్న ప్రస వాలు కేసీఆర్ కిట్స్ పథకం అమ లుతో 57 శాతానికి పెరిగినట్టు వైద్య శాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. రాష్ట్రంలో మాతాశిశు మరణాలను నియంత్రించడంలో భాగంగా ప్రభు త్వం కేసీఆర్ కిట్స్-అమ్మ ఒడి కార్య క్రమాన్ని అమలుచేస్తున్నది. ఒకవైపు గర్భిణుల ఆరోగ్యంపట్ల శ్రద్ధ వహి స్తూనే భవిష్యత్‌తరాలు ఆరోగ్యంగా ఉండాలన్న ఉద్దేశంతో చిన్నారుల ఆరోగ్యంపై దృష్టి సారించింది. అధు నాతన సౌకర్యాలతో, కార్పొరేట్ తర హాలో సర్కారు దవాఖానల్లో వైద్యం అందిస్తున్నారు. అన్ని జిల్లా దవాఖా నల్లో నవజాత శిశువుల సంరక్షణ కోసం ప్రత్యేకయూనిట్లు ఏర్పాటుచేసి, పిల్లల ఆరోగ్యాన్ని కాపాడేలా చర్యలు చేపట్టారు.

**సేకరించిన నమూనాలు 2,08,979**

10,840 మంది ప్రసవించగా అందులో తొమ్మిది మంది మాత్రమే ప్రసవ సమ యంలో మరణించారు.

ప్రసూతి మరణాల రేటు (ఎంఎంఆర్) 4.2%

జీవితకాల ప్రమాదం 0.1%

**ఇన్‌ఫాంట్ మోర్టాలిటీ రేటు (ప్రతి వెయ్యిమంది శిశువులకు)**

2013లో 35

2016లో 31

2017లో 29

**సంతానోత్పత్తి రేటులోనూ తగ్గుదల**

దేశవ్యాప్తంగా సంతానోత్పత్తి రేటు

2013 నుంచి 2016 వరకు : 2.3%

2017లో 2.2%

అత్యధికంగా బీహార్‌లో 3.2%

అత్యల్పంగా ఢిల్లీలో 1.5%

తెలంగాణ, మహారాష్ట్ర, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో 1.7%

# తెలంగాణకు నిధులివ్వండి

- అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సహకరించండి
- లోక్‌సభలో మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి విజ్ఞప్తి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో వినూత్న తరహాలో కొనసాగుతున్న సంక్షేమ, అభివృద్ధిపనులకు కేంద్ర ప్రభుత్వం తోడ్పాటు అందించాలని, ప్రత్యేక నిధులను కేటాయించి కొత్త రాష్ట్రానికి సహకరించాలని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి కోరారు. మంగళవారం ఆయన లోక్‌సభలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతి ఇంటికీ తాగునీటిని అందించడానికి చేప ట్టిన మిషన్ భగీరథ పథకం దాదాపు పూర్తి కావచ్చిందన్నారు. ఈ పథకానికి రూ.24వేల కోట్ల నిధులు ఇవ్వాలని నీతి ఆయోగ్ సిఫార సుచేసినా కేంద్రం ఇంతవరకు చిల్లిగవ్వ ఇవ్వ లేదని పేర్కొన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం పనిదినాలను వంద నుంచి 150కి పెంచాలని కోరారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలో దాదాపు 36శాతం గ్రామీణ ప్రజలు ఉపాధి పొందుతున్నారని వివరిం చారు. కూలీల కోసం ప్రవేశపెట్టిన ఆధార్, బయోమెట్రిక్ విధానాలు సరిగా అమలు కావడంలేదని చెప్పారు. తెలంగాణకు పల్లెప్ర గతి, గ్రామజ్యోతి వంటి పథకాలు పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతున్నా యని, మహాత్మాగాంధీ కలలను నిజంచేస్తు న్నాయని పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధి కోసం కేంద్ర బడ్జెట్‌లో మొత్తంగా రూ.1,91,800 కోట్లు కేటాయించినప్పటికీ.. 2019-20ఆర్థిక సంవత్సరానికి సవరించిన అంచనాల్లో దానిని రూ.1,40,700కు తగ్గిం చారని, తెలంగాణకు ఎంత కేటాయించారో ఎక్కడా పేర్కొనలేదన్నారు.

### తక్షణం ట్రైబల్‌వర్సిటీ ఏర్పాటుచేయాలి: కేకే

విభజన అంశాలపై కేంద్రం మాటతప్పిందని.. విద్యాసంస్థలు, నిధులు ఇవ్వడంలో నిర్లక్ష్యం వహిస్తున్నదని రాజ్యసభలో టీఆర్ఎస్ పక్షనేత కే కేశవరావు విమర్శించారు. మంగళవారం విశ్వవిద్యాలయ సవరణబిల్లుపై ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఐఐటీ, ట్రిపుల్ ఐటీ, ట్రైబల్ యూనివర్సిటీలను తక్షణం ఏర్పాటుచేయాలని కోరారు. తెలంగాణలో కేంద్ర విశ్వవిద్యాలయాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. లోక్‌సభలో టీఆర్ఎ స్పక్షనేత నామా నాగేశ్వరరావు మాట్లా డుతూ.. హైదరాబాద్ రీజినల్ రింగ్‌రోడ్డు ప్రాధాన్యాన్ని వివరించి, దీనిపై కేంద్రం ప్రక టనచేయాలని, నగరాన్ని కాలుష్యం నుంచి రక్షించాలని కోరారు. తెలంగాణపై కేంద్రం వివక్ష చూపిస్తున్నదని ఆరోపించారు. రోడ్డు భద్రత బిల్లుకు టీఆర్ఎస్ పార్టీ మద్దతు తెలు పుతున్నట్టు ప్రకటించారు. ఎంపీ బండా ప్రకాశ్ మాట్లాడుతూ.. తెలంగాణలో ఎయిర్ పోర్టులను ఏర్పాటుచేయాలన్నారు.

## టీఎస్‌సెట్ కీ విడుదల

**ఉస్మానియా యూనివర్సిటీ:** అసిస్టెంట్ ప్రొఫె సర్, లెక్చరర్‌షిప్‌కు అర్హత సాధించేందుకు నిర్వహించే టీఎస్‌సెట్-2019 ప్రిలిమినరీ కీని అధికారులు విడుదలచేశారు. ఈ కీని www.telanganaset.org,www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యంతరా లుంటే 20లోగా tssetou@gmail.com కు మెయిల్ పంపించాలని పేర్కొన్నారు.

## ఉద్యోగాల్లో మనమే టాప్

మొదటిపేజీ తరువాయి...

ఆ సంస్థ తేల్చింది. ఈ జాబితాలో తెలంగాణ, ఏపీ తర్వాత మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ ఉన్నా యని, బీహార్, ఒడిశా చివరిస్థానంలో నిలిచా యని మంగళవారం విడుదలచేసిన ప్రకట నలో ఆ సంస్థ పేర్కొన్నది. ఉద్యోగిత, ప్రయో జనాలు, ఆదాయం, లింగసమానత్వం లాం టి అంశాలకు ఈ సర్వేలో సమప్రాధాన్యమి చ్చారు. దేశవ్యాప్తంగా మహిళల్లో నిరుద్యోగిత ఎక్కువగా ఉన్నదని, ఈ విషయంలో గోవా, కేరళ రాష్ట్రాలు దారుణస్థితిలో ఉన్నాయని ని వేదిక తేల్చింది. 2017-18 మధ్య గ్రామీణ, పట్టణప్రాంతాల్లో నిరుద్యోగిత రేటు వరుసగా 5.3 శాతం, 7.8 శాతం ఉన్నట్టు అంచనా వే సింది. మహిళల ఉద్యోగరేటు విషయంలో ప్ర పంచబ్యాంకు భారత్‌కు 131 దేశాల్లో 120వ ర్యాంకు ఇచ్చినట్టు నివేదిక పేర్కొన్నది.



మంగళ వారం మంచిర్యాల జిల్లాలోని అన్నారం బరాజ్ వద్ద కాళేశ్వరం జల జాతర కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి. చిత్రంలో మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యేలు బాల్క సుమన్, కోరుకంటి చందర్, దివాకర్‌రావు, ఆత్రం సక్కు, ఎమ్మెల్సీలు పురాణం సతీశ్, నారదాస్ లక్ష్మణ్‌రావు, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు తదితరులు



మంగళవారం అన్నారం బరాజ్ వద్దకు ప్రజలతో కలిసి ర్యాలీగా వస్తున్న ఎమ్మెల్యే బాల్క సుమన్




మంచిర్యాల జిల్లాలోని అన్నారం బరాజ్ వద్ద నిర్వహించిన కాళేశ్వరం జల జాతర కార్యక్రమంలో పెద్దఎత్తున పాల్గొన్న ప్రజలు

# అన్నారంలో జల జాతర!

నిండుకుండను తలపిస్తున్న అన్నారం బరాజ్ వద్ద మంగళ వారం జల జాతర పేరుతో జన జాతర నిర్వహించారు. ఎదురేగి వచ్చిన గోదావరి జలాలకు పూజలుచేసి, అక్కడే వన భోజనాలు చేయాలని చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్ పిలుపుతో వేల కుటుంబాలు తరలి వచ్చాయి. డప్పుల చప్పుళ్లు, బోనాలతో అన్నారం బరాజ్ వద్ద పండుగ వాతావరణం నెలకొన్నది.



బరాజ్ వద్ద సెల్ఫీ దిగుతున్న ప్రజలు



మంగళవారం అన్నారం బరాజ్ వద్ద జల జాతర కార్యక్రమంలో భాగంగా వనభోజనాలు చేస్తున్న దృశ్యం

# అడ్డుకోవడమే ఏకైక ఎజెండానా?

- విపక్షాల తీరుపై ఎమ్మెల్సీ కర్నె ఆగ్రహం
- కొత్త అసెంబ్లీ, సచివాలయం అవసరం
- వేర్వేరు చోట్ల ఆఫీసులతో అవస్థలు
- కిరాయిలకే ఏటా రూ.32 కోట్లు చెల్లిస్తున్నామని వెల్లడి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కాళేశ్వరం ప్రాజెక్టుతో ప్రభుత్వానికి వస్తున్న మంచి పేరు నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే ప్రతిపక్షాలు అసెంబ్లీ, సచివాలయ నిర్మాణాలపై వివాదం సృష్టిస్తున్నాయని టీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ విమర్శించారు. అసెంబ్లీ, సచివాలయ నిర్మాణాలను అడ్డుకోవాలని గవర్నర్‌ను ప్రతిపక్షాలు కోరడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇదొక దుర్మార్గమైన చర్య అని అభివర్ణించారు. సోమవారం టీఆర్‌ఎస్‌ఎల్పీలో మీడియాతో మాట్లాడిన కర్నె ప్రభాకర్.. విపక్షాల వైఖరిని తీవ్రంగా తప్పుబట్టారు. తెలంగాణకు తలమానికంగా ఉండేలా అసెంబ్లీ, సచివాలయం కడుతామంటే కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు అసూయతో వ్యతిరేకిస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ప్రతిపక్షాలు బెంబేలెత్తుతున్నాయని ఎద్దేవాచేశారు. ఢిల్లీలో కొట్లాడుకొనే కాంగ్రెస్, బీజేపీ.. మంచి పనిని అడ్డుకోవడానికి హైదరాబాద్‌లో మిత్రపక్షాలుగా మారాయని చెప్పారు. ఇదేం సిద్ధాంతమో ఆ పార్టీలే సమాధానం చెప్పాలన్నారు. వేర్వేరుచోట్ల ఉన్న కార్యాలయాల కోసం ఏటా రూ. 32 కోట్లు అద్దె రూపంలో ప్రభుత్వం చెల్లిస్తున్నదని, పదేండ్లలో చెల్లించే అద్దె మొత్తంతో సచివాలయాన్ని కడుతుంటే ప్రభుత్వానిది ఆదా తప్ప దుబారా ఖర్చు ఎలా అవుతుందని ప్రశ్నించారు. 'ఇప్పుడున్న సచివాలయం గబ్బిలాల కొంపగా మారింది. సభ్యులకు సరిపోయేలా వసతులు లేవు. స్టాండింగ్ కమిటీలకు, విప్‌లకు గదులు కేటాయించలేని పరిస్థితి నెలకొన్నది. అసెంబ్లీ సమావేశాలప్పుడు మీడియా వాహనాల పార్కింగ్‌కు స్థలం దొరుకడంలేదు. ప్రస్తుతం ఉన్న సచివాలయానికి సేఫ్టీ ప్రమాణాలు లేవు' అని చెప్పారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో విగ్రహాలకు వేల కోట్లు ఖర్చు పెడుతున్నారని, అలాంటిది ప్రజలకు ఉపయోగపడే అసెంబ్లీ, సచివాలయం నిర్మాణాలు చేపడితే బీజేపీ



నేతలు ఎందుకు వ్యతిరేకిస్తున్నారని విరుచుకుపడ్డారు. విపక్షాలు ప్రతీ పనిని విమర్శించడమే లక్ష్యంగా పెట్టుకొన్నాయన్నారు. నిర్మాణాత్మక సలహాలకు దూరంగా ఉండే విపక్షాలను దేశంలో ఎవరూ పట్టించుకోరని, ఇక్కడ కూడా పట్టించుకోవాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. అభివృద్ధిని అడ్డుకోవటమే ఏకైక అజెండాగా మారిందని, ఎందుకు అడ్డుకొంటున్నారో ప్రజలకు చెప్పాలి అని ఆయన డిమాండ్ చేశారు.

ANURAG ENGINEERING COLLEGE
(An Autonomous Institution)
(Approved by AICTE, New Delhi, Affiliated to JNTUH)
Ananthagiri (V & M), Kodad, Suryapet (Dt.)
www.anurag.ac.in Mobile: 98487 22701, 99899 76767

ECET - 2019 SPOT ADMISSIONS

| Branch | CIVIL | CSE | ECE | EEE | MEC |
|---|---|---|---|---|---|

Interested Candidates can attend the spot admissions with original certificates and prescribed fee on 20-07-2019 in the college premises, Admissions will be made as per guidelines given by the Convener TSECET - 2019.
Note:- Fee Reimbursement is not applicable to the candidates admitted under Spot Admissions.
Engineering Engineers

NISE
NATIONAL INSTITUTE OF SOLAR ENERGY
(An Autonomous Institution under the Ministry of New & Renewable Energy, Government of India)
Faridabad-Gurgaon Road, GwalPahari, Gurgaon - 122003, Haryana
3 Months Residential Placement linked Skill Development Program
'SURYAMITHRA'

| Training Center | Institute of Solar Power Technologies & Vocational Training, (M/s. PLNS Educators Private Limited) Hyderabad |
|---|---|

Starting from: 22-07-2019
Registrations will close on 20th July - 2019
Venue : 8-3-167/20/M/5, 2nd Floor, Above Karur Vysya Bank, Moti Nagar Branch, Rajeev Nagar 'X' Roads, Hyderabad - 500 018. Telangana.

| Eligibility | |
|---|---|
| | Education : ITI Electrician / Wireman / Electronics or Inter Vocational or Diploma Electrical / Electronics / Mechanical only. |
| | Gender : Both Male & Female Candidates. |
| | Age : Minimum Age : 19 years Maximum Age : 25 years. |

Contact Details : Land Line : 040 - 23833566 / 040 - 23833567
Mobile : 6303 450 925
Email : centercoordinatorhyd.plns@gmail.com
Certification By SCGJ / Govt. of India.






## కాస్తులో ఉన్నా కాటేశారు!

అధికారుల తప్పులకు అన్నదాతకు అవస్థలు

విచారణ లేకుండానే భూమార్పిడి

రికార్డుల సవరణకు రెవెన్యూ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు

ప్రొసీడింగ్ ఇచ్చి చేతులు దులుపుకున్న అధికారులు

ధర్మగంటను ఆశ్రయించిన జోగుళాంబ గద్వాల జిల్లా రైతు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలంలోని చిన్న తాండ్రపాడు గ్రామానికి చెందిన తట్టిపల్లి తిక్కయ్యకు అదే గ్రామంలోని సర్వే నంబర్ 340/అ1 లో వారసత్వంగా సంక్రమించిన 4.14 ఎకరాల భూమి ఉన్నది. కుటుంబ అవసరాల కోసం అందులో రెండెకరాల భూమిని వేరే వ్యక్తికి విక్రయించారు. మిగతా 2.14 ఎకరాల భూమి.. మొన్నటి భూరికార్డుల ప్రక్షాళన వరకు తిక్కయ్య పేరిటే కొనసాగింది. ఇప్పటికీ అతనే కాస్తులో ఉన్నారు. ఏం జరిగిందో ఏమో కానీ రికార్డుల ప్రక్షాళన అనంతరం తిక్కయ్య పేరిట ఉన్న 2.14 ఎకరాల భూమి బోయ కర్రెన్న పేరిట మారిపోయింది. రికార్డులు ఎలా మారాయని అధికారులను అడిగితే వారు పట్టించుకొన్న పాపాన పోలేదు. సవరించాలని విజ్ఞప్తి చేస్తే స్పందన లేకుండా పోయింది. సదరు భూమి తనది కాదని, తిక్కయ్యకు చెందినదేనని బోయ కర్రెన్న కూడా రెవెన్యూ అధికారులకు రాతపూర్వకంగా తెలిపారు. తన పేరిట మారిన భూమిని తిరిగి తిక్కయ్య పేరిట మార్చాలని కూడా దరఖాస్తుచేశారు. అయినా.. రెవెన్యూ అధికారులు రికార్డులను సవరించలేదు. ఈ వ్యవహారంపై విచారణ జరిపిన వీఆర్వో.. తిక్కయ్యకే భూమి చెందుతుందని ధ్రువీకరించి తాసిల్దార్‌కు సిఫార్సుచేశారు. తాసిల్దార్‌కు మాత్రం రికార్డులను సవరించడానికి, తిక్కయ్యకు పాస్‌బుక్ ఇవ్వడానికి చాలారోజులపాటు తీరికే దొరకలేదు. నెలల తరబడి తిప్పించుకొన్న తర్వాత దయతలచిన తాసిల్దార్.. తిక్కయ్యకు ప్రొసీడింగ్ ఇచ్చారు. అది కూడా వచ్చి నెలలు గడిచిపోయాయి. ఆన్‌లైన్‌లో పేరు మారలేదు. బాధితుడికి కొత్త పాస్‌బుక్ అందలేదు. ప్రొసీడింగ్ ఇచ్చి నెలలు గడుస్తున్నా రికార్డులో పేరు నమోదు చేయకుండా రెవెన్యూ అధికారులు మరింత వేధిస్తున్నారని తిక్కయ్య వాపోతున్నారు.



### ఏసీబీకి పట్టించానని పగ తీర్చుకుంటున్నరు

నా దగ్గర అన్ని ఆధారాలున్నా అధికారులు కావాలనే రికార్డులో నాపేరు నమోదు చేయకుండా అడ్డుకుంటున్నరు. గతంలో లంచం అడిగిన వీఆర్వోను ఏసీబీకి పట్టించానని ఇప్పుడు నాపై పగతీర్చుకుంటున్నరు. బోయ కర్రెన్న ఆ భూమి తనది కాదని ఒప్పుకున్న తర్వాత కూడా రెవెన్యూ అధికారులు ఈ విధంగా ఇబ్బందులు పెట్టడం అన్యాయం. ఉన్నతాధికారులు విచారించి రికార్డులో నా పేరు నమోదుచేయాలి. పాస్‌పుస్తకం జారీచేసి రైతుబంధు వచ్చేలా చూడాలి.

**- తట్టిపల్లి తిక్కయ్య, బాధిత రైతు**

## ఇద్దరు తాసిల్దార్ల సస్పెన్షన్

భూరికార్డుల ప్రక్షాళనలో, విధుల్లో నిర్లక్ష్యం

ఉత్తర్వులు జారీచేసిన సూర్యాపేట కలెక్టర్ అమయ్‌కుమార్

**సూర్యాపేట, నమస్తే తెలంగాణ:** సూర్యాపేట జిల్లాలో ఇద్దరు తాసిల్దార్లను సస్పెండ్‌చేస్తూ కలెక్టర్ అమయ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ అనుమతి లేకుండా, సమాచారం ఇవ్వకుండా చింతలపాలెం తాసిల్దార్ బాబా ఫసియొద్దీన్, మేళ్లచెర్వు తాసిల్దార్ బీ శంకరయ్య విధులకు హాజరు కాకపోవడంతోపాటు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూరికార్డుల ప్రక్రియలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు వారిపై విచారణ చేపట్టి, నివేదిక ఆధారంగా వారిని సస్పెండ్‌చేశారు.

## రైతు ఆత్మహత్యాయత్నం

కొత్తగూడెం కలెక్టరేట్ ఆవరణలో ఘటన

తన భూమిని ఇతరులకు పట్టాచేశారని ఆరోపణ

**కొత్తగూడెం, నమస్తే తెలంగాణ:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండలం సీతంపేట గ్రామానికి చెందిన పాకా శ్రీనివాస్ తనకు ఉన్న 16 ఎకరాల భూమిలో 8 ఎకరాలను ఇతరులకు పట్టాచేశారని, దీనిపై అధికారులు స్పందించడం లేదని నిరసిస్తూ మంగళవారం కొత్తగూడెంలోని కలెక్టరేట్‌కు వచ్చారు. సంచిలో భూమి పత్రాలతోపాటు పురుగులమందు డబ్బా తెచ్చుకొని తాగేందుకు యత్నించగా, గమనించిన స్థానికులు అడ్డుకొన్నారు. విషయం తెలుసుకొన్న పోలీసులు శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకొని విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తాను ఎంతోకాలంగా సీతంపేటలో పొలం చేసుకొంటున్నానని, తన 16 ఎకరాల భూమిలో 8 ఎకరాలను అదే గ్రామానికి చెందిన శేషభూషణం అనే రైతుకు పట్టాచేశారని బాధితుడు తెలిపారు. ఈ విషయాన్ని తాసిల్దార్‌కు చెప్పినా పట్టించుకోలేదని, చివరికి ఆత్మహత్యే శరణ్యమని ఈ పనికి పాల్పడ్డానని పేర్కొన్నారు. ఈ విషయంపై సుజాతనగర్ తాసిల్దార్ చల్లా ప్రసాద్‌ను వివరణ కోరగా.. 1954 -55 నుంచే పట్టా పొందిన రైతే కాస్తులో ఉన్నారని, అతడికి అన్ని హక్కులు ఉన్నాయని, అది ఏనాడో రెవెన్యూ రికార్డుల్లో ఉన్నదని, బాధిత రైతు ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. వేరే రైతు పొలాన్ని సర్వేచేయాలని పాకా శ్రీనివాస్ పదేపదే అడుగుతున్నారని, ఇతరుల పొలాన్ని సర్వేచేయడం కుదరదని చెప్పామని, అయినా అతను వినకుండా ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేశారని తెలిపారు.



ఆత్మహత్యకు యత్నించిన పాకా శ్రీనివాస్‌తో మాట్లాడుతున్న పోలీసులు

## ఎప్పుడడిగినా.. రేపు మాపే!

ఏడాదిన్నరగా తిరుగుతున్నా అందని పాస్‌పుస్తకం

అధికారుల నిర్లక్ష్యంతో రైతుబంధు కోల్పోయా

వికారాబాద్ జిల్లా తరిగోపుల రైతు అశోక్‌చారి ఆవేదన



**ధారూరు:** వికారాబాద్ జిల్లా ధారూరు మండలం తరిగోపుల గ్రామానికి చెందిన కే వెంకన్నచారికి సర్వే నంబర్ 435లో 1.1 ఎకకాల పొలం ఉన్నది. తాతల కాలం నుంచి ఈ భూమిని వెంకన్నచారి కుటుంబం సాగుచేసుకొంటూ జీవిస్తున్నది. భూరికార్డుల ప్రక్షాళన సమయంలో గ్రామ రైతులకు కొత్త పాస్‌పుస్తకాలు అందజేశారు. అయితే వెంకన్నచారి కుమారుడు అశోక్‌చారి హైదరాబాద్‌లో ఉంటున్నందున.. ఆయనకు మాత్రం ఇవ్వకుండా అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించారు. పాస్‌బుక్ కోసం ఏడాదిన్నర కాలంగా రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరిగినా పట్టించుకోవడంలేదు. ఎప్పుడు అడిగినా అధికారులు రేపు మాపు అంటూ కాలయాపన చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో గత ఏడాది రైతుబంధు సాయం కోల్పోయారు. ఉన్నతాధికారులు ఇకనైనా స్పందించి వెంటనే పాస్‌బుక్ అందించాలని అశోక్‌చారి కోరుతున్నారు. ఈ ఏడాది పంట పెట్టుబడితో పాటు గత ఏడాది పంట పెట్టుబడి కూడా అందిస్తే పంటలకు చేసిన అప్పులు కొంత మేరకు తీర్చుకొనే అవకాశం ఉంటుందని బాధితుడు కోరుతున్నారు.

### ఆగస్టు 15 లోపు అందరికీ పాస్‌బుక్‌లు

మండలంలోని తరిగోపుల గ్రామానికి సంబంధించిన పాస్‌పుస్తకాలను ఆగస్టు 15లోగా అందజేస్తాం. పాస్‌పుస్తకాల సమస్యలు పరిశీలించి పరిష్కారానికి కృషిచేస్తాం. ఎలాంటి సమస్యలు ఉన్నా మా దృష్టికి తీసుకురండి. రెవెన్యూ సిబ్బంది భూసమస్యలు పరిష్కరించే పనుల్లో నిమగ్నమై ఉన్నారు. రైతులకు తప్పకుండా న్యాయంచేస్తాం.

**- రాధాబాయి, ధారూరు తాసిల్దార్**

## భూమి లేనోళ్లకు పట్టా చేశారు

అధికారుల కాసుల కక్కుర్తి.. 20 గుంటలు మాయం

హద్దురాళ్లు తీసేసి గొడవకు దిగుతున్న కబ్జాదారులు

వరంగల్ రూరల్ జిల్లా కలెక్టరేట్‌లో బాధితుల ఫిర్యాదు


పాస్‌పుస్తకాలు రద్దుచేసి న్యాయం చేయాలని వేడుకోలు



భూమి పత్రాలను చూపుతున్న బాధితులు యాదగిరి, ఓదెలు

**సంగెం:** లంచాలకు అలవాటుపడిన రెవెన్యూ సిబ్బంది.. తాము అడిగినంత అప్పగిస్తే చాలు రికార్డుల్లో భూమి లేకున్నా పాస్‌పుస్తకాలు సిద్ధంచేసి ఇంటికే పంపిస్తారు. సాగు చేసుకొంటున్న రైతుల మధ్య గొడవలు పెట్టిస్తారు. సమస్య పరిష్కారం కోసం మళ్లీ తమ దగ్గరికొస్తే మరోలా చెప్తారు. ఇదీ వరంగల్ రూరల్ జిల్లా రెవెన్యూ అధికారుల తీరు. సంగెం మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన వేల్పుల ఉప్పలయ్యకు ముగ్గురు కుమారులు ఓదెలు, కుమారస్వామి, యాదగిరి ఉన్నారు. ఎల్గూర్ రంగంపేట శివారులోని సర్వే నంబర్ 732/2 లో ఖాతా నంబర్ 703లో ఉప్పలయ్య పేరిట 2.10 ఎకరాల భూమి ఉన్నది. ఈ భూమిలో 33 ఏండ్లుగా ఉప్పలయ్య కుటుంబీకులు కాస్తులో ఉండి సాగుచేసుకొంటూ ప్రభుత్వానికి పన్నులు కూడా కడుతున్నారు. ఈ క్రమంలో ఉప్పలయ్య తన ముగ్గురు కుమారులకు తలా 30 గుంటల చొప్పున పంచి ఇవ్వడంతో.. ఎవరికి వారు సాగు చేసుకొంటు జీవనం సాగిస్తున్నారు. భూరికార్డుల ప్రక్షాళన సమయంలో ఇదే గ్రామానికి చెందిన వేల్పుల రాజు, వేల్పుల ఉప్పలయ్య, వేల్పుల ఓదెలు, వేల్పుల కట్టయ్య, వేల్పుల అశోక్‌కు రెవెన్యూ అధికారులు ఐదెకరాల భూమిని పట్టాచేశారు. ఈ ఐదుగురి పేరిట రికార్డులు లేనప్పటికీ పక్కనే ఉన్న వేల్పుల ఉప్పలయ్య ముగ్గురు కుమారులకు చెందిన 20 గుంటల భూమిని కూడా అధికారులు వీరికి పట్టా చేశారు. దాంతో ఆ ఐదుగురు 20 గుంటల భూమిలోకి వచ్చి దున్నడం మొదలు పెట్టడమే కాకుండా.. హద్దురాళ్లు తీసేసి భూమిని కలిపేసుకొన్నారు. ఈ విషయంపై న్యాయం చేయాలంటూ బాధితులు స్థానిక పోలీసుస్టేషన్‌తోపాటు కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్‌సెల్‌లో కూడా ఫిర్యాదుచేశారు. వరంగల్ పోలీస్ కమిషనర్‌ను కలిసి గోడు వెల్లబోసుకొన్నారు. ఐనప్పటికీ తమకు న్యాయం జరుగడం లేదని వారు వాపోతున్నారు. ఐదుగురి పేరిట రికార్డుల్లో ఎలాంటి భూమి లేకున్నా కాసులకు కక్కుర్తిపడిన రెవెన్యూ అధికారులు వారి పేరిట పాస్‌పుస్తకాలు ఇవ్వడమే కాకుండా తమ 20 గుంటల భూమిని కూడా రాసిచ్చారని వేల్పుల ఉప్పలయ్య కుమారులు ఓదెలు, కుమారస్వామి, యాదగిరి ఆరోపిస్తున్నారు. తమ భూమిని అప్పనంగా ఇతరులకు కట్టబెట్టిన రెవెన్యూ అధికారులతోపాటు కబ్జాచేసి హద్దురాళ్లు తొలగించినవారిపై కూడా చర్యలు తీసుకొని తమ భూమిని ఇప్పించాలని వారు వేడుకొంటున్నారు.

## ఎంత తిరిగినా పాస్‌బుక్ రాలేదు




**బోనకల్లు:** నా పేరు పసుపులేటి వీరయ్య. మాది ఖమ్మం జిల్లా బోనకల్లు మండలం గోవిందాపురం-ఎల్ గ్రామం. నాకు గార్లపాడు రెవెన్యూలో వారసత్వంగా వస్తున్న 1.08 ఎకరాల భూమి ఉన్నది. ఈ భూమి రికార్డుల్లో ఉండటంతోపాటు పాత పాస్‌పుస్తకం కూడా ఉన్నది. అయినప్పటికీ కొత్త పాస్‌పుస్తకం ఇస్తలేరు. తాసిల్ కార్యాలయం చుట్టూ ఎంత తిరిగినా పాస్‌పుస్తకం ఇస్తలేరు. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వల్ల నా భూమి నేటికీ ఆన్‌లైన్ కాలేదు. దీంతో ప్రభుత్వం ఇస్తున్న రైతుబంధు సాయం అందడంలేదు. అధికారులను ఎన్నిసార్లు అడిగినా రేపు మాపు అంటూ కాలం గడుపుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నా భూమికి పట్టాదారు పాస్‌పుస్తకాన్ని అందించి, సీఎం కేసీఆర్ రైతులకు ఇస్తున్న రైతుబంధు సాయాన్ని అందేలా చూడాలని కోరుతున్నాను.

**- పసుపులేటి వీరయ్య, గోవిందాపురం- ఎల్**

## రికార్డులో 1.07 ఎకరాలు మాయం

సిద్దిపేట జిల్లా శబాష్‌గూడెం రైతు లక్ష్మీనర్సయ్య ఆవేదన



**చేర్యాల, నమస్తే తెలంగాణ:** రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా 1.07 ఎకరాల భూమి రికార్డుల్లో కనిపించడంలేదని సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం నాగపురి రెవెన్యూ పరిధిలోని శబాష్‌గూడెం గ్రామానికి చెందిన రైతు యామ లక్ష్మీనర్సయ్య ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. తనకు వారసత్వంగా వస్తున్న భూమిని ఇతరుల పేరిట చేశారని, తనకు న్యాయంచేయాలని కొన్ని నెలలుగా రెవెన్యూ సిబ్బంది చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా పట్టించుకోవడంలేదని ధర్మగంటను ఆశ్రయించారు. యామ లక్ష్మీనర్సయ్యకు వారసత్వంగా వచ్చిన, ఇతరుల వద్ద కొనుగోలు చేసిన భూమి 5.27 ఎకరాలు ఉన్నది. పాత పాస్‌బుక్‌లో మొత్తం భూమి ఉన్నా.. కొత్త పాస్‌బుక్ మంజూరు అనంతరం అందులో 4.20 ఎకరాలే నమోదైంది. మిగతా 1.07 ఎకరాల భూమి నమోదుకాలేదు. కొత్త పాస్‌బుక్ ఇచ్చే ముందు ఇచ్చిన 1బీ నమూనా ప్రతుల్లో సైతం 5.27 ఎకరాల భూమి ఉన్నదని, రెవెన్యూ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే పాస్‌బుక్‌లో మాత్రం మాయమైందని రైతు లక్ష్మీనర్సయ్య చెప్తున్నారు. తనకు చెందిన భూమిని గ్రామంలోని బర్రె జయరాంరెడ్డి అనే వ్యక్తి పేరిట 10 గుంటలు, దేవనబోయిన రాములు పేరిట 29 గుంటలు, మరో వ్యక్తి పేరిట 8 గుంటలు రికార్డుల్లోకి ఎక్కించారని ఆరోపిస్తున్నారు. రికార్డుల్లో సరిచేయాలని అధికారులను వేడుకుంటున్నారు. ఈ మేరకు దరఖాస్తు కూడా సమర్పించారు. గతంలో తాను ఇతరుల వద్ద కొనుగోలు చేసిన వ్యవసాయ భూమిని రికార్డుల్లోకి ఎక్కించేందుకు అప్పటి వీఆర్వో రూ.20 వేలు తీసుకున్నట్టు ఆరోపించారు. ఈ విషయమై చేర్యాల తాసిల్దార్ బీ నాగరాజుగౌడ్‌ను వివరణకోరగా సమగ్ర విచారణ జరిపి న్యాయంచేస్తానని తెలిపారు.



మంగళవారం ఖమ్మం కలెక్టరేట్‌లో పురుగుల మందు డబ్బాతో ధర్నా చేస్తున్న రైతు కుటుంబం

## పురుగులమందు డబ్బాతో రైతు ధర్నా

ఖమ్మం కలెక్టరేట్ ఆవరణలో కుటుంబంతో బైఠాయింపు

భూసమస్య పరిష్కారానికి చర్యలు తీసుకొన్న కలెక్టర్

**ఖమ్మం, నమస్తే తెలంగాణ:** ఆన్‌లైన్‌లో తన పేరు వచ్చేలా చూడాలని కోరుతూ ఖమ్మం కలెక్టరేట్ ఆవరణలో తిరుమలాయపాలెం మండలం ఎర్రగడ్డ గ్రామానికి చెందిన ఏలూరి లక్ష్మయ్య అనే రైతు కుటుంబసభ్యులతో కలిసి పురుగులమందు డబ్బాతో మంగళవారం ధర్నాకు దిగారు. ఏలూరి లక్ష్మయ్యకు కొక్కిరేణి గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్లు 336, 337లో 18 గుంటల భూమి ఉన్నది. అతడికి పాస్‌పుస్తకం ఉండటంతో పాటు పహాణీలో కూడా అతడి పేరు వస్తున్నది. అయితే ఆన్‌లైన్‌లో మాత్రం అతడి పేరుకు బదులు బెల్లం నారాయణ అనే వ్యక్తి పేరు వస్తుండటంతో లక్ష్మయ్యకు బ్యాంక్ రుణం, రైతుబంధు సాయం అందడంలేదు. తన పేరు ఆన్‌లైన్‌లో వచ్చేలా చర్యలు తీసుకోవాలని కొంత కాలంగా వీఆర్వోను, ఆర్‌ఐను, తాసిల్దార్‌ను కోరుతున్నప్పటికీ పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. పేరు మార్పునకు రూ.50 వేలు డిమాండ్ చేశారని, తాను అంత ఇచ్చుకోలేనని చెప్పినప్పటికీ రెవెన్యూ అధికారులు స్పందించడం లేదని రైతు వాపోయారు. ఈ క్రమంలోనే కుమారుడు, కోడలు, కూతురు, భార్య, మనుమరాలితో కలిసి వచ్చి కలెక్టరేట్ ఆవరణంలో పురుగులమందు డబ్బా పట్టుకొని ధర్నా నిర్వహించారు. దీంతో కలెక్టరేట్ అధికారులు, పోలీసులు లక్ష్మయ్యను కలెక్టర్ వద్దకు తీసుకెళ్లి సమస్యను తెలియజేశారు. ఆయన వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి లక్ష్మయ్య సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకొన్నారు.



మంగళవారం హుజూర్‌నగర్ తాసిల్ ఎదుట ధర్నాచేస్తున్న బాధితులు

## మాకు న్యాయం చేయండి

హుజూర్‌నగర్ తాసిల్ ఎదుట బాధితుల ఆందోళన

**హుజూర్‌నగర్ రూరల్:** సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లోని కోదాడ రోడ్డు సమీపంలో 292 సర్వే నంబర్‌లో ఉన్న భూమిలో 25 గుంటలను అక్రమంగా కబ్జాచేసేందుకు ప్రయత్నిస్తున్న కొందరికి అధికారులు కొమ్ముకాస్తున్నారంటూ బాధితులు మంగళవారం తాసిల్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఆ భూమికి సంబంధించిన పుస్తకం ఉన్నదని, పహాణీలో కూడా తమ పేర్లు నమోదైనప్పటికీ కబ్జాచేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. స్పందించిన తాసిల్దార్ వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. 25 గుంటల భూమిని ఓ రైతు వద్ద నుంచి కొంత మంది కొన్నారు. ఆ భూమిలో ప్లాట్లు చేసుకొని ఇండ్లు నిర్మించుకోవడానికి సన్నద్ధమవుతుండగా, ఇతరులు ఆ 25 గుంటల భూమి తమదేనని హద్దురాళ్లు తొలగించారు. దీనిపై వివాదం నడుస్తుండగా అధికారులు కూడా వారికి అనుకూలంగా మాట్లాడుతున్నారని బాధితులు పేర్కొన్నారు.

## అక్రమంగా బదలాయించారు

భూరికార్డుల ప్రక్షాళనలో రెవెన్యూ సిబ్బంది చేతివాటం

వారసత్వ భూమిలో 19.04 ఎకరాలు దాయాదులకు పట్టా

కోర్టును ఆశ్రయించాలని అశ్వారావుపేట తాసిల్దార్ ఉచిత సలహా

న్యాయం కోసం 'ధర్మగంట'ను ఆశ్రయించిన బాధితులు

ఓ కుటుంబానికి వారసత్వంగా 20 ఎకరాల భూమి వచ్చింది. భూరికార్డుల ప్రక్షాళన సమయంలో రెవెన్యూ సిబ్బంది 19.04 ఎకరాల భూమిని అక్రమంగా దాయాదులకు బదలాయించారు. ఈ విషయంపై ప్రశ్నిస్తే.. కోర్టుకు వెళ్లమని ఉచిత సలహా కూడా తాసిల్దారే ఇస్తున్నారు. తమకు జరిగిన అన్యాయాన్ని వివరించి న్యాయం చేయాలంటూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి గ్రామానికి చెందిన ఓ బాధిత కుటుంబం 'ధర్మగంట'ను ఆశ్రయించింది.

**అశ్వారావుపేట, నమస్తే తెలంగాణ:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వారావుపేట మండలం, గుమ్మడవల్లి గ్రామానికి చెందిన తాళ్లూరి రమణయ్య ముత్తాత తాళ్లూరి పున్నం గ్రామ సమీపంలోని సర్వే నంబర్లు 554/175, 564/182, 372/175, 550/174 (కుషి పట్టా), 442/175 (కుషి పట్టా), 435/174 (కుషి పట్టా)లలో 60 ఎకరాలకుపైగా వ్యవసాయ భూమిని సంపాదించారు. ఈ భూమిని ఆయన ముగ్గురు కుమారులైన గురవయ్య, రాముడు, శేషయ్య పేరిట 20 ఎకరాల చొప్పున పట్టాచేశారు. వీరిలో గురవయ్యకు సత్యం, ఆంజనేయులు సంతానం. సత్యంకు సంతానం లేకపోవడంతో ఆంజనేయులు కుమారులైన నాగేశ్వరరావు, రమణయ్య, లక్ష్మయ్య, పుల్లయ్యలే ఈ మొత్తం 20 ఎకరాలను సాగు చేసుకొంటున్నారు. సత్యం బాగోగులు చూసుకొన్న ఆంజనేయులు కుమారులు ఆయన మరణించిన తర్వాత కూడా అతని భూమిని వీరే సాగుచేసుకొంటున్నారు. అయితే భూరికార్డుల ప్రక్షాళన సమయంలో రెవెన్యూ అధికారులు గురవయ్య పేరిట ఉన్న ఈ 20 ఎకరాలను కాస్తులో ఉన్న ఆంజనేయులు కుమారులకు కాకుండా, గురవయ్య ఇద్దరు సోదరుల కుమారులైన ఏడుగురి పేరిట ఆన్‌లైన్ చేసి, పాస్‌పుస్తకాలు అందించారు. తాళ్లూరి రమణయ్య నలుగురు సోదరులకు తండ్రి ఆంజనేయులు, పెద్దనాన్న సత్యం వాటా కింద ఒక్కొక్కరికీ ఐదెకరాల భూమి రావాలి. కనీసం తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన 10 ఎకరాల నుంచైన 2.20 ఎకరాల చొప్పున రావాలి. కానీ రెరెన్యూ అధికారులు రమణయ్య సోదరులు నలుగురికి కేవలం తొమ్మిది గుంటల చొప్పున మాత్రమే పట్టాదారు పాస్‌పుస్తకాలు అందించారు. మిగతా భూమిని వీరి దాయాదుల పేరిటచేశారు.



వారసత్వ హక్కుపత్రాలు చూపుతున్న రమణయ్య, ఆయన తల్లి, సోదరులు

**మరో సర్వే నంబర్‌లో కూడా..**

అదేవిధంగా రమణయ్య పేరుతో సర్వే నంబర్ 182/ఉ లో నాలుగెకరాల భూమి ఉండగా.. దీనిని కూడా గురవయ్య సోదరుల కుమారుల పేరిట రికార్డులుచేశారు. విషయం తెలుసుకొన్న రమణయ్య.. తల్లి అక్కమ్మ, ముగ్గురు సోదరులతో కలిసి అశ్వారావుపేట తాసిల్దార్ రాఘవరెడ్డిని కలిసి సమస్యను విన్నవించి న్యాయంచెయ్యాలని కోరారు. ఈ సమస్య తన పరిధిలో లేదంటూ సమాధానం ఇవ్వడంతోపాటు కోర్టుకు వెళ్లండంటూ తాసిల్దార్ ఉచిత సలహా ఇచ్చారని బాధితుడు రమణయ్య ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. తమ భూమిని ఆక్రమించుకొనే ప్రయత్నం జరుగుతున్నదని, దీనికి రెవెన్యూ అధికారులు సహకరిస్తున్నట్టు అనుమానంగా ఉన్నదని ఆరోపించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి తగిన న్యాయం చేయాలని ఉన్నతాధికారులకు విజ్ఞప్తిచేశారు. ఈ విషయమై తాసిల్దార్ రాఘవరెడ్డిని వివరణ కోరగా.. బాధిత రైతు ఇచ్చిన ఫిర్యాదును పరిశీలించి తగిన చర్యలు తీసుకొంటానని హామీ ఇచ్చారు.

# కిసాన్‌సమ్మాన్ లబ్ధిదారులు 34.51లక్షలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం-కిసాన్) పథకం లబ్ధిదారుల లెక్క ఓ కొలిక్కి వచ్చింది. కేంద్ర ప్రభుత్వం విడుదలచేసిన మార్గదర్శకాల ప్రకారం.. రాష్ట్రవ్యాప్తంగా 34.51 లక్షల మంది రైతులను ఈ పథకం లబ్ధిదారులుగా గుర్తించారు. వాస్తవానికి రాష్ట్రంలో 54.50 లక్షల మంది రైతులు ఉన్నారు. పీఎం-కిసాన్ పథకంలో గత ఆర్థికసంవత్సరంలో 21.42 లక్షల మంది రైతులనే అర్హులుగా గుర్తించి, పోర్టల్‌లో అప్‌లోడ్ చేశారు. వారిలో మొదటి విడతలో మార్చి నెలలో 18.47 లక్షల మంది రైతులకు రూ.369.40 కోట్లు నగదు బదిలీచేశారు. 5 ఎకరాల లోపు భూమి ఉన్న రైతులే కాకుండా.. అంతకంటే ఎక్కువ భూమి ఉన్న రైతులకు కూడా రూ.6 వేల చొప్పున ఆర్థిక సహాయం చేసేలా కేంద్రప్రభుత్వం పథకంలో మార్పులు చేసింది. దీంతో లబ్ధిదారుల సంఖ్య 34.51లక్షలకు పెరిగింది. వీరందరి వివరాలను పీఎం-కిసాన్ పోర్టల్‌లో అప్‌లోడ్‌చేసి కేంద్ర వ్యవసాయశాఖకు సమాచారం ఇచ్చినట్లు వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి సీ పార్థసారథి తెలిపారు. మూడు విడతలుగా వీరికి నగదు జమ చేస్తారు.



రవీంద్రభారతిలో సినీగేయ రచయిత సిరివెన్నెలకు సినారె-ఆళ్ల స్వర్ణకంకణ పురస్కారం ప్రదానం చేస్తున్న మహారాష్ట్ర గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు. చిత్రంలో ప్రభుత్వ సలహాదారు రమణాచారి, నటి జమున తదితరులు ఉన్నారు.

# తెలుగును కాపాడుకుందాం

- సినారె జయంతి సభలో మహారాష్ట్ర గవర్నర్ విద్యాసాగర్‌రావు పిలుపు
- సినీగేయ రచయిత సిరివెన్నెలకు 'సినారె-ఆళ్ళ' స్వర్ణ కంకణం ప్రదానం

**రవీంద్రభారతి:** తెలుగు భాషను కాపాడుకుందామని మహారాష్ట్ర గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు పిలుపునిచ్చారు. తెలుగు భాష కూడా అంతరించే దశకు వచ్చిందని ఆందోళన వ్యక్తంచేశారు. రవీంద్రభారతిలో వంశీ ఇంటర్నేషనల్, వేగేశ్న ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన డాక్టర్ సీ నారాయణరెడ్డి 88వ జయంతి కార్యక్రమంలో విద్యాసాగర్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. సినారె కాంస్య విగ్రహం ఏర్పాటుకోసం సీఎం కేసీఆర్‌తో మాట్లాడుతానని తెలిపారు. అనంతరం సినీగేయ రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రిని ఘనంగా సత్కరించి 'సినారె-ఆళ్ళ స్వర్ణ కంకణం' ప్రదానం చేశారు. గోవిందరాజు రామకృష్ణారావు రచించిన 'స్వరాంగీణ ప్రతిభామూర్తి' గ్రంథం, కంపల్లె రవిచంద్రన్ రచించిన 'నీ పేరు తలచిన చాలు' గ్రంథాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి, నటి జమున, కిమ్స్ దవాఖాన చైర్మన్ బొల్లినేని కృష్ణయ్య, డాక్టర్ ఆళ్ళ శ్రీనివాసరెడ్డి(అమెరికా), వంశీరామరాజు, సుంకరపల్లి శైలజ తదితరులు పాల్గొన్నారు.



# కబ్జాల డీఎస్పీ!

నల్లగొండలో పోలీసు అధికారి భూ దాహం

- హోదాను అడ్డంపెట్టుకొని అడ్డగోలు కబ్జాలు
- 'ఆడబిడ్డల భూమిపై డీఎస్పీ కన్ను' కథనంతో.. వెలుగులోకి మరికొన్ని దురాగతాలు
- తమ భూమినీ కబ్జా చేశారంటూ ధర్మగంటను ఆశ్రయించిన బాధితులు
- డీఎస్పీ వ్యవహారంపై డీజీపీ ఆరా!

ఆయనో పోలీసు ఉన్నతాధికారి. చట్టాన్ని కాపాడాల్సిన అధికారే తన ఖాకీ డ్రస్‌ను అడ్డంపెట్టుకొని అడ్డగోలుగా భూ కబ్జాలకు పాల్పడితే? బాధితులు ఎవరికి చెప్పుకోవాలి? అసలే పోలీసు.. పైగా ఉన్నతాధికారి! తన కుటుంబసభ్యులతో పొరుగునే ఉన్న రైతుల భూములను ఆక్రమించి కంచె వేయిస్తారు. అదేంటని అడగటానికి వెళ్లేవాళ్లను బెదిరిస్తారు. రాళ్లతో కొట్టి దాదాగిరీ చేస్తారు. ఇటువంటి అధికారిపై ఫిర్యాదు చేయాలంటే సామాన్యులకు చాలా ధైర్యం కావాలి. తదనంతర విపరిణామాలను ఎదుర్కొనేందుకు సిద్ధపడాలి. ఆ సాహసం చేసింది ఒక కుటుంబం. 'ఆడబిడ్డల భూమిపై డీఎస్పీ కన్ను' పేరిట ఆ బాధితుల గోడును నమస్తే తెలంగాణ వార్తగా ప్రచురించడంతో సదరు కబ్జాకోరుపై ఫిర్యాదు చేసేందుకు మరిన్ని కుటుంబాలు ముందుకు వచ్చాయి. తమకు న్యాయం చేయాలని మొరపెట్టుకున్నాయి. కాగా, నమస్తే తెలంగాణలో కథనం ప్రచురితమైన నేపథ్యంలో ఈ విషయంలో డీజీపీ మహేందర్‌రెడ్డి ఆరా తీశారని సమాచారం.

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నాగర్‌కర్నూల్‌లో ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న కొమ్ము శంకర్ తనకున్న పలుకుబడిని ఉపయోగించి నల్లగొండలో తన కుటుంబ సభ్యులచేత దౌర్జన్యాలు చేయిస్తూ భూకబ్జాలు చేయిస్తున్నారని, ఇదేం పద్ధతని అడిగితే.. దాడులకూ వెనుకాడటం లేదని పలువురు బాధితులు వాపోతున్నారు. నల్లగొండ శివారు గ్రామమైన అక్కలాయిగూడెం సర్వే నంబర్ 240లో రెండెకరాల భూమి ఉన్నది. ఇందులో కంబాలపల్లి పెద్ది రాములమ్మ, కంబాలపల్లి మల్లయ్య, కంబాలపల్లి వెంకమ్మ, కంబాలపల్లి లింగయ్యలకు 19 గుంటల చొప్పున భూమి ఉన్నది. సదరు డీఎస్పీ కుటుంబసభ్యులు వీరి భూమితోపాటు ఈ భూమిలోనుంచి వెళ్తున్న మరో నాలుగుగుంటల డొంకను కూడా ఆక్రమించారని బాధితులు చెప్తున్నారు. రికార్డులను పరిశీలిస్తే బాధితులకు ఈ సర్వే నంబర్‌లో రెండెకరాల భూమికి 1బీ పత్రాలున్నాయి. రికార్డుల ప్రక్షాళన అనంతరం కొత్త పట్టాదార్ పాస్‌పుస్తకాలు కూడా వచ్చాయి. రైతుబంధు, రైతుబీమా కూడా వర్తిస్తున్నాయి. కానీ, డీఎస్పీ తన అధికారబలాన్ని ఉపయోగించి భూమిని సాగు చేయనివ్వడంలేదని, తమ భూమికే తాము పరాయి వాళ్లమయ్యామని బాధితులు వాపోతున్నారు. కబ్జాచేసిన భూమిలో ఎర్రచందనం చెట్టుపెట్టి చుట్టూ కంచె కట్టుకున్నారని చెప్తున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే.. 'ఈ భూమి మీదే కానీ మేము ఏమీచేయలేం.. ఆయన మొండివాడు. ఎంత చెప్పినా వినడు. నేను రోజూ మీ పంచాయితీ చేయడానికే ఇక్కడ ఉన్నానా?' అంటూ వన్‌టౌన్ పోలీస్ అధికారి విసుక్కుంటున్నారని బాధితులు కన్నీరుమున్నీరయ్యారు. ఎవరైనా భూమిని దౌర్జన్యంగా కబ్జాచేస్తే అలాంటి వారిపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు పంపించాల్సిన పోలీసులు ఇందుకు విరుద్ధంగా 'వాళ్లు మంచివాళ్లు కాదు.. మీరు ఆ భూముల వద్దకు వెళ్లకండి' అని ఉచిత సలహాలు ఇవ్వడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఓ పక్క 240 సర్వే నంబర్‌లోని భూమిని కబ్జా చేయడంపై ఆందోళన చేస్తుండగానే కబ్జాదారులు బాధితులకే చెందిన మరో సర్వే నంబర్ 416లో ఉన్న భూమిని కూడా కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. 416 సర్వేనంబర్ భూమి హద్దులను చెరిపేస్తున్నారని బాధితులు చెప్పారు.

### హద్దులు నిర్ణయిస్తాం

తమ భూమిని సర్వేచేయాలని కొంత మంది వచ్చిన మాట వాస్తవమే. దీనిపై లీగల్‌సెల్‌కు రాశాము. లీగల్‌సెల్ నుంచి అభిప్రాయం వచ్చిన తరువాత సర్వేచేసి హద్దులు నిర్ణయిస్తాం.

– శ్రీనివాస్, అడిషనల్ డైరెక్టర్, ల్యాండ్ సర్వే సెటిల్‌మెంట్

### శంకర్ అంటే హడల్!

డీఎస్పీ శంకర్ తనకున్న హోదాను ఉపయోగించి నల్లగొండలో బాధితుల పక్షాన ఎవ్వరూ నిలబడకుండా, మాట్లాడకుండా చేస్తున్నారని బాధితులు చెప్తున్నారు. పోలీసులేమో 'వాడో మొండోడు.. మీరు వెళ్లవద్దు' అని ఉచిత సలహాలిస్తుంటే.. రెవెన్యూ అధికారులు 'ఈ భూమి మీదే అని చెప్పాం. ఇంతకంటే ఏమీ చేయలేం' అని చేతులు దులిపేసుకొంటుండటంతో బాధితులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఒక రెవెన్యూ అధికారి భూమిని సర్వేచేసి హద్దులు నిర్ణయించడానికి ప్రయత్నిస్తే సదరు డీఎస్పీ తాను పనిచేస్తున్న ఏరియాలోని ఆర్డీవో ద్వారా అటువైపుకు వెళ్లవద్దని ఆదేశించారని సమాచారం. దీంతో సదరు అధికారి 'నాకు పై నుంచి ఒత్తిళ్లు వస్తున్నాయి. నేను ఏమిచేయలేను' అని వెనక్కు తగ్గాడని బాధితులు వాపోతున్నారు. దీంతో డీఎస్పీ కొడుకులు, భార్యలు, మనవళ్లు అంతా దాడికి వస్తారన్నారు. 'ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకో.. కలెక్టర్ వచ్చినా మమ్మల్ని ఏమీ చేయలేడు.. ఈ భూమి అంతా మాదే.. భూమిలోకి ఎలా వస్తారో చూస్తాం' అంటూ బెదిరిస్తున్నారని, భూమి మీదకు వెళితే రాళ్లతో కొడుతున్నరని, చేతిలో ఉన్న గొడ్డలి తీసుకొని నరుకుతానని మీదకు వస్తారని పెద్ద రాములమ్మ, కంబాలపల్లి వెంకమ్మ వాపోయారు. భూమిని మేము దున్నుకోవడానికి వచ్చామంటే చాలు.. బూతులు తిడుతూ రాళ్లు, కర్రలతో గుండెలపై గుద్దుతున్నారని కంబాలపల్లి మల్లయ్య భోరుమన్నాడు. ఈ భూమి వద్దకు ఏ అధికారి రాకుండా డీఎస్పీ శంకర్ ఫోన్లు చేస్తారని చెప్పారు. 'ఎలాగైనా మా భూమిని మాకు అప్పగించండి సారు.. ఏమిలేనోళ్లం.. ఇన్నికూరగాయలు పండించుకొని బతుకుతం' అని బాధితులు నమస్తే తెలంగాణకు మొర పెట్టుకున్నారు.

# ప్రత్యామ్నాయ పంటలు వేయాలి

- నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో తీవ్ర దుర్భిక్షం
- రైతులు ఆర్థికంగా నష్టపోకుండా కంటింజెన్సీ ప్రణాళిక
- జిల్లాలవారీగా పంటల క్యాలెండర్‌ను విడుదల చేసిన వ్యవసాయశాఖ
- 6 లక్షల క్వింటాళ్ల విత్తనాలు సిద్ధంగా ఉంచాలని తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థకు ఆదేశం



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నందున రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని వ్యవసాయశాఖ విజ్ఞప్తిచేసింది. ఈ మేరకు కంటింజెన్సీ ప్రణాళికను విడుదల చేసింది. ఈ నెల 15 నాటికి సాధారణ స్థాయిలో పంటల సాగు విస్తీర్ణం పెరుగకపోతే కంటింజెన్సీ ప్రణాళిక అమలుచేయాలని సూచించింది. ప్రణాళికలో ప్రస్తుత వానకాలం సీజన్ పరిస్థితిని వివరిస్తూ, ప్రత్యామ్నాయ పంటల వివరాలను జిల్లాలవారీగా ప్రకటించింది. కంటింజెన్సీ ప్రణాళిక అమలుకు అవసరమైన విత్తనాలు సరఫరా చేయాలని తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థను ఆదేశించింది. రుతుపవనాలు బలహీనంగా ఉండి రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నెల 12వ తేదీ నాటికి 31 శాతం లోటు వర్షపాతం నమోదైంది. నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయి. ప్రస్తుత సీజన్లో 1.08 కోట్ల ఎకరాలకుగాను కేవలం 43.33 లక్షల ఎకరాల్లోనే పంటలు సాగయ్యాయి. ఈ నేపథ్యంలో రైతులు ఆర్థికంగా నష్టపోకుండా ఉండేందుకు ప్రత్యామ్నాయ పంటల సాగుకు వెళ్లాల్సిన అవసరం ఉన్నదని, ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నట్టు వ్యవసాయశాఖ తెలిపింది.

**మూడు దశల్లో కంటింజెన్సీ ప్రణాళిక**

కంటింజెన్సీ ప్రణాళికను మూడు దశల్లో అమలుచేయాలని నిర్ణయించారు. ఈ నెల 15వ తేదీ వరకు సాధారణంతో పోలిస్తే సాగు విస్తీర్ణం పెరగకపోతే మొదటి ప్రణాళిక, ఈ నెల 31వ తేదీ నాటికి కూడా పరిస్థితి మెరుగుపడనిపక్షంలో రెండో దశ ప్రణాళిక, ఆగస్టు 15 నాటికి కూడా పరిస్థితిలో మార్పురాకపోతే మూడో దశ అమలుచేయనున్నారు. ఏ జిల్లాలో ఏయే పంటలను సాగుచేయాలనేదానిపై వ్యవసాయశాఖ క్యాలెండర్‌ను విడుదల చేసింది. జిల్లాలవారీగా వర్షపాతం, అక్కడి నేల స్వభావం, వేయాల్సిన పంటల వివరాలను క్యాలెండర్‌లో పేర్కొన్నారు. ప్రధానంగా స్వల్పకాలిక, మధ్యకాలిక విత్తనాలను.. అలాగే వివిధ రకాల వెరైటీలను వేయాలని సూచించింది. ఉదాహరణకు కామారెడ్డి జిల్లాలో తేలికపాటి నేలల్లో తొలి దశ కింద మధ్యకాలిక కంది, పొద్దుతిరుగుడు, మక్కజొన్న వేయాలని, రెండో దశలో ఆయా పంటల్లోని స్వల్పకాలిక రకాలతోపాటు జొన్న, సల్వకాలిక కూరగాయలు విత్తుకోవాలని సూచించింది. మూడో దశలో కంది, పొద్దుతిరుగుడు, ఆముదం సాగుచేయాలని పేర్కొన్నది.

**6 లక్షల క్వింటాళ్ల విత్తనాలు కావాలి**

కంటింజెన్సీ ప్రణాళిక అమలుకు 6.02 లక్షల క్వింటాళ్ల విత్తనాలను అందుబాటులో ఉంచాలని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థకు వ్యవసాయశాఖ కమిషనర్ రాహుల్‌బొజ్జా లేఖ రాశారు. మొదటి దశ కంటింజెన్సీ ప్రణాళిక అమలుకు 1.78 లక్షల క్వింటాళ్ల విత్తనాలు, రెండో దశకు 1.94 లక్షల క్వింటాళ్ల విత్తనాలు, మూడో దశకు 2.28 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అందించాలని సూచించింది. మూడు దశల్లో 2.45 లక్షల క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు కూడా అందుబాటులో ఉంచాలని కోరింది. ఇవేకాకుండా మినుము, నువ్వు, సజ్జ, ఆముదం, కొర్రలు, పొద్దుతిరుగుడు విత్తనాలు కూడా సరఫరా చేయాలని వ్యవసాయశాఖ సూచించింది.

# దేశ చరిత్రలోనే డబుల్ రికార్డు

- రాష్ట్రంలో 2,80,616 డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణం
- జవాబుదారీతనానికి పెద్దపీట
- జాప్యం లేకుండా కాంట్రాక్టర్లకు చెల్లింపులు
- నిర్మాణాలు చేపట్టేవారికి ప్రత్యేక ప్రోత్సాహకాలు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నిరుపేదల సొంతింటి కలను సాకారం చేయాలన్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సంకల్పాన్ని నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముమ్మరంగా కృషిచేస్తున్నది. పేదలపై ఒక్క పైసా కూడా భారాన్ని మోపకుండా 560 చదరపు అడుగుల వైశాల్యంలో డబుల్ బెడ్‌రూం ఇండ్లను నిర్మించి ఇస్తున్న ప్రభుత్వం.. తొలివిడతగా రూ.18,520 కోట్ల వ్యయంతో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో 2,80, 616 డబుల్ బెడ్‌రూం ఇండ్లను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించి దేశ చరిత్రలోనే సరికొత్త రికార్డు సృష్టించనున్నది. పారదర్శకతకు, జవాబుదారీతనానికి ప్రాధాన్యమిస్తున్న ప్రభుత్వం.. బిల్లులు సమర్పించిన 15 రోజుల్లోనే కాంట్రాక్టర్లకు చెల్లింపులు జరిగేలా చూస్తున్నది.

### కాంట్రాక్టర్లకు పలు ప్రోత్సాహకాలు

డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణంలో భాగంగా ఇప్పటివరకు 1,99,835 గృహాలకు టెండర్లను ఖరారు చేసిన రాష్ట్ర ప్రభుత్వం.. వాటిని నిర్మించే కాంట్రాక్టర్లకు పలు ప్రోత్సాహకాలను అందజేస్తున్నది. సిమెంట్ కంపెనీలతో చర్చించి మార్కెట్ ధరకన్నా తక్కువకే (బస్తాకు రూ.230 చొప్పున) వారికి సిమెంట్ సరఫరా చేయిస్తున్నది. సీనరేజి చార్జీలను మాఫీచేసి ఇసుకను ఉచితంగా అందజేస్తున్నది. టెండర్ల ప్రక్రియలో ఈఎండీని 2.5 శాతం నుంచి 1 శాతానికి, కాంట్రాక్టర్లకు చెల్లించే బిల్లులో ధరావతు (ఎఫ్‌ఎస్‌డీ)ను 7.5 నుంచి 2 శాతానికి తగ్గించడంతోపాటు ఇండ్ల నిర్మాణ పనులు పూర్తయిన తర్వాత విడుదలచేసే ఎఫ్‌ఎస్‌డీ కాలాన్ని రెండేండ్ల నుంచి ఏడాదికి తగ్గించింది.

### రాష్ట్రంలో 'డబుల్' తీరుతెన్నులు

| | | |
|---|---|---|
| మంజూరైన ఇండ్లు: | 2,80,616 | ప్రాజెక్టు అంచనా వ్యయం: రూ.18,520 కోట్లు |
| టెండర్లు పిలిచినవి: | 2,38,926 | |
| టెండర్లు ఖరారైనవి: | 1,99,835 | |
| నిర్మాణం మొదలైనవి: | 1,79,078 | ఇప్పటివరకు అయిన ఖర్చు: రూ.6,141 కోట్లు |
| నిర్మాణం పూర్తయినవి: | 1,23,314 | |
| వివిధ దశల్లో నిర్మాణంలో జరిగేవి: | 55,764 | |

### ప్రత్యేక ప్రశంసలు..

డబుల్ బెడ్‌రూం ఇండ్ల డిజైన్, లేఅవుట్‌లో సృజనాత్మకతతోపాటు ఇండ్ల నిర్మాణంలో మెరుగైన పనితీరు కనబరుస్తున్న ఆన్‌లైన్ ప్రాజెక్టు మానిటరింగ్ సిస్టం (ఓపీఎంఎస్)కు జాతీయ స్థాయిలో హడ్కో అవార్డులు లభించాయి. ఈ పథకం అమలుపై అధ్యయనం చేసేందుకు జాతీయ స్థాయి అధికారులతోపాటు ఇతర రాష్ట్రాల అధికారులు, నిపుణులు తెలంగాణ ప్రభుత్వాన్ని ప్రత్యేకంగా ప్రశంసిస్తున్నారు. ఇటీవల తెలంగాణలో పర్యటించిన ఏపీ అధికారులు తమ రాష్ట్రంలోనూ ఇలాంటి ఇండ్లను నిర్మించాలని నిర్ణయించారు.

– చిత్రా రామచంద్రన్, ఎండీ, తెలంగాణ రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ

# మహాప్రభో.. మావల్ల కాదు!

**లెటర్ ఆఫ్ క్రెడిట్ నిబంధన వాయిదా వేయండి: దక్షిణాది రాష్ట్రాల విద్యుత్ సంస్థలు**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** విద్యుత్ కొనుగోలు ఒప్పందం (పీపీఏ) చేసుకున్న డిస్కంలు లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్వోసీ)ను సమర్పించాలన్న కేంద్రం నిర్ణయంతో దక్షిణాది డిస్కంలు ఇబ్బందుల పాలవుతాయని, నిర్ణయాన్ని వాయిదా వేసుకోవాలని దక్షిణప్రాంత విద్యుత్ కమిటీ (ఎస్సార్పీసీ) విజ్ఞప్తి చేసింది. ఎస్సార్పీసీ చైర్మన్ సెల్వకుమార్ అధ్యక్షతన 12న ఆ కమిటీ 36వ సమావేశం జరిగింది. సమావేశంలో దక్షిణాది రాష్ట్రాల విద్యుత్ సంస్థల చైర్మన్లు.. ఎల్వోసీ నిబంధనను అమలుచేయవద్దని ముక్తకంఠంతో కోరారు. ఈ నేపథ్యంలో దక్షిణాది రాష్ట్రాల్లోని డిస్కంల పరిస్థితిని వివరిస్తూ సెల్వకుమార్ కేంద్ర ఇంధన శాఖ కార్యదర్శికి లేఖ రాశారు. దక్షిణాది డిస్కంలు ఆర్థిక ఒత్తిళ్లలో ఉన్నాయని, ఎల్వోసీ నిబంధన అమలు ఉపయుక్తం కాదని పేర్కొన్నారు.ఎల్వోసీ నిబంధనల ప్రతిపాదనలపై ముందుగా దక్షిణాది రాష్ట్రాల్లోని విద్యుత్ భాగస్వామ్య సంస్థలతో చర్చించాకే తుది నిర్ణయం తీసుకోవాలని కోరారు.

# డిగ్రీ ప్రవేశాలకు ప్రత్యేక 'దోస్త్'

- నేటినుంచే సర్టిఫికెట్ల పరిశీలన, ఆప్షన్ల ఎంపిక ప్రారంభం
- దోస్త్ కన్వీనర్ ప్రొఫెసర్ లింబాద్రి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) ప్రత్యేక ప్రకటన జారీ చేసింది. రూ.400 ఫీజు చెల్లించి బుధవారం (ఈ నెల 17) నుంచే విద్యార్థులు రిజిస్ట్రేషన్లు నమోదు చేసుకోవచ్చు. అదేరోజు నుంచి సర్టిఫికెట్ల పరిశీలనతోపాటు వెబ్ కౌన్సెలింగ్ ద్వారా ఆప్షన్ల నమోదు ప్రక్రియ ప్రారంభం కానుందని దోస్త్ కన్వీనర్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26న సీట్ల కేటాయింపు చేస్తామని, సీట్లు పొందినవారు అదేరోజు ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని పేర్కొన్నారు. ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో పాసైనవారు, గతంలో ఇంటర్ పాసై, దోస్త్‌కు నమోదుచేసుకోనివారు, గతంలో దోస్త్‌కు నమోదై వెబ్‌ఆప్షన్లు ఎంపికచేసుకోనివారు, మూడు కౌన్సెలింగ్‌లలో తక్కువ ఆప్షన్లు పెట్టడంతో సీటు పొందనివారు ప్రత్యేక కౌన్సెలింగ్‌లో పాల్గొనడానికి అవకాశం కల్పించామని, పూర్తివివరాలకు dost.cgg.gov.in వెబ్‌సైట్‌ను పరిశీలించాలని తెలిపారు.



మానసిక రోగుల ఆరోగ్యంపై అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న సీఎస్ ఎస్కే జోషి

# 'హాఫ్‌వే హోమ్స్'కు ప్రణాళికలు

- మానసిక రుగ్మతల నుంచి కోలుకున్నవారి కోసం ఏర్పాటుచేయాలి
- నిధుల కోసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపాలి:సీఎస్ జోషి ఆదేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మానసిక వైద్యశాలల్లో చికిత్సపొంది ఆరోగ్యవంతులైనవారి కోసం హాఫ్‌వే హోమ్స్‌ను ఏర్పాటు చేసేందుకు అవసరమైన ప్రణాళికలను 15 రోజుల్లో రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి అధికారులను ఆదేశించారు. మానసిక రోగుల ఆరోగ్యంపై మంగళవారం ఆయన అధ్యక్షతన సచివాలయంలో మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. మానసిక రుగ్మతల నుంచి కోలుకున్నప్పటికీ దవాఖానల్లోనే కొనసాగుతున్న వారి కోసం సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా హాఫ్‌వే హోమ్స్‌ను ఏర్పాటుచేయనున్నామని సీఎస్ తెలిపారు. జిల్లాల్లో మెంటల్ హెల్త్ బోర్డుల ఏర్పాటుకు అనుమతి కోసం హైకోర్టు రిజిస్ట్రార్‌కు లేఖ రాయాలని, దీనదయాళ్ డిజేబుల్డ్ రిహాబిలిటేషన్ పథకం నుంచి నిధులు పొందేందుకు ప్రతిపాదనలు రూపొందించి కేంద్రానికి సమర్పించాలని సీఎస్ జోషి అధికారులకు సూచించారు. వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, స్త్రీశిశు సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి జగదీశ్వర్, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ యోగితారాణా, వికలాంగులశాఖ కమిషనర్ శైలజ, డీఎంఈ రమేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నూరు శాతం పారదర్శకత లక్ష్యం

- కీలకపాత్ర పోషించనున్న కలెక్టర్లు
- క్రెడిట్ రేటింగ్, బాండ్లతో నిధులు
- మున్సిపాలిటీలకు మాస్టర్ ప్లాన్
- నేడు క్యాబినెట్ భేటీలో ముసాయిదాకు ఆమోదం!

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పూర్తి పారదర్శకత, ప్రజలకు మెరుగైన సేవలే లక్ష్యంగా మున్సిపల్ కొత్త చట్టం ముసాయిదా సిద్ధమైంది. ప్రజాప్రతినిధులు, అధికారుల్లో జవాబుదారీతనం పెంచడంతోపాటు బాధ్యతలు నిర్వర్తించనివారిపై చర్యలు తీసుకొనేలా విధివిధానాలు రానున్నాయి. ఆర్థికంగా సొంతకాళ్లపై నిలబడేలా వినూత్న విధానాలు అవలంబించడం సహా అన్ని పట్టణాలకు మాస్టర్‌ప్లాన్లు రూపొందించనున్నారు. పచ్చదనం, పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తూ అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ విధా నం, అర్బన్ సెం టర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లను ఏర్పాటుచేయనున్నారు. కొత్తచట్టం కోసం మున్సిపల్‌శాఖ రూపొందించిన ముసాయిదా బిల్లుపై న్యాయశాఖ పరిశీలన పూర్తయ్యింది. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు నేతృత్వంలో మంగళవారం ప్రగతి భవన్లో జరగనున్న మంత్రివర్గం సమావేశంలో ఈ ముసాయిదాపై చర్చించి ఆమోదించనున్నారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, గ్రేటర్ హైదరాబాద్ మినహా ఇతర కార్పొరేషన్ల కోసం కొత్త చట్టం తీసుకురానున్నారు. నూరుశాతం పారదర్శకత లక్ష్యంగా కొత్త చట్టం తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు పూర్తిచేసింది. ప్రజాప్రతినిధులు, అధికారుల్లో జవాబుదారీతనం పెరిగేలా విధాన రూపకల్పన చేయడం, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించేవారిపై చర్యలు తీసుకొనే అధికారాన్ని చట్టంలో పొందుపర్చనున్నట్టు సమాచారం. పట్టణ ప్రజలకు సేవలు అందించడంలో కలెక్టర్లు కీలకపాత్ర పోషించేలా ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిసింది. ఆయా పట్టణాల్లోని జనసాంద్రత ఆధారంగా భూ వినియోగం, చివరి గమ్యం వరకు రవాణా వ్యవస్థ, ల్యాండ్ పూలింగ్ విధానం, సమగ్ర మంచినీటి- పారిశుద్ధ్య వ్యవస్థ ఉండేలా చర్యలు తీసుకొంటున్నట్టు సమాచారం.

**అమలులోకి జోనల్ నిబంధనలు**

పట్టణ ప్రాంతాల్లో సమీకృత భవనాల నిర్మాణం సహా జోనల్ నిబంధనలు అమలుచేయనున్నారు. మున్సిపాలిటీల్లో సొంత ఆర్థిక వనరుల పెంపు దిశగా వివిధ చర్యలు తీసుకుంటారు. ఆస్తి పన్ను వసూళ్లలో సంస్కరణలను ప్రతిపాదిస్తున్నారు. కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు క్రెడిట్ రేటింగ్ ఇచ్చి బాండ్ల ద్వారా నిధులు సమీకరించుకొనే వెసులుబాటు కల్పించేలా కొత్త చట్టంలో విధివిధానాలు రూపొందిస్తున్నట్టు తెలిసింది. అన్ని స్థానికసంస్థలకు మాస్టర్ ప్లాన్లను రూపొందించనున్నారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సిస్టంతో ఘన, ద్రవ్య వ్యర్థాల సమగ్ర నిర్వహణా విధానాల్ని అమలుచేస్తారు. పట్టణ ప్రాంత స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణసహా రిజర్వేషన్ల అంశాన్ని ముసాయిదా బిల్లులో పొందుపరిచినట్టు సమాచారం.

### ఓటర్ల జాబితా సిద్ధం

- నేడు పార్టీలతో సమావేశం
- 19న పోలింగ్ స్టేషన్ల జాబితా
- నాలుగోవారంలో ఎన్నికల షెడ్యూల్!





**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని 129 మున్సిపాలిటీలు, 3 కార్పొరేషన్లలో ఓటర్ల జాబితాలు మంగళవారం సిద్ధమయ్యాయి. ఇప్పటికే ముసాయిదా ఓటర్ల జాబితాలపై అభ్యంతరాలు, ఫిర్యాదులను స్వీకరించాక ఓటర్ల జాబితాలు సిద్ధం చేసినట్టు అధికారులు చెప్తున్నారు. 21న తుది జాబితాను ప్రకటించాలని షెడ్యూల్‌ను సవరిస్తూ ఇదివరకే ఎస్ఈసీ సర్క్యులర్ జారీ చేసింది. అన్ని సక్రమంగా జరిగితే ఈ నెల నాలుగోవారంలో ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. బుధవారం ముసాయిదా జాబితా ప్రచురణ, అదే రోజు మున్సిపాలిటీల స్థాయిలో రాజకీయ పార్టీలతో సమావేశం, 19న అభ్యంతరాలు, సలహాలను స్వీకరించి, పరిష్కరిం చి.. అదేరోజున తుది జాబితాను జిల్లా కలెక్టర్లు, ఎన్నికల అధికారులకు పంపించాలని ఎస్ఈసీ పేర్కొన్నది. 21న జిల్లా ఎన్నికల అధికారుల ఆమోదంతో సంబంధిత మున్సిపాలిటీల్లో తుది జాబితా ప్రచురణ చేపట్టాలని ఆదేశాలిచ్చారు. నిజామాబాద్, కరీంనగర్, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్లలో 20న తుదిజాబితా మున్సిపల్ కమిషనర్లకు సమర్పిస్తారు.

**ఎన్నికల ఏర్పాట్లలో వేగం**

ఇప్పటికే మున్సిపల్ కమిషనర్లకు శిక్షణా తరగతులను రాష్ట్ర ఎన్నికల కమిషన్ పూర్తి చేసింది. గురు, శుక్రవారాల్లో అసెంబ్లీ, కౌన్సిల్ సమావేశాల్లో కొత్త మున్సిపల్ చట్టంపై చర్చించి ఆమోదముద్ర వేయనున్నారు. ఆ తర్వాత ఒకట్రెండు రోజుల్లోనే రిజర్వేషన్లు ఖరారవుతాయని సమాచారం. ఈ నెల నాలుగో వారంలో ఎన్నికల షెడ్యూల్‌ను ఎస్ఈసీ విడుదలచేసే అవకాశాలున్నాయి. నోటిఫికేషన్ విడుదలయ్యాక 16 రోజుల్లో ఎన్నికల ప్రక్రియ ముగించేందుకు ఎస్ఈసీ ఏర్పాట్లు చేస్తున్నది. ఆగస్టు 15 లోగా పోలింగ్, ఫలితాల ప్రకటన, పాలకవర్గాల బాధ్యతల స్వీకారం పూర్తికావొచ్చని అధికారవర్గాల సమాచారం.

# ప్రభుత్వ ఉపాధ్యాయులకు గుర్తింపుకార్డులు!

- పరిశీలనలో డ్రెస్‌కోడ్ సైతం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరికీ గుర్తింపుకార్డులు ఇవ్వాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. టీచర్లకు హైటెక్నాలజీతో తయారుచేసిన చిప్ ఉన్న రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిటీ (ఆర్‌ఎఫ్‌ఐడీ) కార్డులను జారీచేయనున్నారు. ఈ ప్రక్రియను నెలరోజుల్లో పూర్తిచేసేందుకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లుచేస్తున్నారు. ఈ కార్డులో ఉపాధ్యాయుల ఫొటో, పేరు, యూనిక్ నంబర్ లేదా జిల్లా స్థాయి నంబర్ ఇవ్వాలన్న ప్రతిపాదనలున్నాయి. ప్రభుత్వ టీచర్లకు డ్రెస్‌కోడ్ ప్రవేశపెట్టే విషయాన్ని కూడా విద్యాశాఖ అధికారులు పరిశీలిస్తున్నట్టు సమాచారం. ఇప్పటివరకు టీచర్లకు గుర్తింపుకార్డులను జారీచేయలేదు. కొంతమంది టీచర్లు స్కూల్‌కు రాకపోయినా.. వచ్చినట్టుగా హాజరు పట్టికలు చూపిస్తున్నాయి. దీంతో ప్రజాధనం వృథా అవుతున్నది. ఇలాంటివాటికి స్వస్తిపలికి ఉపాధ్యాయులంతా సక్రమంగా విద్యాబోధన చేపట్టేవిధంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని విద్యాశాఖ భావిస్తున్నది. అందులో భాగంగానే ఆర్‌ఎఫ్‌ఐడీ గుర్తింపుకార్డులను జారీచేయనున్నామని ఆ శాఖ కమిషనర్ టీ విజయ్‌కుమార్ తెలిపారు.

# వైద్యసీట్ల కన్వీనర్ కోటా నేడు కౌన్సెలింగ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కన్వీనర్ కోటాలో ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల భర్తీకి రెండోవిడుత వెబ్‌కౌన్సెలింగ్ బుధవారం (ఈ నెల 17) నుంచి శుక్రవారం (19) వరకు నిర్వహించనున్నట్టు కాళోజీ హెల్త్ వర్సిటీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం 8 గంటల నుంచి శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల వరకు అభ్యర్థులు వెబ్‌ఆప్షన్లు నమోదుచేసుకోవాలని సూచించింది. రెండోవిడుత కౌన్సెలింగ్‌లో కేటాయించిన కోర్సు, కళాశాలల్లో అభ్యర్థులు విధిగా చేరాలని, చేరని అభ్యర్థులను ఇక ముందు జరిపే కౌన్సెలింగ్‌లో అనర్హులుగా నిర్ణయించనున్నట్టు తెలిపింది.

# ఆగస్టులో హాజరు మాసోత్సవం

- విద్యాశాఖ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 100 శాతం హాజరు నమోదుకు ఆగస్టు 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు హాజరు మాసోత్సవం నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. సోమవారం టీశాట్‌లో ప్రధానోపాధ్యాయులతో వీడియో సమావేశం నిర్వహించిన విద్యాశాఖ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి.. ఈ కార్యక్రమాన్ని ప్రతిస్కూల్లోనూ విజయవంతంచేయాలని ఆదేశించారు.

# ఇంటర్ విద్యార్థులకు ఉపకారవేతనాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఇంటర్ ఫలితాల్లో మెరిట్ సాధించిన విద్యార్థులకు ఉపకారవేతనాలను కేంద్ర మానవవనరుల మంత్రిత్వశాఖ అందిస్తున్నట్టు ఇంటర్‌బోర్డు కార్యదర్శి ఏ అశోక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపకారవేతనాల కోసం దరఖాస్తు చేసుకోవడానికి అక్టోబర్ 31 వరకు గడువు విధించామని చెప్పారు.



రోడ్లపై టోల్ టాక్స్ ఎప్పుడూ బంద్ కాదు, జీవితాంతం ఉంటుంది. రోడ్డు సేవలు మంచిగుండాలంటే, టోల్ పన్ను కట్టాల్సిందే. ప్రభుత్వం దగ్గర పైసలు లేవు.


**నితిన్ గడ్కరీ, కేంద్ర మంత్రి**

తిరుగుబాటు ఎమ్మెల్యేలుగా ముంబయి వెళ్లినవారంతా ప్రతి ఒక్కరూ మంత్రి పదవీ కావాలనుకుంటున్నారు. పది ఎమ్మెల్యేల డిమాండ్ ఆ విధంగా ఉన్నది. ఎవరు ముఖ్యమంత్రిగా ఉండాలన్నది స్పీకర్, కోర్టు పరిధిలోని విషయం కాదు.

**హెచ్‌డీ కుమారస్వామి, కర్ణాటక ముఖ్యమంత్రి**



**చరిత్రలో నేడు**



1861

పేపర్ కరెన్సీని అందుబాటులోకి తీసుకువచ్చిన అమెరికా.

1919

రాజ్యాంగాన్ని ఆవిష్కరించుకున్న ఫిన్లాండ్.





1987

ఇరాన్, ఫ్రాన్స్ మధ్య తెగిపోయిన దౌత్య సంబంధాలు.

నేపాల్ మౌలిక వసతుల నిర్మాణ కంపెనీ (ఎన్ఐసీసీ)ని ఏర్పాటుచేయడం ద్వారా 58 ఏండ్ల కింద చేసిన తప్పిదాన్ని పునరావృత్తం చేస్తున్నది. గతంలో నేపాల్ జాతీయ నిర్మాణ కంపెనీ ప్రాజెక్టులను నిర్మించడంలో విఫలమైంది. తాజాగా ఎన్ఐసీసీని ఏర్పాటుచేసి ఆ సంస్థకు పది బిలియన్ రూపాయల అధీకృత పెట్టుబడిని ఏర్పాటుచేసింది. సారంగాలు ఇతర ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులను ఈ సంస్థకు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో ప్రభుత్వం చేపట్టిన ఏ ప్రాజెక్టూ దిగ్విజయంగా పూర్తికాలేదనేది గమనార్హం.

**ది హిమాలయన్ టైమ్స్**

వరల్డ్ కప్ ఫైనల్‌తో ఆరు వారాల సంబురం ముగిసింది. దక్షిణాసియా దేశాలేవీ ఫైనల్‌కు చేరనప్పటికీ టోర్నమెంట్ పొడుగూతా వారి ఆధిపత్యం కనిపించింది. బంగ్లాదేశ్ బాగా ఆడింది కానీ దేశ ఆకాంక్షలు ఇంకా బలంగా ఉన్నాయి. ఎనిమిదవ స్థానానికి వచ్చిన బంగ్లాదేశ్ జట్టు ఇంకా కొంచెం బాగా ఆడగలిగి ఉండేది. మళ్లా నాలుగేండ్ల తరువాత దక్షిణాసియా దేశాలు తమ ప్రతిభకు పదునుపెడుతాయని భావిద్దాం. బంగ్లాదేశ్ క్రికెట్ జట్టు దీర్ఘకాలిక దృష్టిని కలిగి ఉండాలె. కొత్త వారిని ఎంపిక చేసుకొని తగిన శిక్షణ ఇవ్వాలె.

**ది డైలీ స్టార్**



# సమాఖ్య స్ఫూర్తి ఏది?

జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)కు విస్తృత అధికారాలను కట్టబెట్టే బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ప్రతిపక్ష సభ్యుల నిరసనలు, అభ్యంతరాల మధ్య దిగువసభలో ఆమోదం పొందిన ఈ బిల్లు ఎగువసభలో ఆమోదం పొందాల్సి ఉన్నది. ఈ బిల్లుతో జాతీయ దర్యాప్తు సంస్థ మరింత బలోపేతం, విస్తృతం కానున్నది. గతంలో ఎన్ఐఏ పరిధిలో కేవలం ఉగ్రవాద కార్యకలాపాలు, విధ్వంసక హత్యాకాండల కేసులు మాత్రమే ఉండేవి. ప్రస్తుత సవరణ బిల్లుతో సైబర్‌నేరాలు, నకిలీ నోట్లు, దొంగనోట్ల చెలామణి, ఆయుధాలు, మనుషుల అక్రమ రవాణా కేసులు కూడా ఎన్ఐఏ పరిధిలోకి వస్తాయి. అలాగే విదేశాల్లో భారతీయులపై, వారి ఆస్తులపై జరిగే దాడుల విషయంలోనూ ఎన్ఐఏ దర్యాప్తు చేపడుతుంది. భారత ప్రజలకు ఇంటా, బయటా రక్షణ కల్పిస్తూ సత్వర న్యాయం అందేలా చర్యలు చేపట్టే లక్ష్యంతో ఎన్ఐఏకు విస్తృతాధికారాలను కేంద్రం కట్టబెట్టింది. బిల్లు ఆమోదం పొందే క్రమంలో ప్రతిపక్ష సభ్యులు అనేక అనుమానాలు, భయాలు వ్యక్తం చేయటం గమనార్హం. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ అయితే దేశాన్ని పోలీస్ రాజ్యం చేసే దిశగా ఈ చట్టాన్ని తెస్తున్నారని తీవ్రంగా విమర్శించింది. కాగా దేశంలో నానాటికీ పెచ్చరిల్లుతున్న ఉగ్రవాదాన్ని అణచటం కోసమే జాతీయ దర్యాప్తు సంస్థను బలోపేతం చేస్తున్నామని, ప్రజల సంరక్షణ కోసమే పరిధిని విస్తృతపరుస్తున్నామని అధికారపక్షం చెప్పుకొచ్చింది.

**ఉగ్రవాదుల ఆగడాలను అరికట్టాలంటే విస్తృతాధికారాలు గల ప్రత్యేక దర్యాప్తు సంస్థ అనివార్యమన్న వాతావరణంలో కాంగ్రెస్ హయాంలో 2009లో ఎన్ఐఏ ఏర్పాటైంది. అయితే అప్పుడు గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న నరేంద్రమోదీ రాష్ట్రాల హక్కులను హరించే ప్రయత్నంలో భాగంగానే ఎన్ఐఏకు కాంగ్రెస్ రూపకల్పన చేసిందని విమర్శించారు. శాంతిభద్రతలు రాష్ట్రాలకు సంబంధించిన అంశమని, దాంట్లో కేంద్ర దర్యాప్తు సంస్థల పేరుతో కాంగ్రెస్ రాష్ట్రాల హక్కులను హరించివేయటానికి ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు.**

దేశంలో నెలకొన్న ఒక ప్రత్యేక పరిస్థితిలో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ఉనికిలోకి వచ్చింది. 2008లో ఉగ్రవాదులు ముంబయి ముట్టడి తర్వాత దేశవ్యాప్తంగా తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. ముంబయి ఉగ్రవాద దాడిలో 166 మంది బలయ్యారు. ఉగ్రవాదుల ఆగడాలను అరికట్టాలంటే విస్తృతాధికారాలు గల ప్రత్యేక దర్యాప్తు సంస్థ అనివార్యమన్న వాతావరణంలో కాంగ్రెస్ హయాంలో 2009లో ఎన్ఐఏ ఏర్పాటైంది. అయితే అప్పుడు గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న నరేంద్రమోదీ రాష్ట్రాల హక్కులను హరించే ప్రయత్నంలో భాగంగానే ఎన్ఐఏకు కాంగ్రెస్ రూపకల్పన చేసిందని విమర్శించారు. శాంతిభద్రతలు రాష్ట్రాలకు సంబంధించిన అంశమని, దాంట్లో కేంద్ర దర్యాప్తు సంస్థల పేరుతో కాంగ్రెస్ రాష్ట్రాల హక్కులను హరించివేయటానికి ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. మరో అడుగు ముందుకేసి దేశంలో రైట్‌వింగ్ టెర్రరిస్టుల పేరుతో బీజేపీ మద్దతుదారులపై దాడుల కోసం ఎన్ఐఏను వాడుకునే ప్రమాదం ఉన్నదని మోదీ నాడు తీవ్రంగా వ్యతిరే కించారు. అయితే కాలం మారింది, పరిస్థితి తారుమారైంది. ఇప్పుడు కేంద్రం లో అధికారంలో ఉన్న మోదీ అదే ఎన్ఐఏకు కోరలు పెంచుతున్నారు. ప్రజల రక్షణ కోసమే ఇదంతా అని చెప్పుకొస్తున్నారు. అయితే, ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్‌తో సహా మమతా బెనర్జీ తదితర నేతలు కూడా బీజేపీ చర్యను రాష్ట్రాల హక్కులను హరించడంగా నిరసిస్తూ, ఇలాంటి చట్టాలన్నీ సమాఖ్యస్ఫూర్తికి గొడ్డలిపెట్టు లాంటివని వ్యతిరేకించటం గమనార్హం.

జాతీయ దర్యాప్తు సంస్థ బిల్లు ఆమోదం చర్చలో భాగంగా పార్లమెంటులో కేంద్ర హోం మంత్రి పోటా లాంటి చట్టాలను కాంగ్రెస్ రద్దుచేయటం మూలంగానే దేశంలో ఉగ్రవాదం పెరిగిపోయిందని, ఆ తప్పును సరిదిద్దుకునేందుకే కాంగ్రెస్ ఎన్ఐఏను ఏర్పాటు చేసిందని బీజేపీ వాదించింది. ఇప్పుడు ఎన్ఐఏతో దాన్ని తుదముట్టిస్తామని అంటున్నది. అంటే బీజేపీ వాదన ప్రకారం.. కేవలం చట్టాలతోనే శాంతిభద్రతలు నెలకొంటాయనీ, నేరాలు అంతమవుతాయని అంటున్నారు. ఢిల్లీలో జరిగిన నిర్భయ ఘటన తర్వాత దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున అలాంటి ఘటనలు జరుగకుండా నిరోధించటానికి కఠిన చట్టం అవసరమనే డిమాండ్ ముందుకువచ్చింది. ఫలితంగా మహిళలపై హింసాత్మక దాడులను అరికట్టడానికి నిర్భయ చట్టాన్ని తెచ్చారు. కానీ మహిళలపై హింసాత్మక హంతక, లైంగికదాడులు నిలిచిపోలేదన్నది గుర్తించాలి. కఠినమైన చట్టాలతోనే నేరాలు తగ్గుముఖం పడుతాయని అనుకోవటం పొరపాటు. నేరాలకు, హింసాత్మక కార్యకలాపాలకు మూలమైన సామాజిక రుగ్మతలను పరిష్కరించినప్పుడే అలాంటివి రూపుమాసిపోతాయి. 'బ్రిటిష్ వారు భారతీయుల హక్కులను అణిచివేసేందుకు అనేక చట్టాలను తెచ్చారు. ఇప్పటికీ ఆ క్రిమినల్ చట్టాలున్నాయి. అందుకే మన రాజ్యాంగ నిర్మాతలు పౌరహక్కులకు ప్రాధాన్యం ఇచ్చారు. ఇప్పుడు వాటిని కాలరాసేట్లుగా చట్టాలు చేయటం సరికాద'ని కాంగ్రెస్ సభ్యుడు మనీష్ తివారీ పేర్కొనటం సముచితం. ప్రపంచవ్యాప్తంగా ప్రమాదకరంగా పరిణమించిన ఉగ్రవాదం పట్ల కఠినంగా వ్యవహరించవలసిందే. అయితే రాష్ట్రాలు కూడా ఎంతోకాలంగా ఈ చట్టం పట్ల అభ్యంతరాలను వ్యక్తం చేస్తున్నాయి. ఎన్ఐఏను ఎట్లాగూ సవరిస్తున్న ఈ సందర్భంలో సమాఖ్య స్ఫూర్తితో రాష్ట్రాలను కూడా సంప్రదిస్తే బాగుండేది.

**జనగళం**

## క్యాన్సర్‌ను నిరోధించాలె

ప్రాణాంతక క్యానర్స్ మహమ్మారితో రోజుకు వేలల్లో మరణాలు సంభవిస్తున్నాయి. ఈ వ్యాధి సోకిందంటే చాలు ప్రాణాలను నిలుపుకోవడం కఠిన పరీక్షే. క్యాన్సర్ వ్యాధి నివారణకు, దానికి సంబంధించిన చికిత్స కోసం లక్షల్లో ఖర్చు చేయాల్సి ఉంటుంది. అంతపెద్ద మొత్తంలో డబ్బు ఖర్చు చేయలేని పేదల కుటుంబాలు పడుతున్న కష్టం అంతా ఇంతా కాదు. ఇలాంటి పరిస్థితుల్లో జాతీయ ఔషధ ధరల నియంత్రణ సంస్థ క్యాన్సర్‌కు సంబంధించిన ఔషధాల ధరలను తగ్గించినట్లు ప్రకటించడం హర్షణీయం. ఇలా తగ్గించిన ఔషధాలు ప్రజలందరికీ అందుబాటులో ఉంచేట్లు చర్యలు తీసుకోవాలి. అలాగే క్యాన్సర్ వ్యాధి కారకాల నిరోధానికి కూడా ప్రభుత్వాలు కృషి చేయాలి.

**- జంపాల అంజయ్య, యాదాద్రి భువనగిరి జిల్లా**

## నిబంధనల ఉల్లంఘనే ప్రధాన కారణం

రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న తీరు, ఆ ప్రమాదాల్లో జరుగుతున్న మరణాల తీరుతెన్నులను పోలీసులు విడుదల చేస్తున్న సీసీ పుటేజీ వీడియోల్లో చూస్తుంటే గుండె తరుక్కుపోతున్నది. చిన్నపాటి నిర్లక్ష్యాలు, నిబంధనలు పాటించకపోవటం లాంటి కారణాలతోనే ఎక్కువగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నట్లు ఆ వీడియోల్లో స్పష్టంగా తెలుస్తున్నది. కాబట్టి ప్రయాణికులు ఇకనైనా జాగ్రత్తగా వ్యవహరించి తమ ప్రాణాలకు ప్రాధాన్యం ఇవ్వాలె. పోలీసుల నిబంధనలను పాటిస్తే ప్రమాదాలను పెద్దమొత్తంలో అరికట్టవచ్చునేది ప్రతి ప్రయాణికుడు తెలుసుకోవాలి.

**- కె.శ్రీనివాస్, పెద్ద సముద్రాల, సిద్దిపేట జిల్లా**

## చెత్త నిబంధనలు

ఐసీసీ చెత్త నిబంధనలు, అంపైర్ల తప్పిదం వల్లనే వరల్డ్‌కప్ గెలువాల్సిన న్యూజిలాండ్ ఓటమి పాలయింది. అయినా ఆ జట్టు ఆటగాళ్లు సంయమనం పాటించి గౌరవంగా వ్యవహరించడం అభినందనీయం. ఐసీసీ నిబంధనల వల్ల మాజీ క్రికెటర్లు కూడా అసంతృప్తిగా వ్యక్తం చేస్తుండటం క్రికెట్ అభిమానులను ఆలోచింపజేస్తున్నది. అందరి అభిప్రాయమూ అదే ఐసీసీ ఇరు జట్లను విజేతలుగా ప్రకటించాల్సి ఉండాల్సిందని.

**- జీడిపల్లి లింగారావు, రామకృష్ణకాలనీ, కరీంనగర్**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా:** 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

అమెరికా ఎన్నికలు

**క్లాయిర్ బ్రౌన్**
**సైమన్ సాల్‌స్ట్రామ్**

# మేలుచేసే నాయకుడెవరు?

అమెరికాలో మెరుగైన పెట్టుబడిదారీ వ్యవస్థను నిర్మించడానికి అవసరమైన వనరులున్నాయి. నేటి ప్రజల సంక్షే మం కోసం ఏయే విధానాలు అవలంబించాలె, భవిష్యత్తరాల కోసం ఎటువంటి న్యాయబద్ధమైన సుస్థిరమైన ఆర్థికవ్యవస్థను రూపొందించుకోవాలె అనే స్పష్టత ఉన్నది. అయితే ఈ విధానాలను అనుసరించేవారినే దేశాధ్యక్షుడిగా, చట్టసభ సభ్యులుగా ప్రజలు ఎన్నుకోవలసి ఉన్నది.

2020లో జరిగే అమెరికా అధ్యక్ష ఎన్నికల కోసం పోటీ పడుతున్న అభ్యర్థులు అనేక ఆర్థిక విధానాలను ప్రతిపాదిస్తున్నారు. ఈ విధానాలను సాధారణంగా స్వేచ్ఛా మార్కెట్‌కు లేదా సోషలిస్టు విధానాలుగా వర్గీకరించవచ్చు. అయితే ఈ రెండురకాల మాటలు అమెరికన్లకు అయోమయం కలిగిస్తాయి. ప్రత్యేకించి పెట్టుబడిదారీ విధానం అంటే స్వేచ్ఛామార్కెట్ విధానంగా భావిస్తారు. కానీ పెట్టుబడిదారీ విధానం అంటే ఆస్తిపై ప్రైవేట్ యాజమాన్యం, స్వేచ్ఛా మార్కెట్ మొదలుకొని సోషల్ డెమొక్రసీ వరకు అన్నిరకాల నమూనాలుంటాయి. ఈ భిన్నవిధాల పెట్టుబడిదారీ వ్యవస్థలలో మార్కెట్ కార్యకలాపాలకు, ఆస్తి పరిరక్షణకు, చట్టబద్ధ పాలనకు కనీస నిబంధనలుంటాయి. పలు క్యాపిటలిస్టు సమాజాలలో బలహీన వర్గాలను పరిరక్షించడానికి సామాజిక పథకాలుంటాయి. క్యాపిటలిస్టు ఆర్థిక వ్యవస్థల్లోని ప్రభుత్వాలకు రెండు ప్రాథమిక పంథాలుంటాయి. ఒకటి- సమిష్టి ప్రయోజనం కోసం మార్కెట్ నిబంధనలను ఏర్పరుచవచ్చు లేదా స్వేచ్ఛా మార్కెట్ ముసుగులో బడా పరిశ్రమలకు బాధ్యతలను అప్పగించవచ్చు. రెండవ పంథా- అసమానతలను తగ్గించడానికి, పర్యావరణాన్ని పరిరక్షించడానికి సార్వత్రిక సామాజిక పథకాలను అమలుపరుచవచ్చు లేదా ప్రభుత్వ వ్యయాన్ని కనీసస్థాయికి తగ్గించడానికి ఆయా పథకాలను ఉపసంహరించుకోవచ్చు. ప్రభుత్వం ఏ మార్గం అనుసరిస్తుందనే దాన్నిబట్టి దేశంలో అసమానతలు, గ్రీన్‌హౌజ్ వాయువుల విడుదల, సమాజ సంక్షేమం ఆధారపడి ఉంటాయి. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రాటిక్ పార్టీ తరపున పోటీ చేస్తున్న అభ్యరుల ఆర్థిక విధానాలు ఎటువంటివి అనేది సరిగ్గా అర్థం చేసుకోవాలంటే, వారి ప్రతిపాదనలు ఎట్లా ఉన్నవనేది విశ్లేషించుకోవాలె.

సమాజ సంక్షేమానికి సంబంధించిన ప్రతిపాదనలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 'సోషలిజం' అంటూ తేలికగా కొట్టిపారేస్తుంటారు. స్వేచ్ఛా మార్కెట్‌ను ప్రశంసిస్తారు. మార్కెట్ ఎకానమీ పనిచేయడానికి ఏ నిబంధనలూ అవసరం లేదని అభిప్రాయపడుతారు. ట్రంప్ అభిప్రాయం ప్రకారం- ప్రభుత్వం ఎటువంటి నిబంధనలనూ ఏర్పాటుచేయకూడదు. బహుళజాతి కార్పొరేషన్లు తమకు అనుగుణమైన రీతిలో మార్కెట్ నియమాలను నిర్ణయించుకుంటాయి. భారీ టెక్ కంపెనీలు, ఇతర రంగాలలోని గుత్తాధిపత్యం గల సంస్థలు పోటీ లేని పరిస్థితులను కోరుకుంటాయి. మార్కెట్ నియమాలు లేకపోతే పోటీ కూడా ఉండదు. ఏ కొద్ది కంపెనీలో ముఠాగా ఏర్పడి తమకు అనుగుణమైన విధానాలను నెలకొల్పుతాయి. కొత్తవాటిని ఎదుగనివ్వవు. ట్రంప్ విధానాలు మొత్తం విధాన నిర్ణయాలను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించేవిగా ఉన్నాయి. ఇంధన రంగాన్నే తీసుకుందాం. బొగ్గు, చమురు, గ్యాస్ కంపెనీలే పర్యావరణ విధానాలను నిర్ణయిస్తాయి. వాతావరణాన్ని ఎంత కాలుష్యభరితం చేయాలనేది నిర్ణయించేది ఈ బడా కంపెనీలే. అమెరికా సమాజం ఇప్పటికే శిలాజ ఇంధనాలకు అలవాటుపడ్డది. అయితే ఎంత వేగంగా పునరుపయోగ ఇంధనాలను వాడుకలోకి తేవాలనేది నిర్ణయించేది ప్రభుత్వం కాదు. ఇంధన కంపెనీలే నిర్ణయించుకుంటాయి. ఇక ఆరోగ్య రంగాన్ని పరిశీలిద్దాం. ట్రంప్ విధానాల ప్రకారం మందుల ధరలు ఎంత ఉండాలనేది నిర్ణయించవలసింది ఔషధ కంపెనీలే. బీమా కంపెనీలు పాతికశాతం లాభాలు జుర్రుకుంటున్నాయి. అమెరికా రక్షణ విధానాలను ప్రభుత్వం నిర్ణయించాలని ట్రంప్ కోరుకోరు. ఆయన అభిమతం ప్రకారం- ఆయుధ కంపెనీలు నిర్ణయిస్తాయి. ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకులు షేర్ల మార్కెట్‌ను ప్రభావితం చేస్తాయి. వ్యవసాయ క్షేత్రాలన్నీ కూడా ఈ రంగానికి చెందిన బడా కంపెనీల చేతుల్లో ఉంటాయి. ఈ విధంగా కీలక రంగాలన్నిటిలో బడా కంపెనీలు తిష్టవేశాయి. ఈ బహుళజాతి కంపెనీలే ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేస్తాయి. ఇష్టారీతిన ధరలను పెంచుకుంటాయి. కొత్తగా ఎదుగుతున్న కంపెనీలను అణిచివేసి తమ గుత్తాధిపత్యాన్ని కాపాడుకుంటాయి. అడ్డగోలుగా సంపాదించిన సొమ్ముతో తమకు కావలసినవారిని చట్టసభ సభ్యులుగా గెలిపించుకుంటాయి. ఈ చట్టసభ సభ్యులతో లాబీయింగ్ చేస్తూ ప్రభుత్వ విధానాలను శాసిస్తాయి. తమ రంగాల్లో తమ పెత్తనం, తమ లాభాలుండేలా చూసుకుంటాయి. ఈ కార్పొరేట్ సంస్థలు ప్రజాస్వామ్య ఉద్యమాలను దెబ్బతీస్తాయి.

గతంలో పలువురు డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థులు ఈ కార్పొరేట్ సంస్థల వల్ల కలుగుతున్న ముప్పును హెచ్చరించారు. బడా పారిశ్రామిక సంస్థల మూలంగానే అవినీతి పెరిగిందనీ, అసమానతలు పెరుగుతున్నాయనీ, వాతావరణ సంక్షోభం ఏర్పడినదనీ, అమెరికా ప్రజాస్వామ్యానికి కూడా ప్రమాదం ఏర్పడిందని ఎలిజబెత్ వారెన్ వాపోయారు. కొన్ని విషయాల్లో వారెన్‌కు, సాండర్స్‌కు విభేదాలున్నాయి. ఇరువురు ప్రజా ప్రభుత్వానికి అధికారాలు ఉండాలని కోరుకుంటారు. మార్కెట్ స్వరూప స్వభావాలను ప్రభుత్వం నిర్ణయించడం ద్వారానే సమాజ సంక్షేమం నెలకొంటుందని అంగీకరిస్తారు. బడా వ్యాపారులు, సంపన్నులపై అధిక పన్నులు విధించాలని, పర్యావరణ చట్టాలను కఠినంగా అమలుచేయాలని అంటారు. ప్రతి ఒక్కరికి ఆరోగ్య రక్షణ, శిశు సంరక్షణ, ఉన్నత విద్య, గృహవసతి, గౌరవ ప్రదమైన ఉద్యోగం, సామాజిక భద్రత ఉండాలని ఇరువురు అభ్యర్థులు కోరుతున్నారు. వీరిరువురే కాకుండా, డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థిత్వం కోసం ప్రయత్నిస్తున్న ఆశావహులు అందరూ ఈ విధానాల పట్ల సానుకూలంగానే ఉన్నారు. అయితే కొందరు అభ్యర్థులు మాత్రం మధ్యేవాద విధానాలను అనుసరిస్తున్నామంటూ, రైటిస్టు స్వభావాన్ని కనబరుస్తున్నారు. ఇందుకు అమెరికా మాజీ ఉపాధ్యక్షుడు జో బైడెన్ మాట లు అద్దం పడుతున్నాయి. ఆయన ఇటీవల తమకు విరాళాలు ఇచ్చే దాత ల సమావేశంలో మాట్లాడుతూ తాను గెలిస్తే ఇప్పుడున్న విధానాల్లో ఎటువంటి మౌలిక మార్పు ఉండదని హామీ ఇచ్చారు.

అమెరికా పెట్టుబడిదారీ వ్యవస్థలో భారీ ప్రక్షాళన అవసరం. వాతావరణ సంక్షోభాన్ని, తీవ్రస్థాయిలో ఉన్న అసమానతలను రూపుమాపాలంటే ప్రక్షాళన తప్పదు. విస్తృతస్థాయిలో సంక్షేమ పథకాలను, స్వాతంత్ర్యాన్ని కాపాడుకుంటూనే ఆర్థిక వ్యవస్థలను అభివృద్ధి చేయవచ్చునని యూరప్ దేశాలు నిరూపించాయి. ప్రగతిశీల పెట్టుబడిదారీ విధానం సంపదను హరించడానికి తగ్గిస్తుందని, సుస్థిర న్యాయబద్ధమైన ఆర్థికవ్యవస్థను నెలకొల్పుతుందని ప్రముఖ ఆర్థికవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత జోసెఫ్ ఈ స్టిగ్లజ్ అభిప్రాయం.

అభివృద్ధి విధానాల పేరుతో సమాజం, ప్రకృతి విధ్వంసం జరుగకూడదు. మన అభివృద్ధి విధానాలు ప్రకృతిని కాపాడేవిగా ఉండాలె. ప్రజలు సుఖంగా ఉండేవిధంగా రూపొందించాలె. అయితే సుస్థిర ప్రపంచం- అర్థవంతమైన జీవితం కలిగి ఉండాలంటే ఏయే విధానాలు సరైనవో తెలుసుకోవడానికి ఒక సూచిక ఉండాలె. బర్క్‌లీలోని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలోని మా పరిశోధక బృందం ఒక సూచికను తయారుచేసింది. ఈ 'సస్టయినెబుల్ షేర్డ్- ప్రాస్పరిటీ పాలసీ ఇండెక్స్' (ఎస్ఎస్‌పీఐ) ద్వారా సుస్థిర ప్రపంచంలో అర్థవంతమైన జీవితాన్ని కల్పించే విధానాలను కొలువవచ్చు. ఈ సూచిక ఆధారంగా యాభై దేశాల ర్యాంకులను నిర్ణయించాం. ఇందుకు మూడు ప్రధాన ప్రాతిపదికలను అనుసరించాం. ఒకటి-నిబంధనలు, పన్నులతో కూడిన మార్కెట్ నిర్మాణాన్ని ప్రభుత్వ విధానాలే నిర్ణయించాలె. రెండు-పర్యావరణ పరిరక్షణ చర్యలు ఉండాలె. మూడు-ఆరోగ్యకరమైన, విద్యావంతులైన ప్రజలు, మౌలికవసతులు, మానవ హక్కు లు, చక్కని సామాజిక జీవనం మొదలైన వాటికి దోహదపరిచే ప్రభుత్వ పథకాలు ఉండాలె.

అమెరికా అధ్యక్ష పదవి అభ్యర్థులు తమ ఆర్థిక విధానాలను వెల్లడించినట్టయితే, తమ జీవనప్రమాణాలు మారడానికి ఇవి ఎంతమేర ప్రత్యామ్నాయాలను చూపగలవో ప్రజలు నిర్ణయించుకుంటారు. ఆరోగ్య రక్షణ, ఉన్నత విద్య, శిశు సంక్షేమంతో పాటు కుటుంబం, మిత్రులు, సమాజంతో సమతుల్య జీవనం గడపడానికి కావలసిన భద్రమైన ఉద్యోగం, గౌరవప్రదమైన వేతనం తమకు లభిస్తుందా అనేది ప్రజలు ఆయా అభ్యర్థుల ఆర్థికవిధానాలను బేరీజు వేసుకొని తెలుసుకోగలగాలె. అమెరికా వంటి ధనిక దేశంలో ఇవేమీ పెద్ద కోరికలు కావు. ఇంతకన్నా మెరుగైన పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థను సృష్టించుకోగల ఆర్థిక వనరులు అమెరికాకు ఉన్నాయి. మన సంక్షేమం కోసం, భవిష్యత్ తరాల కోసం ఏ విధానాలు మంచివో మనకు తెలుసు. ఈ కొత్త వ్యవస్థను నిర్మించే అధ్యక్షుడిని చట్టసభ సభ్యులను దేశం ఎన్నుకోవలసి ఉన్నది.

**(వ్యాసకర్త: ఆర్థిక శాస్త్రంలో ప్రొఫెసర్. బర్క్‌లీలోని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో సెంటర్ ఫర్ వర్క్, టెక్నాలజీ, సొసైటీ కేంద్రం డైరెక్టర్. 'బుద్ధిస్ట్ ఎకనమిక్స్, ఏన్ ఎనలైటెండ్ అప్రోచ్ టు ది డిస్మల్ సైన్స్' రచయిత)**

**(వ్యాసకర్త: కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలోని సస్టయినెబుల్ షేర్డ్- ప్రాస్పరిటీ పాలసీ ఇండెక్స్ పరిశోధక సమన్వయకర్త**

> అమెరికా అధ్యక్ష పదవి అభ్యర్థులు తమ ఆర్థిక విధానాలను వెల్లడించినట్టయితే, తమ జీవనప్రమాణాలు మారడానికి ఇవి ఎంతమేర ప్రత్యామ్నాయాలను చూపగలవో ప్రజలు నిర్ణయించుకుంటారు. ఆరోగ్య రక్ష ణ, ఉన్నత విద్య, శిశు సంక్షేమంతో పాటు కుటుంబం, మిత్రులు, సమాజంతో సమతుల్య జీవనం గడపడానికి కావలసిన భద్రమైన ఉద్యోగం, గౌరవప్రదమైన వేతనం తమకు లభిస్తుందా అనేది ప్రజలు ఆయా అభ్యర్థుల ఆర్థిక విధానాలను బేరీజు వేసుకొని తెలుసుకోగలుగాలె.

# అద్భుతం: ఈ విద్యాయజ్ఞం!

గ్రౌండ్ రిపోర్ట్



**ప్రసాద్ చరసాల**

కేసీఆర్ చేసిన యజ్ఞాల గురించి తెలిసింది గానీ మైనారిటీల విద్యాయజ్ఞం గురించి మాత్రం గతవారమే మాకు తెలిసింది. వృత్తిరీత్యా నేను ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ను. మా సొంతూరు కడప జిల్లా కల్పనాయిని చెరువు. కొన్నేండ్లుగా అమెరికాలోని మేరీలాండ్‌లో ఉంటున్న. మా అమ్మాయి ప్రణతి పదో తరగతి పూర్తిచేసి 11వ తరగతిలోకి వచ్చింది. మా అమ్మాయి స్కూల్‌లో ఏదైనా ఒక అంశంపై ఒక పేపర్ సబ్‌మిట్ చేయాల్సి ఉన్నది. మా అమ్మాయి 'భారతదేశంలో ముస్లిం, ఇతర మైనారిటీల విద్య, ఆర్థికస్థితిగతుల'పై అధ్యయనం చేయాలనుకున్నది. దీనికోసమే నేను రెండువారాల కోసం నా కూతురుతో కలిసి ఇండియాకు వచ్చాను.తెలంగాణ, ఏపీ రాష్ట్రాలలోని దళితులు, ముస్లింలు, పేదల స్థితిగతులపై మా అమ్మాయి క్షేత్రస్థాయి పర్యటన చేసింది. తోడుగా నేను కూడా వెళ్లాను. మా పర్యటనలో ప్రధానంగా ముస్లిం విద్యార్థినుల విద్యపై తెలుసుకోవాలన్న ఆతృత మా అమ్మాయి ప్రణతిలో కనిపించింది. పాకిస్థాన్, ఆఫ్ఘనిస్తాన్ వంటి దేశాల్లో విద్యావ్యవస్థ, నోబెల్ అవార్డు గ్రహీత మాలాల ప్రభావం మా అమ్మాయిపై ఉండి ఉండవచ్చు. మైనారిటీలకు విద్యా సౌకర్యాలు ఎలా ఉన్నాయన్న మా అమ్మాయి ప్రశ్నకు సమాధానం హైదరాబాద్‌లో ముస్లింలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలలో దొరుకుతుందని భావించాం. ఇక్కడ ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, అలాగే వీలైతే మదరస్సాల్లోని విద్యను కూడా పరిశీలించాలనుకున్నాం. ఇదే విషయాన్ని నా మిత్రుడు స్కై బాబాతో చెబితే ఆయన కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటుచేసిన ముస్లిం మైనారిటీస్ రెసిడెన్షియల్ స్కూళ్ళను పర్యవేక్షించే ఒక అధికారి (ఖాసిం మొహమ్మద్)ను నాకు పరిచయం చేశారు. ఆయన తన సహాయకుడిని మాకు తోడుగా పంపి ఖైరతాబాద్‌లోని ఒక అమ్మాయిల రెసిడెన్షియల్ పాఠశాలకు పంపించారు.

అక్కడి ప్రిన్సిపల్ ఐశా మస్రత్ మా రాక ఉద్దేశాన్ని తెలుసుకొని ఎంతో సంతోషించారు. ఎంతో ఉత్సాహంగా అడిగిన ప్రతి ప్రశ్నకూ సమాధానాలిస్తూ దగ్గరుండి ప్రతి తరగతి గదిని చూపించారు. పిల్లలు పడుకునే పడకలూ, ఆడుకునే స్థలం, వంటగది, డైనింగ్ హాల్, సిక్ రూం.. ఇలా ప్రతీదీ దగ్గ రుండి వివరిస్తూ చూపించారు.

మామూలు ప్రభుత్వ పాఠశాలల మాదిరి కాకుండా పిల్లలు చాలా ఆరోగ్యంగా, ఉత్సాహంగా కనిపించారు. వంటగదికి వెళ్లినపుడు అక్కడ ఆ సాయంత్రం బీట్‌రూట్ హల్వా చేస్తున్నారు. అది పిల్లలకు సాయంత్రం స్నాక్ అట. మాకూ తినిపించారు. చాలా బాగుంది. వంటగది పరిసరాలు దుర్వాసన, ఈగలు లేకుండా శుభ్రంగా ఉన్నాయి.

సిక్‌రూంలోకి వెళ్లినపుడు అక్కడ నలుగురు పిల్లలు మంచాలపై విశ్రాంతి తీసుకుంటూ కనిపించారు. వాళ్లను కనిపెట్టుకొని అక్కడే ఒక టీచర్ ఉన్నారు. (ఆ రోజు ఉండాల్సిన నర్స్ సెలవులో ఉన్నదని ప్రిన్సిపల్ చెప్పారు). మా అమ్మాయి అంతకుముందే ప్రిన్సిపల్‌ను అమ్మాయిలకు ప్యాడ్స్ ఉచితంగా ఇస్తారా అని అడిగింది. అందుకు సమాధానంగా అక్కడ పెట్టెల్లో ఉన్న ప్యాడ్స్‌ను ప్రిన్సిపల్ మా అమ్మాయిని తీసుకెళ్లి చూపించారు. ఏ అమ్మాయికి ఏ రోజు పీరియడ్స్ వచ్చాయన్న వివరాలు కూడా రిజిష్టర్‌లో నమోదు చేస్తామని, ప్యాడ్స్ వాడటం గురించి, పరిశుభ్రత గురించి వివరిస్తామని చెప్పారు.



> మా అమ్మాయి అంతకుముందే ప్రిన్సిపల్‌ను అమ్మాయిలకు ప్యాడ్స్ ఉచితంగా ఇస్తారా అని అడిగింది. అందుకు సమాధానంగా అక్కడ పెట్టెల్లో ఉన్న ప్యాడ్స్‌ను ప్రిన్సిపల్ మా అమ్మాయిని తీసుకెళ్లి చూపించారు. ఏ అమ్మాయికి ఏ రోజు పీరియడ్స్ వచ్చాయన్న వివరాలు కూడా రిజిష్టర్‌లో నమోదు చేస్తామని, ప్యాడ్స్ వాడటం గురించి, పరిశుభ్రత గురించి వివరిస్తామని చెప్పారు.

తరగతి గదులు కూడా పరిశుభ్రంగా ఉన్నాయి. అందరికీ సరిపడా బల్లలున్నాయి. ప్రతి ఒక్కరి యునిఫాం మురికిలేకుండా శుభ్రంగా కనిపించాయి. ఒక్కో తరగతికి 80 మంది విద్యార్థులను తీసుకుంటారట. వారిని 40 మంది చొప్పున రెండు సెక్షన్లుగా విడదీస్తారట. అలా ఆ పాఠశాలలో 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకూ సుమారుగా 400 మంది పిల్లలు చదువుకుంటున్నారు.

ఒక్కో తరగతికి తీసుకునే 80 మందిలో మొత్తం మైనారిటీ మతాలకు 75 శాతం (60 సీట్లు), అంటే 64 ముస్లింలకు, 7 క్రైస్తవులకు, జైనులు, పార్సీలు, బౌద్ధులు, సిక్కులకు ఒక్కొక్కరికి ఒక్క శాతం చొప్పున కేటాయించారు. మిగిలిన 25 శాతం అంటే 20 సీట్లను ఎస్సీలకు 6, ఎస్టీలకు 4, బీసీలకు 12, ఓసీలకు 3 శాతం చొప్పున కేటా యించారు.

ఏటా తెలంగాణ రాష్ట్రంలో ప్రవేశపరీక్ష పెట్టి దాని ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తున్నారు. ఇలాంటి పాఠశాలలు రాష్ట్రమంతా కలిసి 204 ఉన్నాయి. అంటే సగటున ఒక్కో పాఠశాలలో 700 మంది అనుకున్నా లక్షన్నర మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఏటా 16 వేల మంది విద్యార్థులు చేరుతున్నారు. ఇదొక అద్భుతమైన పథకం. మైనారిటీల్లో ఇదొక విప్లవాత్మకమైన మార్పు తెస్తుందనిపించింది. ఇలాంటి పాఠశాలలు దేశమంతా తెరువాలి. పిల్లల మీద, వారి చదువుల మీద పెట్టే ఏ పైసా వృథా కాదు. దానికి మించిన సార్థకత దేనికి ఉంటుంది? తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటుచేసిన మైనారిటీ విద్యాసంస్థలను చూసి, అక్కడి పరిస్థితులపై మా అమ్మాయి అధ్యయనం చేసిన తర్వాత జూలై 13న అమెరికాకు తిరుగు ప్రయాణమయ్యాం. అక్కడి విద్యా సౌకర్యాలను చూసిన తర్వాత దేశంలో నిజమైన మార్పు కనిపించిందనిపించింది. తెలంగాణ ప్రభుత్వం మైనారిటీ విద్యార్థులపై పెట్టిన దృష్టి దీర్ఘకాలంలో దేశంలో మార్పునకు నాంది పలుకుతుందనిపించింది. ఇదో సామాజిక విప్లవంగా తోచింది. అక్కడి పరిస్థితులు చూశాక సంతోషంగా ఫీలయ్యాం.

కేసీయార్‌కు స్నేహితుడైన జగన్ ఈ పథకాన్ని ఏపీలో కూడా ప్రవేశపెడితే ప్రజలకు ఎంతో మేలు చేసినవాడవుతాడు.

చివరగా ఆ ప్రిన్సిపల్‌ను మా అమ్మాయి అడిగిన ఒక ప్రశ్న. మీరు ముస్లిం అమ్మాయిలకు పాఠశాల నడుపుతున్నారు కదా, మీ మీద బాంబులేస్తామని ఎవరూ బెదిరించలేదా?

ఆ ప్రిన్సిపల్‌కు ప్రశ్న అర్థంగాక కాసేపు తెల్లమొహం వేసింది.

**(మేరీల్యాండ్, అమెరికా నుంచి)**

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

## • కనువిందు.. బాబేఝరి జలపాతం



కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం బాబేఝరి గ్రామసమీపంలోని జలపాతం కనువిందు చేస్తున్నది. ఇటీవల కురిసిన వర్షాలకు పైనుంచి కిందకు జాలువారుతున్న జలపాతం అందరినీ ఆకట్టుకుంటున్నది. జోడెఘాట్ వెళ్లే రహదారి పక్కన పచ్చని అడవుల మధ్య లోయలో కనిపించే ఈ దృశ్యం పర్యాటకులను ఆకర్శిస్తున్నది. - కెరమెరి





నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలానికి సమీపంలోని కర్ణాటక రాష్ట్రం యానగుంది సూర్యనంది క్షేత్రంలో మంగళవారం గురుపౌర్ణమి సందర్భంగా మాతా మాణికేశ్వరి భక్తులకు దర్శనిచ్చారు. మాత దర్శనం కోసం మహారాష్ట్ర, గుజరాత్, తెలంగాణ, ఏపీ రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. - దామరగిద్ద

## చంద్రగ్రహణంతో ఆలయాల మూసివేత



వేములవాడ రాజన్న ఆలయ తలుపులు మూసివేస్తున్న అర్చకులు

**నమస్తే తెలంగాణనెట్‌వర్క్:** చంద్రగ్రహణం సందర్భంగా పలు ప్రధాన దేవాలయాలను మంగళవారం ద్వార బంధనం చేశారు. బుధవారం ఉదయం సంప్రోక్షణ నిర్వహించి తిరిగి తెరువనున్నారు. వేములవాడలోని రాజరాజేశ్వరస్వామి ఆలయాన్ని మంగళవారం సాయంత్రం 4 గంటలకు, యాదాద్రి ఆలయాన్ని సాయంత్రం 6.30 గంటలకు, బాసరలోని సరస్వతీ ఆలయాన్ని సాయంత్రం 4 గంటలకు మూసివేశారు.



ఆదిలాబాద్‌లో మహిళలకు పార్టీ సభ్యత్వాన్ని అందజేస్తున్న పాడిపరిశ్రమాభివృద్ధి సంస్థ చైర్మన్ లోక భూమారెడ్డి, ఎమ్మెల్యే జోగు రామన్న



వికారాబాద్ జిల్లా పరిగి మండలం మల్లెమోనిగూడలో సభ్యత్వం అందజేస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి



నిజామాబాద్ జిల్లా మోర్తాడ్‌లో మాట్లాడుతున్న మార్క్‌ఫెడ్ చైర్మన్, బాల్కొండ ఇంచార్జి లోక బాపురెడ్డి

# రికార్డు స్థాయిలో సభ్యత్వాలు

**కొనసాగుతున్న గులాబీ పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియ ▪ ఇంటింటికీ వెళ్తున్న శ్రేణులు**






మంగళ వారం మేడ్చల్‌లో టీఆర్ఎస్ సభ్యత్వ నమోదు పత్రాన్ని అందజేస్తున్న మంత్రి చామకూర మల్లారెడ్డి



గ్రేటర్ హైదరాబాద్‌లోని చైతన్యపురిలో సభ్యత్వాన్ని అందజేస్తున్న మంత్రి తలసాని. చిత్రంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** టీఆర్ఎస్ సభ్యత్వ నమోదు ప్రక్రియ రికార్డు స్థాయిలో కొనసాగుతున్నది. చాలాచోట్ల లక్ష్యానికి మించి చేపడుతున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయడమేగాకుండా పలుచోట్ల ఇంటింటికి వెళ్లి సభ్యత్వాలను అందజేస్తున్నారు. మంగళవారం గ్రేటర్ హైదరాబాద్‌లోని చైతన్యపురి డివిజన్‌లో ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం, ఉప్పల్‌లో ఎమ్మెల్యే బేతి సుభాశ్‌రెడ్డి, ఇంచార్జి కంచర్ల చంద్రశేఖర్ రెడ్డితో కలిసి పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ.. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కార్పొరేటర్లు బాధ్యతగా చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా టీఆర్ఎస్ పార్టీ ప్రజలకు మరింత చేరువ అయ్యేందుకు అవకాశం ఉన్నదన్నారు. గతం లో మాదిరిగా సభ్యత్వ నమోదులో ఎల్బీనగర్ నియోజకవర్గం నంబర్‌వన్‌గా నిలువాలని సూచించారు. మేడ్చల్ పట్టణంలో మంగళవారం చేపట్టిన టీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో లక్ష మందికిపైగా సభ్యత్వాన్ని కల్పిస్తామన్నారు. అధిష్ఠానం పిలుపు మేరకు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున చేపట్టడం అభినందనీయమన్నారు. ప్రతి నాయకుడు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు ఇంటింటికి తిరిగి చేపట్టడంతో లక్ష వరకు సభ్యత్వాలను చేపట్టగలుగుతున్నామని మంత్రి మల్లారెడ్డి తెలిపారు. ఆదిలాబాద్‌లో ఎమ్మెల్యే జోగు రామన్న, పాడిపరిశ్రమాభివృద్ధి సంస్థ చైర్మన్ లోక భూమారెడ్డి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. సభ్యత్వ నమోదుకు భారీ స్పందన వస్తున్నదని వారు పేర్కొన్నారు. గ్రామాల్లో స్థానికులతోపాటు రైతులు ఎక్కువ సంఖ్యలో సభ్యత్వాన్ని తీసుకుంటున్నారని తెలిపారు. వికారాబాద్ జిల్లా పరిగి మండలం మల్లెమోనిగూడలో నిర్వహించిన సభ్యత్వ నమోదులో పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వ నమోదు కార్యక్రమం గ్రామాల్లో పండుగ వాతావరణంలో కొనసాగుతున్నదన్నారు. నిజామాబాద్ జిల్లా మోర్తాడ్‌లో మార్క్‌ఫెడ్ చైర్మన్, బాల్కొండ నియోజకవర్గ సభ్యత్వ నమోదు ఇంచార్జి లోక బాపురెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ప్రజలు టీఆర్ఎస్ సభ్యత్వాలు తీసుకోవడానికి స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని తెలిపారు.



భద్రాచలంలో నిర్వహించిన దమ్మక్క సేవాయాత్రలో పాల్గొన్న భక్తులు

## ఘనంగా దమ్మక్క సేవా యాత్ర

**భద్రాచలం, నమస్తే తెలంగాణ:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఆషాఢ పౌర్ణమి సందర్భంగా పోకల దమ్మక్క సేవా యాత్రను మంగళవారం ఘనంగా నిర్వహించారు. భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య, ఆలయ ఈవో తాళ్లూరి రమేశ్‌బాబు దంపతులు దమ్మక్కకు ప్రత్యేక పూజలు చేసి సేవా యాత్రను ప్రారంభించారు. ఏజెన్సీలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనులు పుష్పాలు, ఫలాలను తీసుకురాగా వాటిని మేళతాళాలు, వేద పండితుల మంత్రోచ్ఛరణలతో అపరభక్త శబరి పోకల దమ్మక్క చిత్రపటంతో గిరిప్రదక్షిణ నిర్వహించారు. ఆఫీసర్స్ క్లబ్ సమీపంలో ఉన్న పోకల దమ్మక్క విగ్రహానికి ఈవో తాళ్లూరి రమేశ్‌బాబు దంపతులతోపాటు ఎమ్మెల్యే పొదెం వీరయ్య ఫలాలు, పుష్పాలను ఉంచి పూజలు చేశారు.

## సూర్యాపేటను అగ్రగామిగా చేస్తా

▪ విద్యాశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి

**సూర్యాపేట ప్రతినిధి, నమస్తే తెలంగాణ/సూర్యాపేట టౌన్:** 'తనను రెండోసారి గెలిపించిన ప్రజల రుణం తీర్చుకుంటా. సూర్యాపేట మున్సిపాలిటీని దేశంలోనే నంబర్‌వన్ స్థాయికి తీసుకెళ్తా.' అని విద్యాశాఖమంత్రి జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సూర్యాపేట మున్సిపల్ పరిధిలో సుమారు రూ.75 కోట్ల వ్యయంతో 60 పనులకు 11 ప్రాంతాల్లో ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్‌లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ కులం, మతం, వర్గం ఏదీ చూడకుండా అన్నివర్గాలకు సంక్షేమ పథకాలు వర్తింపచేస్తున్నారని చెప్పారు. తెలంగాణలో ప్రవేశపెట్టిన సంక్షేమపథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని.. ఇతర రాష్ట్రాలు, కేంద్రప్రభుత్వం మనపథకాలను కాపీ కొడుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమపథకాలను చూసి 2018లో ప్రజలు గెలిపించారని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో టీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలకు మంత్రి జగదీష్‌రెడ్డి తమ ప్రాంతాలకు వస్తున్నారని తెలుసుకొని స్వచ్ఛందంగా మామిడి తోరణాలు కట్టి.. కోలాటాలు, నృత్యాలు చేస్తూ మంత్రికి ఘనంగా స్వాగతం పలికారు. గురుపౌర్ణమి సందర్భంగా మంత్రి జగదీశ్‌రెడ్డి సూర్యాపేటలోని శాంతినగర్‌లో నివాసముంటున్న తన గురువు సబ్బయ్య నివాసానికి వెళ్లి పాదాభివందనం చేసి ఆశీర్వచనం పొందారు. అనంతరం గురుదక్షిణగా రూ. 10 వేలు అందజేశారు. మంత్రి వెంట ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, జడ్పీ వైస్‌చైర్మన్ వెంకటనారాయణ ఉన్నారు.



తన గురువు సుబ్బయ్యకు పాదాభివందనం చేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

# మున్సిపాలిటీల అభివృద్ధే ధ్యేయం

▪ పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
▪ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

**వరంగల్ రూరల్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** సీఎం కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పేర్కొన్నారు. వరంగల్ రూరల్ జిల్లా వర్ధన్నపేటలో మంగళవారం ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే అరూరి రమేశ్‌తో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ సహకారంతో వర్ధన్నపేట మున్సిపాలిటీని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. సీఎం ఇప్పటికే ఈ మున్సిపాలిటీకి రూ.18 కోట్లు కేటాయించారని, అవసరమైతే మరో రూ.20 కోట్లు కేటాయించి మూడునెలల్లో వర్ధన్నపేటను ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. మున్సిపాలిటీలకు ఎన్ని నిధులైనా ఇచ్చేందుకు సీఎం కేసీఆర్ సుముఖంగా ఉన్నారని చెప్పారు. మహిళా ఆర్థికాభివృద్ధికి రెండ్రోజుల్లో రూ.2కోట్లు మంజూరు చేయనున్నట్టు చెప్పారు. మహిళలు బిందెలు ఎత్తుకొని రోడ్లపైకి రావద్దన్న సంకల్పంతో సీఎం కేసీఆర్ మిషన్ భగీరథకు శ్రీకారం చుట్టారని చెప్పారు. మహిళా సంఘాలకు పావలా వడ్డీకే రుణాలు మంజూరు చేయడంతోపాటు ప్రత్యేక రుణాలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని వివరించారు.

**వర్ధన్నపేట మున్సిపాలిటీ అభివృద్ధికి సహకారం..**

ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పడిన వర్ధన్నపేట మున్సిపాలిటీ అభివృద్ధి కోసం తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. వర్ధన్నపేట మున్సిపాలిటీకి మంత్రి దయాకర్‌రావు, ఎమ్మెల్యే అరూరి రమేశ్ ఇప్పటికే రూ.33 కోట్ల నిధులు మంజూరు చేయించడం అభినందనీయమని అన్నారు. మహిళలకు మెరుగైన వైద్య పరీక్షలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వ దవాఖానల్లో వసతులను మెరుగు పరిచినట్టు ఎమ్మెల్యే అరూరి రమేశ్ పేర్కొన్నారు.



వరంగల్ రూరల్ జిల్లా వర్ధన్నపేటలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు. చిత్రంలో ఎమ్మెల్యే అరూరి రమేశ్, ఎమ్మెల్సీ పోచంపలి శ్రీనివాస్‌రెడ్డి

## బాలికపై లైంగికదాడి కేసులో నిందితుడికి పదేండ్ల జైలు

**ఆదిలాబాద్ అర్బన్/నమస్తే తెలంగాణ:** బాలికపై లైంగికదాడి కేసులో నిందితుడికి పదేండ్లు జైలుశిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ జిల్లా అదనపు న్యాయమూర్తి తీర్పునిచ్చినట్టు పీపీ రమణారెడ్డి తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం రాంపూర్‌కు చెందిన సంతోష్ తనకు వరుసకు మరదలయ్యే బాలికపై పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. అనంతరం బాలిక గర్భం దాల్చింది. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదుతో 16 ఏప్రిల్ 2014లో జైనథ్ పోలీసులు కేసు నమోదు చేశారు. బాలిక మగబిడ్డకు జన్మనివ్వగా.. డీఎన్ఏ పరీక్షలు నిర్వహించగా.. సంతోషే తండ్రని తేలింది. మంగళవారం 13 మంది సాక్షులను కోర్టులో విచారించగా.. నేరం రుజువైంది. మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి పీ శ్రీనివాస్‌రావు నిందితుడికి పదేండ్ల కఠినకారాగార శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.



మహబూబ్‌నగర్ సగరకాలనీలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

## ఇంటింటికీ మిషన్ భగీరథ నీళ్లు

▪ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ:** మిషన్‌భగీరథ ద్వారా పట్టణంలో ఇంటింటికి శుద్ధజలం అందిస్తున్నామని ఎక్సైజ్‌శాఖమంత్రి డాక్టర్ వీ శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. పట్టణాభివృద్ధి కండ్లముందు కనిపిస్తున్నదని.. అభివృద్ధిని చూసి ప్రజలు టీఆర్ఎస్‌కు అండగా నిలిచారని చెప్పారు. మంగళవారం మహబూబ్‌నగర్ సగరకాలనీలో సీసీరోడ్డు ప్రారంభించి.. న్యూటౌన్‌లో రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. గణేశ్‌నగర్‌లో బోరును, పాల్‌సాబ్‌గుట్టలో మిషన్‌భగీరథ ట్యాంకును మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పట్టణప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతుంటే కండ్లారా చూశానన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రతి వార్డు తిరిగి సమస్యల పరిష్కారానికి కృషి చేశానన్నారు. పట్టణాభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఇంతియాజ్ ఇసాక్, పట్టణ టీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్కును మంగళవారం యూరప్ దేశాల ప్రతినిధులు సందర్శించారు. దక్షిణభారత పర్యటనలో ఉన్న వీరు హైదరాబాద్‌లోని రౌండ్ టేబుల్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో నిర్వహించే యంగ్ అంబాసిడర్స్ కార్యక్రమానికి హాజరైన సందర్భంగా వీరు పోచంపల్లిని సందర్శించి ఈ పార్కులో ఉత్పత్తి చేస్తున్న పోచంపల్లి టై అండ్ డై ఇక్కత్ వస్త్రాల తయారీ విధానాన్ని పరిశీలించారు. - భూదాన్‌పోచంపల్లి



## ప్రేమ పేరుతో వేధింపులు

▪ పదోతరగతి విద్యార్థిని ఆత్మహత్య

**కొందుర్గు :** ప్రేమ వేధింపులను భరించలేక ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నది. రంగారెడ్డి జిల్లా జిల్లెడ్‌చౌదరిగూడ మండలం వీరన్నపేట గ్రామానికి చెందిన రాజేశ్వరి(15) మండలంలోని పెద్ద ఎల్కిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్నది. అదే గ్రామానికి చెందిన జోగు నరేశ్ (24) కొంత కాలంగా రాజేశ్వరి వెంటపడి ప్రేమించాలంటూ వేధిస్తున్నాడు. ఈ నెల 13న ఈ విషయాన్ని విద్యార్థిని తన తల్లి లక్ష్మికి తెలుపగా నరేశ్‌ను పిలిచి మందలించింది. అయినా నరేశ్ వేధించడం ఆపకపోవడంతో మనస్తాపానికి గురైన రాజేశ్వరి సోమవారం సాయంత్రం ఇంట్లో చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్సై లింగం తెలిపారు.



రాజేశ్వరి (ఫైల్)

## గిరిజన నేత హత్యకేసులో నిందితులు అరెస్టు

**చర్ల రూరల్:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం కుదునూరుకక్ష ఈనెల 7వ తేదీ రాత్రి జరిగిన గిరిజననేత రాఘవయ్య హత్య కేసులో నిందితులను అరెస్టు చేసినట్టు భద్రాచలం ఏఎస్పీ రాజేశ్‌చంద్ర తెలిపారు. చర్లలో మంగళవారం హత్యకేసు దర్యాప్తు వివరాలు ఆయన మీడియాకు తెలిపారు. హత్య కేసును విచారణ జరిపి.. నిందితులుగా గుర్తించిన పవన్, మహేశ్, కోటేశ్, సు ధీర్, నరేశ్, సుధాకర్, వీర్రాజు, శేఖర్, సం దీప్, అమర్‌బాబు, గందం రాజును మంగళవారం అరెస్టు చేసినట్టు పేర్కొన్నారు.

## 'టిక్-టాక్' ఉద్యోగులపై చర్యలు

**11 మంది బదిలీ**

**ఖమ్మం, నమస్తే తెలంగాణ:** పనివేళల్లో టిక్‌టాక్ వీడియోలు చేసి.. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఖమ్మం నగరపాలక సంస్థ కార్యాలయంలోని ఔట్‌సోర్సింగ్ సిబ్బందిపై కమిషనర్ చర్యలు తీసుకున్నారు. 11 మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని శానిటేషన్ విభాగానికి బదిలీ చేసి.. వారి వేతనాల్లో కోత విధించినట్టు కమిషనర్ జే శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సిబ్బంది వేతనాల నుంచి 10 రోజుల వేతనాలలో కోత విధించినట్టు వివరించారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా పనిచేస్తున్న రవి, సురేశ్ (సిస్టమ్ అసిస్టెంట్లు), రాజశేఖర్ (అసోసియేట్), ప్రవీణ్‌కుమార్, ఉపేందర్, శంకర్, అనిత (డాటా ఎంట్రీ ఆపరేటర్లు), వీరన్న, వంశీ, జ్యోతి, శ్రీదేవి (కార్యాలయ సహాయకులు) తదితరులపై చర్యలు తీసుకున్నారు.

**టిక్-టాక్‌పై ఎంపీ నామా సీరియస్**

ఉద్యోగుల టిక్-టాక్ వీడియో రికార్డులు పట్ల టీఆర్ఎస్ లోక్‌సభ పక్షనేత నామా నాగేశ్వర రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీలోని పార్లమెంట్ సమావేశాల్లో ఉన్న నామా విషయం తెలుసుకున్నారు. ఉద్యోగులు ప్రభుత్వానికి ప్రజలకు అనుసంధాన కర్తలుగా ఉండాలని.. ఇటువంటి చేష్టలు పునరావృతం కాకూడదని హెచ్చరించారు.

## ఏసీబీకి చిక్కిన దమ్మపేట ఐబీ ఏఈ

**సత్తుపల్లిటౌన్:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేటలో ఇరిగేషన్‌శాఖ ఏఈగా పనిచేస్తున్న పీ నరసింహారావు మంగళవారం లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఖమ్మంకు చెందిన కాంట్రాక్టర్ వెంకట్రామయ్య మండలంలోని పలు చెరువుల్లో మిషన్‌కాకతీయ పనులు చేస్తున్నారు. కాగా బిల్లులు మంజూరుచేసేందుకు ఏఈ నరసింహారావు రూ. 15000 లంచం అడిగాడు. కాంట్రాక్టర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. మంగళవారం ఉదయం బస్టాండ్ సమీపంలోని ఓ జిరాక్సు సెంటర్‌లో కాంట్రాక్టర్ ఏఈకి రూ.10 వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.



నరసింహారావు

# ఒక్క రోజులోనే 5.49 కోట్లు ఖర్చు

## మలేషియా మాజీ ప్రధాని నజీబ్‌పై తీవ్ర ఆరోపణలు



**కౌలాలంపూర్, జూలై 16:** మలేషియా మాజీ ప్రధాని నజీబ్ రజాక్ ఎంతటి విలాసవంతమైన జీవితాన్ని అనుభవించాడో తెలిపే వివరాలు బహిర్గతమయ్యాయి. 2014లో తన క్రెడిట్ కార్డుల ద్వారా ఇటలీలోని ఒక లగ్జరీ జ్యువెలరీ దుకాణంలో ఒక్క రోజులోనే రూ.5.49 కోట్లను (8లక్షల డాలర్లు) ఖర్చు చేశాడని ఓ న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. నజీబ్, ఆయన కుటుంబసభ్యులు కలిసి దేశ ఖజానా నుంచి వందల కోట్లను కొల్లగొట్టారని గతంలో పెద్ద ఎత్తున ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ ఆరోపణల వల్లనే ఆయన గతేడాది జరిగిన దేశ ఎన్నికల్లో ఓడిపోయారు. అనంతరం ఆయనను అరెస్టు చేయడమే కాకుండా ఈ ఆరోపణలపై కొత్త ప్రభుత్వం విచారణ జరుపుతున్నది. ఈ నేపథ్యంలో నజీబ్ ఎంతటి విలాసవంతమైన జీవితాన్ని గడిపాడో అన్న విషయాలను న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకొచ్చారు.


# గ్రీస్‌లో అమెరికా శాస్త్రవేత్తపై లైంగికదాడి, హత్య

**ఏథెన్స్:** సుజానే ఈటన్ (59) అనే అమెరికా శాస్త్రవేత్తపై గ్రీస్ వాసి లైంగికదాడి చేసి దారుణంగా హత్య చేశాడు. ఆమె జర్మనీలోని డ్రెస్డెన్ వర్సిటీ మాక్స్ ప్లాంక్ సంస్థలో మాలిక్యులర్ బయోలజిస్ట్. ఓ సదస్సు కోసం గ్రీస్ క్రీట్ ద్వీపంలోని చానియాకెళ్లిన ఆమె, వారం రోజులుగా కనిపించలేదు. జూలై 2న నగరశివారులో ఈటన్ మృత దేహాన్ని కొందరు గుర్తించారు. దీంతో పోలీసులు క్రీట్ ద్వీపంలోని ఓ అనుమాతుడ్ని అరెస్ట్ చేశారు. అతడు దర్యాప్తులో తన నేరాన్ని అంగీకరించినట్లు తెలిపారు. ఒంటరిగా వెళ్తున్న ఈటన్‌ను నిందితుడు కారులో బలవంతంగా ఎక్కించుకుని శివారులోని ఆర్మీ బంకర్‌కు తీసుకెళ్లి ఆమెపై లైంగిక దాడి జరిపి అనంతరం హత్యచేసినట్లు పోలీసులు చెప్పారు.

# విడాకులు అడిగిందని భార్యను చంపిన ఎన్నారై

**న్యూయార్క్:** భార్య హత్య కేసులో భారత సంతతి వ్యక్తిని అమెరికా కోర్టు దోషిగా నిర్ధారించింది. అవతార్ గ్రేవాల్(44) అనే ఎన్నారైకి 2005లో నవనీత్ కౌర్‌తో భారత్‌లో వివాహమైంది. ఆమె అమెరికాలో ఉద్యోగం చేస్తుండగా, భర్త ఉద్యోగ రీత్యా కెనడాలో ఉంటున్నారు. భార్యపై అనుమానంతో పదేపదే ఆమెకు ఫోన్ చేసేవాడు. ఫోన్ ఎత్తకపోతే ఆమె ఆఫీసులో ఆరా తీసేవాడు. భర్త వైఖరితో విసుగెత్తిన నవనీత్ 2007లో ఫోన్‌లోనే విడాకులు కోరింది. దీనిపై మాట్లాడుకుందామని అమెరికా వచ్చిన భర్తను ఇంటికి తీసుకెళ్లింది. విడాకులపై ఇద్దరి మధ్య ఘర్షణ తలెత్తగా అవతార్ ఆగ్రహంతో ఆమె గొంతు నులిమి బాత్‌టబ్‌లో ముంచి హత్యచేసి భారత్‌కు పరారయ్యాడు. అవతార్‌ను భారత అధికారులు 2011లో అమెరికా పోలీసులకు అప్పగించారు. 12 ఏళ్ల నాటి కేసులో యూఎస్ స్థానిక కోర్టు అవతార్‌ను దోషిగా తేల్చింది. ఆగస్టు 23న శిక్షను ఖరారు చేయనున్నట్లు తెలిపింది.

# 'శరవణ' రాజగోపాల్‌కు ప్రైవేటు దవాఖానలో చికిత్స



**చెన్నై, జూలై 16:** శరవణ భవన్ హోటళ్ల వ్యవస్థాపకుడు పీ రాజగోపాల్‌కు ప్రైవేటు దవాఖానలో చికిత్సకు మద్రాసు హైకోర్టు అనుమతి ఇచ్చింది. తన హోటల్‌లో పని చేసే ఒక ఉద్యోగి భార్యను బలవంతంగా పెళ్లి చేసుకునేందుకు ప్రయత్నించిన ఆయన 2001లో ఆ ఉద్యోగిని హత్య చేయించాడు. ఈ కేసులో యావజ్జీవ శిక్ష పడగా సుప్రీంకోర్టు ఆదేశంతో ఈ నెల 9న లొంగిపోయాడు. పుళల్ కేంద్ర కారాగారంలో జైలుశిక్ష అనుభవిస్తున్న రాజగోపాల్‌కు 13న గుండెపోటు రాగా ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై కుమారుడు దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన హైకోర్టు, వైద్య ఖర్చుతోపాటు రిస్క్‌ను ఆయనే భరించాలని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది.

# కర్ణాటకంపై నేడు తీర్పు

## ఉదయం 10.30 గంటలకు వెలువడే అవకాశం

## వాద ప్రతివాదాలను ముగించిన సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ, జూలై 16:** తమ రాజీనామాలను కర్ణాటక స్పీకర్ ఆమోదించేలా ఆదేశాలు జారీ చేయాలంటూ కాంగ్రెస్-జేడీ(ఎస్)కు చెందిన 15 మంది రెబల్ ఎమ్మెల్యేల పిటిషన్‌పై సుప్రీంకోర్టు బుధవారం నాడు తీర్పును వెల్లడించనుంది. రెబల్ ఎమ్మెల్యేలు, కర్ణాటక స్పీకర్, ముఖ్యమంత్రి కుమారస్వామి తరఫున వారి వారి న్యాయవాదులు వినిపించిన వాదోపవాదాలను చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం ముగించింది. రెబల్ ఎమ్మెల్యేల తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ తన వాదనలు వినిపిస్తూ, ఎమ్మెల్యేల రాజీనామాలు, అనర్హత అంశంపై యథాతథ స్థితిని కొనసాగించాలంటూ కోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులనే కొనసాగించాలని సూచించారు. ఒకవేళ అసెంబ్లీ సమావేశాలు జరిగినా.. అధికార పార్టీ విప్‌ను అనుసరించి 15 మంది రెబల్ ఎమ్మెల్యేలు సభకు హాజరు కాకుండా మినహాయింపునివ్వాలని కోరారు. స్పీకర్‌ను ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసే పరిధి సుప్రీంకోర్టుకు లేదని సీఎం కుమారస్వామి తరఫున వాదనలు వినిపించిన సీనియర్ అడ్వకేట్ రాజీవ్ ధవన్ పేర్కొన్నారు. స్పీకర్ కేఆర్ రమేశ్‌కుమార్ తరఫున మరో సీనియర్ న్యాయవాది ఏఎం సింఘ్వీ మాట్లాడుతూ, గత ఏడాది అర్ధరాత్రి జరిగిన విచారణ సందర్భంగా కోర్టు, బీఎస్ యడ్యూరప్పను ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు ఆహ్వానించి, బలపరీక్ష జరుపాలని ఆదేశించినప్పుడు.. కర్ణాటక స్పీకర్‌కు మాత్రం ఎటువంటి సూచనలు చేయలేదని గుర్తు చేశారు. రెబల్ ఎమ్మెల్యేల రాజీనామా, అనర్హతపై స్పీకర్ బుధవారం నిర్ణయం తీసుకుంటారని, కానీ కోర్టు యథాతథ స్థితిని కొనసాగించాలంటూ జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులను సవరించాలని సింఘ్వీ విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యేల రాజీనామాలను స్పీకర్ తొక్కిపెడుతూ, పక్షపాత వైఖరిని ప్రదర్శిస్తున్నారని ముకుల్ రోహత్గీ ఆరోపించారు. దీనిపై సింఘ్వీ స్పందిస్తూ.. నిర్దిష్ట వ్యవధిలోగా నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌ను ఆదేశించడం సరైంది కాదని పేర్కొన్నారు. ట్రయల్ కోర్టులకు కూడా ఇటువంటి ఆదేశాలను జారీ చేయరని చెప్పారు. ఎమ్మెల్యేల అనర్హత విషయమై స్పీకర్ నిర్ణయం తీసుకునే విధంగా రాజ్యాంగ నిబంధన ఏదైనా ఉందా అని ధర్మాసనం రోహత్గీని ప్రశ్నించగా, 'రాజీనామాపై తక్షణమే నిర్ణయం తీసుకోవాలి అని నిబంధనలు చెప్తున్నాయి' అని తెలిపారు. అన్ని పక్షాల వాదనలు విన్న ధర్మాసనం తీర్పును రిజర్వులో ఉంచింది. బుధవారం ఉదయం 10.30 గంటలకు న్యాయస్థానం తన తీర్పును వెలువరించే అవకాశాలున్నాయి. కాగా గురువారం అసెంబ్లీలో బలపరీక్ష నిర్వహించనున్నారు.



సీఎం కుమారస్వామి రాజీనామా చేయాలని అసెంబ్లీలో నినాదాలు చేస్తున్న బీజేపీ ఎమ్మెల్యేలు

**రాజ్యాంగం ప్రకారమే పనిచేస్తున్నా: స్పీకర్**

రాజ్యాంగం ప్రకారమే తాను విధులు నిర్వహిస్తున్నానని కర్ణాటక స్పీకర్ కేఆర్ రమేశ్‌కుమార్ చెప్పారు. కోలార్ జిల్లాలో మంగళవారం ఆయన మాట్లాడుతూ, 'అంతిమంగా సుప్రీం కోర్టు నుంచి ఏది (తీర్పు) వెలువడుతుందో.. దానిని పరిశీలించిన తరువాత, నేను స్పందిస్తాను' అని చెప్పారు.

**రిసార్ట్‌లలో ఎమ్మెల్యేలు**

అసెంబ్లీలో సీఎం కుమారస్వామి ప్రభుత్వం బలపరీక్షను ఎదుర్కోవడానికి ఇంకా ఒక్కరోజే మిగిలి ఉన్న నేపథ్యంలో ఆయా పార్టీలు తమ ఎమ్మెల్యేలను రిసార్ట్‌లకు తరలించాయి. బెంగళూరులోని ఒక హోటల్‌లో బసచేస్తున్న తమ ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీ నగరం వెలుపల ఉన్న రిసార్ట్‌కు తరలించింది. విశ్వాసపరీక్షకు ముందు మరో ఇద్దరు ముగ్గురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాజీనామా చేయనున్నారంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీఎస్ యడ్యూరప్ప పేర్కొనడంపై కేపీసీసీ చీఫ్ దినేశ్ గుండూరావు మండిపడ్డారు. రెబల్ ఎమ్మెల్యేపై అనర్హత వేటు వేయడానికి యడ్యూరప్ప చేసిన ప్రకటన సరిపోతుందన్నారు.

# తెరపైకి ప్రధాన కార్యదర్శి పదవి!



## కాంగ్రెస్ కొత్త అధ్యక్షుడి ఎంపిక వరకూ తాత్కాలిక ఏర్పాటు

**న్యూఢిల్లీ, జూలై 16:** కాంగ్రెస్ నూతన అధ్యక్షుడి ఎన్నిక మరింత ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో ఘోర పరాజయానికి నైతిక బాధ్యత వహిస్తూ రాహుల్‌గాంధీ అధ్యక్ష పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఆయన రాజీనామాను పార్టీ అత్యున్నత వేదిక అయిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) ఇంకా ఆమోదించలేదు. రాజీనామాను వెనక్కి తీసుకోవాలని రాహుల్‌గాంధీని సీడబ్ల్యూసీ కోరినప్పటికీ ఆయన ససేమిరా అన్నారు. అయితే ప్రస్తుతం పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ఇవి ముగియగానే సీడబ్ల్యూసీ సమావేశాన్ని ఏర్పాటు చేసే అవకాశముందని, ఈ సందర్భంగా రాహుల్ రాజీనామాను ఆమోదించవచ్చని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఒకరు చెప్పారు. ఆరు నెలలపాటు పార్టీ వ్యవహారాల బాధ్యతలను చూడటానికి ప్రధాన కార్యదర్శిని నియమించే అవకాశముందని, త్వరలో జరుగనున్న పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు పార్టీ పరంగా బాధ్యత వహిస్తారని తెలిపారు. అధ్యక్షుడి ఎన్నిక వరకూ ఈ ప్రధాన కార్యదర్శే పార్టీకి పెద్ద దిక్కు అని పేర్కొన్నారు. వాస్తవానికి అధ్యక్షుడిని ఎంపిక చేయడానికి పార్టీ ముఖ్య నేతలు పలుసార్లు సమావేశమై చర్చించినప్పటికీ ఏకాభిప్రాయం రాకపోవడంతో ఈ కొత్త ఫార్ములాను తెరపైకి తీసుకొచ్చే అవకాశముందని ఆయన వివరించారు.

## జాబిల్లియాత్రకు 50 ఏండ్లు




మానవజాతి చరిత్రలో చందమామపైకి తొలిసారిగా వ్యోమగాములను తీసుకెళ్లిన అపోలో-11 మిషన్ యాత్ర ప్రారంభమై మంగళవారానికి 50 ఏండ్లు. ఈ సందర్భంగా వాషింగ్టన్‌లోని స్మిత్‌సోనియన్ మ్యూజియంలో.. నాటి వ్యోమగామి నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ ధరించిన స్పేస్‌సూట్‌ను ప్రదర్శించారు. అపోలో వ్యోమనౌకతో కూడిన శాటర్న్ వీ రాకెట్ 16 జూలై 1969న నింగికెగిరింది. నాలుగు రోజుల తర్వాత అపోలో వ్యోమగాములు జూలై 20న చంద్రుడిపై కాలుమోపారు.


# ఇంజిన్‌లో లీకేజీ

## చంద్రయాన్ రద్దుకు అదే కారణం

## హీలియం బాటిల్ వద్ద సమస్యను గుర్తించిన ఇస్రో ఇంజినీర్లు

## లోపాన్ని సరిదిద్దినప్పటికీ లీకేజీకి కారణం కోసం అన్వేషణ

**శ్రీహరికోట, జూలై 16:** చంద్రయాన్-2 ప్రయోగం రద్దుకు కారణమైన సాంకేతిక సమస్యను భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) శాస్త్రవేత్తలు ఎట్టకేలకు కనుగొన్నారు. చంద్రునిపై పరిశోధనలు జరిపేందుకు సోమవారం ఉదయం 2.51 గంటలకు తలపెట్టిన ఈ ప్రయోగాన్ని 56 నిమిషాల 24 సెకన్ల ముందు నిలిపివేసిన సంగతి తెలిసిందే. అందరినీ నిరుత్సాహపరిచిన ప్రయోగం రద్దుకు కారణమైన సమస్యను గుర్తించినట్లు ఓ సీనియర్ శాస్త్రవేత్త వెల్లడించారు. బాహుబలి వ్యోమనౌక జీఎస్ఎల్వీ-మాక్3లోని క్రయోజెనిక్ ఇంజిన్‌లో లీకేజీ జరుగుతుండటాన్ని పసిగట్టామని ఆయన తెలిపారు. ఆక్సిడైజర్‌కు, ఇంధనానికి ఒత్తిడి (ప్రెషర్)ను సరఫరా చేసే హీలియం బాటిల్ జాయింట్ వద్ద లీకేజీ జరుగుతుండటాన్ని గుర్తించామని చెప్పారు. ఏం జరిగిందో తెలుసుకున్నప్పటికీ అది ఎందుకు జరిగిందన్న దానిని గుర్తించేందుకు ఇస్రో ఇంజినీర్లు ప్రయత్నిస్తున్నారు. రాకెట్‌ను పూర్తిగా విడగొట్టకుండానే లీకేజీని అరికట్టగలిగామని ఆ శాస్త్రవేత్త తెలిపారు. వ్యోమనౌకలోని ఆక్సిజన్ ట్యాంక్ పైన ఉన్న గ్యాస్ బాటిల్ వద్దకు చేరుకొనేందుకు ఒక ద్వారం ఉన్నదని, అక్కడికి వెళ్లి లీక్ అవుతున్న జాయింట్‌ను సరిచేశామని చెప్పారు. అయితే లీకేజీ ఎందుకు జరిగిందన్న కారణాన్ని కనుగొనాల్సి ఉందని, లేకపోతే మరోసారి లీకేజీ అయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. ఆర్బిటార్, ల్యాండర్, రోవర్‌ను అమర్చిన రాకెట్‌ను విడగొట్టాల్సిన పని లేదు గనుక ఈ నెలాఖరులో ప్రయోగాన్ని చేపట్టే అవకాశాలున్నాయని అధికార వర్గాలు పేర్కొన్నాయి. ప్రయోగం రద్దుపై విశ్లేషణ నివేదిక ఒకటి రెండు రోజుల్లో అందుతుందని, ఆ తరువాతనే నిర్ణయం తీసుకుంటామని తెలిపాయి.



జీఎస్ఎల్వీ-మాక్ 3 క్రయోజెనిక్ ఇంజిన్‌లోని ఒక భాగం

**అయినా వేళ్లేది కానీ..**

'గ్యాస్ బాటిల్‌లో 34 లీటర్ల హీలియం ఉంటుంది. ఆ బాటిల్ నుంచి వెలువడే ప్రెషర్‌ను తొలుత 350 బార్‌ల వరకు పెంచుతారు. ఆ తరువాత ఆ ప్రెషర్‌ను 50 బార్ల వద్ద క్రమబద్ధం చేస్తారు. జరిగిన లీకేజీ వల్ల.. నిమిషానికి నాలుగు బార్ల చొప్పున ప్రెషర్ తగ్గడం ప్రారంభమైంది. అయినప్పటికీ రాకెట్ నింగిలోకి దూసుకొనిపోయేది. కానీ ఆ చిన్న లోపంతో రూ.978 కోట్ల ప్రాజెక్టు ప్రయోగం చేపట్టరాదని నిర్ణయించాం' అని ఓ అధికారి పేర్కొన్నారు. 'ఒకవేళ గ్యాస్ బాటిల్‌లో లీకేజీ పెద్దగా ఉంటే.. అది ఇంధన దహన క్రియను, వేగాన్ని దెబ్బతీయడంతోపాటు, రాకెట్ కూడా నియంత్రణలో లేకుండా పోతుంది' అని ఓ సీనియర్ విశ్లేషకుడు తెలిపారు.


తెలంగాణ ప్రభుత్వం
మిషన్ భగీరథ శాఖ, MB సర్కిల్, నల్గొండ
NIT No. 1 & 2/2017-18 (9th call) & 1/2018-19 (5th call), ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన తేది: 12-07-2019
MB సర్కిల్, నల్గొండలో గ్రామీణ పునరావాస పనులు (03) వద్ద త్రాగునీటి సదుపాయం ఏర్పాటు చేయుట చేపట్టుట కొరకు దిగువ సంతకందారుచే టెండర్లు కోరబడుచున్నవి. మొత్తం ECV: రూ. 135.00 లక్షలు. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది: 18-07-2019న మ|| 3.00 గం.కు. టెండర్ల స్వీకరణకు చివరి తేదీ మరియు సమయం: 31-07-2019న మ|| 3.30 గం. ఫోన్ నెం.: 7995660147. తదుపరి వివరాల కొరకు www.eprocurement.gov.in దర్శించండి.
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, MB ఇన్‌ట్రా సర్కిల్, నల్గొండ
DIPR RO.No. 639-DP/CL/ADVT/1/2019-20, Dt: 16-07-2019

తెలంగాణ ప్రభుత్వం
సూపరింటెండింగ్ ఇంజినీర్ కార్యాలయము, P.R. రీజియన్, కరీంనగర్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
1)NIT No.05 to 08/SE/2BHK/Tenders/2019-20 తేది: 10-07-2019
పని పేరు: P.R.రీజియన్, కరీంనగర్‌లో 2 BHK ఇళ్ళ నిర్మాణం, సి.సి. రోడ్లు, డ్రెయిన్లు నిర్మాణం, సి.సి. రోడ్లు వేయుట, హాస్టల్ భవనాలు, కమ్యూనిటీ హాళ్ళు నిర్మాణం మొదలగు పనులు. మొత్తం ECV: రూ. 3631.18 లక్షలు, బిడ్ అప్‌లోడింగ్ ప్రారంభ & ముగింపు తేది: 17-07-2019 నుండి 25-07-2019 వరకు. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ www.tenders.telangana.gov.in నుండి పొందవచ్చును.
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, P.R. రీజియన్, కరీంనగర్
DIPR R.O.No. 641 DP/CL/Advt/1/2019-20 తేది: 16-07-2019

తెలంగాణ ప్రభుత్వం
రహదారులు మరియు భవనాల శాఖ
Lr.No. EE/R&B NHHYD/HD/2019-20/548 సవరణ తేది: 16-07-2019
Ref:- Lr.No. EE/R&B/NH/HYD/HD/2019-20, తేది: 01-07-2019 ప్రచురించిన CTNకు పాక్షిక మార్పులో భాగంగా దిగువ తేదీలు, ఐటం నం.లు 8,9 & 10లను మాత్రమే సవరించడం జరిగింది.

| వివరాలు | LTN ప్రకారం | సవరించిన విధంగా |
| --- | --- | --- |
| టెండర్ల డౌన్‌లోడింగ్ తేది | 15-06-2019న మ. 3.00 గం.వరకు | 15-06-2019న మ. 3.00 గం.వరకు |
| టెండర్ల స్వీకరణకు చివరి తేది | 16-07-2019న మ.3.00 గం.వరకు | 31-07-2019న మ.3.00 గం.వరకు |

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, (R&B) NH డివిజన్, హైదరాబాద్
DIPR R.O.No. 249 PP/CL/Advt/1/2019-20 తేది: 16-07-2019

శ్రీ రాజ రాజేశ్వర స్వామి దేవస్థానం, వేములవాడ : రాజన్న సిరిసిల్ల జిల్లా
ఆర్.సి.నెం. సి1/460/2019, ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన తేది: 13-07-2019
శ్రీ రాజ రాజేశ్వర స్వామి దేవస్థానం, వేములవాడ దేవస్థానం ఇంజినీరింగ్ విభాగం పనుల గురించి ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్లు కోరబడుచున్నవి. టెండరు ప్రకటన మరియు టెండరు వివరాలు https://tender.telangana.gov.inకు లాగాన్ అవ్వండి. కరంట్ టెండర్స్‌పై క్లిక్ చేసి శ్రీ రాజ రాజేశ్వర స్వామి దేవస్థానం, వర్క్స్ సెలెక్ట్ చేయండి.
సం/- ఎం.ఎం.డి. క్రిష్ణవేణి, బి.ఏ., ఎల్.ఎల్.బి., రీజినల్ జాయింట్ కమిషనర్ & కార్యనిర్వహణాధికారి (F.A.C.)
DIPR RO.No. 250-PP/CL/ADVT/1/2019-20, Dt: 16-07-2019

తెలంగాణ ప్రభుత్వం
జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీర్ కార్యాలయం, PIU నిజామాబాద్.
టెండరు ప్రకటన
CTN No. 09/DB/T1/Tenders/2019-20 తేది: 10.07.2019
పని పేరు: PIU డివిజన్, నిజామాబాద్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణం, గండ్ల యువజన సంఘం నిర్మాణం, కమ్యూనిటీ హాల్‌కు మిగిలిన నిర్మాణం మొ|| పనులు (03). మొత్తం ECV: రూ. 27.50 లక్షలు. దరఖాస్తులకు చివరి తేది: 10.07.2019 నుండి 20.07.2019న సా. 5.00 గం|| వరకు. టెండరు షెడ్యూళ్ల జారీ: 22.07.2019న సా. 5.00 గం|| వరకు. టెండర్ల స్వీకరణకు చివరి తేది: 23.07.2019న మ. 3.00 గం|| వరకు. టెండర్లు తెరుచు తేది: 23.07.2019న మ. 3.30 గం||. తదుపరి వివరాలను దిగువ సంతకందారు నుండి పొందవచ్చును.
సం/- జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీర్, PIU డివిజన్, నిజామాబాద్
DIPR RO. No. 647-DP/CL/Advt/1/2019-20, Dt: 16/07/2019

నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్
CIN No. U40109TG2000SGC034119
స్పెసిఫికేషన్ నం. 01/2019-20తో DE/OP/రూరల్/హన్మకొండ యొక్క స్వల్పకాలిక టెండరు ప్రకటన నం. 02/2019-20
వరంగల్ అర్బన్ సర్కిల్ నందు డివిజినల్ ఇంజినీర్, ఎలక్ట్రికల్, ఆపరేషన్/రూరల్ హన్మకొండ యొక్క రూరల్ హన్మకొండ సబ్-డివిజన్‌లో ధర్మసాగర్ సెక్షన్ వద్ద GTEDOGEES స్పిల్ వేర్ యొక్క నిర్మాణం కొరకు జె. చొక్కారావు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంకు 50KW యొక్క 1 No.100 KVA DTR NDS లోడ్ యొక్క స్థాపన యొక్క పని కొరకు వరంగల్ జిల్లా యొక్క TSNPDCL రిజిస్టర్డ్ కాంట్రాక్టర్ల నుండి సీల్డు టెండర్లు కోరబడుతున్నవి. పనుల వివరాలు మా వెబ్‌సైట్: www.tsnpdcl.in నుండి పొందవచ్చు.
టెండరు యొక్క ముఖ్యమైన తేదీలు:
1. టెండరు షెడ్యూలు యొక్క అమ్మకం యొక్క చివరి తేది: 24-07-2019న 17.00 గం.వరకు
2. సీల్డు టెండర్ల యొక్క దాఖలు: 25-07-2019న 13.00 గంటల వరకు
3. టెండరు షెడ్యూళ్ళు తెరుచుట: 25-07-2019న 16.00 గంటలు
డివిజినల్ ఇంజినీర్, ఆపరేషన్, TSNPDCL, రూరల్ హన్మకొండ పేరున డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో రూ. 1050-00 (GST కలిపి) యొక్క చెల్లింపుపై వరంగల్ వద్ద చెల్లుబాటయ్యే విధంగా డివిజినల్ ఇంజినీర్ ఎలక్ట్రికల్, ఆపరేషన్, TSNPDCL రూరల్ హన్మకొండ కార్యాలయం నుండి పై తేదీలలో టెండరు షెడ్యూళ్ళను కొనుగోలు చెయ్యవచ్చు.
సం/- డివిజినల్ ఇంజినీర్ ఎలక్ట్రికల్ ఆపరేషన్, రూరల్ హన్మకొండ
స్పెసిఫికేషన్ నం. 01/2019-20తో SE/OP/జనగామ యొక్క స్వల్పకాలిక టెండరు ప్రకటన నం. 01/2019-20
ఆపరేషన్ సర్కిల్ జనగామ యొక్క జనగామ సబ్-డివిజన్ యొక్క జనగామ టౌన్‌సెక్షన్‌లో రోడ్డు వెడల్పు చేయుటకు జనగామ చౌరస్తా నుండి నెహ్రూపార్క్ వరకు రైల్వే స్టేషన్ రోడ్ దిశగా 11KV లైన్లు మరియు LT లైన్ల యొక్క షిఫ్టింగ్ యొక్క పని కొరకు TSNPDCL రిజిస్టర్డ్ కాంట్రాక్టర్ల నుండి సీల్డు టెండర్లు కోరబడుతున్నవి. పనుల వివరాలు మా వెబ్‌సైట్:www.tsnpdcl.in నుండి పొందవచ్చు.
టెండరు యొక్క ముఖ్యమైన తేదీలు:
1. టెండరు షెడ్యూలు యొక్క అమ్మకం యొక్క చివరి తేది: 05-08-2019న 17.00 గం.వరకు
2. సీల్డు టెండర్ల యొక్క దాఖలు: 06-08-2019న 13.00 గంటల వరకు
3. టెండరు షెడ్యూళ్ళు తెరుచుట: 06-08-2019న 16.00 గంటలు
సూపరింటెండింగ్ ఇంజినీర్, ఆపరేషన్ సర్కిల్, TSNPDCL, జనగామ పేరున డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో రూ. 1050-00 (GST కలిపి) యొక్క చెల్లింపుపై జనగామ వద్ద చెల్లుబాటయ్యే విధంగా సూపరింటెండింగ్ ఇంజినీర్, ఆపరేషన్, TSNPDCL జనగామ కార్యాలయం నుండి తేది: 05-08-2019న లేదా ఆలోగా టెండరు షెడ్యూళ్ళను కొనుగోలు చెయ్యవచ్చు.
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, ఆపరేషన్ సర్కిల్, జనగామ


## రోడ్డు ప్రమాదంలో

# దంపతుల దుర్మరణం

■ అనాథలైన నలుగురు పిల్లలు



అంజయ్య గండెమ్మ దంపతులు (ఫైల్)

**ఇబ్రహీంపట్నం, నమస్తేతెలంగాణ :** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండల పరిధిలో మంగళవారం రోడ్డు ప్రమాదంలో దంపతులు దుర్మరణం చెందారు. మంచాల మండలం ఆరుట్లకు చెందిన అంజయ్య(55), గండెమ్మ(49) దంపతులు. వీరికి ముగ్గురు ఆడపిల్లలు, ఓ కుమారుడు ఉన్నారు. వీరు జాతర్లలో బొమ్మలమ్ముకుంటూ జీవనం సాగిస్తుంటారు. మంగళవారం దంపతులు మోకాళ్ల నొప్పులకు చికిత్స కోసం ఆరుట్ల నుంచి ఇబ్రహీంపట్నంలోని దవాఖానకు బైక్‌పై వెళ్తుండగా మార్గమధ్యంలోని సీతారాంపేట్ గేటు సమీపంలోకి రాగానే, ఇబ్రహీంపట్నం నుంచి మంచాల వైపు వెళ్తున్న.. మంచాల ఇంచార్జి ఎంఈవో వెంకట్‌రెడ్డి కారు వారిని బలంగా ఢీకొంది. తీవ్ర గాయాలపాలైన దంపతులను చికిత్స నిమిత్తం నగరంలోని ఓ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందారు.


# బజార్‌హత్నూర్ మండలంలో పులి కలకలం

**బజార్‌హత్నూర్:** ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలంలో పులిసంచారంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాలైన డెడ్రా, గోసాయి ఉమార్డా, ఉమార్డ, గిరిజాయి మారుమూల గ్రామాల్లో పులి కదలికలు కనిపించాయి. మంగళవారం రాత్రి అటవీ ప్రాంతంలో పులి రెండు ఆవులపై దాడి చేసి హతమార్చింది. బుధవారం ఉదయం విషయం తెలుసుకున్న ఫారెస్టు డివిజనల్ అధికారి బర్నోబ, ఫారెస్టు రేంజ్ అధికారి అప్పయ్య, ఘటనాస్థలాన్ని పరిశీలించారు. పరిసర ప్రాంతాల్లో గాలించగా పులి పాదముద్రలు కనిపించాయి. ఆవులను హతమార్చింది పులేనని అధికారులు నిర్ధారించారు.

# తూముల ఏర్పాటు చారిత్రక నిర్ణయం

## జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

**రాయికల్ రూరల్ :** చెరువులను నింపేందుకు ఎస్సారెస్పీ కాలువలకు తూములు ఏర్పాటు చేయాలని సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయం చరిత్రలో నిలిచిపోతుందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని చెరువులను నింపేందుకు ఎస్సారెస్పీ కాలువకు రూ.70లక్షలతో 14 తూముల నిర్మాణానికి జడ్పీ అధ్యక్షురాలు దావ వసంతతో కలిసి మంగళవారం ఆయన భూమి పూజ చేశారు.



భూపతిపూర్‌లో తూము నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

# అంతర్ జిల్లాల బ్యాటరీ దొంగల ముఠా అరెస్ట్

**హాలియా, నమస్తే తెలంగాణ:** నల్లగొండ, సూర్యాపేట జిల్లాలో సెల్‌ఫోన్ టవర్ల బ్యాటరీల చోరీకి పాల్పడుతున్న అంతర్ జిల్లాల దొంగల ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నల్లగొండ జిల్లా అడిషనల్ ఎస్పీ టీ పద్మనాభరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండలం బాల్నేపల్లి గ్రామానికి చెందిన రమావత్ రాజశేఖర్, రమావత్ బాలు, ఏనెమీది తండాకు చెందిన మెరావత్ బాబు, తిరుమలగిరి (సాగర్) మండలం సుంకిశాల తండాకు చెందిన పాల్తి అశోక్, నందికొండ(కొత్తూరు)కు చెందిన రమావత్ నాగరాజు, మిర్యాలగూడ మండలం పొట్టిగానితండాకు చెందిన మాలోతు బాలాజి అనే వ్యక్తులు ముఠాగా ఏర్పడ్డారు. రెండు జిల్లాల్లో సెక్యూరిటీ లేని సెల్‌ఫోన్ టవర్లను ఎంచుకొని అక్కడ ఉన్న బ్యాటరీలను చోరీచేసి హైదరాబాద్‌లోని స్క్రాప్‌దుకాణాల్లో అమ్ముకుంటున్నారు. హాలియా సెల్‌ఫోన్ ఎక్స్ఛేంజ్ జేటీవో గొట్టిపాటి రామారావు ఏప్రిల్ 21న పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# పలు జిల్లాల్లో వర్షం




యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ బస్టాండ్ సమీపంలో కురుస్తున్న వర్షం



హైదరాబాద్‌లోని పబ్లిక్‌గార్డెన్ సమీపంలో రోడ్డుపై నిలిచిన వర్షపునీటిని మ్యాన్‌హోల్‌లోకి మళ్లిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

■ హైదరాబాద్‌లో భారీగా..

■ నల్లగొండ, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి జిల్లాల్లో ఓ మోస్తరు వానలు

■ నగరంలో సహాయక చర్యలు చేపట్టిన అధికారగణం

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ/నెట్‌వర్క్:** రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మంగళవారం ఓ మోస్తరు వానలు పడ్డాయి. హైదరాబాద్‌లో భారీ వర్షం కురువగా, నల్లగొండ, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి జిల్లాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. భారీ వర్షం కారణంగా హైదరాబాద్ నగరంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపై నీరు నిలిచి అనేక ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు, విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సరూర్‌నగర్‌లో అత్యధికంగా 3.6 సెంటీమీటర్లు, హిమాయత్‌నగర్‌లో 2.6 సెం.మీ., ఉప్పల్‌లో 2.5, నాగోల్‌లో 1.9, ఆసిఫ్‌నగర్‌లో 1.8 సెం.మీ. వర్షం కురిసింది. ఖైరతాబాద్, పంజాగుట్ట, టోలీచౌకి, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, సికింద్రాబాద్, తార్నాక, ఉప్పల్, కొత్తపేట, దిల్‌సుఖ్‌నగర్, సాగర్‌రోడ్డు, ఎల్బీనగర్, వనస్థలిపురం, చాంద్రాయణగుట్టల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానపడింది. ప్రధానకూడళ్లలో వర్షపు నీరు నిలువడంతో జీహెచ్‌ఎంసీ, పోలీస్, ట్రాఫిక్, జలమండలిశాఖలు అప్రమత్తమై సహాయక చర్యలు చేపట్టాయి. జీహెచ్‌ఎంసీ మాన్‌సూన్ బృందాలు, డిజాస్టర్ రెస్క్యూ టీమ్‌లు రంగంలోకి దిగాయి. వర్షాలుపడే అవకాశం ఉన్నదని మధ్యాహ్నం హైదరాబాద్ వాతావరణశాఖ హెచ్చరిక జారీచేసిన వెంటనే జీహెచ్‌ఎంసీ కమిషనర్ దానకిశోర్.. అధికారులు, సహాయక సిబ్బందిని అప్రమత్తం చేశారు. వర్షం కారణంగా నగరంలోని సుమారు 50చోట్ల రోడ్లపై నీరు నిలువగా, పలుచోట్ల చెట్లు కూలాయి. వెంటనే అక్కడకు చేరుకున్న సిబ్బంది ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టారు. నగరంలో నీరు నిలిచినప్రాంతాలను జీహెచ్‌ఎంసీ కమాండ్ కంట్రోల్‌రూం నుంచి గుర్తించి అధికారులను అప్రమత్తం చేశారు.



నల్లగొండ జిల్లా చిట్యాలలో కురుస్తున్న వర్షం

**పలు జిల్లాల్లో..**

నల్లగొండ జిల్లాలోని పలుప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. అడవిదేవులపల్లి, మర్రిగూడ, నాంపల్లి, కట్టంగూర్, నార్కట్‌పల్లి, హాలియా, త్రిపురారం మండలాల్లో ఓ మోస్తరు, నిడమనూరుతోపాటు పలు ప్రాంతాల్లో జోరువాన పడింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్, భూదాన్ పోచంపల్లిలో అరగంటపాటు వర్షం కురిసింది. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం, పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీలో ఓ మోస్తరు వాన పడింది.

## నాలాలో పడ్డ వ్యక్తిని కాపాడిన రెస్క్యూ బృందాలు

జీహెచ్‌ఎంసీ డిజాస్టర్ రెస్క్యూ బృందాలు సకాలంలో స్పందించి ఒకరి ప్రాణాలు కాపాడాయి. సోమవారం రాత్రి నవీన్ అనే వ్యక్తి బైక్‌పై వెళ్తూ నగరంలోని నాగోల్ సమీపంలో ప్రమాదవశాత్తు నాలాలో పడిపోయాడు. డిజాస్టర్ రెస్క్యూ బృందాలకు సమాచారం అందిన వెంటనే అక్కడికి చేరుకొని.. నవీన్‌ను రక్షించాయి. మోటర్‌సైకిల్‌ను కూడా బయటకుతీశాయి. సకాలంలో స్పందించి వ్యక్తిని కాపాడటంపై బల్దియా సహాయక బృందాలను స్థానికులు అభినందించారు.

# అప్పు తీర్చడం లేదంటూ పంట ధ్వంసం

## పెద్దపల్లి జిల్లా ఇప్పలపల్లిలో దారుణం

**ముత్తారం:** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఇప్పలపల్లిలో అప్పు తీర్చడం లేదంటూ ఓ వడ్డీవ్యాపారి కుటుంబం రైతు పత్తిచేనును ట్రాక్టర్‌తో దున్ని ధ్వంసం చేయించింది. ఇప్పలపల్లికి చెందిన సత్తయ్య రెండేండ్ల క్రితం అదే గ్రామానికి చెందిన రాజేశ్ వద్ద రూ. లక్ష అప్పు తీసుకున్నాడు. కొద్దిరోజులు గడిచాక రూ. 50 వేలను రాజేశ్‌కు చెల్లించాడు. అయితే కొంతకాలం క్రితం రాజేశ్ మృతి చెందడంతో రూ. లక్షతోపాటు వడ్డీ చెల్లించాలని రాజేశ్ కు టుంబ సభ్యులు రాధ, రాకేశ్, మణెమ్మ ఒత్తిడి తెచ్చారు. సత్తయ్య తాను రూ. 50 వేలు ఇప్పటికే చెల్లించాననీ, మిగతా డబ్బులు చెల్లిస్తానని తెలుపడంతో వారు వినకుండా సోమవారం రాత్రి సత్తయ్యకు పత్తిచేనులో ఎకరం మేర ధ్వంసం చేశారు. సమాచార మందుకున్న పోలీసులు ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రాణాలు తీసిన బైక్ రేసింగ్ సరదా

■ ముగ్గురు యువకుల దుర్మరణం

■ నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లో విషాదఛాయలు

**ఖానాపూర్:** బైక్ రేసింగ్ సరదా ముగ్గురు యువకులను బలిగొన్నది. ఈ ఘటన మంగళవారం రాత్రి నిర్మల్ జిల్లాలో చోటుచేసుకున్నది. నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణానికి చెందిన వంశీ, జిషాన్, అమన్, నిరంజన్, భూమేశ్ అనే ఐదుగురు యువకులు మంగళవారం రాత్రి 8.30 గంటల ప్రాంతంలో మంచిర్యాల-నిర్మల్ ప్రధాన రహదారిపై తర్లాపాడు గ్రామం వద్ద సరదాగా బైక్ రేసింగ్ నిర్వహించారు. ఈ క్రమంలో వంశీ, జిషాన్, అమన్ ఉన్న బైక్ నిరంజన్, భూమేశ్ ఉన్న బైక్‌ను ఢీకొట్టగా ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే వీరిని 108 వాహనంలో ఖానాపూర్ ప్రభుత్వ దవాఖానకు తరలిస్తుండగా జిషాన్ మార్గమధ్యంలో మృతి చెందగా, నిరంజన్, భూమేశ్ దవాఖానలో చికిత్స పొందుతూ మరణించారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. గాయపడిన ఇద్దరు కూడా మైనర్లు కావడం గమనార్హం.

## శ్రీలంకకు చైనా యుద్ధనౌక బహుమతి



**బీజింగ్, జూలై 16:** శ్రీలంకకు చైనా యుద్ధ నౌకను బహుమతిగా అందజేసింది. తద్వారా రెండు దేశాల మధ్య సైనిక సహకారం మరింత బలోపేతం అవుతున్నదని సంకేతాలిచ్చింది. 'పీ625' అనే చైనా యుద్ధ నౌక గత వారం శ్రీలంక రాజధాని కొలంబోకు చేరుకున్నది. శ్రీలంక నౌకాదళ కమాండర్ వైస్ అడ్మిరల్ పియాల్ డిసిల్వా స్పందిస్తూ తమకు యుద్ధనౌకను బహుమతిగా అందజేసినందుకు చైనాకు ధన్యవాదాలు తెలిపారు.

## భారత్-పాక్ మధ్య విమాన సేవలు ప్రారంభం

### నాలుగున్నర నెలల తర్వాత తమ గగనతలంలోకి అనుమతించిన పాక్



**న్యూఢిల్లీ:** సుమారు నాలుగున్నర నెలల విరామం తర్వాత భారత్, పాకిస్థాన్ మధ్య పౌర విమాన సర్వీసులు ప్రారంభమయ్యాయి. భారత్ విమాన సర్వీసులను తమ గగనతలం నుంచి ప్రయాణించేందుకు అనుమతినిస్తూ పాకిస్థాన్ మంగళవారం తెల్లవారుజామున 12.41 గంటలకు ఆదేశాలు (నోటమ్-ఎయిర్‌మెన్‌కు నోటీసు) జారీచేసింది. ఆ వెంటనే భారత్ కూడా రెండు దేశాల మీదుగా విమాన సర్వీసులు ప్రయాణిస్తాయని మరో నోటమ్‌లో పేర్కొంది. ఇరుదేశాలు 'నోటమ్' ఆదేశాలు జారీచేసిన కొన్ని గంటల తర్వాత భారత పౌర విమానయాన శాఖ స్పందిస్తూ పాక్ గగనతలం మీదుగా విమాన సర్వీసులు ప్రారంభమయ్యాయని, దీంతో విమానయాన సంస్థలకు, ప్రయాణికులకు ఉపశమనం లభించిందని వ్యాఖ్యానించింది. ఈ ఏడాది ఫిబ్రవరి 14న పుల్వామా ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత వాయుసేన (ఐఏఎఫ్) యుద్ధ విమానాలు అదే నెల 26న పాకిస్థాన్‌లోని బాలాకోట్‌లో జైషే మహమ్మద్ ఉగ్రవాద శిబిరంపై దాడి చేసిన సంగతి తెలిసిందే. ఐఏఎఫ్ దాడుల తర్వాత తమ గగనతలం మీదుగా భారత విమాన సర్వీసులను పాక్ నిషేధించింది.




## ఏపీ గవర్నర్‌గా బిశ్వభూషణ్

### ఒడిశా బీజేపీ సీనియర్ నేతకు బాధ్యతలు
### రాష్ట్రపతి భవన్ నుంచి ఉత్తర్వులు జారీ
### ఛత్తీస్‌గఢ్ గవర్నర్‌గా అనసూయ ఊకే నియామకం




**న్యూఢిల్లీ, జూలై 16:** రాష్ట్ర విభజన తరువాత తొలిసారి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్రం కొత్త గవర్నర్‌ను నియమించింది. ఒడిశా బీజేపీ సీనియర్ నేత, ఆ రాష్ట్ర మాజీ మంత్రి బిశ్వభూషణ్ హరిచందన్‌ను ఏపీ గవర్నర్‌గా.. ఛత్తీస్‌గఢ్ గవర్నర్‌గా అనసూయ ఊకేను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. రాష్ట్ర విభజనకు ముందు 2009, డిసెంబర్ నుంచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఈఎస్ఎల్ నరసింహన్ గవర్నర్‌గా ఉన్నారు. రాష్ట్ర విభజన తరువాత కూడా ఇప్పటివరకు ఆయనే రెండు తెలుగు రాష్ట్రాల గవర్నర్‌గా కొనసాగుతున్నారు. హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ కేంద్రంగా ఆయన కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు. ఏపీకి హరిచందన్‌ను నియమించడంతో నరసింహన్ తెలంగాణకు మాత్రమే పరిమితం కానున్నారు. ఏపీకి కొత్త గవర్నర్ నియామకంపై కొంతకాలంగా ఊహాగానాలు కొనసాగాయి. ఒక దశలో కేంద్ర మాజీ మంత్రి సుష్మాస్వరాజ్‌ను నియమిస్తారని వార్తలొచ్చాయి. అదే సమయంలో మధ్యప్రదేశ్‌కు చెందిన మరో బీజేపీ నేత , రాజ్యసభ సభ్యురాలు అనసూయ ఊకే (62)ను ఛత్తీస్‌గఢ్ గవర్నర్‌గా రాష్ట్రపతి నియమించారు. ఎంపీగా ఊకే పదవీ కాలం 2022లో ముగియనుంది. ప్రస్తుతం, మధ్యప్రదేశ్ గవర్నర్ ఆనందీ బెన్ పటేల్ ఛత్తీస్‌గఢ్ గవర్నర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

**ఐదు దశాబ్దాల ప్రజా జీవనం**

బిశ్వభూషణ్ హరిచందన్ (85) ఒడిశా అసెంబ్లీకి 5సార్లు ఎన్నికయ్యారు. బీజేపీ నుంచి మూడుసార్లు, ఒకసారి జనతా పార్టీ, మరోసారి జనతాదళ్ నుంచి గెలుపొందారు. 1971లో జనసంఘ్‌లో చేరికతో ఆయన తన రాజకీయ జీవితం ప్రారంభమైంది. 1977లో జనతాపార్టీ ఏర్పడే వరకు జనసంఘ్‌లో జాతీయ కార్యవర్గ సభ్యునిగా ఉన్నారు. తర్వాత జనతాపార్టీలో చేరారు. అంతకుముందు 1975 (ఎమర్జెన్సీ సమయంలో) మీసా చట్టం కింద అరెస్టయి జైలుకు వెళ్లారు. బీజేపీ ఏర్పడ్డాక ఆ పార్టీలో చేరిన బిశ్వభూషణ్ 1980-88 వరకు ఒడిశా శాఖ అధ్యక్షునిగా పనిచేశారు. 1988లో మళ్లీ జనతాపార్టీలో చేరిన ఆయన రాష్ట్ర ఉపాధ్యక్షునిగా నియమితులయ్యారు. 1996లో మళ్లీ ఆయన కమలదళంలో చేరారు. న్యాయవాద విద్యను అభ్యసించిన బిశ్వభూషణ్ ఒడిశాలో 2004లో ఏర్పడిన బీజేడీ, బీజేపీ సంకీర్ణ సర్కార్‌లో న్యాయశాఖ మంత్రిగా పనిచేశారు. బిశ్వభూషణ్ రచయిత కూడా. ఆయన ఒడియాలో పలు గ్రంథాలు రాశారు. మారుబటాస్, రాణా ప్రతాప్, శేషజలక్, అస్త్రశిఖ, మానసి గ్రంథాలను ఆయన రాశారు.





భవన శిథిలాల నుంచి చిన్నారిని రక్షిస్తున్న సహాయక సిబ్బంది



## 11 మంది దుర్మరణం

### శిథిలాల కింద 40 మందికిపైగా
### రక్షించేందుకు తీవ్రంగా శ్రమిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందం
### ముంబైలో ఘటన

# సమాధికట్టిన పాత భవనం

**ముంబై, జూలై 16:** మహారాష్ట్ర రాజధాని ముంబైలో ఓ పురాతన భవనం కుప్పకూలింది. మంగళవారం జరిగిన ఈ ఘటనలో 11 మంది మృతిచెందారు. వీరిలో నలుగురు మహిళలు, ఒక చిన్నారి ఉన్నారు. శిథిలాల కింద 40 మందికిపైగా చిక్కుకున్నట్లు భావిస్తున్నారు. వారిని రక్షించేందుకు ఎన్డీఆర్ఎఫ్ బృందం, అగ్నిమాపక దళ సిబ్బంది, పోలీసులతోపాటు స్థానికులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. డోంగ్రి ప్రాంతంలోని అత్యంత రద్దీగా ఉండే తండేల్ వీధిలోని నాలుగంతస్తుల కేసరిభాయ్ భవంతి ఉదయం 11.40 సమయంలో కుప్పకూలింది. పెద్దగా శబ్దం రావడంతో స్థానికులు భయంతో అక్కడి నుంచి పరుగులు దీశారు. విషయం తెలిసిన వెంటనే బృహన్ ముంబై కార్పొరేషన్(బీఎంసీ) అధికారులు ఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యలు చేపట్టారు. ఈ దుర్ఘటనలో సుమారు 12 నుంచి 13 మంది మరణించినట్లు గృహ నిర్మాణ శాఖ మంత్రి రాధాకృష్ణ వీకే పాటిల్ తొలుత వెల్లడించారు. సుమారు వందేండ్ల నాటి ఈ పురాతన భవనంలో 15 కుటుంబాలు నివాసం ఉంటున్నట్లు తెలుస్తున్నది. ఈ భవనం మహారాష్ట్ర గృహ నిర్మాణ, ప్రాంతాల అభివృద్ధి సంస్థ(ఎంహెచ్ఏడీఏ)కు చెందినదని, ప్రమాదకరస్థితిలో ఉన్నా సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. భవనానికి మరమ్మతులు చేయాలని మూడేండ్లుగా అధికారులచుట్టూ తిరిగినా నిధులు లేవంటూ ఎవరూ పట్టించుకోలేదని నివాసితులు మండిపడుతున్నారు.

**2012లోనే కూల్చివేయాల్సి ఉన్నా..**

వందేండ్ల నాటి ఈ భవనం ఎంహెచ్ఏడీఏకు చెందినదేనని ఆ సంస్థ ఛైర్మన్, ఎమ్మెల్యే ఉదయ్ సామంత్ అంగీకరించారు. 2012లో దీనిని కూల్చివేసేందుకు ఓ ప్రైవేట్ డెవలపర్‌కు అప్పగించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు కూల్చకుండా ఉన్నవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. భవనాన్ని ఖాళీ చేయాలని అందులో నివసిస్తున్న వారికి 2017లో నోటీసులు ఇచ్చినా వారు పట్టించుకోలేదని సావంత్ వివరించారు. భవనం అభివృద్ధి పనులను బీఎస్‌బీ డెవలపర్‌కు అప్పగించినట్లు ముంబై భవనాల మరమ్మతులు, పునర్నిర్మాణ బోర్డు (ఎంబీఆర్ఆర్‌బీ) ఛైర్మన్ వినోద్ ఘోసాల్కర్ తెలిపారు. ఇప్పటి వరకు పనులు చేపట్టకపోవడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

**ప్రమాదకర భవనాల జాబితా నుంచి పేరు మాయం**

కేసరిభాయ్ భవనం ప్రమాదకరంగా ఉందని గుర్తించిన బీఎంసీ 2017లోనే దాన్ని కూల్చివేత కేటగిరి సీ1లో చేర్చింది. అయితే రెండేండ్ల వరకు దీని గురించి ఎవరూ పట్టించుకోలేదు. మరోవైపు ఈ ఏడాది మేలో ముంబైలో 499 భవనాలు ప్రమాదకరంగా ఉన్నట్లు గుర్తించిన బీఎంసీ, వాటిని తక్షణం కూల్చివేయాలని నోటీసులు జారీ చేసింది. అనూహ్యంగా వర్షాకాలానికి ముందు మహారాష్ట్ర ఎంహెచ్ఏడీఏకు చెందిన ప్రమాదకర భవనాల జాబితా నుంచి కేసరిభాయ్ బిల్డింగ్ పేరు మాయమైంది.

**బాధ్యులపై చర్యలు: సీఎం ఫడ్నవీస్**

భవనం కుప్పకూలిన ఘటనపై దర్యాప్తు చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్ తెలిపారు. బాధితులను గుర్తించి వారికి పరిహారం అందజేస్తామన్నారు. ఈ ఘటనలో మృతిచెందిన వారిపట్ల ప్రధాని మోదీ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

### వరదలను కచ్చితంగా అంచనావేయొచ్చు!

#### సరికొత్త విధానాన్ని అభివృద్ధి చేసిన పరిశోధకులు

**న్యూయార్క్:** వరదలు సంభవించే సమయం, వ్యవధిని కచ్చితంగా అంచనావేసే సరికొత్త విధానాన్ని పరిశోధకులు అభివృద్ధి చేశారు. అమెరికాలోని సిటీ కాలేజ్ ఆఫ్ న్యూయార్క్‌కు చెందిన నరేశ్ దేవినేని, నాజర్ నజిబి ఈ విధానాన్ని కనుగొన్నారు. వరదల కాలపట్టికను కూడా ఈ విధానం ద్వారా నిర్ధారించవచ్చని వారు తెలిపారు. నదీ ప్రవాహం, వర్షపాతం, వాతావరణ ప్రతిబంధకాలను బట్టి వరదల వ్యవధిని అంచనావేయొచ్చని చెప్పారు.వరద నియంత్రిత డ్యామ్‌లు, బ్రిడ్జిలు, పవర్‌ప్లాంట్లు తదితర కీలక మౌలిక సదుపాయాలపై దీర్ఘకాల వరద ముప్పును నివారించేందుకు ఈ విధానం ఉపయోగపడుతుందని వారు వివరించారు.

### జాదవ్ కేసులో నేడు ఐసీజే తీర్పు

**ది హేగ్:** పాకిస్థాన్ ఆధీనంలో ఉన్న భారత రిటైర్డ్ నేవీ అధికారి కుల్‌భూషణ్ జాదవ్ (49) కేసుపై హేగ్‌లోని అంతర్జాతీయ న్యాయస్థానం (ఐసీజే) బుధవారం తుది తీర్పు ఇవ్వనున్నది. గూఢచర్యం, ఉగ్రవాద చర్యలకు పాల్పడుతున్నాడన్న అభియోగంపై జాదవ్‌కు 2017 ఏప్రిల్‌లో పాక్ మిలిటరీ కోర్టు మరణశిక్ష విధించింది. దీనిని వ్యతిరేకిస్తూ అదే ఏడాది మే 8న ఐసీజేను భారత్ ఆశ్రయించింది. దీంతో తాము తుదితీర్పు వెలువరించే వరకు జాదవ్‌కు మరణశిక్ష విధించరాదని 2017 మే 18న పాక్‌ను ఐసీజే ఆదేశించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో 4 రోజుల పాటు ఐసీజే పూర్తిస్థాయి విచారణ జరిపింది. బుధవారం తుదితీర్పు ఇవ్వనుంది.

# ఆసియా అతలాకుతలం

### భారత్, నేపాల్, బంగ్లాదేశ్, పీఓకేలలో వరద బీభత్సం
### 100 మందికిపైగా మృతి
### లక్షల సంఖ్యలో నిరాశ్రయులైన ప్రజలు
### ఇంకా వరద గుప్పిటే అసోం.. బీహార్‌లోనూ అదే పరిస్థితి
### కొనసాగుతున్న సహాయక చర్యలు



అసోంలో జైలు నీట మునగడంతో సామగ్రితో సురక్షిత ప్రాంతానికి వెళ్తున్న జైలర్లు

**కజిరంగా/గువాహటి/న్యూఢిల్లీ/పాట్నా, జూలై 16:** ఆసియా దేశాల్లో కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలు, పోటెత్తుతున్న వరదల వల్ల భారత్, నేపాల్, బంగ్లాదేశ్, పీఓకేలలో 100 మందికిపైగా మరణించారు. లక్షల మంది నిరాశ్రయులయ్యారు. ఆసియాలో 2017లో వర్షాలు, వరదల వల్ల 800 మంది మరణించారు. దీంతో పోల్చితే రానున్న రోజుల్లో వరదలు మరింత బీభత్సం సృష్టించే అవకాశముంది. భారత్‌లో ఈ ఏడాది వర్షాలు, వరదలతో అసోం, బీహార్ తీవ్రంగా దెబ్బతిన్నాయి. అసోంలో 10 రోజుల్లో 33 జిల్లాల్లో దాదాపు 45 లక్షల మందిపై ప్రభావం పడింది. ఇప్పటి వరకు 17 మంది మరణించారు. అసోంలో ప్రధాన సాగు తేయాకు పంటలు దెబ్బతిన్నాయి. బ్రహ్మపుత్ర నదిలోకి వరద ప్రవాహం పరిస్థితి దారుణంగా ఉండటంతో భారత వాతావరణ విభాగం 'రెడ్ కలర్' వార్నింగ్‌ను జారీ చేసింది. సహాయ చర్యల్లో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, సైన్యం పాల్గొంటున్నాయి. అవసరమైతే రంగంలోకి దిగడానికి వైమానిక దళం కూడా సిద్ధంగా ఉన్నది.

**బీహార్‌లో 25 లక్షల మందిపై ప్రభావం**

బీహార్‌లో వర్షాలు, వరదల వల్ల ఇప్పటి వరకు 33 మంది మరణించారు. 12 జిల్లాలపై వరద ప్రభావం ఎక్కువగా ఉన్నది. దాదాపు 25 లక్షల మందిపై ప్రభావం పడింది. భాగ్‌మతి, కామ్లా బాలన్, లాల్‌బకియా, అధ్వారా, మహానంద నదులు ప్రమాద హెచ్చరిక స్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్‌కు చెందిన 26 బృందాలు, స్థానిక పోలీసులు సహాయ చర్యల్లో పాల్గొంటున్నారు. బాధితుల కోసం ప్రభుత్వం 196 శిబిరాలను ఏర్పాటు చేసింది. దర్భాంగా జిల్లాలో ఖిరోయ్ నదిపై నిర్మించిన డ్యాంకు గండి పడటంతో పలు గ్రామాలు నీట మునిగాయి. భవిష్యత్‌లో కేరళలో భారీ వర్షాలు కురిసే అవకాశముందని ఐఎండీ అంచనా వేయడంతో రెడ్ అలర్ట్ ప్రకటించారు. పంజాబ్, హర్యానాలో వర్షాలు కురిశాయి. వర్షాల కారణంగా ఉత్తరప్రదేశ్‌లో 14మంది మరణించారు.





బీహార్‌లోని ముజఫర్‌పూర్‌లో పడవపై ఓ వృద్ధుడిని దవాఖానకు తీసుకెళ్తున్న దృశ్యం, (పక్కన) వరద ధాటికి కొట్టుకుపోయిన రైల్వే ట్రాక్

**నేపాల్, బంగ్లా, పాక్‌లోనూ మారని పరిస్థితి**

నేపాల్‌లో వర్షాలతో వరదలు రావడం, కొండ చరియలు విరిగిపడటంతో 25 జిల్లాల్లో 78 మంది మరణించగా, 40 మంది గాయపడ్డారు.32 మంది గల్లంతయ్యారు.17,500 మంది నిరాశ్రయులయ్యారు. బంగ్లాదేశ్‌లో 1.90 లక్షల మంది నిరాశ్రయులయ్యారు. కాక్స్ బజార్ జిల్లాలో ఆశ్రయం పొందుతున్న రోహింగ్యా శరణార్థుల్లో దాదాపు లక్ష మంది సురక్షిత ప్రాంతాలకు వెళ్లారు. మరోవైపు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో (పీఓకే) భారీ వర్షాలు, వరదలలో 28 మంది మరణించారు. మరోవైపు వర్షాలు, వరదల్లో పెద్ద సంఖ్యలో ప్రాణనష్టం సంభవిస్తుండటంపై ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరిస్ విచారం వ్యక్తం చేశారు.

### 90 శాతం నీట మునిగిన కజిరంగా పార్కు

#### 155 వన్యమృగాల సంరక్షణ కేంద్రాలపై వరద ప్రభావం
#### కొనసాగుతున్న సహాయక చర్యలు




వరద నీటి నుంచి గట్టుపైకి వెళ్తున్న ఖడ్గమృగాలు

అసోంలోని ప్రముఖ వన్యమృగాల పార్కు 'కజిరంగా' 90%మేర నీట మునిగింది. ఈ పార్కులోని వన్యమృగాలను సంరక్షించే 155 కేంద్రాలపై వరద ప్రభావం పడింది. దీంతో అటవీ సిబ్బంది, పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. వన్యమృగాల సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే కొన్ని జంతువులను సమీప సురక్షిత ప్రాంతాలకు తరలించగా.. మరి కొన్నింటిని పార్కులోని ఎత్తైన ప్రదేశానికి తరలించారు. పార్కు బయట రహదారిపై ప్రమాదాల్లో ఐదు జింకల మృతితో బస్సుల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు. పార్కులోపల వరద వల్ల మరో ఐదు జంతువులు మరణించాయి. 'గోలాఘాట్, నాగావ్ జిల్లాల్లో విస్తరించిన కజిరంగా పార్కు 90% నీట మునిగింది. మొత్తం 199 వన్యమృగాల సంరక్షణ కేంద్రాలకు 155 కేంద్రాలపై వరద ప్రభావం పడింది' అని అసోం అటవీ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది.

# 'టోల్' తప్పదు!

### మెరుగైన రోడ్లు కావాలంటే జనం డబ్బు చెల్లించాల్సిందే
### లోక్‌సభలో రోడ్లు, జాతీయ రహదారుల శాఖ మంత్రి గడ్కరీ స్పష్టీకరణ
### 80 గిగావాట్లు దాటిన దేశీయ సంప్రదాయేతర ఇంధన వనరుల సామర్థ్యం: ఆర్కే సింగ్




**న్యూఢిల్లీ, జూలై 16:** ప్రభుత్వం వద్ద సరిపడా నిధులు లేనందున, రోడ్లు మంచిగా ఉండాలంటే ప్రజలు 'టోల్ ఫీజు' చెల్లించాల్సిందేనని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారులశాఖ మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. మంగళవారం తన శాఖ గ్రాంట్లు, డిమాండ్లపై లోక్‌సభలో జరిగిన చర్చకు ఆయన సమాధానమిస్తూ.. గత ఐదేండ్లలో ప్రభుత్వం 40 వేల కి.మీ. రోడ్లు నిర్మించిందన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో 'టోల్ ఫీజు' వసూళ్ల తీరుపై కొందరు సభ్యులు లేవనెత్తిన ఆందోళనపై ఆయన స్పందిస్తూ జాతీయ రహదారులపై వసూలు చేస్తున్న టోల్ ఫీజును గ్రామీణ, కొండ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి ఉపయోగిస్తున్నామన్నారు. 'టోల్ ఫీజు నా మానస పుత్రిక. టోల్ వ్యవస్థ ఎప్పటికీ రద్దు కాదు. రేట్లు సమయానుకూలంగా మారుతాయి' అని అన్నారు. జాతీయ రహదారులపై 786 ప్రమాద స్థలాలను గుర్తించామని, ఇంజినీరింగ్ పనుల్లో వైఫల్యమే దీనికి కారణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వ రవాణా సంస్థల బస్సులకు టోల్ ఫీజు మినహాయింపును పరిశీలిస్తామన్నారు. లిథియం బ్యాటరీల ఉత్పత్తిపై తమకు సంతృప్తికర వివరణ రాలేదని, మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలన్న కాంగ్రెస్ పక్ష నేత అధిర్ రంజన్ చౌదరి విజ్ఞప్తిని స్పీకర్ ఓంబిర్లా అనుమతించలేదు. దీంతో కాంగ్రెస్ పార్టీ సభ నుంచి వాకౌట్ చేసింది.

**రైతుల ఆత్మహత్యలపై విపక్షం ఆందోళన**

వ్యవసాయ రంగంలో సంక్షోభంపై విపక్ష సభ్యులు ఆందోళన వ్యక్తంచేశారు. వ్యవసాయం, రైతుల సంక్షేమం, గ్రామీణాభివృద్ధిశాఖ పద్దులపై జరిగిన చర్చలో పాల్గొన్న విపక్ష సభ్యులు ప్రభుత్వం తీరుపై మండిపడ్డారు. కాంగ్రెస్ సభ్యుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ సగటున రోజుకు 30 మంది చొప్పున ఏటా సుమారు 12 వేల మంది రైతులు మరణిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

**ప్రైవేట్ చేతుల్లోనే 92% శీతల గిడ్డంగులు**

దేశవ్యాప్తంగా 36.77 మిలియన్ టన్నుల సామర్థ్యం గల 8,038 శీతల గిడ్డంగులు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ చెప్పారు. వాటిలో 92 శాతం ప్రైవేట్ సంస్థలు నిర్వహిస్తున్నాయని లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యుల ప్రశ్నలకు సమాధానంగా తెలిపారు. గతేడాది డిసెంబర్ 31 నాటికి దేశంలో 41,331 మంది పాకిస్థానీయులు, 4,193 మంది అఫ్గన్లు నివసిస్తున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ ఒక ప్రశ్నకు రాతపూర్వక సమాధానంలో చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆయుష్మాన్ భారత్ కింద దేశవ్యాప్తంగా 40 వేల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీ) నెలకొల్పాలని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి హర్షవర్ధన్ రాజ్యసభలో చెప్పారు. దేశీయ సంప్రదాయేతర ఇంధన వనరుల సామర్థ్యం 80 గిగావాట్లను దాటిపోయిందని కేంద్ర విద్యుత్, నూతన, సంప్రదాయేతర ఇంధన వనరుల శాఖ సహాయ మంత్రి ఆర్‌కే సింగ్ ఓ ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. ఇందులో 29.55 గిగావాట్ల సౌర విద్యుత్, 36.37 గిగావాట్ల పవన విద్యుత్ ఉందన్నారు. 2022 నాటికి 175 గిగావాట్ల ఇంధనాన్ని ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

## వెంటాడుతున్న అధికబరువు

### 2016 నాటికి దేశంలో 2.41 కోట్ల మంది స్థూలకాయులు
### ఐక్యరాజ్యసమితి నివేదికలో వెల్లడి



**ఐరాస, జూలై 16:** భారత్‌లో అధిక బరువుతో బాధపడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతున్నదని ఐక్యరాజ్యసమితి నివేదిక వెల్లడించింది. 2012లో 2.41 కోట్లుగా ఉన్న స్థూలకాయుల సంఖ్య (18 ఏండ్లు పైబడిన వారు), 2016 నాటికి 3.28 కోట్లకు చేరుతుందని పేర్కొంది. అదే అధిక బరువు ఉన్న ఐదేండ్లలోపు చిన్నారుల సంఖ్య 2018లో 29 లక్షలుగా ఉన్నట్లు తెలిపింది. అయితే పోషకాహార లోపం ఉన్న వారి సంఖ్య మాత్రం తగ్గుతున్నదని నివేదిక తెలిపింది. 2004-06 మధ్య కాలంలో దేశంలో పోషకాహార లోపం ఉన్న వారి సంఖ్య 25.39 కోట్లు (మొత్తం జనాభాలో 22.2 శాతం) ఉండగా, 2016-18 నాటికి ఆ సంఖ్య 19.44 కోట్లకు (14.5 శాతానికి) తగ్గినట్లు వివరించింది. 'స్టేట్ ఫుడ్ సెక్యూరిటీ అండ్ న్యూట్రిషన్ ఇన్ ద వరల్డ్-2019' పేరిట ఐక్యరాజ్యసమితి ఈ నివేదికను విడుదల చేసింది.

**ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఆకలికేకలు**

2018 నాటికి ప్రపంచవ్యాప్తంగా 82 కోట్ల మంది ఆకలితో అలమటిస్తున్నట్లు నివేదిక వెల్లడించింది. అంతకుముందు ఏడాది కంటే ఈ సంఖ్య 9 కోట్లు అధికం. వరుసగా మూడో ఏడాది కూడా ఈ సంఖ్య పెరుగడం గమనార్హం. 2030 నాటికి ఆకలితో అలమటించేవారే లేకుండా చేయాలన్న సుస్థిరాభివృద్ధి లక్ష్యాన్ని సాధించడం పెను సవాలేనని ఇది తెలియజేస్తున్నది.

# పదేండ్లలో 'ప్రాథమిక' లక్ష్యం!

### 2030లోగా 99% మంది పిల్లలకు ప్రాథమిక విద్య ▪ 84% మందికి ప్రాథమికోన్నత విద్య
### సుస్థిరాభివృద్ధి లక్ష్యం దిశగా భారత్ అడుగులు ▪ యునెస్కో వెల్లడి



**న్యూఢిల్లీ:** ఐక్యరాజ్యసమితి విద్య, శాస్త్రీయ, సాంస్కృతిక సంస్థ (యునెస్కో) సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో నిర్దేశించిన మేరకు 2030కల్లా వంద శాతం పిల్లలకు ప్రాథమిక విద్య అందజేయాలన్న లక్ష్యం సాకారం చేసే దిశగా భారత్ అడుగులేస్తున్నది. 2030 నాటికి దేశంలో 99% మంది చిన్నారులు ప్రాథమిక విద్యను పూర్తిచేసే అవకాశం ఉన్నదని, 84% మంది ప్రాథమికోన్నత విద్యను పూర్తిచేస్తారని యునెస్కో అంచనావేసింది. ప్రపంచవ్యాప్తంగా ఈ ధోరణి ఆశాజనకంగా లేదని, విద్యాభివృద్ధి చర్యలను వేగవంతం చేయకుంటే ఆయా దేశాలు లక్ష్యాలను చేరుకోలేవని యూఎన్ హైలెవల్ పొలిటికల్ ఫోరమ్‌కు సమర్పించిన నివేదికలో స్పష్టంచేసింది. 2030 నాటికి 6-17 ఏండ్ల వయసుస్కుల్లో ఆరుగురిలో ఒకరు ప్రాథమిక విద్యకు నోచుకునే అవకాశం లేదని తెలిపింది.

**లింగ సమానత్వం మెరుగు..**

భారత్‌లో 2008 నుంచి లింగ సమానత్వం గణనీయంగా మెరుగైందని తెలిపింది. ప్రాథమిక, లోయర్ సెకండరీ పాఠశాలల్లో బాలికల చేరికలు పెరిగాయన్నది. 2006లో 66% మంది బాలురు లోయర్ సెకండరీ ఎడ్యుకేషన్‌ను పూర్తిచేయగా, బాలికలు కేవలం 53% మాత్రమే పూర్తిచేసినట్లు తెలిపింది. ప్రస్తుతం బాలురు 82%, బాలికలు 79% లోయర్ సెకండరీ విద్యను పూర్తిచేస్తున్నారన్నది. 1999లో ప్రతి పది మంది బాలురకు ఎనిమిది మంది బాలికలు ప్రాథమిక పాఠశాలకు హాజరైతే ప్రస్తుతం బాలుర కంటే బాలికల సంఖ్యే అధికంగా ఉన్నదని తెలిపింది.



### ఇతర ముఖ్యాంశాలు

- భారత్‌లో 2000లో 82% మంది పిల్లలు ప్రాథమిక విద్యను పూర్తిచేయగా, 2030 కల్లా 99 శాతానికి చేరే అవకాశం ఉన్నది. 2000లో ఉన్నత మాధ్యమిక విద్యను పూర్తిచేసిన వారు 37 శాతమైతే, 2030 నాటికి 84 శాతానికి చేరనుంది. మరోవైపు పాక్‌లో నాలుగోవంతు మంది చిన్నారులు ప్రాథమిక విద్యకు నోచుకోరని యునెస్కో అంచనావేసింది.
- భారత్‌లో 2000లో లోయర్ సెకండరీ ఎడ్యుకేషన్ పూర్తిచేసిన పిల్లలు 57 శాతంగా ఉండగా, 2030కల్లా 94 శాతానికి చేరనుంది. బాలికల డ్రాపౌట్స్ తగ్గింపుకు తొమ్మిదో/పదో తరగతిలో చేరే బాలికకు బీహార్ ఉచితంగా సైకిల్ అందజేయటాన్ని ప్రశంసించింది.
- సబ్ సహారన్ ఆఫ్రికా తదితర ప్రాంతాల్లో 2000 నుంచి సుశిక్షిత ఉపాధ్యాయుల నిష్పత్తి తగ్గుతున్నదని పేర్కొంది. ప్రస్తుత గణాంకాల ప్రకారం 2030 నాటికి మధ్య ఆదాయ దేశాలు, లాటిన్ అమెరికాలో 'లర్నింగ్ రేట్' స్తంభించే పరిస్థితి ఉన్నదని తెలిపింది.

## ధోనీ లేని సచిన్ ప్రపంచకప్ జట్టు

**న్యూఢిల్లీ:** ప్రపంచకప్‌లో అద్భుత ప్రదర్శన చేసిన ఆటగాళ్లతో ఐసీసీ ఇప్పటికే ఓ జట్టును ప్రకటిస్తే... క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ తన మేటి టీంను మంగళవారం ఎంపిక చేశాడు. మాస్టర్ ప్రపంచకప్ జట్టులో ఐదుగురు టీమ్‌ఇండియా ప్లేయర్లకు చోటు దక్కగా... మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ పేరు అందులో లేదు. టీమ్ ఇండియా సారథి విరాట్ కోహ్లీ, వైస్ కెప్టెన్, టోర్నీ టాప్‌స్కోరర్ రోహిత్ శర్మ, బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా, ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా సహా మెగాటోర్నీలో రెండు మ్యాచ్‌లు మాత్రమే ఆడిన రవీంద్ర జడేజాను సచిన్ ఎంపిక చేశాడు. ప్రపంచకప్‌లో సారథిగానూ, బ్యాట్స్‌మన్ గాను అదరగొట్టిన న్యూజిలాండ్ ఆటగాడు విలియమ్సన్‌ను తన మేటి జట్టుకు కెప్టెన్‌గా మాస్టర్ బ్లాస్టర్ ఎంచుకున్నాడు. కీపర్‌గా ధోనీని పక్కనపెట్టి ఇంగ్లండ్ ఆటగాడు బెయిర్‌స్టోను జట్టులోకి తీసుకున్నాడు.

**సచిన్ ప్రపంచకప్ ఎలెవెన్:** రోహిత్ శర్మ(భారత్), బెయిర్‌స్టో(వికెట్‌కీపర్, ఇంగ్లండ్), విలియమ్సన్(కెప్టెన్, న్యూజిలాండ్), కోహ్లీ(భారత్), షకీబ్ అల్ హసన్(బంగ్లాదేశ్), స్టోక్స్(ఇంగ్లండ్), హార్దిక్ పాండ్యా, జడేజా, బుమ్రా(భారత్), స్టార్క్, ఆర్చర్.



## ఎవరూ ఓడిపోలేదు

**వెల్లింగ్టన్:** ప్రపంచకప్ ఫైనల్లో బౌండరీల ఆధారంగా ఇంగ్లండ్‌ను విజేతగా ప్రకటించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుంటే... మరోవైపు క్రీడాస్ఫూర్తి ప్రదర్శించిన న్యూజిలాండ్ కెప్టెన్ విలియమ్సన్‌పై ప్రశంసల వర్షం కురుస్తున్నది. ఈ నేపథ్యంలో విశ్వటోర్నీ ఫైనల్‌పై విలియమ్సన్ స్పందించాడు. 'రెండు జట్ల మధ్య ఏదీ భేదాన్ని తేల్చలేకపోయింది. ఫైనల్‌లో ఎవరూ ఓడిపోలేదు. కాకపోతే ఎవరికో ఒకరికి టైటిల్ దక్కాలి. అదే జరిగింది' అని విలియమ్సన్ అన్నాడు. ఓటమిని అంగీకరించిన తీరుపై వస్తున్న ప్రశంసల పట్ల స్పందిస్తూ తాము ఐసీసీ నిబంధనలకు కట్టుబడి ఉన్నామని అన్నాడు. ఇక బౌండరీల లెక్కింపు నిబంధనపై విలేకరులు అడిగిన ప్రశ్నకు బదులిస్తూ 'ఈ మాట మీరు అడగాల్సి వస్తుందని, నేను సమాధానం చెప్పాల్సి వస్తుందని ఇంతకు ముందెప్పుడూ అస్సలు ఊహించలేదు. తుదిపోరులో ఓటమిని దిగమింగడం చాలా కష్టం, అయితే రెండు జట్లు ఫైనల్‌కు వచ్చేందుకు ఎంతో శ్రమించాయి. ఇరు జట్ల మధ్య భేదాన్ని తేల్చేందుకు రెండు ప్రయత్నాలు జరిగాయి, అయినా ఏదీ తేలలేదు' అని విలియమ్సన్ అన్నాడు.

## స్టోక్స్‌కు నైట్‌హుడ్ పురస్కారం!

**లండన్:** ప్రపంచకప్ ఫైనల్‌లో అలుపెరుగని పోరాటం చేసి ఇంగ్లండ్‌ను తొలిసారి జగజ్జేతగా నిలిపిన ఆ దేశ ఆల్‌రౌండర్ స్టోక్స్‌కు బ్రిటన్ అత్యున్నత పురస్కారాల్లో ఒకటైన 'నైట్‌హుడ్' దక్కే అవకాశం ఉంది. థెరిసా మే తర్వాత బ్రిటన్ ప్రధాని పీఠం కోసం పోటీ పడుతున్న బోరిస్ జాన్సన్, జెరెమీ హంట్... స్టోక్స్‌కు అవార్డు ఇవ్వడంపై సానుకూలంగా స్పందించారు. ది సన్ అండ్ టాక్ రేడియో నిర్వహించిన ఓ చర్చలో వారు ఈ అంశంపై స్పందించారు.



నైట్‌హుడ్‌కు స్టోక్స్ అర్హుడేనా అన్న ప్రశ్నకు జాన్సన్ సమాధానమిస్తూ 'కచ్చితంగా అర్హుడే. నేనైతే పురస్కారం తప్పక ఇచ్చేందుకు ప్రయత్నిస్తా' అని చెప్పారు. దీనికి మరో అభ్యర్థి హంట్ సైతం మద్దతు తెలిపారు. దీంతో వీరిలో ఎవరు ప్రధాని అయినా బెన్ స్టోక్స్‌కు నైట్‌హుడ్ పురస్కారం దక్కే అవకాశముంది. ఇప్పటివరకు 11 మంది ఇంగ్లండ్ క్రికెటర్లకు మాత్రమే ఈ గౌరవం దక్కింది. నైట్‌హుడ్ పురస్కారాన్ని బ్రిటీష్ రాజు లేదా రాణి ప్రదానం చేస్తారు. మాజీ కెప్టెన్ అలెస్టర్ కుక్ చివరిసారి ఈ పురస్కారాన్ని అందుకున్నాడు. బెన్ స్టోక్స్ ఈ విశ్వకప్‌లో 465పరుగులు, ఏడు వికెట్లు తీశాడు. ఫైనల్‌లో ఓ ఎండ్‌లో వికెట్లు పడుతున్నా యోధుడిలా పోరాడి 98 బంతులకు 84 పరుగులు చేశాడు. సూపర్ ఓవర్లోనూ ఎనిమిది పరుగులు చేసి ఇంగ్లండ్ టైటిల్ గెలవడంలో కీలకపాత్ర పోషించాడు.

# అగాధం నుంచి అందలానికి!



బ్రిటన్ ప్రధాన మంత్రి థెరిసా మేతో ఇంగ్లండ్ ప్రపంచకప్ జట్టు

ఉలి దెబ్బకు శిల అందమైన శిల్పంగా మారినట్లు ఎదురుదెబ్బలు తిన్నప్పుడే మనలోని అసలైన ప్రతిభ బయటికి వచ్చేది. ఆటుపోట్లకు ఎదురొడ్డి నిలుస్తూ, ఎదురైన అవాంతరాలను అధిగమిస్తూ ముందుకు సాగినప్పుడే అనుకున్న లక్ష్యాన్ని చేరుకునేది. అవును నాలుగేండ్ల కిందటి ఇంగ్లండ్‌ను ఇప్పటి జట్టును ఓసారి పరిశీలిస్తే ఇదే అర్థమవుతుంది. గత రెండు ప్రపంచకప్‌లలో సెమీస్ చేరని ఇంగ్లిష్ జట్టు తమ సుదీర్ఘ కలను ఈసారి సాకారం చేసుకుంది. ఇన్నాళ్లు సంప్రదాయ క్రికెట్ నీడలో పరిమిత ఓవర్ల ఫార్మాట్‌ను నిర్లక్ష్యం చేసి మూల్యం చెల్లించుకున్న ఇంగ్లండ్ ప్రపంచకప్ లక్ష్యంగా పెనుమార్పులకు నాంది పలికింది. ఈ క్రమంలో ఎన్నో అవరోధాలను ఎదుర్కొని ముందుకు సాగింది. మూడుసార్లు తుదిమెట్టుపై బోల్తాకొట్టి అడుగుదూరంలో నిలిచిపోయిన ఇంగ్లండ్ ఈసారి అద్భుతంగా ఒడిసిపట్టుకుంది. న్యూజిలాండ్‌తో హోరాహోరీ ఫైనల్లో స్కోర్లు సమమైనా..అత్యధిక బౌండరీలతో అద్భుత విజయాన్ని అందుకుంది. ఓవైపు విజేతను నిర్ణయించడంలో కీలకమైన ఐసీసీ నిబంధనలపై విమర్శల జడివాన కురుస్తున్నా..ఇన్నేండ్ల శ్రమ సాకారమైన వేళ ఇంగ్లండ్ అంతటా పండుగ వాతావరణం నెలకొన్నది.

## నాలుగేండ్లలో పెను మార్పులు

### ప్రపంచకప్ గెలుపు వెనుక ఇంగ్లండ్ కఠోర శ్రమ

నమస్తే తెలంగాణ క్రీడా విభాగం

ప్రపంచకప్..జీవితంలో ఒక్కసారైనా తనివీతీరా ముద్దాడాలని ప్రతి ఒక్కరి ఆకాంక్ష. ప్రతిష్ఠాత్మకంగా భావించే కప్‌ను దక్కించుకోవడం కోసం ప్రతి జట్టు పడని కష్టం లేదు. విజయమో, వీర స్వర్గమో అన్న రీతిలో బరిలోకి దిగి జట్లు మైదానంలో చూపించే పరాక్రమం అభిమానులను మరో లోకంలోకి తీసుకెళ్తుంది. నాలుగేండ్లకోసారి జరిగే ప్రపంచకప్‌లో ఎలాగైనా విజేతగా నిలువాలనేది ఆశ, అభిమతం. కానీ అందరికీ ఆ అదృష్టం దక్కకపోవచ్చు. ఇప్పటివరకు 12సార్లు ప్రపంచకప్ జరిగితే అందరికంటే ఎక్కువ సార్లు ఆస్ట్రేలియా(5) విజేతగా నిలిస్తే భారత్, వెస్టిండీస్ రెండేసి సార్లు కప్‌ను తమ వశం చేసుకోగా, పాకిస్థాన్, శ్రీలంక ఒక్కోసారి అందుకున్నాయి. ఇప్పుడు ఈ జాబితాలో ఇంగ్లండ్ కొత్తగా చేరింది. ఆట పుట్టింది, పెరిగింది ఆ దేశంలోనేనైనా ఇన్నాళ్లు కలగానే మిగిలిపోయిన కప్ ఎట్టకేలకు పుట్టింటికి చేరింది. తీరని లోటుగా మారిన ప్రపంచకప్‌ను దక్కించుకోవడం వెనుక ఇంగ్లండ్ పడ్డ శ్రమ అంతాఇంతా కాదు. నాలుగేండ్ల కిందట గ్రూప్ దశలోనే నిష్క్రమించిన నాటి నుంచి నేటి వరకు ఇంగ్లండ్ జట్టులో అనూహ్య మార్పులు చోటు చేసుకున్నాయి. గత వరల్డ్‌కప్ ఆడిన ఐదుగురు క్రికెటర్లు(మోర్గాన్, రూట్, అలీ, వోక్స్, బట్లర్) మాత్రమే ప్రస్తుత జట్టులో ఉన్నారంటే ఎంతలా మారిపోయిందో అర్థమవుతుంది.

#### మోర్గాన్‌పై నమ్మకముంచుతూ

పరిమిత ఓవర్ల ఫార్మాట్‌కు ప్రాధాన్యమిస్తూ ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు(ఈసీబీ) తీసుకున్న సాహసోపేత నిర్ణయాలు సానుకూల ఫలితానిచ్చాయి. సరిగ్గా 2015 ప్రపంచకప్ టోర్నీకి రెండు నెలల ముందు అలిస్టర్ కుక్ నుంచి బాధ్యతలు అందుకున్న ఇయాన్ మోర్గాన్‌పై ఈసీబీ గట్టి నమ్మకం పెట్టుకుంది. అదే సమయంలో ఆస్ట్రేలియాకు చెందిన ట్రెవర్ బెయిలిస్‌కు ప్రధాన కోచ్‌గా బాధ్యతలు అప్పగించి పాల్ ఫార్బెస్‌ను డిప్యూటీ కోచ్‌గా నియమించింది. దేశవాళీ క్రికెట్‌లో నిలకడగా రాణిస్తున్న క్రికెటర్లపై ఈసీబీ దృష్టిసారించి అనుకున్న ఫలితాన్ని సాధించింది. వివిధ జట్ల తరపున దూకుడైన బ్యాటింగ్‌తో అదరగొడుతున్న క్రికెటర్లకు మరింత సానబెట్టి జాతీయ జట్టులో అవకాశాలు కల్పించింది. జాసన్ రాయ్, బెయిర్‌స్టో, జేమ్స్ విన్స్ లాంటి వాళ్లు ఇలా వచ్చినవారే. ఇన్నాళ్లు పరిమిత ఓవర్ల ఫార్మాట్ అంటే భయపడుతూ వచ్చిన నేపథ్యాన్ని కోచ్ బెయిలిస్, కెప్టెన్ మోర్గాన్ పూర్తిగా మార్చేశారు. జట్టుకు దూకుడును పరిచయం చేస్తూ కొత్త సంస్కృతికి తెరతీశారు. ఆటగాళ్లకు బాధ్యతలు అప్పగిస్తూ వారిపై నమ్మకముంచుతూ ముందుకు సాగడం కలిసొచ్చింది. 2015 ప్రపంచప్ నుంచి ఇప్పటి వరకు మిగతా జట్లతో పోలిస్తే..వన్డేల్లో అత్యధిక విజయాల శాతం ఇంగ్లండ్(70.97)దే కావడం వారి మార్పునకు ఉదాహరణ అని చెప్పొచ్చు. దీనికి తోడు వివిధ దేశాల సమహారంగా కనిపించే ఇంగ్లండ్ జట్టులో ఆటగాళ్లు ఒక కుటుంబంలా కలిసి సమిష్టిగా ఆడటం వారి ప్రదర్శనకు తార్కాణం. ఇన్నేండ్లు పడ్డ కష్టానికి అదృష్టం కలిసొచ్చిన వేళ ప్రతిష్ఠాత్మక లార్డ్స్ మైదానం వేదికగా ఇంగ్లండ్‌కు అనుకున్న ఫలితం లభించింది.

#### ఆల్‌రౌండర్లతో కళకళ

ప్రపంచకప్ గెలిచిన ఇంగ్లండ్ జట్టును చూస్తే ఆల్‌రౌండర్లతో కళకళలాడుతూ కనిపిస్తున్నది. బెన్ స్టోక్స్, జోఫ్రా ఆర్చర్, క్రిస్ వోక్స్, మొయిన్ అలీ ఇలా మ్యాచ్‌ను ఒంటిచేత్తో మలుపు తిప్పే ఆటగాళ్లే. జాసన్ రాయ్ నుంచి మొదలుపెడితే ఆఖర్లో ఆర్చర్ వరకు అందరూ బ్యాట్లు ఝులిపించే వారే. బరిలోకి దిగారంటే బాదుడే లక్ష్యంగా ప్రత్యర్థిపై నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడే వాళ్లే వీరంతా. ప్రపంచకప్ టోర్నీకి ముందు పాకిస్థాన్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో దాదాపు ప్రతి మ్యాచ్‌లో 300 లేదా అంతకుపైగా పరుగులు సాధించిన ఇంగ్లండ్.. వన్డేల్లో సరికొత్త ఒరవడికి నాంది పలికింది. వీరి జోరు చూస్తే ప్రపంచకప్‌లో 500ల స్కోరు కూడా సాధ్యమే కావచ్చు అంటూ టీమ్‌ఇండియా కెప్టెన్ కోహ్లీ అన్నాడంటే వాళ్ల బ్యాటింగ్ ఏంటో తెలుస్తుంది.

### స్టోక్స్, ఆర్చర్ ఆయువుపట్టులా..



ఇంగ్లండ్ జట్టుకు ఆల్‌రౌండర్లు బెన్ స్టోక్స్, ఆర్చర్ ఆయువుపట్టు అని చెప్పొచ్చు. తమదైన నైపుణ్యంతో జట్టు సుదీర్ఘ కలను సాకారం చేయడంలో వీరిద్దరిది కీలక పాత్ర. మోతాదుకు మించి మద్యం తాగి వీధి గొడవలో కెరీర్‌ను ప్రమాదంలో పడేసుకున్న నేపథ్యం స్టోక్స్‌ది అయితే..బార్బడోస్‌లో పుట్టి ఇంగ్లండ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన నేపథ్యం ఆర్చర్‌ది. తాను చేసిన తప్పునకు ప్రాయచిత్త పడి మ్యాచ్‌ల నిషేధం ఎదుర్కొని ఒకానొక పరిస్థితుల్లో క్రికెట్‌కు దూరమవుతాడనుకున్న స్టోక్స్...కెరీర్‌లో అదిరిపోయే ఆటతో ఆకట్టుకున్నాడు. విశ్వకప్ వేదికగా తనదైన ఆల్‌రౌండ్ నైపుణ్యంతో జట్టు విజయాల్లో కీలక భూమిక పోషించాడు. ఉపయుక్తమైన బౌలింగ్‌కు తోడు మిడిలార్డర్‌లో నమ్మకమైన బ్యాట్స్‌మన్‌గా మన్ననలు అందుకున్నాడు. ఫైనల్లో పోరాట పటిమతో జట్టు సుదీర్ఘ కలను సాకారం చేసి దిగ్గజ ఇయాన్ బోథమ్ తర్వాత ఇంగ్లండ్‌కు దొరికిన మేలిమి ముత్యంలా స్టోక్స్ నిలిచాడు. మరోవైపు ప్రపంచకప్ టోర్నీకి ముందు మూడంటే మూడు మ్యాచ్‌లు ఆడి అనూహ్యంగా జట్టులోకొచ్చిన ఆర్చర్ తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకున్నాడు.



భారత క్రీడా ప్రాధికార సంస్థ(సాయ్) మంగళవారం ఢిల్లీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేంద్ర క్రీడాశాఖ మంత్రి కిరణ్ రిజిజు చేతుల మీదుగా అర్జున అవార్డులు అందుకుంటున్న రోహన్ బోపన్న, స్మృతి మందన

## మీ వల్లే ఈ స్థాయిలో ఉన్నాం

### గురువు అచ్రేకర్‌కు సచిన్, కాంబ్లీ నివాళులు

**ముంబై:** తనను క్రికెటర్‌గా తీర్చిదిద్దిన గురువు రమాకాంత్ అచ్రేకర్‌కు బ్యాటింగ్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ గురుపూర్ణిమ సందర్భంగా ఘన నివాళులర్పించాడు. తాను ప్రస్తుతం ఈస్థాయిలో ఉన్నానంటే అందుకు ఆయనే కారణమని స్మరించుకున్నాడు. 'విద్యార్థిలో ఉండే చీకటి అనే అజ్ఞానాన్ని గురువు మాత్రమే రూపుమాపగలరు. అలా గురువుగా నన్ను ముందుకు నడిపించి... నేను ప్రస్తుతం ఈస్థాయిలో ఉండేలా చేసిన మా గురువు అచ్రేకర్ సర్‌కు ధన్యవాదాలు' అని సచిన్ టెండూల్కర్ ట్వీట్ చేశాడు. తనకు క్రికెట్‌లో ఓనమాలు నేర్పించి, గొప్ప ఆటగాడిగా ఎదిగేందుకు అచ్రేకర్ ఎంతో కృషి చేశారని సచిన్ చాలాసార్లు చెప్పిన విషయం తెలిసిందే. అలాగే మరో మాజీ క్రికెటర్ వినోద్ కాంబ్లీ ట్విట్టర్ వేదికగా అచ్రేకర్‌కు నివాళులర్పించాడు. 'ఓ ఉత్తమ క్రికెటర్‌గానే కాకుండా ముఖ్యంగా మంచి మనిషిగా ఎలా ఉండాలో మీరు నాకు నేర్పించారు. మిమ్మల్ని ఎంతో మిస్ అవుతున్నా. మీ శిక్షణ ద్వారా ఎప్పుడూ మీరు నాతో ఉంటారు. గురుపూర్ణిమ శుభాకాంక్షలు' అని కాంబ్లీ పేర్కొన్నాడు. రమాకాంత్ విట్టల్ అచ్రేకర్.. క్రికెట్ సర్కిల్‌లో అచ్రేకర్ సర్‌గా ప్రసిద్ధి. సచిన్, కాంబ్లీతో పాటు ఎంతో మందిని క్రికెటర్లుగా తీర్చిదిద్దిన ఆయన ఈ ఏడాది జనవరి 2న కన్నుమూశారు.



## మరో సూపర్ ఓవరైతే బాగుండేది: సచిన్

**న్యూఢిల్లీ:** ఇంగ్లండ్, న్యూజిలాండ్ ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్ విజయంపై మాజీల విశ్లేషణ పర్వం కొనసాగుతూనే ఉన్నది. విజేతను నిర్ణయించేందుకు బౌండరీల సంఖ్యగాకుండా మరో సూపర్ ఓవర్ నిర్వహిస్తే బాగుండేది భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. 'విజేతను ఖరారు చేసేందుకు మరో సూపర్ ఓవర్ పెట్టాల్సింది. ఇరు జట్ల బౌండరీల సంఖ్య జోలికి వెళ్లకుండా సూపర్ ఓవర్ పెడితే సరైన ఫలితం వచ్చేది. ఇది ప్రపంచకప్ ఫైనల్‌కు మాత్రమే పరిమితం కాదు. ప్రతి మ్యాచ్ కీలకమే. ఫుట్‌బాల్‌లోనూ నిర్ణీత సమయంలో ఇరు జట్లు సమాన గోల్స్ చేస్తే మ్యాచ్ అదనపు సమయానికి దారితీస్తుంది. ఇది కూడా అంతే' అని సచిన్ అన్నాడు. ప్రపంచకప్ ఫైనల్లో ఓవర్‌త్రో వివాదంపై ఐసీసీ తొలిసారి స్పందించింది. 'నిబంధనలకు అనుగుణంగా ఫీల్డ్ అంపైర్లు నిర్ణయాలు తీసుకుంటారు. పాలసీకి అనుగుణంగా వారు తీసుకునే నిర్ణయాలపై ఎలాంటి వ్యాఖ్యలు చేయడానికి వీలు లేదు' అని ఐసీసీ అధికార ప్రతినిధి పేర్కొన్నారు. వాస్తవానికి ఐసీసీ నిబంధన 19.8 ప్రకారం ఫీల్డర్ త్రో విసిరే సమయానికి బ్యాట్స్‌మెన్ ఒకరినొకరు దాటినప్పుడే రెండో పరుగు ఇచ్చేందుకు ఆస్కారముంటుంది. కానీ కివీస్‌తో మ్యాచ్ లో గప్టిల్ త్రో వేసే సరికి స్టోక్స్, రషీద్ ఒక్కో ఎండ్‌లో ఉన్నారు. దీంతో ఐదు పరుగులకు బదులు అంపైర్ ధర్మసేన..ఇంగ్లండ్‌కు ఆరు పరుగులు ఇవ్వడం కివీస్ కొంప ముంచింది.

## దరఖాస్తులకు ఆహ్వానం

### కోచ్, సహాయక బృందం కోసం బీసీసీఐ నోటిఫికేషన్

**న్యూఢిల్లీ:** భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) మంగళవారం చీఫ్ కోచ్, సహాయక బృందం కోసం దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ మేరకు అర్హతలతో కూడిన నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈనెల 30వ తేది సాయంత్రం 5 గంటల వరకు తుది గడువును నిర్దేశించింది. గతం (2017)లో రవిశాస్త్రిని ప్రధాన కోచ్‌గా నియమించినప్పుడు మొత్తం తొమ్మిది పాయింట్లతో అర్హత నిబంధనలు రూపొందించిన బీసీసీఐ తాజాగా మూడింటికి పరిమితమైంది. ఇందులో ప్రధాన కోచ్ కోసం దరఖాస్తు చేసుకునే వారు టెస్ట్ హోదా కల్గిన జట్టుకు రెండేండ్లు కోచ్‌గా చేసిన అనుభవం లేదా అసోసియేట్ దేశం/ఏ టీమ్/ఐపీఎల్ జట్టుకు మూడేండ్లు పనిచేసి ఉండాలి. దీనికి తోడు జట్టు తరపున 30 టెస్టులు, 50 వన్డేలాడి 60 ఏండ్ల లోపు ఉన్న వారు అర్హులుగా ప్రకటించింది. ఇక బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ కోచ్ పదవుల కోసం దరఖాస్తు చేసుకునే వారు 10 టెస్టులు లేదా 25 వన్డేలాడి 60 ఏండ్ల లోపు వారయ్యి ఉండాలి. ప్రస్తుతమున్న చీఫ్ కోచ్ రవిశాస్త్రి, భరత్ అరుణ్(బౌలిం గ్), సంజయ్ బంగర్(బ్యాటింగ్), ఆర్ శ్రీధర్(ఫీల్డింగ్) పదవీ కాలాన్ని మరో 45 రోజులు బీసీసీఐ పొడిగించిన సంగతి తెలిసిందే. దీంతో వీరంతా వెస్టిండీస్‌లో సిరీస్ ముగిసే సెప్టెంబర్ 3 వరకు జట్టుతో కొనసాగుతారు. అయితే కొత్త వారితో ప్రస్తుతం కొనసాగుతున్న వారు కూడా తిరిగి అప్లై చేసుకునే అవకాశం బీసీసీఐ కల్పించింది. మరోవైపు ఫిజియో థెరపిస్టు ప్యాట్రిక్ ఫర్హాత్, ట్రైనర్ శంకర్ తమ పదవీ కాలాన్ని పూర్తి చేసుకోవడంతో ఈసారి కొత్తవారికి అవకాశం దక్కనుంది. 2017లో అనిల్ కుంబ్లే తర్వాత జట్టు ప్రధాన కోచ్ పగ్గాలు అందుకున్న రవిశాస్త్రి హయాంలో ఆస్ట్రేలియాపై ఆస్ట్రేలియాలో టెస్ట్ సిరీస్ విజయం మినహా టీమ్‌ఇండియా చెప్పుకోదగ్గ విజయాలు సాధించిన దాఖలాలు లేవు. తాజాగా ముగిసిన ప్రపంచకప్‌లో లీగ్ దశలో టాప్‌లో నిలిచిన భారత్..సెమీస్‌లో కివీస్ చేతిలో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించింది.

## భారత షట్లర్ల శుభారంభం

### మిక్స్‌డ్ డబుల్స్‌లో సిక్కి, ప్రణవ్ జోడీ గెలుపు

**జకార్తా:** ఇండోనేషియా ఓపెన్‌లో భారత షట్లర్లు శుభారంభం చేశారు. మంగళవారమిక్కడ జరిగిన మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో రాష్ట్ర యువ షట్లర్ సిక్కిరెడ్డి, ప్రణవ్ జెర్రీ చోప్రా ద్వయం 25-23, 16-21, 21-19 తేడాతో నెదర్లాండ్ జోడీ రాబిన్ తాబెలింగ్, సెలీనా పీక్‌పై విజయం సాధించారు. హోరాహోరీగా సాగిన పోరులో సిక్కి, ప్రణవ్ ద్వయం ప్రత్యర్థులకు దీటైన పోటీనిచ్చింది. తొలి గేమ్‌ను 25-23తో దక్కించుకున్న ఈ జోడీ రెండో గేమ్‌ను చేజార్చుకుని నిర్ణయాత్మక ఆఖరి గేమ్‌లో పుంజుకుని మ్యాచ్‌ను తమ వైపునకు తిప్పుకుంది. తర్వాతి రౌండ్‌లో చైనాకు చెందిన టాప్ సీడ్ జోడీ జెంగ్ సీ వీ, హువాంగ్ యా క్వింగ్‌తో ప్రణవ్-సిక్కిరెడ్డి పోటీ పడతారు. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో సాత్విక్ సాయిరాజ్ రాంకీరెడ్డి, చిరాగ్ శెట్టి ద్వయం 21-19, 18-21, 21-19 తేడాతో మలేషియా జోడీ గో జే ఫీ, నూర్ ఇజుద్దీన్‌పై విజయం సాధించింది. రెండో రౌండ్‌లో ఇండోనేషియన్ టాప్ సీడ్ ఫెర్నాల్డీ గిడియోన్, సంజయ సుకముల్జో జోడీతో సాత్విక్-చిరాగ్ ద్వయం తలపడనుంది. మహిళల డబుల్స్‌లో మాత్రం భారత్‌కు నిరాశ ఎదురైంది. భారత జోడీ అశ్విని పొన్నప్ప, ఎన్.సిక్కిరెడ్డి 20-22, 22-20, 20-22 తేడాతో మలేషియా జోడీ వివియన్ హూ, యప్ చెంగ్ వెన్ చేతిలోపరాజయం పాలయ్యింది. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో భారత స్టార్ షట్లర్ పీవీ సింధు, పురుషుల సింగిల్స్‌లో కిడాంబి శ్రీకాంత్ బుధవారం బరిలోకి దిగనున్నారు.




## విజయ్‌వీర్‌కు మూడో స్వర్ణం

### షూటింగ్ ప్రపంచకప్‌లో భారత్ జోరు

**న్యూఢిల్లీ:** భారత యువ షూటర్ విజయ్‌వీర్ సిద్ధు షూటింగ్ జూనియర్ ప్రపంచకప్‌లో అదరగొడుతున్నాడు. జపాన్‌లోని సుహ్ల్‌లో మంగళవారం జరిగిన పురుషుల 25 మీటర్ల పిస్టల్ టీం విభాగంలో రాజ్‌కన్వర్ సింగ్, ఆదర్శ్ సింగ్‌తో కలిసి విజయ్ స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నాడు. మొత్తంగా ఈ టోర్నీలో వీర్‌కు మూడో పసిడి కాగా, ఆదర్శ్‌కు రెండోది. పురుషుల 10మీటర్ల ఎయిర్‌రైఫిల్ టీం విభాగంలో భారత త్రయం హృదయ్ హజారికా, యశ్ వర్ధన్, పార్థ్ మకిజా రజత పతకాన్ని కైవసం చేసుకుంది. మొత్తం 1877.4స్కోరు చేసి చైనా త్రయం కంటే కేవలం 0.4పాయింట్లు వెనుకబడి స్వర్ణాన్ని తృటిలో చేజార్చుకున్నారు. 10మీటర్ల ఎయిర్‌రైఫిల్ వ్యక్తిగత విభాగంలో మాత్రం జూనియర్ ప్రపంచ చాంపియన్ హృదయ్‌కు నిరాశే మిగిలింది. 24షాట్ల పోటీలో 18వ షాట్ వరకు అగ్రస్థానంలో ఉన్న అతడు.. ఆ తర్వాత పట్టుతప్పడంతో 207.3పాయింట్లతో నాలుగో స్థానానికి పడిపోయి, పతకాన్ని చేజార్చుకున్నాడు. రష్యాకు చెందిన గ్రిగోరిల్ షమకోవ్ 250పాయింట్లు సాధించి పసిడిని పట్టాడు. టోర్నీలో మొత్తంగా 16 పతకాలతో(7స్వర్ణాలు, 7రజతాలు, 2కాంస్యాలు) భారత్ అగ్రస్థానంలో కొనసాగుతుండగా, 13 పతకాలతో చైనా రెండో స్థానంలో ఉంది.



## భారత్, సిరియా మ్యాచ్ డ్రా

**అహ్మదాబాద్:** ఇంటర్‌కాంటినెంటల్ కప్ టోర్నీలో ఇప్పటికే రెండు మ్యాచ్‌ల్లో ఓడిపోయి ఫైనల్ రేసు నుంచి తప్పుకున్న భారత ఫుట్‌బాల్ జట్టు... మంగళవారమిక్కడ సిరియాతో జరిగిన చివరి మ్యాచ్‌ను 1-1తో డ్రా చేసుకొని ఫర్వాలేదనిపించింది. మ్యాచ్ 52వ నిమిషంలో భారత సెంట్రల్ డిఫెండర్ నరేందర్ గెహ్లాట్ గోల్ చేసి భారత్‌ను 1-0తో ఆధిక్యంలో నిలిపాడు. 78వ నిమిషంలో సిరియా ఆటగాడు ఫిరాస్ అల్ ఖతీబ్ గోల్ కొట్టి టీమ్‌ఇండియా గెలుపు ఆశలపై నీళ్లు జల్లాడు. తొలి మ్యాచ్‌లో తజకిస్థాన్‌పై 2-4తో, రెండో మ్యాచ్‌లో ఉత్తర కొరియాపై 2-5 తేడాతో పరాజయం చెంది తుదిపోరు ఆశలను ఆవిరిచేసుకున్న భారత్... ఈ మ్యాచ్‌లో సిరియాను నిలువరించి ఆ జట్టు ఫైనల్ అవకాశాలను గల్లంతు చేసింది. రెండు మ్యాచ్‌ల్లో తొమ్మిది గోల్స్ సమర్పించుకున్న టీమ్‌ఇండియా.. ఈ పోరులో మాత్రం సమర్థంగా డిఫెండ్ చేసుకుంది. భారత ప్లేయర్లు గెహ్లాట్, రాహుల్ బెకె, ప్రీతమ్ కోటల్, మాన్‌దర్ రావు దేశాయ్ ఆకట్టుకున్నారు. మ్యాచ్ 24వ నిమిషంలో సిరియాకు గోల్ చేసే అవకాశం వచ్చినా.. భారత గోల్ కీపర్ గుర్‌ప్రీత్ సింగ్ సమర్థంగా డైవ్ చేసి నిలువరించాడు. మొదటి అర్ధభాగంలో ఇరు జట్లు డిఫెండ్ చేసుకోవడంతో ఒక్కగోల్ కూడా నమోదు కాలేదు. రెండో అర్ధభాగం 52వ నిమిషంలో వచ్చిన కార్నర్ కిక్‌ను సమర్థంగా వినియోగించుకున్న నరేంద్ర గెహ్లాట్ తొలి గోల్ చేసి భారత శిబిరాన్ని ఆనందంలో ముంచెత్తాడు. ఇక టీమ్‌ఇండియా మ్యాచ్ గెలుస్తుందనుకున్న తరుణంలో 78వ నిమిషంలో సిరియా ప్లేయర్ ఖతీబ్ గోల్ కొట్టాడు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. భారత ఫుట్‌బాల్ కోచ్‌గా స్టిమాక్ బాధ్యతలు చేపట్టాక జట్టుకు ఇది ఐదో మ్యాచ్ కాగా.. ఇప్పటి వరకు ఒక్కటి మాత్రమే గెలిచి, ఈ మ్యాచ్‌ను డ్రా చేసుకుంది. ఇక కెప్టెన్ సునీల్ ఛెత్రీ ఈ టోర్నీలో ఒక్కగోల్ కూడా సాధించలేదు. ఓ టోర్నీని గోల్ చేయకుండా ముగించడం అతడికి ఇది మొదటిసారి.



| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 39,131 | 11,663 |
| ↗234 | ↗74 |

ముడి చమురు (బ్రెంట్) ↘ 64.11 డాలర్లు

| బంగారం ధరలు | న్యూఢిల్లీ (రూ.లలో) |
|---|---|
| 24 క్యారెట్లు | 35,570 |
| 22 క్యారెట్లు | 35,400 |
| వెండి (కిలో) | 39,530 |

**విదేశీ మారకం**

| కరెన్సీ | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|
| అమెరికా డాలర్ | 65.50 | 71.00 |
| యూరో | 73.50 | 80.00 |
| బహ్రెయిన్ దినార్ | 172.00 | 186.00 |
| కువైట్ దినార్ | 215.00 | 229.00 |
| సౌదీ రియాల్ | 17.00 | 18.80 |
| యూఏఈ దిర్హామ్ | 17.50 | 19.20 |

**చికెన్ ధరలు (వెన్‌కాబ్)**

| | (రూ.లలో) |
|---|---|
| ఫారం ధర | 70.00 |
| రిటైల్ లైవ్ | 92.00 |
| డ్రెస్డ్ | 133.00 |
| స్కిన్‌లెస్ | 152.00 |

**నెక్ (వంద గుడ్లకు)**

| | (రూ.లలో) |
|---|---|
| హైదరాబాద్ | 375-00 |
| రంగారెడ్డి | 375-00 |
| మెదక్ | 375-00 |
| కరీంనగర్ | 378-00 |
| వరంగల్ | 378-00 |
| రిటైల్ ప్రైస్ | 4-35 |



దుబాయ్-ఇండోర్ సర్వీసును ప్రారంభిస్తున్న ఎయిర్ ఇండియా చీఫ్ అశ్విని లోహానీ

## హైదరాబాద్-దుబాయ్‌ల మధ్య మరో ఎయిర్ ఇండియా సర్వీసు

### అక్టోబర్ 10 నుంచి అందుబాటులోకి..

**దుబాయ్, జూలై 16:** ప్రభుత్వరంగ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా విదేశీ రూట్లపై ప్రత్యేక దృష్టి సారించింది. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా సెప్టెంబర్ 28 నుంచి ఢిల్లీ-టోరంటోల మధ్య నేరుగా విమాన సర్వీసును నడపనున్నట్లు ప్రకటించింది. వీటితోపాటు నైరోబి, కెన్యాలకు కూడా వచ్చే మూడు నెలలో విమాన సర్వీసులను ప్రారంభించనున్నట్లు కంపెనీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అశ్విని లోహానీ తెలిపారు. ఇండోర్-దుబాయ్‌ల మధ్య సర్వీసును ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మధ్యప్రదేశ్ నుంచి సంస్థ నడుపుతున్న తొలి విదేశీ విమానం ఇదేనని, గల్ఫ్ దేశాలు సందర్శించే ప్రయాణికులు పెరుగుతుండటం వల్లనే ఈ సర్వీసు ఆరంభించినట్లు చెప్పారు. రూ.60 వేల కోట్లకు చేరిన కంపెనీ అప్పుపై ఆయన స్పందిస్తూ..వీటిని తగ్గించడానికి అన్ని రకాలుగా ప్రయత్నిస్తున్నట్లు, నిర్వహణ ఖర్చులు తగ్గించుకోవడానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. 162 మంది ప్రయాణికులు కూర్చోవడానికి వీలుంటే ఏ 320 నియో ఎయిర్‌క్రాఫ్ట్‌ను వారానికి మూడు రోజులు నడుపుతున్నది. ప్రస్తుతం దుబాయ్‌కి వారానికి 4,500 సీట్లు ఉండగా, వచ్చే శీతాకాలనికి ఈ సంఖ్యను 5,800కి పెంచుకోనున్నట్లు ప్రకటించారు. హైదరాబాద్‌తోపాటు కోల్‌కతా, కన్నూరు, కోచి నగరాల నుంచి నేరుగా దుబాయికి మరో విమాన సర్వీసును నడపనున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ సర్వీసు అక్టోబర్ 10 నుంచి అందుబాటులోకి రానున్నట్లు ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. కాగా, భారత్ నుంచి దుబాయ్ వెళ్లేవారు 40 కిలోల లగేజీని, హ్యాండ్ బ్యాగేజీ రూపంలో ఏడు కిలోల సామగ్రిని తీసుకెళ్లవచ్చని లోహాని చెప్పారు. ప్రస్తుతం 30 కిలోల అనుమతి ఉండగా, దీనిని మరో పది కిలోలు పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

## లిమిటెడ్ ఎడిషన్‌గా ర్యాపిడ్

### ధర రూ.6.99 లక్షలు




**న్యూఢిల్లీ, జూలై 16:** ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ స్కోడా ఆటో..మధ్యస్థాయి సెడాన్ ర్యాపిడ్‌ను లిమిటెడ్ ఎడిషన్‌గా అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ కారు ప్రారంభ ధరను రూ.6.99 లక్షలుగా నిర్ణయించింది. 1.6 లీటర్ల పెట్రోల్ ఇంజిన్‌తో తయారైన ఈ కారు.. భద్రత ప్రమాణాలను పెంచడంలో భాగంగా రెండు ఎయిర్‌బ్యాగులు, యాంటీ-లాక్ బ్రేకింగ్ సిస్టమ్, రియర్ పార్కింగ్ సెన్సార్, యాంటీ-గ్లేర్ ఇంటిరియర్ అద్దం, రియర్ విండ్‌స్క్రీన్ డిఫోగర్, సీట్ బెల్ట్‌ను అడ్జస్ట్ చేసుకునే వీలు వంటి ఫీచర్స్ ఉన్నాయని కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది.

# రూ.25 వేల కోట్ల ఆర్డర్లు!

## రాబోయే ఐదేండ్లలో సాధిస్తాం

### బీడీఎల్ స్వర్ణోత్సవ సంబురాల్లో సంస్థ సీఎండీ సిద్ధార్థ్ మిశ్రా




**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తూ.. దేశ భద్రతకు దన్నుగా నిలుస్తున్నది భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్). దేశీయ రక్షణ రంగంలో కీలకపాత్ర పోషిస్తున్న ఈ సంస్థ.. రాబోయే ఐదేండ్లలో మొత్తం రూ.25,000 కోట్ల ఆర్డర్లను అందుకుంటామన్న విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నది. ప్రస్తుతం చేతిలో రూ.8,084 కోట్ల ఆర్డర్లున్నాయంటున్న బీడీఎల్.. ఇవి 2023-24కల్లా పూర్తి కావాల్సి ఉందని తెలిపింది. ఆ తర్వాతి రెండేండ్లకుగాను మరో రూ.8 వేల కోట్ల ఆర్డర్లను చేజిక్కించుకుంటామని చెబుతున్న సంస్థ.. మొత్తం వచ్చే ఐదేండ్లలో రూ.25,000 కోట్ల ఆర్డర్లను సాధించే సత్తా ఉందన్న ధీమాను కనబరుస్తున్నది. మంగళవారం ఇక్కడ బీడీఎల్ స్వర్ణోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా సంస్థ సీఎండీ సిద్ధార్థ్ మిశ్రా విలేఖరులతో మాట్లాడుతూ.. దేశ రక్షణ వ్యవస్థ అవసరాలకు అనుగుణంగా ఆయుధాలను సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల రక్షణ వ్యవస్థలు అనుసరిస్తున్న సాంకేతికతతో పోటీపడుతూ బీడీఎల్ భారత రక్షణ దళాలకు పూర్తిస్థాయి సేవల్ని అందించడానికి అంకితమైందన్నారు. ఈ సందర్భంగా స్వర్ణోత్సవాలకు సంబంధించి లోగో, కాలర్ ట్యూన్‌ని మిశ్రా ఆవిష్కరించారు.

### 50 ఏండ్లుగా రక్షణ దళాలకు సేవ

భారత రక్షణ దళాలకు పూర్తిస్థాయి సేవల్ని అందించడానికి పునరంకితం అయ్యామని సిద్ధార్థ్ మిశ్రా అన్నారు. 1970లో బీడీఎల్ ప్రారంభమైనప్పట్నుంచి అనేక సవాళ్లను విజయవంతంగా ఎదుర్కొన్నామని, ఈ క్రమంలో ఉద్యోగులు కష్టించి పని చేశారని, విక్రేతలు చక్కటి సాయం అందించారని, డీఆర్‌డీవో నుంచి సాంకేతిక సహకారం లభించిందని గుర్తు చేశారు. దీన్నొక చారిత్రక ఘట్టంగా ఆయన అభివర్ణించారు. కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ మార్గదర్శకంలో బీడీఎల్ 50 ఏండ్లు విజయవంతంగా పూర్తి చేసుకున్నదన్నారు. బీడీఎల్ ఆరంభం కాక ముందు, రక్షణ దళానికి అవసరమయ్యే కీలక పరికరాలు విదేశాల నుంచి దిగుమతి అయ్యేవని, బీడీఎల్‌తో ఆ దిగుమతులు తగ్గుముఖం పట్టాయన్నారు. వాటిని మన దేశంలోనే బీడీఎల్ తయారు చేస్తున్నదన్నారు. 1970లో ప్రప్రథమ క్షిపణి, ఎస్ఎస్11బీ1ను భారత గడ్డపై తయారు చేసిన ఘనత బీడీఎల్‌కే దక్కిందన్న ఆయన.. ఫ్రాన్స్ సాయంతో మిలాన్ యాంటీ ట్యాంక్ గైడ్ క్షిపణుల్ని కంచన్‌బాగ్‌లో తయారు చేశామన్నారు. పటాన్‌చెరులోని భానూరులో రెండో బీడీఎల్ యూనిట్‌ను ప్రారంభించామని, రష్యా సహకారంతో కాంకూర్లను రూపొందించామని వివరించారు. భారతరత్న, మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం ఆధ్వర్యంలో రూపుదిద్దుకున్న ''ఇంటిగ్రేటెడ్ గైడెడ్ మిసైల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం'' ద్వారా బీడీఎల్‌కు పుష్కలమైన అవకాశాలు లభించాయని గుర్తుచేశారు. ఆయన సేవలకు గుర్తుగా కాంచన్‌భాగ్ యూనిట్‌లో అబ్దుల్ కలాం విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. పృథ్వీ, ఆకాశ్ వంటి క్షిపణుల్ని తయారు చేసిన ఘనత బీడీఎల్‌కే దక్కుతుందన్నారు.


ఎగ్జిబిషన్‌లో ప్రదర్శిస్తున్న మిలన్, మిలన్ 2టీ వార్‌హెడ్‌లు

### నాలుగు, ఐదో తరం క్షిపణులు

ప్రస్తుతం మూడో తరం క్షిపణులను అభివృద్ధి పరుస్తున్న బీడీఎల్.. ఇతర ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ తయారీదారుల (ఓఈఎం) సహకారంతో నాలుగు, ఐదో తరం క్షిపణులను తయారు చేయడంపై దృష్టి పెట్టింది. చాలా తక్కువ దూరం లక్ష్యాల చేధన క్షిపణుల తయారీ కోసం మహారాష్ట్రలోని అమరావతిలో ప్లాంట్ ఏర్పాటుకు భూమిని సమీకరించామని మిశ్రా తెలిపారు. ఇది మొదలైతే ఆర్డర్లు వెల్లువెత్తగలవన్న ఆశాభావాన్ని వెలిబుచ్చారు. హైదరాబాద్, భానూర్, ఇబ్రహీంపట్నంలలో యూనిట్లున్న బీడీఎల్‌కు.. విశాఖపట్నంలోనూ మరో ప్లాంట్ ఉన్నది. ప్రస్తుతం మిలాన్-2టీ పేరుతో యాంటీ-ట్యాంక్ గైడెడ్ క్షిపణులు, కొంకూర్స్ ఎం, ఇన్వార్, ఆకాశ్ వంటి ఎస్ఏఎంలు, ఎంఆర్ఎస్ఏఎం, తేలికపాటి బరువుగల టార్పెడోల వంటి జలాంతర ఆయుధాలు, బరువుగల టార్పెడో (వరుణాస్త్ర)లు, సీ 303, భారతీయ వైమానిక దళ ఎయిర్‌క్రాఫ్ట్‌ల కోసం కౌంటర్ మేజర్స్ డిస్పెన్సింగ్ వ్యవస్థలను బీడీఎల్ తయారు చేస్తున్నది. నావికా దళానికి తేలికపాటి బరువు గల టార్పెడోలను అందిస్తున్నామన్నారు. అలాగే మల్టీరోల్ ఎయిర్ డిఫెన్స్ క్షిపణులను, డీఆర్‌డీవో, ఐఏఐ, ఇజ్రాయెల్‌ల భాగస్వామ్యంతో మధ్య శ్రేణి గగనతల-వాయు క్షిపణిని తయారు చేస్తున్నామని మిశ్రా చెప్పారు. కేంద్ర ప్రభుత్వం, రక్షణ శాఖల నుంచి పూర్తిస్థాయి సహకారం అందుతున్నదన్న ఆయన బీడీఎల్ విస్తరణ పనులను వేగవంతం చేసినట్లు తెలియజేశారు.


గోల్డెన్ జూబ్లీ సందర్భంగా నివేదికను విడుదల చేస్తున్న బీడీఎల్ సీఎండీ సిద్ధార్థ్ మిశ్రా. చిత్రంలో టెక్నికల్ డైరెక్టర్ దివాకర్, ప్రొడక్షన్ డైరెక్టర్ పీ రాధాకృష్ణ తదితరులు

### త్వరలో టీ-హబ్‌తో ఒప్పందం

స్టార్టప్‌ల కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఆవిష్కరించిన టీ-హబ్‌తో త్వరలో ఎంవోయూను కుదుర్చుకుంటున్నట్లు మిశ్రా ఈ సందర్భంగా ప్రకటించారు. సంస్థ దిగుమతులకు అనుగుణంగా ఉన్న వివిధ స్టార్టప్‌లతో కలిసి పనిచేయనున్నట్లు చెప్పారు. అంతేగాక ఉత్పత్తిలో పెద్ద ఎత్తున సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థ (ఎంఎస్ఎంఈ)లను భాగస్వాములుగా చేస్తున్నామని వివరించారు. బీడీఎల్ తాజా ప్రకటనతో సంస్థతో తెలంగాణకున్న బంధం మరింత బలపడనున్నది. రాష్ట్రంలో ఇప్పటికే మూడు యూనిట్లను కలిగి ఉన్న ఈ సంస్థ.. ఇక్కడి స్టార్టప్‌లకూ ఊతమివ్వడం ఆహ్వానించదగ్గ పరిణామంగా పలువురు స్టార్టప్ నిర్వాహకులు అభిప్రాయపడుతున్నారు. కాగా, గత ఆర్థిక సంవత్సరం (2018-19) సంస్థ టర్నోవర్ రూ.3,069 కోట్లుగా ఉన్నట్లు బీడీఎల్ ఫైనాన్స్ విభాగం డైరెక్టర్ ఎస్ పిరమనయాగం తెలిపారు.

## ఫెడరల్ బ్యాంక్ లాభాల్లో భారీ వృద్ధి

- దన్నుగా నిలిచిన ఫీజు ఆదాయం

**ముంబై, జూలై 16:** ప్రైవేట్ రంగ ఆర్థిక సేవల సంస్థ ఫెడరల్ బ్యాంక్ ఆశాజనక ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. జూన్ 31తో ముగిసిన తొలి త్రైమాసికానికిగాను బ్యాంక్ రూ.384.21 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. నాన్-కోర్ ఆదాయం, ఆస్తుల నాణ్యత నిలకడగా ఉండటంతో గతేడాది నమోదైన లాభంతో పోలిస్తే 46.25 శాతం వృద్ధిని కనబరిచింది. సమీక్షకాలంలో నికర వడ్డీ ఆదాయం 17.77 శాతం పెరిగి రూ.1,154 కోట్లకు చేరుకున్నది. ఇతర మార్గాల ద్వారా రావాల్సిన ఆదాయంలో 44.5 శాతం పెరిగి రూ.391.52 కోట్లకు చేరుకున్నట్లు బ్యాంక్ ఎండీ, సీఈ శ్యామ్ శ్రీనివాసన్ తెలిపారు. గత త్రైమాసికంలో రూ.415 కోట్ల రుణాలు మొండి బకాయిలు జాబితాలోకి చేరాయని, వీటిలో ఐఎల్ అండ్‌ఎఫ్ఎస్‌కు ఇచ్చిన రూ.32 కోట్లు ఉన్నట్లు ఆయన వెల్లడించారు. ఇదే సమయంలో రూ.300 కోట్ల బకాయిలను వసూలు చేసినట్లు చెప్పారు. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 2.99 శాతానికి తగ్గగా, నికర ఎన్‌పీఏ 1.49 శాతం నుంచి 1.72 శాతానికి పెరిగాయి. స్టాక్ మార్కెట్ ముగిసే సమయానికి బ్యాంక్ షేరు ధర స్వల్పంగా పెరిగి రూ.107.35 వద్ద ముగిసింది.

## ఐఎంఎఫ్‌కు లగార్డే గుడ్‌బై

**వాషింగ్టన్, జూలై 16:** ఫ్రెంచ్ రాజకీయవేత్తగా మారిన క్రిస్టిన్ లగార్డే..అంతర్జాతీయ ద్రవ్యనిధి(ఐఎంఎఫ్) మేనేజింగ్ డైరెక్టర్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ రాజీనామా సెప్టెంబర్ 12 నుంచి అమలులోకి రానున్నది. యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ ప్రెసిడెంట్‌గా ఆమెను నియమిస్తూ యూరోపియన్ కౌన్సిల్ నిర్ణయం తీసుకోవడంతో ఈ పదవి నుంచి తప్పుకున్నారు. ఆమె రాజీనామాను ఐఎంఎఫ్ ఎగ్జిక్యూటివ్ బోర్డు ఆమోదించింది కూడా. ఎగ్జిక్యూటివ్ బోర్డు సభ్యులను కలుసుకొని తన రాజీనామాను సమర్పించినట్లు ఒక ప్రకటనలో ఆమె వెల్లడించారు. దీంతో డేవిడ్ లిప్టన్ నూతన ఐఎంఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరించనున్నారు.

# ఎన్‌పీఏలు తగ్గుతున్నాయ్!

### గత ఆర్థిక సంవత్సరం బ్యాంకుల్లో తగ్గిన రూ.1.02 లక్షల కోట్లు ▪ కేంద్ర ఆర్థిక మంత్రి సీతారామన్ వెల్లడి



**న్యూఢిల్లీ, జూలై 16:** వాణిజ్య బ్యాంకుల మొండి బకాయిలు (నిరర్థక ఆస్తులు లేదా ఎన్‌పీఏ) గత ఆర్థిక సంవత్సరం (2018-19) రూ.1.02 లక్షల కోట్లు తగ్గాయని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యల ఫలితంగా ఈ ఏడాది మార్చి 31 నాటికి స్థూల నిరర్థక ఆస్తులు రూ.9.34 లక్షల కోట్లకు దిగివచ్చాయని మంగళవారం రాజ్యసభలో లిఖితపూర్వక సమాధానంగా సీతారామన్ చెప్పారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) వివరాల ప్రకారం షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకుల మొండి బకాయిలు గతేడాది మార్చి ఆఖరున గరిష్ఠంగా రూ.10,36,187 కోట్లుగా ఉంటే.. ఈ ఏడాది మార్చి చివరిన రూ.9,33,625 కోట్లుగా నమోదైయ్యాయని పేర్కొన్నారు. ఏడాది కాలంలో రూ.1,02,562 కోట్లు తగ్గాయని మంత్రి స్పష్టం చేశారు. ఎన్‌పీఏలను పారదర్శకంగా గుర్తించేందుకు తమ ప్రభుత్వం నాలుగు అంచెల వ్యూహాన్ని అవలంభిస్తున్నదన్నారు. రిజల్యూషన్, రికవరీ, రీ-క్యాపిటలైజేషన్, రిఫార్మ్‌ల పేరుతో ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రక్షాళన చేస్తున్నట్లు వివరించారు. బ్యాంకింగ్ రంగంలో సంస్కరణల అమలుతోపాటు, ఆర్థికంగా బలహీన బ్యాంకులకు మూలధన సాయం, మొండి బకాయిలు ఎక్కువగా ఉన్న బ్యాంకుల్లో ఒత్తిడితో ఉన్న ఆస్తుల విక్రయం ద్వారా రుణాల వసూళ్లు, దివాలా తీర్మానం ప్రక్రియలతో ముందుకెళ్తున్నట్లు చెప్పారు.

**మోసాల్లో ఐసీఐసీఐ టాప్**

2018-19 ఆర్థిక సంవత్సరంలో రూ.లక్ష, అంతకుమించిన మొత్తాలతో కూడిన మోసాలను ఐసీఐసీఐ బ్యాంక్ ఎక్కువగా నివేదించిందని సీతారామన్ ఈ సందర్భంగా తెలిపారు. 374 మోసాలను ఈ ప్రైవేట్ రంగ బ్యాంక్ రిపోర్టు చేసిందని చెప్పారు. ఆ తర్వాతి స్థానాల్లో కొటక్ మహీంద్రా బ్యాంక్ (338), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (273), ఎస్బీఐ (273), యాక్సిస్ బ్యాంక్ (195), అమెరికన్ ఎక్స్‌ప్రెస్ బ్యాంకింగ్ కార్పొరేషన్ (190) ఉన్నాయన్నారు. బ్యాంకింగ్ మోసాలను అరికట్టేందుకు తగిన చర్యలు చేపడుతూనే ఉన్నామన్న ఆమె నేరాభియోగాలు మోపుతున్నామని, పరారీ ఆర్థిక నేరగాళ్ల చట్టాన్ని తెచ్చామని, సెంట్రల్ ఫ్రాడ్ రిజిస్ట్రీ ఏర్పాటు చేశామని, రుణ ఎగవేతదారుల కోసం ప్రభుత్వ రంగ బ్యాంకుల అధిపతుల సూచనల మేరకు లుకౌట్ నోటీసులూ జారీ చేస్తున్నామని చెప్పుకొచ్చారు. ఈ క్రమంలోనే గడిచిన నాలుగు ఆర్థిక సంవత్సరాల్లో రికార్డు స్థాయిలో రూ.4,01,424 కోట్లను రికవరీ చేశామని చెప్పారు.

### ఎడాపెడా పన్నుల ఎగవేత

వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) అమలు తర్వాత గత ఆర్థిక సంవత్సరంలో రూ.37,946 కోట్ల మోసాలను, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2019-20) తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో రూ.6,520 కోట్ల మోసాలను పన్ను అధికారులు కనుగొన్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి అనురాగ్ ఠాకూర్ రాజ్యసభకు ఓ లిఖితపూర్వక సమాధానంగా చెప్పారు. నకిలీ ఇన్వాయిస్‌లు తదితర వాటి సాయంతో పన్నుల ఎగవేతలకు పాల్పడ్డారని వివరించారు. కాగా, ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో రూ.25 కోట్లు అంతకుమించిన రుణాల ఎగవేతలపై స్పందిస్తూ ఆర్బీఐ వివరాల ప్రకారం 1,938 కేసులున్నాయన్నారు.

## హైదరాబాద్ విమానాశ్రయానికి ఎఫ్‌టీసీసీఐ ఎక్సలెన్స్ అవార్డు


సీఎస్ఆర్ కింద ఎఫ్‌టీసీసీఐ ఎక్సలెన్స్ అవార్డును హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్ర చేతుల మీదుగా అందుకుంటున్న జీఎంఆర్ అధికారులు

**శంషాబాద్, జూలై 16:** జీఎంఆర్ హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం లిమిటెడ్(జీహెచ్ఐఏఎల్) కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటి (సీఎస్ఆర్) విభాగమైన జీఎంఆర్‌విఎఫ్( జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్) ద్వారా చేపడుతున్న కార్యక్రమాలకుగాను ప్రతిష్ఠాత్మక ఎఫ్‌టీసీసీఐ( ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ) ఎక్సలెన్స్ అవార్డు లభించింది. ఇటీవల నగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్ర చేతుల మీదుగా జీఎంఆర్, జీహెచ్ఐఏఎల్ అధికారులు అందుకున్నట్లు కంపెనీ అధికార ప్రతినిధి తెలిపారు. ఈ సందర్భంగా ఎఫ్‌టీసీసీఐ వర్గాలు మాట్లాడుతూ.. సామాజిక సేవాకార్యక్రమాలతో పరిసరాలలో ఎంతో మార్పు తీసుకొచ్చిందని అభినందించారు. ఎయిర్‌పోర్టు సీఈఓ ఎస్‌జీకే కిశోర్ మాట్లాడుతూ..ఈ అవార్డు లభించడం గర్వంగా ఉందని, భవిష్యత్‌లో మరింత బాధ్యతగా పనిచేస్తూ సామాజిక సేవలో మరింత ముందుకు వెళ్లనున్నట్లు ఆయన వివరించారు. ఎయిర్‌పోర్టు పరిసరాలలో విద్య, సామాజిక, గ్రామీణాభివృద్ధి, ఉద్యోగ, ఉపాధి రంగాలలో ఉచిత శిక్షణతో పాటు అన్ని విధాల ప్రోత్సహిస్తుందని తెలిపారు.

## టాటా గ్రూపే టాప్

### దేశీయ అత్యంత విలువైన బ్రాండ్లలో ఈ ఏడాదీ అగ్రస్థానం

### తర్వాతి స్థానాల్లో ఎల్ఐసీ, ఇన్ఫోసిస్



**ముంబై, జూలై 16:** అత్యంత విలువైన దేశీయ బ్రాండ్లలో టాటా గ్రూప్ మరోసారి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. వరుసగా రెండో ఏడాదీ టాప్-100 సంస్థల్లో అగ్రస్థానంలో నిలిచింది. ఈ ఏడాదికిగాను విడుదలైన తాజా జాబితాలో 19.60 బిలియన్ డాలర్ల (సుమారు రూ.1.40 లక్షల కోట్లు)తో టాటా గ్రూప్ బ్రాండ్ విలువ టాప్‌లో స్థిరపడింది. గతేడాది 14.23 బిలియన్ డాలర్లతో టాటా ప్రథమ స్థానంలో ఉండగా, ఈ ఏడాది మరో 5.37 బిలియన్ డాలర్ల విలువను పెంచుకుని తన స్థానాన్ని పదిలపరుచుకున్నది. 2018 కంటే 2019లో టాటా గ్రూప్ బ్రాండ్ విలువ 37 శాతం ఎగిసింది. బ్రిటన్‌కు చెందిన బ్రాండ్ ఫైనాన్స్ మంగళవారం ఈ లిస్టును ఆవిష్కరించింది. ఇందులో ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం ఎల్ఐసీ రెండో స్థానంలో ఉండగా, దీని విలువ 7.32 బిలియన్ డాలర్లు. నిరుడుతో పోల్చితే సంస్థ బ్రాండ్ విలువ 22.8 శాతం ఎగబాకింది. మూడో స్థానంలో ఇన్ఫోసిస్ (6.50 బిలియన్ డాలర్లు) ఉంటే, దీని విలువ గతం కంటే 7.7 శాతం పెరిగింది. నాలుగో స్థానంలో ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్బీఐ (5.97 బిలియన్ డాలర్లు) ఉన్నది. ఎస్బీఐ బ్రాండ్ వాల్యూ ఏడాదిలో 34.4 శాతం వృద్ధి చెందగా, 35.5 శాతం బ్రాండ్ విలువను పెంచుకుని మహీంద్రా గ్రూప్ (5.24 బిలియన్ డాలర్లు) ఐదో స్థానాన్ని పొందింది. టాప్-10లో మిగతా ఐదు సంస్థల విషయానికొస్తే.. వరుసగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (4.84 బిలియన్ డాలర్లు), భారతీ ఎయిర్‌టెల్ (4.79 బిలియన్ డాలర్లు), హెచ్‌సీఎల్ (4.64 బిలియన్ డాలర్లు), రిలయన్స్ (4.54 బిలియన్ డాలర్లు), విప్రో (4 బిలియన్ డాలర్లు) ఉన్నాయి. టాప్-25 సంస్థల్లో టాటా స్థాయిలో ఏ సంస్థ కూడా తమ బ్రాండ్ విలువను పెంచుకోలేదని జాబితా రూపకర్త బ్రాండ్ ఫైనాన్స్ అన్నది.

**56వ స్థానంలో అనిల్ అంబానీ గ్రూప్**

పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయి.. ఒక్కో వ్యాపారాన్ని అమ్ముకుంటున్న అనిల్ ధీరూభాయ్ అంబానీ గ్రూప్.. తాజా జాబితాలో 56వ స్థానానికి పడిపోయింది. గతేడాదితో పోల్చితే 28 స్థానాలు దిగజారింది. ఏడాది కాలంలో బ్రాండ్ విలువ 65 శాతం క్షీణించి 559 మిలియన్ డాలర్లకు పరిమితమైంది.

## అల్ట్రాటెక్, విక్టరీలకు బీఐఎస్ లైసెన్స్‌లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దేశంలో మొదటిసారిగా తాడిపత్రిలోని అల్ట్రాటెక్ సిమెంట్, హైదరాబాద్‌లోని విక్టరీ మ్యాట్రిసిస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలకు లైసెన్స్‌లు మంజూరుచేసినట్టు భారతీయ ప్రమాణాల మండలి (బీఐఎస్) హైదరాబాద్‌శాఖ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. హైదరాబాద్‌లోని బీఐఎస్ కార్యాలయంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో బీఐఎస్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సురీనరాజన్ ఈ లైసెన్స్‌లను అందజేశారు. అల్ట్రాటెక్ సిమెంట్ లిమిటెడ్‌కు సిమెంట్ తయారీలో వాడే గ్రౌండ్ గ్రాన్యులేటెడ్ బ్లాస్ట్‌ఫర్నేస్ స్లాగ్ అనే ఉత్పాదన తయారీకి లైసెన్స్ వచ్చింది. ఈ స్లాగ్ వాడకం వల్ల సిమెంట్ పరిశ్రమలో సున్నపురాయి, శిలాజ జనిత ఇంధనాల వంటి వనరులు ఆదా అవుతాయని, తద్వారా ఉత్పత్తి వ్యయం తగ్గుతుందని తెలిపింది. విక్టరీ మ్యాట్రిసిస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు బెడ్‌మ్యాట్రిస్ అకార్డింగ్ టు ఇంటియన్ స్టాండర్డ్ ఐఎస్ 13489: 2000 అనే ఉత్పత్తికి లైసెన్స్ ఇచ్చినట్టు బీఐఎస్ వెల్లడించింది.

## రిలయన్స్ తెచ్చిన ఉత్సాహంతో..

### 234 పాయింట్లు లాభపడిన సూచీ



**ముంబై, జూలై 16:** దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో రోజు లాభాల్లో ముగిశాయి. బ్లూచిప్ కంపెనీల షేర్లను కొనుగోలు చేయడానికి మదుపరులు ఎగబడటం, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలు కూడా తోడవడంతో సూచీలు ఎగువముఖం పట్టాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్, యెస్ బ్యాంక్, టాటా మోటర్స్‌లు ఇచ్చిన దన్నుతో 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 234.44 పాయింట్లు లాభపడి 39,131.04 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 39,173.89 పాయింట్ల వద్దకు చేరుకున్న సూచీ ఒక దశలో 38,845.27లకు పడిపోయింది. జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ మరో 72.70 పాయింట్లు అందుకొని 11,661.05 వద్ద ముగిసింది. మార్కెట్లో అత్యధికంగా యెస్ బ్యాంక్ 11.48 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది. బ్యాంక్‌లో వాటాను కొనుగోలు చేయడానికి ప్రైవేట్ ఈక్విటీ సంస్థ ఆసక్తి చూపుతున్నట్లు వచ్చిన వార్తలు బ్యాంక్ షేరు ధర భారీగా పుంజుకోవడానికి దోహదం చేసింది. వీటితోపాటు టాటా మోటర్స్ 5.53 శాతం లాభపడింది. టాటాకు చెందిన బ్రిటిష్ బ్రాండ్ జేఎల్ఆర్ సెక్యూర్డ్ రుణానికి గ్యారెంటీగా ఉంటామని బ్రిటన్ ప్రభుత్వం ప్రకటించడం ఇందుకు కారణం. వీటితోపాటు సన్ ఫార్మా, ఎన్టీపీసీ, పవర్‌గ్రిడ్, టాటా స్టీల్, యాక్సిస్ బ్యాంక్, ఎల్ అండ్ టీ, హెచ్‌యూఎల్, ఏషియన్ పెయింట్స్, ఆర్ఐఎల్, ఎస్బీఐల షేర్లు మూడు శాతం వరకు బలపడ్డాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ఆశాజనక ఫలితాలను ప్రకటించడంతో ఇన్ఫోసిస్ షేరు ధర వరుసగా రెండో రోజు కూడా 0.71 శాతం లాభపడింది. దివాన్ హౌజింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ పతనానికి బ్రేక్‌పడింది. సోమవారం భారీగా నష్టపోయిన కంపెనీ షేరు ధర ఆ మరుసటి రోజు నాలుగు శాతం లాభపడింది. మరోవైపు టీసీఎస్, మహీంద్రా అండ్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్, కోటక్ బ్యాంక్, టెక్‌మహీంద్రా, భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లు రెండు శాతం వరకు మార్కెట్‌వాటాను కోల్పోయాయి. రంగాలవారీగా చూస్తే రియల్టీ, ఆయిల్ అండ్ గ్యాస్, కన్జ్యూమర్ డ్యూరబుల్, పవర్, యుటిలిటీస్, ఎనర్జీ, క్యాపిటల్ గూడ్స్‌ల షేర్లు లాభాల్లో ముగియగా.. ఐటీ, టెక్‌ల షేర్లు నష్టాల బాట పట్టాయి.

**రూపాయి 17 పైసలు డౌన్**

డాలర్‌తో పోలిస్తే రూపాయి 17 పైసలు క్షీణించి 68.71 వద్ద ముగిసింది. గ్లోబల్ మార్కెట్లో ఇంధన ధరలు భగ్గుమనడం, విదేశీ నిధుల ప్రవాహం పెరుగడం రూపాయి పతనానికి ఆజ్యం పోశాయి.

# ఖనిజాభివృద్ధి సంస్థ ఘనకీర్తి

- రూ.500 కోట్ల నుంచి రూ.2,200 కోట్లకు పయనం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఇసుక పాలసీ దేశానికే ఆదర్శంగా నిలిచింది. 2007 నుంచి 2014 వరకు ఇసుకపై కేవలం రూ.39.69 కోట్లుగా ఉన్న ఆదాయం రాష్ట్ర ప్రభుత్వ విప్లవాత్మక చర్యల కారణంగా అమాంతం పెరిగింది. తొలి రెండేండ్లలోనే రూ.535.43 కోట్ల ఆదాయాన్ని ఆర్జించిన తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థకు.. 2016 నుంచి 2019 జులై 10 వరకు మరో రూ.2,207 కోట్ల ఆదాయం లభించింది. దీంతో ఇసుక ద్వారా ఇప్పటివరకు మొత్తం రూ.2,753 కోట్ల ఆదాయం ప్రభుత్వ ఖజానాలోకి చేరింది. తెలంగాణవ్యాప్తంగా 80కిపైగా స్టాక్‌యార్డులను నెలకొల్పిన రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ గత నాలుగేండ్లలో 4.30 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను సరఫరాచేసి రికార్డు సృష్టించడంతోపాటు ఐఎస్వో 9001- 2015 గుర్తింపును పొందింది. మరోవైపు మంచిర్యాల జిల్లా దేవాపూర్‌లో 797 హెక్టార్ల సున్నపురాయి గనులను ఓరియంట్ సంస్థకు లీజుకివ్వడంతో ఆ సంస్థ రూ.2,000 కోట్ల పెట్టుబడి పెట్టింది. దీంతో దాదాపు 4 వేల కుటుంబాలకు ప్రత్యక్షంగా జీవనోపాధి లభించనున్నది.

### మరింత ఆదాయంపై దృష్టి



ప్రభుత్వానికి మరింత ఆదాయాన్ని సమకూర్చడంపైనే దృష్టిసారిస్తున్నాం. సీఎం కేసీఆర్ సహకారంతో తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థను దేశంలోనే అత్యున్నత ప్రమాణాలు కలిగిన సంస్థగా నిలిపాను. సంస్థ చైర్మన్‌గా మూడేండ్లు పూర్తిచేసుకున్నందుకు ఆనందంగా ఉన్నది.

**- శేరి సుభాష్‌రెడ్డి, చైర్మన్, తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ**



### తెలుగువారంతా ప్రేమతో కలిసుందాం

తెలుగు రాష్ట్రాల్లోని ప్రజలంతా అన్నదమ్ముల్లా ప్రేమతో కలిసి ఉండాలని ఎంపీలు ఆకాంక్షించారు. మంగళవారం ఢిల్లీలోని తెలంగాణభవన్‌లో ఢిల్లీ తెలుగు అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో లోక్‌సభాపక్ష నేత నామా నాగేశ్వరరావు, ఎంపీలు రాములు, కొత్త ప్రభాకర్ రెడ్డి, వెంకటేశ్‌నేతతోపాటు పలువురు ఏపీ ఎంపీలు పాల్గొన్నారు. **– హైదరాబాద్, నమస్తే తెలంగాణ**





ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఓయూ వీసీ ప్రొఫెసర్ రామచంద్రం, టీఎస్ఎస్‌పీడీసీఎల్ డైరెక్టర్ పర్వతం

## ఓయూతో ఎస్పీడీసీఎల్ ఒప్పందం

**ఉస్మానియా యూనివర్సిటీ:** తెలంగాణ స్టేట్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టీఎస్ ఎస్పీడీసీఎల్).. ఉస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలోని ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగంతో పలు అంశాలపై అవగాహనా ఒప్పందాన్ని కుదుర్చుకుంది. అత్యంత ప్రాధాన్యమున్న ఈ ఎంఓయూపై ఓయూ వీసీ ప్రొఫెసర్ రామచంద్రం సమక్షంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గోపాల్‌రెడ్డి, టీఎస్ ఎస్పీడీసీఎల్ హెచ్చార్డీ సీజీఎం ఏజీ సతీశ్‌కుమార్ సంతకాలు చేశారు. అనంతరం ఓయూ వీసీ, టీఎస్ ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ జీ పర్వతం ఆ ఒప్పంద పత్రాలను పరస్పరం మార్చుకున్నారు. ఈ సందర్భంగా ఓయూ వీసీ మాట్లాడుతూ.. ఈ ఒప్పందాన్ని చారిత్రాత్మకమైనదిగా అభివర్ణించారు. ఓయూ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం, సెంట్రల్ పవర్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (సీపీటీఐ) మధ్య స్టూడెంట్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమాన్ని చేపట్టేందుకు వీలుకల్పించే ఈ ఒప్పందం రాష్ట్ర విద్యుత్ రంగానికి ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఓయూ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ జీ మల్లేశం మాట్లాడుతూ.. ఈ ఒప్పందంలో భాగంగా ఏటా శిక్షణా కార్యక్రమాలు, వర్క్‌షాప్‌లు నిర్వహిస్తామన్నారు.

## 22 నుంచి తెలంగాణ కవితా సప్తాహం

- దాశరథి, సినారె జయంత్యుత్సవాల సందర్భంగా కవి సమ్మేళనాలు,
- తెలంగాణ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో మహాకవులకు నివాళి

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** తెలంగాణ సాహితీ దిగ్గజాలు దాశరథి కృష్ణమాచార్య, సింగిరెడ్డి నారాయణరెడ్డి జయంత్యుత్సవాలను పురస్కరించుకొని ఈ నెల 22 నుంచి 29వ తేదీ వరకు తెలంగాణ కవితా సప్తాహాన్ని నిర్వహించనున్నట్టు తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి తెలిపారు. హైదరాబాద్ రవీంద్రభారతి ప్రాంగణంలోని తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ సాహిత్య చరిత్రలో గుర్తు పెట్టుకోదగిన అత్యంత ప్రధానమైన మాసం జూలై అని చెప్పారు. తెలంగాణ ఆధునిక సాహిత్యకారుల్లో సుప్రసిద్ధులైన డాక్టర్ దాశరథి కృష్ణమాచార్య, డాక్టర్ సీ నారాయణరెడ్డి జయంతి ఈ మాసంలోనే ఉన్నదని, దాశరథి జూలై 22న జన్మిస్తే, సినారె ఈ నెల 29న జన్మించారని గుర్తు చేశారు. మొత్తంగా ఎనిమిదిరోజుల వ్యవధి ఉన్నందున 'తెలంగాణ కవితా సప్తాహం'గా వేడుకను నిర్వహించనున్నామని తెలిపారు. సాహిత్యాభిమానులంతా ఈ కార్యక్రమాలకు హాజరుకావాలని కోరారు. ఈ నెల 22న 'మహాకవి దాశరథి జీవితం – కవిత్వం'పై పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షులు ఆచార్య అనుమాండ్ల భూమయ్య ప్రత్యేక ప్రసంగం చేయనున్నారు.

# నైజీరియన్లపై నజర్!



- అక్రమ నివాసంపై పోలీసుల దృష్టి
- హైదరాబాద్‌లో వీసా గడువుదాటి ఉంటున్న 93 మంది విదేశీయుల పాస్‌పోర్టులు రద్దు
- డ్రగ్స్ మాఫియా, సైబర్ నేరాల నేపథ్యంలో వివరాలు సేకరిస్తున్న పోలీస్‌శాఖ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్‌లో అక్రమంగా నివసిస్తున్న నైజీరియన్లపై పోలీస్ శాఖ నజర్ పెట్టింది. నగరంలో ఎక్కడ డ్రగ్స్ పట్టుబడుతున్నా నైజీరియన్లే కీలక నిందితులుగా ఉంటున్నారని విచారణలో తేలడంతో.. వారిపై ప్రత్యేకంగా దృష్టిసారించింది. మయన్మార్ రోహింగ్యాలు, బంగ్లాదేశీ అక్రమ వలసదారులతోపాటు నైజీరియన్లు, ఇతర విదేశీయులుండే ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తూ వారి వివరాలు సేకరిస్తున్నది. అందులోభాగంగా మంగళవారం దాదాపు 15 ప్రాంతాల్లో హైదరాబాద్ పోలీసులు ప్రత్యేకంగా డ్రైవ్ నిర్వహించారు. 70 మంది విదేశీయులను విచారించగా, 23 మంది వీసా గడువు ముగిసిన తర్వాత కూడా అక్రమంగా ఉంటున్నట్టు గుర్తించామని సీపీ అంజనీకుమార్ తెలిపారు. ఇప్పటికే అక్రమంగా హైదరాబాద్‌లో ఉంటున్న 93 మంది విదేశీయులను గుర్తించి వారి పాస్‌పోర్టులను సైతం రద్దు చేసినట్టు హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి ఇటీవల మీడియాతో చెప్పారు. దక్షిణాఫ్రికా, కెన్యా, నైజీరియా వంటి దేశాల నుంచి ఉన్నతవిద్య, పర్యాటకం, వ్యాపారం పేరిట భారత్‌లోకి ప్రవేశిస్తున్న నైజీరియన్లు, క్రమంగా దేశంలోని పెద్ద పెద్ద నగరాలను అడ్డాగా మత్తుమందుల వ్యాపారం చేస్తున్నారు.

### అమాయకులపై సైబర్ వల

- రాష్ట్రంలో నమోదవుతున్న సైబర్‌నేరాల వెనుక నైజీరియన్ల హస్తం ఉంటున్నది. అమాయకులైన కస్టమర్లకు ఫోన్ చేసి క్రెడిట్‌కార్డు, డెబిట్‌కార్డుల వివరాలను తెలుసుకోవడం.. తర్వాత వాటిని క్లోనింగ్ చేసి డబ్బు కొల్లగొట్టే స్థాయినుంచి ఫిషింగ్ మెయిల్స్ పంపేవరకు వీరి నేర విధానం ఎప్పటికప్పుడు మారుతున్నది.
- ఫేక్ మెయిల్ ఐడీలు, ఫేస్‌బుక్ అకౌంట్లు, ఇన్‌స్టాగ్రాం అకౌంట్లు సృష్టించి వాటిలో అందమైన అమ్మాయిల ఫొటోలను పెట్టి కవ్విస్తున్నారు. చాటింగ్‌లోకి దింపి, అవసరాలు ఉన్నాయని, విదేశాల నుంచి ఖరీదైన బహుమతులు పంపాను.. కస్టమ్ డ్యూటీ కట్టాలని, విదేశాల్లోజాబ్స్ ఇప్పిస్తామని ఇలా రకరకాలుగా మోసాలకు పాల్పడుతున్నారు.
- హైదరాబాద్ నుంచి గతేడాది నైజీరియన్లు పెండ్లిండ్ల పేరిట రూ.1.87 కోట్ల వరకు మోసగించినట్టు సమాచారం.

### మత్తుపదార్థాల రవాణా

- నైజీరియన్లు తొలుత ఏవేవో కారణాలతో ఇండియాకు వచ్చినా, ఆ తర్వాత అంతా కలిసి ఒకచోట ఉంటున్నారు.
- కొకైన్, బ్రౌన్‌షుగర్ వంటి మాదకద్రవ్యాలను విమానాలు, ఓడల ద్వారా గుట్టుచప్పుడు కాకుండా దేశంలోకి తెస్తున్నారు.
- స్థానిక పరిస్థితులను అర్థం చేసుకుని.. పోలీస్ నిఘాపై ఆరాతీస్తున్నారు. డ్రగ్స్ తీసుకొనే యువత ప్రాథమిక సమాచారం తెలుసుకొని వారికి విక్రయిస్తున్నారు.
- విదేశాల్లో ఉండే డ్రగ్స్ ముఠాలు బెంగళూరు, చెన్నై కేంద్రంగా డ్రగ్స్‌ను ఇండియాకు చేరవేస్తున్నాయి. అక్కడి నుంచి లోకల్‌గా వాటిని విక్రయించేవారు మరొకరు ఉంటారు. అంతా కమీషన్ ప్రాతిపదికన వ్యాపారం చేస్తుంటారు.
- గతంలో సెలబ్రిటీ సర్కిళ్లలో మాత్రమే అలవాటైన డ్రగ్స్‌కు ఇప్పుడు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, విద్యార్థుల బానిసలవుతుండటంతో నైజీరియన్లకు కస్టమర్ల సంఖ్య ఎక్కువై వ్యాపారం ఏటేటా పెరుగుతున్నది.
- హైదరాబాద్‌లో వీకెండ్ పార్టీ కల్చర్ పెరుగడంతో ఈవెంట్లు, రేవ్‌పార్టీలకు ఈ ముఠాలే సమకూరుస్తున్నాయి.
- పోలీసులకు పట్టుబడినా పెద్దమొత్తంలో డ్రగ్స్ దొరకకుండా, తెచ్చిన సరుకును గ్రాముల చొప్పున ప్రత్యేకంగా ప్యాకింగ్ చేసి, దగ్గరలో ఉన్న నైజీరియన్ల అందరి దగ్గర పెట్టుకుంటారు. ఒకవేళ ఎవరినైనా పోలీస్, ఎక్సైజ్ వాళ్లు పట్టుకున్నా కొద్దిమొత్తంలోనే సరుకు దొరుకుతుందన్నది వీరి ప్లాన్.

### ప్రత్యేకంగా దృష్టిపెట్టిన పోలీసులు

ఎక్కువ డ్రగ్స్ కేసులు, సైబర్ నేరాల్లో ఆఫ్రికన్ దేశాలకు చెందినవారు ఉంటుండటంతో తెలంగాణ పోలీసులు ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. తరచూ నిర్వహించే కార్డన్‌సెర్చ్‌లే కాకుండా హైదరాబాద్‌లో విదేశీయులు, ప్రధానంగా ఆఫ్రికన్లు ఎక్కడెక్కడ ఉంటున్నారన్న సమాచారం ఆధారంగా ఆయా ప్రాంతాల్లో డోర్ టు డోర్ వెళ్లి మరీ పత్రాలు పరిశీలిస్తున్నారు.

**రాష్ట్రంలో నైజీరియన్లపై నమోదైన డ్రగ్స్, సైబర్ నేరాల కేసుల సంఖ్య**

| ఏడాది | కేసులు |
|---|---|
| 2014 | 98 |
| 2015 | 104 |
| 2016 | 124 |
| 2017 | 136 |
| 2018 | 143 |

# ఆయిల్‌పాం సాగుకు అనుకూలం

- 6 .75 లక్షల ఎకరాలను గుర్తించిన ఉద్యానశాఖ
- 204 మండలాల్లో సాగుకు యోగ్యమని కేంద్రానికి ప్రతిపాదనలు
- వెల్లడించిన ఉద్యానశాఖ డైరెక్టర్ ఎల్ వెంకట్రామిరెడ్డి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో తక్కువ నీటితో అధిక దిగుబడి పొందేందుకు ఆయిల్‌పాం సాగు ప్రయోజనకరంగా ఉంటుందని ఉద్యానశాఖ భావిస్తున్నది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 50 వేల ఎకరాల్లో ఆయిల్‌పాం సాగవుతుండగా.. మరో 6.75 లక్షల ఎకరాలు సాగుకు అనుకూలమని ఇటీవల తాము చేపట్టిన సర్వేలో తేలినట్టు ఉద్యానశాఖ డైరెక్టర్ ఎల్ వెంకట్రామిరెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని 18 జిల్లాల పరిధిలోని 204 మండలాల్లో కొత్తగా ఆయిల్‌పాం సాగుకు యోగ్యమైన పరిస్థితులు ఉన్నట్టు గుర్తించి కేంద్రానికి ప్రతిపాదనలు పంపినట్టు వెల్లడించారు. పామాయిల్ వినియోగంతో గుండె సంబంధ సమస్యలు తలెత్తుతాయని జరుగుతున్న ప్రచారాన్ని, ఇటీవలి పరిశోధనలు తప్పని తేల్చాయి. దీంతో విదేశాలు కూడా భారత్ నుంచి పెద్ద ఎత్తున పామాయిల్‌ను దిగుమతి చేసుకొంటున్నాయి. ఎకరం వరి సాగుకు 60 వేల లీటర్ల నీటిని వినియోగించాల్సి ఉంటుండగా.. అదే ఆయిల్‌పాం సాగుకు కేవలం 10 వేల లీటర్లు సరిపోతాయని అధికారులు పేర్కొంటున్నారు. రాష్ట్రంలో కొత్తగా 204 మండలాల్లో దాదాపు 6.75 లక్షల ఎకరాల్లో భూమి ఆయిల్‌పాం సాగుకు అనుకూలంగా ఉన్నట్టు ఇటీవల ఉద్యానశాఖ గుర్తించింది. పంట నాటిన నాలుగేండ్ల తర్వాత కాపు వస్తుందని, ఆ సమయం వరకు 50 శాతం సబ్సిడీ ఇస్తున్నామని వెంకట్రామిరెడ్డి చెప్పారు.

















# చందానగర్ ఠాణా ఆదర్శం

- ఆకస్మికంగా సందర్శించి.. ప్రశంసించిన డీజీపీ మహేందర్‌రెడ్డి
- ప్రజలకు చక్కటి సేవలందిస్తున్నారని సిబ్బందికి కితాబు



చందానగర్ పోలీస్‌స్టేషన్‌కు వస్తున్న డీజీపీ మహేందర్‌రెడ్డి

**చందానగర్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని అన్ని పోలీస్‌స్టేషన్లకు చందానగర్ పోలీస్‌స్టేషన్ ఆదర్శంగా ఉన్నదని, అక్కడ అనుసరిస్తున్న వ్యూహాన్ని ఇతర పోలీస్‌స్టేషన్లకు విస్తరించాలని డీజీపీ మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన హైదరాబాద్‌లోని చందానగర్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి, దాదాపు నాలుగు గంటలపాటు అక్కడే గడిపారు. స్టేషన్‌లోని మూత్రశాలలు మొదలుకొని, నేరస్థులను ఉంచే సెల్‌వరకు అన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించారు. పూర్తిగా పచ్చదనంతో నిండిన స్టేషన్‌ను ఆవరణ చూసి, సంతోషం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రజలే పోలీసులు.. పోలీసులే ప్రజలు అన్నరీతిలో సిబ్బంది సేవలు అందిస్తున్నారని ప్రశంసించారు. టెక్నాలజీ, ప్రాసెస్, మ్యాన్‌పవర్‌ను క్రమపద్ధతిలో వినయోగిస్తూ, కేసుల ఛేదనలో మంచి ఫలితాలు రాబడుతున్నారని పేర్కొన్నారు. తెలంగాణను నేరరహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో త్వరలోనే 18వేల మంది పోలీసులు విధుల్లోకి వస్తారని.. దీంతో సిబ్బంది కొరత తీరుతుందని చెప్పారు. ఒకేసారి ఇంతభారీస్థాయిలో పోలీసుల రిక్రూట్‌మెంట్ ఏ రాష్ట్రంలోనూ జరుగలేదన్నారు. డీజీపీ వెంట సైబరాబాద్ సీపీ సజ్జనార్, డీసీపీ ఏ వెంకటేశ్వరరావు, డీసీపీ క్రైమ్స్ రోహిణీ ప్రియదర్శిని, అడిషనల్ డీసీపీ వెంకటేశ్వర్లు, ఏసీపీ సంక్రాంతి రవికుమార్, స్థానిక ఇన్‌స్పెక్టర్ రవీందర్, ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్ రవీంద్రప్రసాద్, ఎస్ఐలు శంకర్, రమేశ్, అహ్మద్‌పాషా, బాలరాజు, శ్యాంప్రసాద్, ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, పీసీలు ఇతర సిబ్బంది ఉన్నారు.

## ఒకేచోట పనిచేస్తున్న పోలీసుల బదిలీకి కసరత్తు

ఎక్కువకాలం ఒకేచోట పనిచేస్తున్న కానిస్టేబుళ్లు, హెడ్‌కానిస్టేబుళ్లు, ఏఎస్ఐల బదిలీలపై పోలీస్‌శాఖ దృష్టిసారించింది. ఐదేండ్లకుమించి ఒకేచోట పనిచేస్తున్న సిబ్బంది వివరాలు సేకరించాలని పోలీస్ కమిషనర్లకు, అన్ని జిల్లాల ఎస్పీలకు డీజీపీ కార్యాలయం నుంచి ఆదేశాలు వెళ్లినట్టు సమాచారం. సమస్యాత్మక ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న ఏఆర్ కానిస్టేబుళ్లలో ఏడాది పూర్తయినవారిని తిరిగి వెనుకకు రప్పించి వారిస్థానంలో కొత్తవారిని నియమించే ప్రక్రియ ఇప్పటికే కొనసాగుతున్నది.

## • ఆస్ట్రేలియాలో ఘనంగా బోనాల జాతర



ఆస్ట్రేలియాలో తెలంగాణ ప్రజలు బోనాల పండుగను వైభవంగా జరిపారు. మెల్‌బోర్న్ నగరంలోని రాక్‌బ్యాంక్ దుర్గామాత ఆలయం వద్ద తెలంగాణ న్యూస్ సంస్థ ఆధ్వర్యంలో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జాతరలో అధికసంఖ్యలో పాల్గొన్న మహిళలు అమ్మవారికి బోనం, తొట్టెల సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. యువకులు దుర్గామాత ఆలయం వద్ద ఆటపాటలతో సందడిచేశారు. గడిచిన ఐదేండ్లనుంచి ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్న తెలంగాణ న్యూస్ నిర్వాహకులు తెలంగాణ మధు, వేముల రాజు, ప్రజీత్‌రెడ్డి, దీపక్‌లను పలువురు అభినందించారు. **– హైదరాబాద్, నమస్తే తెలంగాణ**

## ఇండిగోలో సాంకేతిక లోపం

**శంషాబాద్:** హైదరాబాద్– కోయంబత్తూరు విమానంలో సాంకేతికలోపం తలెత్తడంతో మంగళవారం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అత్యవసరంగా ల్యాండింగ్ చేశారు. ఇండిగో6ఇ739 విమానం శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరిన కొద్దిసేపటికి విమానంలో సాంకేతిక లోపం ఉన్నట్లు పైలట్ గుర్తించారు. వెంటనే విమానాశ్రయ అధికారులను సంప్రదించి చాకచక్యంగా ల్యాండింగ్ చేశారు. ఆ వెంటనే ప్రయాణికులను ప్రత్యామ్నాయ విమానంలో తరలించారు.

## బిగ్‌బాస్-3ని అడ్డుకోండి!

- హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రియాల్టీషోగా పేర్కొంటూ స్టార్‌ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రసారం చేస్తున్న బిగ్‌బాస్–3 కార్యక్రమాన్ని అడ్డుకోవాలని మంగళవారం హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. సినీనిర్మాత కేతిరెడ్డి జగదీశ్వర్‌రెడ్డి ఈ పిటిషన్ దాఖలు చేశారు. అసభ్యకర ప్రవర్తన, నైతిక విలువలను దిగజార్చేలా ఉండే సన్నివేశాలను బిగ్‌బాస్ రియాల్టీషోలో ప్రసారం చేస్తున్నారని పిటిషనర్ పేర్కొన్నారు. ఇండియన్ బ్రాడ్‌కాస్టింగ్ ఫౌండేషన్ చట్టాలను అనుసరించి ప్రతి ఎపిసోడ్‌ను సెన్సార్ చేసిన తర్వాతే ప్రసారం అయ్యేలా ఆదేశాలు జారీచేయాలని విజ్ఞప్తిచేశారు. సినీహీరో నాగార్జునతోపాటు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్, స్టార్‌ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (మాటీవీ), పోలీసులను ప్రతివాదులుగా పేర్కొన్నారు. కాగా, బిగ్‌బాస్ రియాల్టీషో నిర్వాహకులు హైకోర్టులో క్యాష్ పిటిషన్ దాఖలు చేసినట్టు సమాచారం.

# కాపు రిజర్వేషన్లపై జగన్ X బాబు

**అమరావతి, నమస్తే తెలంగాణ:** కాపుల రిజర్వేషన్ అంశంపై ఏపీ అసెంబ్లీలో మంగళవారం సీఎం జగన్మోహన్‌రెడ్డి, ప్రతిపక్ష నేత చంద్రబాబు మధ్య తీవ్ర వాదోపవాదాలు జరిగాయి. కాపులకు ఐదుశాతం రిజర్వేషన్లకు వైఎస్సార్సీపీ కట్టుబడి ఉన్నదా అని ప్రశ్నించిన చంద్రబాబు.. కాపులను గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మోసంచేశారని విమర్శించారు. దీనిపై జగన్ స్పందిస్తూ.. కాపులను మోసంచేశారు కాబట్టే చంద్రబాబును ప్రతిపక్షంలో కూర్చోబెట్టారని పేర్కొన్నారు. సినిమాలో కనిపించే విలన్ క్యారెక్టర్, మోసగాడు.. అసెంబ్లీకి వస్తే చంద్రబాబులా ఉంటారని ఎద్దేవాచేశారు.

**సదావర్తి భూములపై విచారణ**

సదావర్తి భూముల్లో అక్రమాలపై విచారణ జరిపిస్తామని ఏపీ దేవాదాయ, ధర్మాదాయ శాఖమంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ ప్రకటించారు. సింహాచలం దేవస్థానం పంచగ్రామాల ప్రజలను మభ్యపెట్టేందుకు గత ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకొచ్చిందన్నారు. ఈ భూములకు సంబంధించి కోర్టులో ఉన్న కేసులపై ముఖ్యమంత్రి అడ్వొకేట్ జనరల్‌తో సమీక్ష చేపట్టారని, సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

**తిరుమలలో వీఐపీ దర్శనాలు రద్దు**

తిరుమలలో వీఐపీ దర్శనాలకు టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి చెక్‌పెట్టారు. ఎల్ 1 , ఎల్ 2, ఎల్ 3 దర్శనాలను రద్దు చెయ్యాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన తిరుమలలో మీడియాతో మాట్లాడుతూ.. మంగళవారం నుంచే ప్రత్యామ్నాయ ఏర్పాట్లుచేస్తామన్నారు.

## ఎర్రమంజిల్‌పై కొనసాగిన వాదనలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నూతన అసెంబ్లీ కాంప్లెక్స్ నిర్మాణం, ఎర్రమంజిల్ భవనం కూల్చివేతపై దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాలపై హైకోర్టులో మంగళవారం వాదనలు కొనసాగాయి. హైదరాబాద్ జిందాబాద్ అనే ఎన్జీవో తరఫున సీనియర్ న్యాయవాది స్వరూప్‌రెడ్డి వాదనలు కొనసాగించారు. అర్బన్ ఏరియా డెవలప్‌మెంట్ యాక్ట్ ప్రకారం ఏర్పడిన అర్బన్ ఆర్ట్ కమిషన్ గుర్తించిన 135 కట్టడాలను నూతన చట్టంలో చేర్చలేదని పేర్కొన్నారు. కర్ణాటక హైకోర్టు భవనం 'అటారా కచేరి'ని కూల్చాలని అప్పటి కర్ణాటక ప్రభుత్వం అనుకున్నదని.. కానీ, కోర్టులో వాదోపవాదాలను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం.. ఆ నిర్ణయాన్ని వెనుకకు తీసుకున్నదని చెప్పారు. ఈ దశలో జోక్యం చేసుకున్న ధర్మాసనం.. భవనం కూల్చివేత అంశంలో ప్రభుత్వానికి ఆదేశాలు జారీచేసే అధికార పరిధి కోర్టుకు ఉన్నదా? లేదా? అని ప్రశ్నిస్తూ.. తదుపరి విచారణను బుధవారానికి వాయిదా వేసింది.



నమస్తే తెలంగాణ
WWW. NTNEWS.COM
# జిందగీ
బుధవారం 17 జూలై 2019 /nt.zindagi

కరీంనగర్



॥ కొంతమంది కుర్రవాళ్లు పుట్టుకతో వృద్ధులు.. పేర్లకి పకీర్లకి పుకార్లకి నిబద్ధులు.. ॥
॥ కొంతమంది యువకులు ముందు యుగం దూతలు పావన నవజీవన బృందావన నిర్మాతలు ॥

ఇలా.. మహాకవి శ్రీశ్రీ.. సమాజంలోని రెండు రకాల యువకుల గురించి తన గళం విప్పాడు. అయితే.. తమ కళ్ల ముందే పాడైపోతున్న యువతరాన్ని మెల్కొలిపేందుకు కొందరు యువకులు నడుంకట్టారు. పుట్టుకతో వృద్ధులైన యువకుల్లో జవసత్వాలు నింపారు. పేర్లకి, పకీర్లకి, పుకార్లకి నిబద్ధులుగా మారుతున్న మరికొందరిని తీసుకొచ్చి 'లైబ్రరీ'లో కూర్చోబెట్టారు. ఒక మంచి పుస్తకాన్ని చదివించి జీవితాన్ని నేర్పారు. భావితరానికి, నవజీవన బృందావనానికి 'ప్రజా గ్రంథాలయం' అనే పునాదిని వేసి, చక్కని బతుకుబాట చూపుతున్నారు. వారే ముల్కనూరు ప్రజా గ్రంథాలయ కమిటీ సభ్యులు. నిత్య చైతన్య గీతికగా మారిన ఆ ప్రజా గ్రంథాలయంపై 'జిందగీ' అందిస్తున్న కథనం.

## విజ్ఞాన వేదిక.. చైతన్య బావుట

# ముల్కనూరు ప్రజా గ్రంథాలయం


ముల్కనూరు లైబ్రరీలో రీడింగ్ రూం


కంప్యూటర్ రూం


ప్రజా గ్రంథాలయం కమిటీసభ్యులు


వ్యాసరచన పోటీలు

### ఇదీ ముల్కనూరు నేపథ్యం

దేశవ్యాప్తంగా ఉవ్వెత్తున సాగిన కోఆపరేటివ్ ఉద్యమంలో వరంగల్ అర్బన్ జిల్లా ముల్కనూరు చాలా చురుగ్గా ఉండింది. ఆసియాలోనే రెండో ఉత్తమ కోఆపరేటివ్ సొసైటీగా పేరు తెచ్చుకున్నది. నాటి నుంచి సహకార సంఘంతో ఎన్నో మంచి పనులు చేశారు. సహకార సంఘం ఆదర్శంగా మహిళా సంఘాలు ఏర్పడ్డాయి. పాల డెయిరీలు స్థాపించారు. సహకార సంఘ ఉద్యమం నడుస్తున్న కాలంలో ముల్కనూరు దేశంలో అగ్రస్థానంలో ఉన్నది. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ముల్కనూరు కేంద్రంగా పీవీ నర్సింహారావు, గోపాల కృష్ణమూర్తి, చంద్రయ్య, కాశీవిశ్వనాథరెడ్డి వంటి చాలామంది స్వాతంత్ర్య సమరయోధులు ఎన్నో ఉద్యమాలు చేశారు. తర్వాత నిజాం పరిపాలనను వ్యతిరేకిస్తూ.. రజాకార్లపై తిరుగుబాటు చేసిన చరిత్ర ఈ గ్రామానికి ఉన్నది. అలా ముల్కనూరులో రాజకీయ చైతన్యం పెరిగింది. అయితే కొంతమంది యువకులు చెడు అలవాట్లకు బానిలసై జీవితాన్ని నాశనం చేసుకునేవారు. చెప్పేవారు లేకపోవడంతో ఓ తరం అంధకారాన్ని అనుభవించింది.

అది వరంగల్ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూరు గ్రామం. ఒకప్పుడు సాంస్కృతికంగా విరాజిల్లిన గ్రామం.. పల్లెపాటలు, పల్లె ఆటలు, సాంస్కృతిక కళలతో కళకళలాడిన ప్రాంతం. భారత స్వాతంత్ర్య పోరాటంలో, రజాకార్ల వ్యతిరేక ఉద్యమంలోనూ కేంద్రంగా ఉన్న ఆ ప్రాంతం.. స్వాతంత్ర్యానంతరం ఒక్కసారిగా వెలుగు కోల్పోయింది. యువత పెడదోవ పట్టింది. అవగాహన లేక ఒక తరం అంధకారాన్ని చవి చూసింది. ఆ దుస్థితిని దగ్గరగా చూశారు కొందరు యువకులు. మేల్కొన్నారు.. తమతోటి వారినీ మేల్కొల్పారు. ప్రజా గ్రంథాలయాన్ని నిర్మించి.. పూర్వవైభవాన్ని తీసుకొచ్చారు. ఇప్పుడా గ్రంథాలయం రాష్ట్రంలోనే ఆదర్శం. తమ గ్రామాలను అభివృద్ధిపథాన నడిపించుకోవాలనుకునే వారు.. కచ్చితంగా సందర్శించాల్సిన గ్రామం ముల్కనూరు.

**ముల్కనూరులో** 1983వ సంవత్సరంలో పదో తరగతి పాసైన విద్యార్థులు.. మంచి స్నేహితులయ్యారు. ఉన్నత చదువుల కోసం ఊరిని విడిచివెళ్లినా.. ఎప్పటికప్పుడు ఊరి సమాచారం తెలుసుకుంటూనే ఉన్నారు. వీరిలో ముఖ్యులు శ్రీనివాసులు, కిషన్ ప్రసాద్, సుగుణాకర్, మూలా శ్రీనివాస్, సంపత్, శంకర్రావు, ప్రమోద్‌రెడ్డి, తిరుపతి, వీరేశం, లక్ష్మయ్య(రి.టీచర్) కొమరయ్య (సర్పంచ్), వంగా రవి(జడ్పీటీసీ), మురళీ, రాము, నాగరాజు, కృష్ణమూర్తి గ్రామానికి చెందిన కొందరు ప్రముఖులు, ఎన్‌ఆర్‌ఐలు ఉన్నారు. గ్రామంలో పెడదోవ పడుతున్న యువతను దారికి తెచ్చుకోవడం కోసం.. విద్యార్థి దశ నుంచే పునాది వెయ్యాలనుకున్నారు. ఈ క్రమంలో 2001లో 'స్పందన చారిటబుల్ సొసైటీ' ఏర్పాటు చేశారు. దీని ద్వారా 7 నుంచి 10 తరగతుల విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు ఇవ్వడం ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలలను అప్పటి ప్రభుత్వాలు సరిగా పట్టించుకోకపోవడంతో విద్యార్థులు ప్రైవేట్ చదువులకు అలవాటు పడ్డారు. కొన్నాళ్లకు ఊరి అభివృద్ధి, విద్యార్థుల భవిష్యత్ కోసం అంతా ఏకతాటిపైకి వచ్చారు. గ్రామంలోని అన్ని వర్గాల వారిని సమావేశపరిచి, అందరి నిర్ణయం మేరకు 2015లో 'ప్రజా గ్రంథాలయం' స్వాతంత్ర్య సమరయోధుల బిల్డింగ్‌లో ఏర్పాటు చేశారు. వారే సొంతంగా డబ్బులు వేసుకొని పుస్తకాలు, ఇతర సామగ్రి కొన్నారు. కొన్నాళ్లకు కొంతమంది సమరయోధుల నుంచి అభ్యంతరాలు ఎదురవడంతో.. లైబ్రరీకి సొంతంగా బిల్డింగ్ ఉండాలనే ఆలోచనకు వచ్చారు. ముందుగా ఒక కమిటీని ఏర్పాటు చేసుకొని, గ్రామస్థుల నుంచి విరాళాలు సేకరించారు. రూ.500 నుంచి రూ.5 లక్షల వరకు దాతలు ఇచ్చారు. ఎంపీ, ఎమ్మెల్యేల నిధుల నుంచీ కొంత సేకరించారు. జిల్లా పరిషత్ అధికారుల సహకారంతో స్థలం తీసుకొని అందమైన బిల్డింగ్‌తో నూతన లైబ్రరీ నిర్మించారు. ఇది రెండు అంతస్థుల బిల్డింగ్. కింద పెద్ద లైబ్రరీ హాల్, కంప్యూటర్ ల్యాబ్, ఆఫీస్ రూం ఉన్నాయి. పై అంతస్థుల్లో 200 మందికి సరిపడా కాన్ఫరెన్స్ హాల్ నిర్మించారు. ఆ హాల్‌ను పాఠాలు చెప్పడానికి, మీటింగ్‌లకు, అవగాహనా తరగతులకు, విద్యార్థుల కౌన్సెలింగ్‌కు ఉపయోగిస్తున్నారు. ఈ గ్రామంలో విద్యార్థులకు పాఠాలు చెప్పడానికి వచ్చే గెస్ట్ లెక్చరర్స్ కోసం అధునాతన సౌకర్యాలతో రెండు గదులను నిర్మించారు. లైబ్రరీ అనగానే అంతా డల్‌గా ఉంటుందని అభిప్రాయపడుతుంటారు. ఆ ధోరణిని మార్చాలని చాలా కలర్‌ఫుల్‌గా నిర్మించి, గతేడాది జూలైలో అప్పటి ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి చేతులమీదుగా ప్రారంభించారు.

### చైతన్యం కనిపిస్తున్నది



నేను ముల్కనూరులో 1983 పది వరకూ చదువుకున్న. ప్రస్తుతం రిజిస్ట్రేషన్ శాఖలో జాయింట్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్‌గా పనిచేస్తున్నా. 1996 బ్యాచ్ గ్రూప్-1 ఆఫీసర్‌ని. మా అందరిదీ ఊరికి ఏదైనా చెయ్యాలనే ఉద్దేశమే. ఎప్పటికీ చీకటినే నిందిస్తూ పోకుండా.. చిరు దీపం వెలిగించి చీకటిని పారదోలే ప్రయత్నం చేశాం. చాలా రోజుల తర్వాత ఊరిలో ఒక చైతన్యం కనిపిస్తున్నది. మా గ్రామానికి వచ్చినవారంతా లైబ్రరీ చాలా బాగుంది. అందులో సౌకర్యాలు కూడా చాలా బాగున్నాయి. లైబ్రరీ ద్వారా చేస్తున్న పనులు అందరినీ ఆలోచింపజేస్తున్నాయి అని చెబుతుంటే.. మా బాధ్యత మరింత పెగుతున్నది.

**- శ్రీనివాసులు,** ప్రజా గ్రంథాలయ కమిటీ


విద్యార్థులకు అవగాహన తరగతులు

### ఇంకా 4 రోజులే..

ముల్కనూరు ప్రజాగ్రంథాలయం, నమస్తే తెలంగాణ సంయుక్తంగా నిర్వహిస్తున్న కథల పోటీకి.. ఇంకా నాలుగు రోజులే గడువు ఉంది. కథలు అందాల్సిన చివరి తేదీ జూలై 20. తెలంగాణ సంస్కృతి, చరిత్ర, సమకాలీన జీవన వైవిధ్యాలు, వైరుధ్యాల నేపథ్యంలో కథలు ఉండాలి. నవ్యతకు, సృజనాత్మకతకు పెద్దపీట వేసే కథలకు మాత్రమే ఆహ్వానం పలుకుతున్నాం. మొత్తం రూ.1,60,000 బహుతులు విజేతలకు అందజేస్తారు. మొదటి బహుమతి రూ.50వేలు, ద్వితీయ బహుమతి రూ.25వేలు, తృతీయ బహుమతి 10 వేలు, ఆరు కన్సొలేషన్ బహుతులు రూ.5 వేల చొప్పున ఉంటాయి. బహుమతి సాధించిన కథలు నమస్తే తెలంగాణ 'బతుకమ్మ'లో ప్రచురితం అవుతాయి. పూర్తి వివరాలకు www.ntnews.com చూడండి.

### విజ్ఞాన వేదిక.. చైతన్య దీపిక

ముల్కనూరు ప్రజా గ్రంథాయలం ఓ చైతన్య బావుట. దీనిని నిర్మించిన దగ్గర్నుంచి విద్యార్థులు, గ్రామస్థుల కోసం అహర్నిశలు కష్టపడుతూనే ఉన్నారు కమిటీసభ్యులు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, క్విజ్ పోటీలు, మహిళలు-పెద్దలకు ఉపన్యాస పోటీలు, ముగ్గులపోటీలు నిర్వహిస్తున్నారు. 5 నుంచి 85 సంవత్సరాల వాళ్ల వరకూ అందరినీ ఆకట్టుకునే విధంగా ఇక్కడ కార్యక్రమాలు రూపొందిస్తున్నారు. గ్రామస్థులు, విద్యార్థుల్లోని కళలు, ప్రతిభను వెలికి తీసి బహుమతులతో ప్రోత్సహిస్తున్నారు. ఈ లైబ్రరీ ద్వారా గ్రామంలోని విద్యార్థులకు ఉచితంగా కంప్యూటర్ నేర్పిస్తున్నారు. దీంతో పిల్లలు కూడా చాలా ఉత్సాహంగా లైబ్రరీకి వస్తున్నారు. విద్యార్థుల పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కోసం అవగాహనా తరగతులు నిర్వహిస్తున్నారు. గతంలో ముల్కనూరు సాహితీ కేంద్రంగా విరాజిల్లింది. ఈ క్రమంలో విద్యార్థుల్లో రచనా, కవితా శక్తిని వెలికితీసేందుకు సాహిత్యపరమైన పుస్తకాలు అందుబాటులో ఉంచారు. 'మాకు కావాల్సిన పుస్తకాలు' అని ఒక రిజిస్టర్ నిర్వహిస్తున్నారు. అందులో ఎవరైనా తమకు అవసరమైన పుస్తకం పేరు రాస్తే.. అందుబాటులో ఉంచుతారు. యువతను భాగస్వాములను చేసేందుకు గ్రామం-గ్రంథాలయ అభివృద్ధిపై సలహాలు, సూచనలు స్వీకరిస్తున్నారు.

### పోటీ పరీక్షల అభ్యర్థుల కోసం..

ముల్కనూరు గ్రామంలో సివిల్స్, గ్రూప్స్, ఆర్‌ఆర్‌బీ, బ్యాంక్, ఎస్‌ఐ, కానిస్టేబుల్, ఎల్‌ఐసీ.. ఇతర పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికోసం బయటి నుంచి వీరే ఫ్యాకల్టీని పిలిపిస్తున్నారు. అధ్యాపకుల ద్వారా గ్రామంలోని విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ.. పోటీ పరీక్షలకు సంసిద్ధులను చేస్తున్నారు. వీరి నుంచి తక్కువ మొత్తంలో ఫీజు తీసుకుంటున్నారు. దీంతో పాటుగా ముల్కనూరుకు చెందిన ఎవరైనా విద్యార్థి బాగా చదువగలిగి ఆర్థికంగా లేని పక్షంలో.. లైబ్రరీ ప్రతినిధులే వారికి అండగా ఉంటారు. అవసరమైతే వరంగల్, హైదరాబాద్‌కు మేలైన శిక్షణా సంస్థల్లో చేర్పించి, తామే డబ్బులు చెల్లిస్తున్నారు.

### క్రీడాకారుల కోసం..

ముల్కనూరు గ్రామంలో క్రీడాకారులనూ ప్రోత్సహిస్తున్నారు. లైబ్రరీ కమిటీవారు గ్రామంలోని హైస్కూల్‌లో క్రీడాకారుల కోసం ప్రత్యేకంగా 400 మీటర్ల రన్నింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేశారు. ఇది ఎస్‌ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు అనువుగా ఉన్నది. లైబ్రరీ ప్రాంగణంలో వాలీబాల్, బ్యాడ్మింటన్ కోర్టులు వేశారు. యోగా, చెస్, క్యారమ్స్ వంటి ఇండోర్ గేమ్స్ పోటీలూ నిర్వహిస్తున్నారు. ఈ ప్రజా గ్రంథాలయాన్ని ఓ కల్చరల్ సెంటర్‌గా మార్చాలనే ధ్యేయంతో ఉన్నారు కమిటీసభ్యులు.


### వాట్సప్ గ్రూప్‌లో నిర్ణయాలు

ముల్కనూరులో అభివృద్ధి కోసం కీలకంగా పనిచేసే వ్యక్తులందరికీ 'ముల్కనూరు ప్రజా గ్రంథాలయం' పేరిట ఓ వాట్సప్ గ్రూపు ఉన్నది. గ్రామ అభివృద్ధికి సంబంధించిన ఏ విషయమైనా చర్చకు వచ్చేది ఇక్కడే. చర్చ అనంతరం అందరి అభిప్రాయాలు తీసుకొని, సాధ్యాసాధ్యాలపై నిర్ణయం తీసుకుంటారు.

... డప్పు రవి

# 'అయోర్టాలో ఇబ్బంది' అంటే..?


అడుగండి చెబుతా



**మా నాన్న వయసు 65 ఏళ్లు. సంవత్సరం క్రితం వరకూ ఆరోగ్య పరంగా ఏ ఇబ్బందీ లేదు. కానీ, కొన్ని వారాలుగా రోజువారీ పనులు చేసుకోవడానికి ఇబ్బంది పడ్తున్నారు. తరచుగా గుండె దడ, ఆయాసం అంటున్నారు. చాలా నీరసంగా కూడా ఉంటున్నారు. ఒక్కోసారి ఛాతీలో నొప్పి, ఊపిరి ఆడడం లేదు అని కూడా చెప్తున్నారు. జనరల్ ఫిజీషయన్‌కు చూపించాం. ఆయన కొన్నాళ్లు మందులిచ్చినా తగ్గకపోవడంతో గుండె వైద్య నిపుణుడికి చూపించమన్నారు. ఆయనకు చూపిస్తే ఇ.సి.జి, 2డి-ఎకో, రక్త పరీక్షలు మొదలైనవన్నీ చేసి గుండె అయోర్టాలో ఇబ్బంది అని చెప్పారు. తొందరగా హైదరాబాద్‌లో పెద్దసుపత్రికి తీసుకెళ్లి, ఏదో కొత్త విధానం వచ్చింది అది చేయించుకోమని చెప్పారు. చాలా ప్రమాదకరమనీ చెప్తున్నారు. అయోర్టా అంటే ఏమిటి? అసలీ సమస్యకు కారణం ఏమిటి? డాక్టర్ చెప్పిన కొత్త విధానమేమిటి? చాలా ఆందోళనలో ఉన్నాం. దయచేసి వివరించగలరు.**

**- షేక్ నూర్జహాన్,** నల్గొండ

ప్రజలలో 65 ఏళ్ళు వయసున్న వృద్ధులలో 5 శాతం మంది ఇదే సమస్యతో బాధపడుతున్నారు. మన శరీరంలో గుండె చాలా ప్రధాన అవయవం. ఇది పూర్తిగా కండరాలతో నిర్మితమైంది నిరంతరాయంగా మనిషి జీవించినంతకాలం గుండె పని చేస్తూనే ఉండాలి. మన జీవితకాలంలో గుండె మొత్తం మీద 8లక్షల పైగా లీటర్ల రక్తాన్ని శరీరంలోని అన్ని ప్రధాన భాగాలకు పంప్ చేస్తుంది. గుండె నుంచి అవయవాలు అన్నింటికీ రక్తాన్ని చేర్చే బాధ్యతను శరీరంలో అతిపెద్దది అయిన బృహద్ధమని (అయోర్టా) నిర్వహిస్తుంది. ఈ దృఢమైన, శక్తివంతమైన భారీ ధమని అసాధారణమైన పని ఒత్తిడిని తట్టుకొని గుండె నుండి శుద్ధ రక్తం తలపై భాగం మొదలుకొని అరికాళ్ళ వరకూ ప్రతి భాగానికీ చేరేటట్లు చూస్తుంది. ఈ అయోర్టా వాల్వ్‌తో పాటు గుండెలో 4కవాటాలు (వాల్స్) ఉంటాయి. వీటిని 'అయోర్టా స్టేన్సిస్' అంటారు. రక్త ప్రసరణ సరఫరా వ్యవస్థకు ఇవి చాలా కీలకం. ఈ వ్యాధి నిర్ధారణ చేసిన తర్వాత చాలా జాగ్రత్తగా ఉండాలి. కొత్తగా 'ఇంటర్ వెన్షనల్' ప్రక్రియ ద్వారా సర్జరీ అవసరం లేకుండా ఒక అత్యాధునిక కార్డియాలజీ వైద్య విధానం అందుబాటులోకి వచ్చింది. దీనిని TAVR (ట్రాన్స్ కాథేటర్ అయోర్టిక్ వాల్వ్ రీప్లేస్‌మెంట్) అంటారు. ఈ మినిమల్లీ ఇన్వేసివ్ విధానం ద్వారా శస్త్రచికిత్సకు బదులుగా 'వాల్వ్' (కవాటం) మరమ్మత్తు చేసి కవాటం తొలగించకుండా రిపేర్ లేదా రిప్లేస్ చేస్తారు. ఇది చాలా సురక్షితమైంది. ఈ 'ఇంటర్ వెన్షనల్' వైద్య విధానంలో అతిచిన్న కోతలు ఉంటాయి. ఓపెన్ హార్ట్ శస్త్రచికిత్సలోలాగా ఛాతి కోత ద్వారా వేరు చేయనవసరం లేదు. ఒక రకంగా ఇది 'స్టెంట్' వేయించుకోవడం లాంటిదే. ఆసుపత్రిలో ఉండే సమయం 3 నుంచి 5 రోజులు మాత్రమే. దీనితో ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు. వేగవంతమైన రికవరీకి అవకాశాలు సన్నగిల్లినప్పుడు, రిస్క్ ఎక్కువగా ఉన్నపుడు TAVR ఒక మంచి ఎంపిక. ఈ రెండు విధానాల్లో ఒకదాన్ని రోగి పరిస్థితిని బట్టి ఉపయోగించి నిర్వహిస్తారు. హైదరాబాద్‌లో ఈ చికిత్స అందుబాటులో ఉంది. ఈ విధానంలో తొడ ధమని ద్వారా కేథటర్ ప్రవేశ పెట్టడం ద్వారా ఛాతీలో చిన్న కోతతో లేదా ఛాతీ లో పెద్ద ధమని ద్వారా ఎడమ కాలి తొడ కొన ద్వారా గుండె వరకూ అయోర్టాకు కేథటర్ ప్రవేశపెట్టడం ద్వారా అతి తక్కువ కోతతో చేసే మినిమల్లీ ఇన్వేసివ్ వైద్య చికిత్స ప్రక్రియ. ఇది మీరు ఎలాంటి భయలు, ఆందోళనలూ పెట్టుకోకుండా తొందరగా చికిత్స చేయించండి.



**డాక్టర్. ఉదయ్ కుమార్,**
సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్,
యశోద హాస్పిటల్స్,
సికింద్రాబాద్.

# పాత దుకాణాలన్నీ కొత్తగా!

**మొట్టమొదటి బుక్‌బైండింగ్ షాపు పుణేలో మొదలైంది. ఆ తర్వాతే ఎన్నో దుకాణాలొచ్చాయి. ఇలాంటి షాపు ప్రత్యేకత ఈ తరానికి తెలియక కొత్త దుకాణాల వైపు అడుగులేస్తున్నారు. అందుకే వారిని ఆకర్షించేలా రంగులద్దుతున్నారు ఈ అమ్మాయిలు.**



ఈ ఫొటోలో కనిపిస్తున్న అమ్మాయిలు.. అలెఫియా, అనుష్క. పుణేలోని పేపర్ షాప్ యజమాని రవివార్ పేత్ కూతురు అలెఫియా. వీరి దుకాణం మూడు తరాల నుంచి నడుస్తున్నది. దీనికి చాలామంచి పేరుంది. ఆ తర్వాత చుట్టుపక్కల చిన్న దుకాణాలు తయారయ్యాయి. అప్పుడు పేరుగాంచిన షాపులన్నీ ఇప్పుడు పాతబడ్డాయి. పుణే నగరంలో కొత్త కాలేజీలు ఏర్పడడంతో పాటు సిటీకి కొత్త స్టూడెంట్లు వస్తున్నారు. వారు కొత్తగా పెట్టిన షాపుల వైపు ఎక్కువ మొగ్గు చూపుతున్నారు. దీనికి కారణం ఆ దుకాణాలు పాతబడినట్లు కనిపించడం. దీంతో అలెఫియాకు ఒక ఐడియా తట్టింది. ఈ ఆలోచనను తన ఫ్రెండ్ అనుష్కతో పంచుకున్నది. ఇద్దరూ కలిసి బాగా ఆలోచించి ఒక ప్రాజెక్ట్‌ను చేపట్టారు. దీని పేరు 'ఎ ఫ్రెష్ కోట్'. 1937లో గులామ్‌హుస్సెన్ మహ్మద్ భాయ్ మొట్టమొదటి బైండింగ్ షాప్ పెట్టాడు. హుస్సెన్‌తో పాటు పాత దుకాణాల యజమానులందరినీ కలిసి 'ఎ ఫ్రెష్ కోట్' ప్రాజెక్ట్ గురించి వివరించారు. కస్టమర్లను ఆకర్షించేలా చేస్తామంటే ఎవరూ మాత్రం వద్దంటారు. అందరూ అంగీకారం తెలిపారు. అనుష్క, అలెషియా కొంతమందిని టీంగా ఏర్పాటు చేశారు. ఆదివారం నాడు షాపులన్నీ బంద్ చేస్తారు. ఆ రోజే వీరు పని మొదలుపెట్టారు. ఉదయం 5 గంటలు మొదలు రాత్రి వరకు ఒకటి కూడా వదలకుండా వరుసగా షాపునకు తగ్గట్టుగా వారి ఆర్ట్స్ ఉంటాయి. ఏ షాపుకు ఎలాంటి ఆర్ట్ వేయాలో ముందుగానే టీం సభ్యులు చర్చించుకుంటారు. ఇలా మొదటి ఆదివారం నాడు 20 షట్టర్లకు పెయింటింగ్ వేశారు. మొదటిసారికి అయిన ఖర్చంతా వీరే భరించారు. రెండవ సారి ఆర్ట్ వేయడానికి స్పాన్సర్లు ముందుకు వస్తున్నారని అనుష్క చెప్పుకొచ్చింది.

# అరిటాకుల భోజనంతో అధిక లాభాలు



- అరటి ఆకుల్లో యాంటీ ఆక్సిడెంట్ ప్రాపర్టీలు ఎక్కువ. ఇవి జీవనశైలి, వయసుతో పాటు వచ్చే వ్యాధుల్ని దరిచేరనివ్వవు. అలాగే కొన్ని రకాల క్యాన్సర్లను కూడా ఈ అరిటాకుల భోజనం నివారిస్తుంది. కొన్ని రకాల ఆకు కూరల్లో ఉండే పాలీ ఫినాల్స్ అనే యాంటీ ఆక్సిడెంట్లు ఈ అరిటాకుల్లో పుష్కలంగా ఉంటాయి.
- పాత్రలను తోమడానికి వాషింగ్ పౌడర్ లేదా జెల్‌ని ఉపయోగిస్తాం. అయితే పాత్రలపై రసాయనాల ప్రభావం కూడా ఉంటుంది. ఆ పాత్రల్లోనే భోజనం చేస్తే రసాయనాలు నేరుగా కడుపులోకి వెళ్తాయి. అలాగే థర్మకోల్, ప్లాస్టిక్ ప్లేట్స్‌పై ఉండే ప్రమాదకరమైన కెమికల్స్ నుంచి కూడా అరిటాకుపై తినే భోజనం మనల్ని కాపాడుతుంది.
- అరిటాకులు ఎంతో విశాలంగా ఉంటాయి. అందుకే భోజనం కూడా ఎంతో సౌకర్యవంతంగా తినవచ్చు. ఇంకా, ఈ ఆకుల్ని వివిధ రకాల సైజుల్లో కట్ చేయవచ్చు. అలాగే వీటిని ఎటువంటి సైజుల్లో ఉండే ప్లేట్లలో అయినా పెట్టి వడ్డించవచ్చు.
- అరిటాకుల్లో భోజనం రుచికరంగా ఉంటుంది. వేడి వేడి ఆహారపదార్థాలు వడ్డించినప్పుడు అరిటాకులో ఉండే పొర కరిగి అందులో కలుస్తుంది. ఆ విధంగా ఆహారం మరింత రుచికరంగా మారుతుంది.

### వంటింటి చిట్కాలు



- ఆపిల్ పండ్ల పక్కనే అరటి పండ్లను ఉంచితే అవి త్వరగా పాడవుతాయి.
- కందముక్కలను ఉడికించే నీటిలో చిన్న బెల్లంముక్క వేస్తే అవి త్వరగా ఉడుకుతాయి.
- వంటల్లో సుగంధ ద్రవ్యాలను నేరుగా వేసే కంటే, పొడి చేసి వేస్తే పదార్థాలు కమ్మటి వాసన వస్తాయి.
- ఆలుగడ్డ ముక్కల్ని ఉప్పు నీటిలో అరగంట నానబెట్టి వేయిస్తే ముక్కలు రుచిగా ఉంటాయి.

II.

నమస్తే తెలంగాణ

యువ

[ కరీంనగర్ ]

బుధవారం 17 జులై 2019

## చెత్త ఏరుకున్న అమ్మాయి..

# చెఫ్ అయ్యింది!

చెట్టు కింద నిద్రించింది. చెట్టంత ఆత్మస్థయిర్యాన్ని కూడగట్టుకున్నది. బాల్యంలో ఆకలి అంటూ అలమటించింది. ప్రస్తుతం ఆకలిని జయించింది. విధి రాతని ఎదిరించి.. బతుకు పోరాటంలో నిలిచి గెలిచింది. అనాథగా మొదలైన ఆమె జీవితం ఇప్పుడెందరికో ఆదర్శప్రాయంగా నిలుస్తున్నది.



ఢిల్లీకి చెందిన లిలిమాఖాన్ బాల్యంలోనే తల్లిదండ్రులను కోల్పోయింది. ఒంటరిగా మిగిలింది. ఢిల్లీ వీధుల్లో దిక్కులేని జీవితం గడిపింది. ఎక్కడ దొరికితే అక్కడ తిని పుట్‌పాత్ మీదే పడుకునేది. చెత్త ఏరుకుని అమ్మితే వచ్చే డబ్బులతో కాలం గడిపేది. అలా లిలిమాకు 11 ఏండ్ల వచ్చాక కిల్కారి రెయిన్‌బో హోమ్ స్వచ్ఛంద సంస్థ వాళ్లు ఆశ్రయం కల్పించారు. అక్కడే ఆమెకు చదువు చెప్పించారు. ఇంటర్ వరకు లిలిమా చదువుకున్నది. ఖాళీ సమయాల్లో అక్కడే ఉన్న క్యాంటీన్‌ల్లో వంట చేసేది. క్రియేటివ్ సర్వీసెస్ సపోర్ట్' ఎన్జీవో ద్వారా లిలిమా వంటల్లో మెళకువలు నేర్చుకుంది. ఇటాలియన్ రెస్టారెంట్‌లో అసిస్టెంట్ కుక్‌గా ఉద్యోగంలో చేరింది. ప్రస్తుతం ఓ పెద్ద రెస్టారెంట్‌లో జూనియర్ చెఫ్‌గా పనిచేస్తున్నది. భవిష్యత్‌లో హెడ్ షెఫ్‌ను అవుతానని లిలిమా పేర్కొంటున్నది. సొంత ఇల్లు కొనుక్కుంటానని, అనాథలకు అండగా నిలుస్తానని అంటున్నది. సొంతగా రెస్టారెంట్ పెట్టుకుని కొందరికైనా ఉపాధి కల్పిస్తానని లిలిమా ధీమాగా చెబుతున్నది.

# లోలాకుల సోయగం

మగువల చెవులకు అందాన్ని తెచ్చిపెట్టేవి లోలాకులు. శబ్దం రాని గంట మాదిరిగా ఊగే వీటిని ఇష్టపడని వారుండరు. ఇవి చెవులకు అదనపు అందాన్ని తెచ్చిపెడతాయి. ఇప్పటి వరకు ఎన్నో మోడళ్లలో ఇయర్ రింగ్స్ వచ్చినా లోలాకులు మాత్రం ఇప్పటికీ ప్రత్యేకమే.



గతంలో చెవికి ఒక ఇయర్ రింగ్ పెట్టుకునే వారు. కొన్నేళ్లుగా చెవి చుట్టూ ఇయర్ రింగ్స్ పెడుతున్నారు. ఇటీవల ట్రెండ్ మారింది. ఒకే చెవికి నాలుగైదు లోలాకులు వేలాడదీయడం ప్రస్తుతం ఫ్యాషన్. ఎలాంటి ఆకృతి ఉన్న ముఖం వారికైనా ఇవి చూడముచ్చటగా ఉంటున్నాయి. ముఖ ఆకృతిని బట్టి కూడా ఈ లోలాకులు మార్కెట్లలో అందుబాటులో ఉన్నాయి. వెండి, బంగారం, ప్లాస్టిక్, ప్లాటినం, మెటల్, గ్లాస్, రబ్బర్ వంటి వాటితోనూ ఇవి తయారు చేస్తున్నారు. ఈ రకమైన ఇయర్ రింగ్స్‌లో అదనపు హ్యాంగింగ్ ఉండడంతో మగువలు వీటిని ధరించడానికి ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. వన్ గ్రాం గోల్డ్‌లో రూ. 90 నుంచి రూ.వెయ్యి వరకు అమెజాన్ స్టోర్‌లో లభిస్తున్నాయి. బంగారు లోలాకులు రూ. 4 వేల నుంచి రూ. 30 వేల వరకు అందుబాటులో ఉన్నాయి.

# పెండ్లిలో చెంపదెబ్బ!



అమెరికాలో ఇటీవల ఓ వివాహం జరిగింది. అందులో వధువు తెల్ల గౌనులో ఆకర్షణగా నిలిచింది. వివాహ వేడుకలో భాగంగా ఓ పండు ముక్కను వరుడు ఆమెకు తినిపించాడు. ఆ తర్వాత ఆమె వరుడికి తినిపించబోయి ఆట పట్టించింది. ఆ వెంటనే వరుడు ఆమెను చెంపదెబ్బ కొట్టాడు. ప్రతిస్పందనగా ఆమె అతడి చెంప చెళ్లుమనిపించింది. కుటుంబీకులు, బంధువులు చూస్తుండగానే ఈ ఘటన జరిగింది. ఇరువురు చెంపదెబ్బలు కొట్టుకోవడం అక్కడి సంప్రదాయం. ప్రస్తుతం ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నది.

# అద్దిరిపోయే హెయిర్ టాటూ..

యువకులు ఎప్పటికప్పుడు విభిన్నంగా ఉండాలని కోరుకుంటారు. అందుకోసం కొత్త కొత్త ప్రయోగాలు చేస్తుంటారు. ముఖ్యంగా ఫ్యాషన్ వెంట పరుగులు పెడుతుంటారు. టాటూ వేయించుకోవడం ఓ మధుర జ్ఞాపకం. అయితే ఈ టాటూలోనూ విభిన్నతను కోరుకుంటున్నారు.



నచ్చిన సెలబ్రిటి, అభిమాన క్రికెటర్, ఆరాధ్య దైవం, ఇలా ఏదైనా కావచ్చు. ఎవ్వరైనా కావచ్చు. వాటన్నింటినీ ఫొటోల రూపంలో తలకెక్కించుకోవచ్చు. అదేనండీ హెయిర్ టాటూ వేయించుకోవచ్చు. ఈ లెటెస్ట్ ట్రెండ్ ప్రస్తుతం తైవాన్‌లో సంచలనంగా మారింది. అక్కడి యువత హెయిర్ టాటూలు వేయించుకోవడానికి బాగా ఆసక్తి చూపుతున్నది. హెయిర్ టాటూ వేయించుకున్న తర్వాత పది, పదిహేను రోజులకు చెరిగిపోతుంది. తైవాన్‌లో చాలామంది బార్బర్స్ ఈ టాటూల ద్వారా ఉపాధి పొందుతున్నారు. ఒక్కో చిత్రం చెక్కడానికి కనీసం గంట సమయం పడుతున్నది. సినీ హీరోలు, హీరోయిన్ల టాటూలకు వెయ్యి రూపాయలు, నాయకుల టాటూలకు రూ. 500 చొప్పున చార్జీ చేస్తున్నారు.

# నవీన నట తారాజువ్వలు

అవతలి నుంచి వచ్చిన కాల్ ఏదో షార్ట్‌ఫిలిమ్ గురించి అనుకొని 'నో' చెప్పి పెట్టేసింది. కానీ ఆమెకు తెలీదు అది ఓ సినిమా ఛాన్స్ అని. సీన్ కట్ చేస్తే ఆమె అదే సినిమాలో మంచి పాత్రలో ప్రత్యేక్షమైంది.

ఎక్కడో ఉప్పల్‌లో చిన్న కూలీ పని చేస్తున్న అబ్బాయికీ తెలియదు.. అతను వెళ్తున్నది ఓ దర్శకుని దగ్గరకు అని. అతనొక సినిమాలో కీలక పాత్రలో నటించబోతున్నాడని.

మరో యువకునికీ అస్సలే తెలీదు.. అతను ఇంతవరకూ సరదాగా మాట్లాడింది ఓ సినిమా డైరెక్టర్‌తో అని.

ఈ ముగ్గురే కాదు.. 'దొరసాని' సినిమాతో తెర మీద వెలిగిన మట్టిలో మాణిక్యాలు చాలామందే ఉన్నారు. వారిలో నవ నట తారాజువ్వలు వీరే..



'ఒక్క చాన్స్' ఇస్తే ఏం చేయగలరో నిరూపించడానికి దొరసాని ద్వారా వచ్చిన ఆ ఒక్క అవకాశాన్ని మంచిగ అందుకున్నరు. ఇట్లా 64 మంది కొత్తోళ్లు తెరమీద మెరిసింండ్రు. వారిలో కీలక పాత్రల్లో ఉన్న ఏడుగురి పరిచయం ఇది.

### అనుకోని అవకాశం అందుకొని..



హీరోకు మరో దోస్త్ బుచ్చి. ఆ బుచ్చిగాడే ఈ సంతోష్. నటనలో ఎలాంటి అనుభవం లేకుండా అన్నీ నేర్చుకొని మొదటిసారి తెరమీద కన్పించిండు సంతోష్. ఉప్పల్‌లో ఉంటడు. చాలా పేద కుటుంబం. దీంతో చదువుకు దూరం అయిండు. తండ్రి చనిపోయిండు. పొట్టకూటి కోసం తల్లి దినసరి కూలీగా చేస్తున్నది. తల్లికి ఆసరాగా సంతోష్ ఒక బ్యాంక్‌లో ఆఫీస్‌బాయ్‌గా పనిజేస్తుండు. సంతోష్‌కు ఎప్పటి నుంచో నటించాలనే ఆసక్తి ఉండేది. ఇదే సినిమాలో 'బైరిగాడు' పాత్రలో నటించిన నితిన్‌కు సంతోష్ తెలుసు. ఆయన సాయంతో 'దొరసాని'లోకి రాగలిగిండు. పాత్రకు అచ్చుగుద్దినట్టు అనిపించుడుతోనే సంతోష్‌ను తీసుకొచ్చి యాక్టింగ్ ట్రైనింగ్ ఇచ్చింండ్రు డైరెక్టర్. డైలాగ్‌లు చెప్పించడం, మాట్లాడడం అన్నీ నేర్పించిండ్రు. సినిమా రిలీజైనంక చాలామంది మెచ్చుకున్నరనీ, అమ్మ సంతోషపడుతున్నదనీ, ఇంకా వేరే సినిమాల కూడా యాక్టింగ్ చేసేతందుకు చాన్స్‌లు వస్తున్నయని అంటుండు. ఈ గుర్తింపు అంత నితిన్, డైరెక్టర్ కేవీఆర్ వల్లే వచ్చిందనీ సంతోషపడుతున్నడు.

### నటనే లక్ష్యంగా..



దొరసాని సినిమాల హీరో దోస్త్ శీను పాత్రల నటించిన వ్యక్తే ఈ సన్ని.. ఎప్పటికైనా సినిమాల్లో నటించాలనే డ్రీమ్‌తో ఎనిమిదేండ్ల కిందట హైద్రాబాద్ వచ్చిండు. సన్నీది మెదక్ జిల్లా రేగోడ్ మండల్ పోచారం. ఇంటర్ ఐపోయినంక హైద్రాబాద్ బయల్దేరిండు. ఇక్కడ సినిమాల్లో ట్రై చేస్తునే బీఎఫ్ఏ ఫొటోగ్రఫీ సదివిండు. సినిమాల్లో అవకాశాల కోసం ఎన్నో ఆఫీస్‌లు తిరిగిండు. పార్ట్‌టైంగా ఫొటోగ్రఫీ చేస్తూ కొంత ఖర్చులకు సంపాదించుకుంటుండు. కొన్ని షార్ట్‌ఫిల్మ్‌లకు కూడా పని చేసి పేరు తెచ్చుకున్నడు. ఇట్లనే ఆరేడేండ్లు ఐపోయింది. అయినా చాన్స్ రాలే. 'దొరసాని'లో ఆ చాన్స్ అచ్చింది. చాలామందికి పోటీ ఇచ్చి పాత్ర దక్కిచ్చుకున్నడు. 'డైరెక్టర్ కేవీఆర్, హీరో ఆనంద్ యాక్టింగ్‌లో అన్నీ నేర్పిచ్చింండ్రు. అంత పెద్ద హీరో, హీరోయిన్ మాతో అంతమంచిగ ఉంటడం ఆశ్చర్యం అన్పించింది. షూట్‌లో వాళ్ల ద్వారా చాలా నేర్చుకున్న' అన్నడు సన్నీ.

### జాబ్ వదిలేసి అవకాశాల కోసం..



హీరోకు ఇంకో దోస్త్ అబ్దుల్. ఆ పాత్రలో నటించింది కొత్త శ్రావణ్. హైదరాబాద్ యువకుడే. నటన అంటే ఆసక్తి. తనను తాను నిరూపించుకోవడానికి అన్నీ తానై షార్ట్‌ఫిలిమ్స్‌లు తీసిండు. ఇప్పటి వరకూ 14 షార్ట్‌ఫిలిమ్స్ తీసిండు. అందులో 'ఫ్రెస్టెటెడ్ బాయ్ ఫ్రెండ్' వైరల్ అయింది. శ్రావణ్ ఎంటెక్ చేసి రెండేండ్లు లెక్చరర్‌గా పని చేసిండు. కానీ నటన మీద ఆసక్తితో ఉద్యోగం బంద్‌జేసి సినిమా ప్రయాత్నాలు జేసిండు. దొరసాని సినిమా గురించి తెలుసుకొని ఆడిషన్స్‌కు పోయిండు. అక్కడ దర్శకుల ముందు ప్రతిభ కనబర్చి అవకాశం అందిపుచ్చుకున్నడు. తనకు ఈ చాన్స్ ఇచ్చినందుకు డైరెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపాడు.

### షార్ట్ ఫిలిమ్ నుంచి సినిమాలోకి..



అనూష హోటల్ మేనేజ్‌మెంట్ సదువుతున్నది. అట్లానే ఒక షార్ట్‌ఫిలిమ్‌ల కూడా లీడ్‌రోల్ జేసింది. చాలా రోజుల కింద ఉదయం ఓ కాల్ వచ్చింది. దొరసాని సినిమాలో నటించాలని అడగడానికి వచ్చిన ఫోన్ కాల్ అది. అదేదో షార్ట్‌ఫిలిమ్ అనుకొని 'నాకు ఇంట్రెస్ట్ లేదు' అని చెప్పి పెట్టేసింది. తర్వాత మళ్లీ కాలొచ్చింది. అప్పుడు సినిమానే అని అనూషకు అర్థమైంది. 'ఓకే' అన్నది. ఆడిషన్స్‌కు వెళ్లింది. సెలక్ట్ అయింది. సినిమాలో 'వసంత' కారెక్టర్ ప్రత్యేక్షమైంది. అనూష హైద్రాబాద్‌లో మెహిదీపట్నం అమ్మాయి. దొరసాని సినిమా షూటింగ్ ఎక్కడో ఊర్లో ఉండేది. దూరం ఐతుందని షూటింగ్‌కు పోలే. మళ్లీ దర్శకుడే ఫోన్ చేసి మెప్పించి షూట్‌కు తీసుకెళ్లిండు. కారణం వసంత పాత్రకు అనూషను తప్ప ఎవరినీ ఊహించుకోలేక పోయిండు దర్శకుడు. 'అసలు నిజంగా ఒక డైరెక్టర్ ఇంత ఫ్రీగా మాతో మాట్లాడ్తడా? ఇంత ఈగోకు వెళ్లకుండా నాకు ఫోన్ జేసి కన్విన్స్ జేస్తడా? అందుకే ఆ క్యారెక్టర్‌లో నేను ఎంత అవసరమో అనిపించింది. ఎంతో ఇష్టపడి చేసిన. డైరెక్టర్ సారే అన్నీ చెప్పేవారు. మొదటిసారి ఒక పెద్ద సినిమాలో ఆ స్థాయిలో నటించానంటే కేవీఆర్ సార్ గైడ్ జేసుడుతోనే అయింది' అని చెప్పింది అనూష.

### కథకునిగా, నటునిగా.. హుమాయున్



సినిమాల తన భూమి గుంజుకున్న దొరను ఎదిరించి అమరుడైతడు కామ్రేడ్ యాదగిరి.. ఆ కామ్రేడ్ పాత్రను ఎట్లాంటి మెలిక లేకుండా జేసిండు సంఘీర్. ఈయనది కామారెడ్డి జిల్లా గోపాల్‌పేట ఊరు. కొంత కాలంగా హైదరాబాద్‌లోనే ఉంటుండు. రచయితగా, ఆర్టిస్టుగా జీవితాన్ని సాగిస్తున్నడు. ఇప్పటి వరకు డైరెక్షన్ డిపార్ట్‌మెంట్‌తో పాటు కొన్ని షార్ట్ ఫిలిమ్స్‌లో కూడా లీడ్ రోల్స్‌లో యాక్ట్ జేసిండు. ఈ క్రమంలోనే 'దొరసాని' గురించి తెలిసింది. ఆడిషన్స్‌కు వెళ్లిండు. సంఘీర్ నటనకు పరీక్ష పెట్టి యాదగిరి పాత్రకు ఎంపిక జేసింది 'దొరసాని' బృందం. అనుకున్నట్టే ఆ పాత్రలో లీనమై చేసి ప్రతిభ కనబర్చిండు. ఇట్లా మొదటిసారి పెద్ద సినిమాలో యాక్టింగ్ చేసే అవకాశం ఇచ్చినందుకు దర్శకునికి, సాయం జేసినందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నడు సంఘీర్.


### ఎనిమిదేండ్ల నిరీక్షణ..



...✍ వినోద్ మామిడాల

దొరసాని అన్నగా చివర్లో అందరినీ షాక్‌కు గురిచేసిన పాత్ర ప్రతాపరెడ్డి. ఈ పాత్రకు తగ్గ గంభీరాన్ని ప్రదర్శించిన వ్యక్తి వంశీ. ఈయనది కర్నూల్. పెరిగింది మాత్రం హైదరాబాద్‌లోనే. విదేశాల్లో డాక్టర్ సదివిండు. యాక్టింగ్ మీద ఆసక్తి ఉంది. మంచి యాక్టర్ అవ్వాలని ఎనిమిదేండ్ల నుంచి అవకాశాల కోసం చూస్తున్నడు. రోజులు గడిచినా అవకాశాలు రాలే. ఈ టైంలోనే దొరసాని గురించి తెలిసి ఆడిషన్స్‌కు వెళ్లి తన ట్యాలెంట్ నిరూపించుకున్నడు. తెలంగాణ యాస మంచిగా మాట్లాడిండు. ఈ పాత్రకు చాలామంది వచ్చింండ్రు కానీ ఈయనే సెలక్ట్ అయిండు. పాత్ర కోసం పది కిలోల బరువు తగ్గిండు. ఎనిమిదేండ్ల నిరీక్షణ దొరసానితో తీరిందనీ సంతోషాన్ని వ్యక్తం చేస్తుండు. 'ప్రాంతంతో తనకు సంబంధం లేదు.. పాత్రకు తగ్గ నటుడు నాలో ఉన్నాడని నమ్మి ఈ పాత్ర నాకు ఇస్తున్నట్టు డైరెక్టర్ చెప్పారు, ఇంత మంచి క్యారెక్టర్ ఇచ్చిన డైరెక్టర్‌కు కృతజ్ఞతలు' అని వంశీ చెప్పిండు.

### అవకాశాల కోసం ఎదురుచూసి..



సినిమాలో బైరిగాడు చిన్నపాత్రే అయినా కథ మీద ఇంపాక్ట్ చూపే క్యారెక్టర్. ఈ పాత్రకు తగ్గట్టు నటించిన వ్యక్తే నితిన్ రెడ్డి. ఈయనది కామారెడ్డి జిల్లా బిక్నూర్ మండలం కంచర్ల ఊరు. సినిమాల్లో పని చేయాలని చాలా రోజుల కిందట హైద్రాబాద్ వచ్చిండు. ఇప్పుడు ఉప్పల్‌లో ఉండి సినిమాల్లో ప్రయత్నాలు చేస్తుండు. చదువు అయిపోయాక హైదరాబాద్ వచ్చి సినిమాల వైపు తన ఆసక్తిని కొనసాగించిండు. ఈ క్రమంలో 'దొరసాని'లో దర్శకులు కేవీఆర్ మహేంద్ర అవకాశం కల్పించిండు. ముమ్ముందు అవకాశాలొస్తే ఉపయోగించుకుంటా అని నితిన్ అంటుండు.

## సుడోకు

**డైలీ సుడోకు 93 సమాధానం**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 2 | 4 | 7 | 8 | 9 | 3 | 5 | 6 | 1 |
| 3 | 6 | 9 | 1 | 7 | 5 | 8 | 4 | 2 |
| 5 | 8 | 1 | 6 | 4 | 2 | 7 | 3 | 9 |
| 6 | 9 | 4 | 7 | 8 | 1 | 3 | 2 | 5 |
| 8 | 7 | 5 | 2 | 3 | 6 | 1 | 9 | 4 |
| 1 | 3 | 2 | 4 | 5 | 9 | 6 | 7 | 8 |
| 9 | 1 | 6 | 5 | 2 | 7 | 4 | 8 | 3 |
| 7 | 2 | 8 | 3 | 1 | 4 | 9 | 5 | 6 |
| 4 | 5 | 3 | 9 | 6 | 8 | 2 | 1 | 7 |

**డైలీ సుడోకు -94**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 3 | 5 | | | | 6 | 8 | | |
| 9 | | | | | | | 5 | |
| | 6 | | | | 2 | | | |
| | | | 1 | | | 4 | 2 | |
| | | 1 | | | | 3 | | |
| | 8 | 5 | | | 4 | | | |
| | | | 5 | | | | 3 | |
| | 4 | | | | | | | 8 |
| | | 3 | 7 | | | | 9 | 1 |

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

## ట్వీట్



రామ్ గోపాల్ వర్మ
@RGVzoomin



స్కూల్‌లో చదివే రోజుల్లో నేను ఎలా ఉన్నానో చూడండి. నా బట్టలను చూసి అమ్మానాన్నని నిందించేరు. అవి నేను కొనుక్కున్నవే!

రామ్‌గోపాల్ వర్మను ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య ▸ 36,03,066

## కామన్‌మ్యాన్ వాయిస్

అన్నా ఉద్యోగానికి ఇంటర్వ్యూకు పిలిచారు. సెలెక్ట్ చేయలేదు. నేనిప్పుడు క్యాస్టింగ్ కౌచ్ అని ఫిర్యాదు చేయవచ్చునా?
నాకు తెలియదు. నువ్వెవరో కూడా నాకు తెలియదు తమ్ముడు. బిగ్ బాస్ పేరు కూడా నేనెప్పుడూ వినలేదు తమ్ముడు.

– Murali Buddha

లైలా, మజ్నులు.. అనార్కలీ, సలీంల నుంచి.. సాక్షి మిశ్రా, అజితేషుల వరకూ చావును మోస్తున్న ప్రేమికులారా..
ఈ దేశంలో కులం ఉన్నంతవరకూ.. పరువు హత్యల రూపంలో మిమ్మల్ని వెంటాడుతూనే ఉంటుంది.
కన్న కడుపులే కాదు.. రాజ్యమూ మిమ్మల్ని వేధిస్తూనే ఉంటుంది.

– Vijaya Bhandaru

## వైరల్ వీడియో



వరల్డ్ కప్ ఫైనల్ ఫీవర్ ఇంకా వదల్లేదు అనేందుకు ఈ వీడియోనే సాక్ష్యం. ఉత్కంఠగా సాగిన ఇంగ్లండ్, న్యూజిలాండ్ పోరును అందరూ ఆ రోజు చూసే ఉంటారు. కానీ ఆ ఆటకి సంబంధించిన హైలైట్స్‌పై ఐసీసీ ఒక వీడియోని విడుదల చేసింది. ఈ వీడియో ఇప్పుడు నెట్టింట వ్యూల పరుగులు తీస్తుంది.

England vs New Zealand – Match Highlights | ICC Cricket World Cup 2019


Total views : 19,355,611+

Published on 14 Jul 2019

నమస్తే తెలంగాణ
# సంకేత
[ కరీంనగర్ ]
బుధవారం 17 జూలై 2019
టెక్నాలెడ్జీ 2.0

కొత్త ఫీచర్

## గూగుల్ మ్యాప్స్‌లో 'డైనింగ్'



**గూగుల్ వినియోగదారుల కోసం కొత్త కొత్త ఫీచర్లను ప్రవేశపెడుతూనే ఉంది. తాజాగా మ్యాప్స్‌లో మూడు డైనింగ్ ఫీచర్లను జోడించింది.**

నగరాల్లోని మంచి హోటళ్లలో భోజనం చేయాలంటే ఇక గూగుల్ మ్యాప్స్‌లో వెతికితే సరిపోతుంది. 11 నగరాల్లోని హోటళ్లలో భోజన వివరాలు తెలుసుకునేందుకు ఆఫర్ ఫీచర్‌ను గూగుల్ మ్యాప్స్‌లో జోడించింది. హైదరాబాద్, ఢిల్లీ, ముంబై, బెంగళూరు, పుణె నగరాలు ఈ జాబితాలో ఉన్నాయి. 'ఈజీడైనర్' సంస్థతో కలిసి 'ఆఫర్' ఫీచర్‌ను గూగుల్ అందిస్తున్నది. 4 వేలకు పైగా రెస్టారెంట్లలో ఆఫర్స్ తెలుసుకోవచ్చు.ఎక్స్‌ప్లోర్ ట్యాబ్‌లో ఆఫర్స్ షార్ట్‌కట్‌ను క్లిక్ చేస్తే వివరాలన్నీ కనిపిస్తాయి. యూజర్స్ అభిరుచులకు అనుగుణంగా ఎక్స్‌ప్లోర్ ట్యాబ్‌ను తీర్చిదిద్దింది. బంకులు, ఏటీఎంల వంటి ఏడు విభాగాల షార్ట్‌కట్లూ ఉన్నాయి. కొత్తగా ప్రవేశపెట్టిన 'ఫర్ యూ' ట్యాబ్ ద్వారా కొత్త రెస్టారెంట్లు, వార్తల్లో ఉన్న ప్రదేశాలు, యూజర్లు నోటిఫికేషన్ పొందవచ్చు.

## బోస్ నుంచి ఏఆర్ సన్ గ్లాసెస్

కొత్త గ్యాడ్జెట్

**అమెరికన్ కంపెనీ 'బోస్' భారత మార్కెట్‌లోకి మొదటిసారి ఏఆర్ ఆడియో సన్ గ్లాసెస్‌ను విడుదల చేసింది. ఆకట్టుకొనే ఫీచర్లతో బోస్ కొత్త ప్రయోగం చేసింది.**



బ్రాండ్‌లుక్‌తో ఉన్న ఈ సన్ గ్లాస్ ఫోన్, ట్యాబ్‌కు కనెక్ట్ అవుతుంది. ఎడమవైపు ఫ్రేమ్‌కు బోస్ అడియో సిస్టమ్ ఉంటుంది. దీని ద్వారా ఆడియోను కంట్రోల్ చేయొచ్చు. మ్యూజిక్‌ను కూడా స్ట్రీమ్ చేయొచ్చు. దీంతో పాటు ఫోన్‌కాల్స్, గూగుల్ అసిస్టెంట్, సిరీలను కంట్రోల్ చేయవచ్చు. మాటల ద్వారా కమాండ్స్ ఇవ్వొచ్చు. బోస్ ఏఆర్ ఫ్లాట్‌ఫామ్‌తో ఇది పని చేస్తుంది. ఆడియో ఏఆర్ ఫీచర్లు ఉండడంతో కేవలం ఆడియో ఫీచర్లే పని చేస్తాయి. వీడియో ఫీచర్లు పని చేయవు. లిథియమ్ బ్యాటరీలు 12 గంటల స్టాండ్ బై ఇస్తాయని కంపెనీ వెల్లడించింది. ఐఓస్‌లో బోస్ యాప్స డౌన్‌లోడ్ చేసుకొని దీనికి కనెక్ట్ కావొచ్చు. ధర రూ. 21, 900.

కొత్త మొబైల్

## మల్టీకలర్ ప్యానెల్‌తో హానర్ 20 ప్రో



**రియర్ ప్యానెల్‌ను మల్టీ కలర్స్‌లో హువావే తన సబ్ బ్రండ్ హానర్ ఫోన్‌ను రిలీజ్ చేసింది. గత కొన్ని రోజులుగా తన ట్రెండ్స్‌ను కొనసాగిస్తూ వస్తున్నది ఈ కంపెనీ. తాజాగా హానర్ 20 ప్రో పేరుతో మరో స్మార్ట్ ఫోన్‌ను రిలీజ్ చేసింది. గుడ్ లుకింగ్‌తో ఉన్న ఈ ఫోన్ ఫీచర్లు ఇలా ఉన్నాయి..**

### హానర్ 20 ప్రో ఫీచర్లు..

| | | |
|---|---|---|
| డిస్‌ప్లే | : | 6.26 అంగుళాల ఫుల్‌వ్యూ డిస్‌ప్లే, |
| రిజల్యూషన్ | : | 2340x1080 పిక్సెల్స్ |
| ప్రాసెసర్ | : | 1.8 జీహెచ్‌జడ్ ఆక్టా కోర్ |
| ఓఎస్ | : | ఆండ్రాయిడ్ 9 పై |
| ర్యామ్ | : | 8జీబీ |
| స్టోరేజీ | : | 256 జీబీ |
| రియర్ కెమెరా | : | 48 మెగాపిక్సెల్స్, ఏఐ క్వాడ్ కెమెరా+ 16 ఎంపీ వైడ్ యాంగిల్ కెమెరా+ 8 ఎంపీ టెలీఫొటో కెమెరా |
| ఫ్రంట్ కెమెరా | : | 16 మెగాపిక్సెల్స్, |
| బ్యాటరీ | : | 3750 ఎంఏహెచ్ |

టిప్ టాప్

## పీడీఎఫ్ ఇలా సులభం





**పీడీఎఫ్ పార్మాట్‌ను మనం విరివిగా ఉపయోగిస్తుంటాం.. కొన్నిసార్లు క్రియేట్, ఎడిట్ చేయాలంటే కష్టం అవుతుంటుంది. అలాంటప్పడు కింది చిట్కాలు పాటించండి.**

**జొటి మాల్వేర్ స్కాన్ :** ఏదైనా పీడీఎఫ్‌లో వైరస్ ఉందా చెక్ చేయాలంటే ఈ జొటి మాల్వేర్ స్కాన్ బాగా ఉపయోగపడుతుంది. ఈ వైబ్‌సైట్‌లో మీ ఫైల్‌ను అప్‌లోడ్ చేస్తే అది 20కిపైగా వేర్వేరు మాల్వేర్ స్కానర్లతో పరీక్షిస్తుంది. కేవలం క్షణాల్లోనే ఫలితం చూపిస్తుంది.
www.virusscan.jotti.org

**అన్‌లైన్ ఓసీఆర్ :** పీడీఎఫ్ నుంచి ఒక పారాను టెక్ట్స్ రూపంలో కాపీ చేసుకోవాలనుకుంటున్నార? అప్‌డేటెడ్ పీడీఎఫ్ రీడర్లలో ఈ పని చాలా సులువుగా అయిపోతుంది. కానీ కొన్నింటిలో కాదు. దీనికి సరైన మార్గం.. ఆప్టికల్ క్యారెక్టర్ రికగ్నైజేషన్ (ఓసీఆర్) టూల్ వాడడమే. ఇది ఫైలులోని ప్రతి క్యారెక్టర్‌నూ టెక్స్ట రూపంలో మార్చికి అందిస్తుంది.
www.onlineocr.net

**హెచ్‌టీఎంల్ టు పీడీఎఫ్:** ఏదైనా వెబ్ పేజీని పీడీఎఫ్‌లో సేవ్ చేసుకోవడానికి ఇది చక్కటి మార్గం. మీరు చేయాల్సిందల్లా హెచ్‌టీఎంల్ టు పీడీఎఫ్ అనే టూల్‌లోకి మీరు కోరుకున్న వెబ్ పేజీ లింక్ పేస్ట్ చేయడమే. వెంటనే పీడీఎఫ్ డౌన్‌లోడ్ అవుతుంది.
www.html2pdf.com

మరికొన్ని టూల్స్: పీడీఎఫ్ ప్రొటెక్ట్, పీడీఎఫ్ అన్‌లాక్, పీడీఎఫ్ కంప్రెస్... వీటి పేరును బట్టి అవి ఎందుకు ఉపయోగపడుతాయో అర్థం చేసుకోవచ్చు.



**మెయిల్‌లో ఫైల్ పంపాలంటే 25 ఎంబీలకు మించి కుదరదు. అంతకన్నా పెద్దగా ఉంటే గూగుల్ డ్రైవ్‌లోకి వెళ్తుంది. అప్‌లోడ్ అవడానికి కూడా టైం పడుతుంది. ఇవే ఇలా ఉంటే మరి అంత కంటే ఎక్కువ సైజ్ ఉన్న ఫైల్‌ను ఎలా పంపాలి? అందుకోసం కొన్ని ప్రత్యేకమైన ఫ్లాట్‌ఫామ్‌లు ఉన్నాయి.. అవేంటంటే..**

# ఎంతైనా సరే.. పంపేద్దాం!

**ఎక్కువ** జీబీలు ఉన్న ఫైల్స్‌ను పంపాలంటే ఒకప్పుడు సిడీలు, డీవీడీలు, పెన్‌డ్రైవ్‌లే గుర్తుకువచ్చేవి. వాటిలోకి రైడ్ చేసుకొని ఫైల్స్‌ను పంపేది. కానీ ఇప్పుడు ట్రెండ్ మారింది ! ఆ ట్రెండ్‌కు తగ్గట్టే ఫైల్స్ ట్రాన్స్‌ఫరింగ్‌లో కూడా మార్పులొచ్చాయి. సైజ్‌తో సంబంధం లేకుండా ఎంత పెద్ద ఫైల్స్‌ను అయినా ఆన్‌లైన్ ద్వారా పంపేయొచ్చు. సాధారణంగా మనం జీ మెయిల్‌ను వాడినట్టుగానే వీటి ద్వారా ఎంత పెద్దఫైల్స్‌ను అయినా పంపొచ్చు.

### We Transfer

**లిమిట్ : 2జీబీ**



తక్కువ పరిమితులతో ఉన్న చక్కటి వేదిక. దీని ద్వారా 2 జీబీ లోపు ఉన్న ఫైల్స్‌ను ఒకేసారి అటాచ్ చేయొచ్చు. అంతకన్నా ఎక్కువ ఉంటే పంపలేం. అవతలి వారి ఈమెయిల్ అడ్రస్, మన ఈమెయిల్ అడ్రస్ టైప్ చేయడమే మన పని. ఎదుటివారు ఈమెయిల్ లింక్ నుంచి మనం పంపిన ఫైల్స్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దీన్ని వాడడానికి అకౌంట్ రిజిస్ట్రేషన్ అవసరం లేదు. ఇందులో We Transfer Plus సర్వీస్ కూడా ఉంది. దీనికి డబ్బులు చెల్లిస్తే అదనపు ఫీచర్లు ఉంటాయి. 20 జీబీ వరకూ ఫైల్ అటాచింగ్, 100 జీబీల వరకూ డేటా స్టోరేజీ, పాస్‌వర్డ్ ప్రొటెక్షన్, షెడ్యుల్ ట్రాన్స్‌ఫర్ వాటిలో ఆ ఫీచర్లు.
www.We Transfer .com

### MailBigFile

**లిమిట్ : 2జీబీ**




మెయిల్ బిగ్‌ఫైల్ వెబ్‌సైట్‌లోకి వెళ్లే కొద్ది మనోహరమైన ఇంటర్‌ఫేస్‌తో యూజర్‌ను లోనికి తీసుకెళ్తుంది. దీని ద్వారా 2జీబీ డేటాను ట్రాన్స్‌ఫర్ చేయవచ్చు. కానీ 5 ఫైల్స్‌ను మాత్రమే అటాచ్ చేయడానికి వీలుంది. కావాలంటే ఫైల్స్ అన్నింటినీ కంప్రెస్ చేసి అటాచ్ చేసుకోవచ్చు. దీంట్లో మరో మూడు రకాల సర్వీస్‌లున్నాయి. ప్రో, బిజినెస్, బిజినెస్ లైట్ సర్వీలు అవి
www.MailBigFile.com

### Filemail



**లిమిట్ : 30 జీబీ**

దీని ద్వారా ఒకేసారి 30జీబీల డేటాను షేర్ చేయొచ్చు. మనం పంపిన ఫైల్స్‌ను కచ్చితమైన టైం లిమిట్‌లో అవతలి వారు డౌన్‌లోడ్ చేసుకొనే వీలుంది. ఉదాహరణకు.. వారం, పది రోజుల్లోపు మాత్రమే డౌన్‌లోడ్ అవకాశం ఇవ్వొచ్చు. మనం సెట్ చేసిన టైం లిమిట్ దాటితే అవతలి వారికి ఫైల్స్ డౌన్‌లోడ్ కావు. మనం ఎవరికీ ఏమేం ఫైల్స్ పంపామో 'డౌన్‌లోడ్ పేజీ' ఆప్షన్‌లో చెక్ చేసుకోవచ్చు. దీంతో పాటు ప్రో వెర్షన్‌లో అదనపు ఫీచర్లు ఉంటాయి. మెయిల్‌ను ట్రాక్ చేయడం, వారు దాన్ని డౌన్‌లోడ్ చేసుకున్నారా? ఎన్ని సార్లు చేసుకున్నారు అనే విషయాలను చూడొచ్చు. పంపుతున్న ఫైల్స్‌కు పాస్‌వర్డ్, ఏ సమయంలో పంపాలో షెడ్యూల్ కూడా సెట్ చేయొచ్చు.
www.Filemail.com



### Send this File

**లిమిట్ : ఏమీ లేదు**

డేటాను షేర్ చేయడానికి ప్రైవేట్ అండ్ సెక్యూర్డ్ వెబ్‌సైట్ ఇది. దీంట్లో ఫైల్ పంపడానికి సైజ్‌లో ఎలాంటి పరిమితులు లేవు. ఎంత పెద్ద ఫైల్‌ను అయినా సింగిల్ క్లిక్‌లో పంపొచ్చు. ఎండ్ టూ ఎండ్ ఎన్‌క్రిప్షన్ దీని ప్రత్యేకత. కాబట్టి డేటాకు ఎలాంటి ముప్పు ఉండదన్నమాట. ఈ వెబ్‌సైట్ సర్వీస్‌ను వాడుకోవాలంటే ఇందులో అకౌంట్ రిజిస్టర్ చేయాల్సిందే. అది ఉచితమే. ప్రో వెర్షన్ కూడా అందుబాటులో ఉంది.
www.SendthisFile.com


### MediaFire



**లిమిట్ : 10 జీబీ**

ఇదో క్లౌడ్ సర్వీస్. ఫైల్ ట్రాన్స్‌ఫర్ ఫ్లాట్ ఫామ్ కాదు. కానీ దీని నుంచి కూడా ఫైల్స్‌ను షేర్ చేసుకోవచ్చు. ఈ సర్వీస్‌ను ఉపయోగించుకోవాలంటే ఖాతా తప్పనిసరి. అది ఉచితమే. ఖాతా తెరవగానే ఉచితంగా 10జీబీ ఫైల్ స్టోరేజీ పొందొచ్చు. దీంట్లోకి అప్‌లోడ్ చేసిన ఫైల్స్‌ను సెలక్ట్ చేసి ఇతరులకు పంపవచ్చు. షేర్ ఆప్షన్‌ను క్లిక్ చేస్తే ఒక లింక్ వస్తుంది. దాన్ని అవతలి వారికి షేర్ చేయడం ద్వారా కేవలం ఆ ఫైల్స్‌ను మాత్రమే వారు డౌన్‌లోడ్ చేసుకోవడానికి వీలుంటుంది. డబ్బులు చెల్లిస్తే మరో 50 జీబీ స్పేస్‌ను కూడా పొందవచ్చు.
www.MediaFire.com

### e-mail Drives



**ఈమెయిల్ ద్వారా**

పెద్ద ఫైళ్లను పంపడానికి పాపులర్ ఈమెయిల్ సర్వీసులు 'క్లౌడ్ స్టోరేజ్' సదుపాయాన్ని అందిస్తున్నాయి. ఉదాహరణకు జీమెయిల్ వాడుతున్న వారికి గూగుల్ డ్రైవ్ అదనంగా 15 జీబీ స్టోరేజ్‌ను ఇస్తుంది. ఈ డ్రైవ్‌లోకి మనం ఫైల్స్‌ను అప్‌లోడ్ చేశాక వాటిని ఇతరులకు షేర్ చేయవచ్చు. ప్రెజెంటేషన్స్, డాక్యుమెంట్స్, ఇతర ఫైళ్లను ఒకేసారి అప్‌లోడ్ చేయడానికి 50 ఎంబీల పరిమితి ఉంటుంది. అలాగే మైక్రోసాఫ్ట్ ఈమెయిల్ వినియోగదారులు కూడా 'వన్‌డ్రై'లో 15 జీబీ స్పేస్‌ను ఉపయోగించుకోవచ్చు. దీని సహాయంతో అవుట్‌లుక్, హాట్‌మెయిల్ అకౌంట్‌లో నుంచి లార్జ్ ఫైల్స్ పంపుకోవచ్చు. ఇందులో ఒక ఫైల్ అప్‌లోడ్‌కు 10 జీబీ లిమిట్ ఉంటుంది. ఏ ఫైల్‌ను షేర్ చేసుకోవాలనుకుంటున్నారో దానిపై రైట్ క్లిక్ చేస్తే 'షేర్ ఏ వన్‌డ్రైవ్ లింక్' అనే ఆప్షన్ వస్తుంది. ఈ లింక్‌ను నేరుగా ఈ మెయిల్‌లో పేస్ట్ చేసుకోవచ్చు. యాహూ సైతం డ్రాఫ్‌బాక్స్ ఉంది. ఈ మూడు పాపులర్ మెయిల్స్‌లోనే 150ఎంబీ ఫైల్స్‌ను త్వరగా పంపుకోవచ్చు.

... వినో..

# నిపుణ — విద్య ఉద్యోగ సమాచారం —

## వీఎస్ఎస్‌సీలో జేఆర్‌ఎఫ్‌లు

**తిరువనంతపురంలోని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ (వీఎస్ఎస్‌సీ)లోని స్పేస్ ఫిజిక్స్ ల్యాబొరేటరీలో ఖాళీగా ఉన్న జేఆర్‌ఎఫ్, ఆర్‌ఏల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.**




- మొత్తం ఖాళీలు– 20 (జేఆర్‌ఎఫ్–10, ఆర్‌ఏ–10)
- **అర్హత:** జేఆర్‌ఎఫ్‌లకు.. ఫిజిక్స్, అప్లయిడ్/స్పేస్ ఫిజిక్స్, అట్మాస్ఫియరిక్ సైన్స్, మెటీరియాలజీ/స్పేస్ సైన్స్, ప్లానెటరీ సైన్సెస్, ఆస్ట్రానమీ, ఆస్ట్రోఫిజిక్స్‌లో మాస్టర్స్ డిగ్రీ (ఎమ్మెస్సీ) లేదా అట్మాస్ఫియరిక్/స్పేస్, ప్లానెటరీ సైన్సెస్, అప్లయిడ్ ఫిజిక్స్‌లో ఎంటెక్ ఉండాలి. సంబంధిత సబ్జెక్టుల్లో సీఎస్ఐఆర్ నెట్/గేట్, జామ్, జెస్ట్‌లో అర్హత సాధించాలి.
- రిసెర్చ్ అసోసియేట్‌లకు.. సైన్స్ లేదా టెక్నాలజీ లేదా తత్సమాన సబ్జెక్టుల్లో పీహెచ్‌డీ ఉండాలి.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **దరఖాస్తులకు చివరితేదీ:** జూలై 30
- **వెబ్‌సైట్:** www.vssc.gov.in

## బీవోబీలో స్పెషలిస్ట్ ఆఫీసర్లు

**బ్యాంక్ ఆఫ్ బరోడా వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.**




- **మొత్తం పోస్టులు:** 35
- **పోస్టు:** మేనేజర్ (ఐటీ)–25 ఖాళీలు
- **విభాగాలు:** లైనక్స్/విండోస్/ఎస్‌క్యూఎల్ అడ్మినిస్ట్రేటర్, ఒరాకిల్/నెట్‌వర్క్/మిడిల్‌వేర్ అడ్మినిస్ట్రేటర్ వెబ్ స్ఫియర్, వెబ్‌లాజిక్, డాటా సెంటర్ అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్, ఈటీఎల్ డెవలపర్, సాఫ్ట్‌వేర్ డెవలపర్, ఫైనాన్షియల్ డెవలపర్
- **పోస్టు:** సీనియర్ మేనేజర్–10 ఖాళీలు
- **అర్హతలు:** కనీసం 60 శాతం మార్కులతో బీసీఏ, ఎంసీఏ లేదా ఐటీ, సీఎస్ఈ, ఈసీఈలో బీఈ/బీటెక్ లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణత. సంబంధిత రంగంలో అనుభవం ఉండాలి.
- **పేస్కేల్:** మేనేజర్ పోస్టులకు రూ. 31,705–45,950, సీనియర్ మేనేజర్ పోస్టులకు రూ.42,020–51,490.
- **వయస్సు:** ఐటీ మేనేజర్‌కు 25–32 ఏండ్లు, సీనియర్ ఐటీ మేనేజర్‌కు 25–35 ఏండ్ల మధ్య ఉండాలి. రిజర్వ్‌డ్ అభ్యర్థులకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **అప్లికేషన్ ఫీజు:** రూ.600/–, ఎస్సీ/ఎస్టీ, పీహెచ్‌సీలకు రూ.100/–
- **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ టెస్ట్, సైకోమెట్రిక్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ
- **పరీక్ష విధానం:** రీజినింగ్–50, ఇంగ్లిష్ లాంగ్వేజ్–25, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్–50, ప్రొఫెషనల్ నాలెడ్జ్–75 మార్కులు ఇస్తారు. పరీక్ష కాలవ్యవధి రెండు గంటలు. పరీక్షలో నెగెటివ్ మార్కింగ్ విధానం ఉంది.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఆగస్టు 2
- **వెబ్‌సైట్:** www.bankofbaroda.in

## నాన్ టీచింగ్ పోస్టులు

**న్యూఢిల్లీలోని జామియా మిలియా ఇస్లామియా (జేఎంఐ) కేంద్ర విశ్వవిద్యాలయంలో ఖాళీగా ఉన్న కింది పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.**

- నాన్ టీచింగ్ పోస్టులు
- మొత్తం ఖాళీలు: 75
- **పోస్టులు:** డిప్యూటీ రిజిస్ట్రార్, అకౌంట్స్ ఆఫీసర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్, సెక్షన్ ఆఫీసర్, ల్యాండ్ రికార్డ్ సూపరింటెండెంట్, ప్రొఫెషనల్ అసిస్టెంట్, రిసెప్షనిస్ట్, ఆడియో విజువల్ ఆపరేటర్, టెక్నికల్ అసిస్టెంట్, కన్జర్వేషనిస్ట్, అప్పర్ డివిజన్ క్లర్క్, క్లర్క్/టైపిస్ట్, మల్టీ టాస్కింగ్ స్టాఫ్ తదితరాలు
- **అర్హత:** గుర్తింపు పొందిన బోర్డు లేదా సంస్థ నుంచి పదోతరగతి, ఇంటర్, డిప్లొమా, సంబంధిత సబ్జెక్టుల్లో బ్యాచిలర్ డిగ్రీ, మాస్టర్ డిగ్రీ ఉత్తీర్ణత. సంబంధిత విభాగంలో అనుభవం ఉండాలి.
- **ఎంపిక:** రాతపరీక్ష/ ఇంటర్వ్యూ ద్వారా
- **అప్లికేషన్ ఫీజు:** రూ.500/–
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఆగస్టు 16
- **వెబ్‌సైట్:** www.jmi.ac.in



## ఐఐటీఎంలో


**పుణెలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెట్రాలజీ (ఐఐటీఎం)లో యూడీసీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.**



- **పోస్టు:** అప్పర్ డివిజన్ క్లర్క్– 5 ఖాళీలు
- **అర్హత:** డిగ్రీ ఉత్తీర్ణత. ఇంగ్లిష్‌లో కనీసం 30 పదాల టైపింగ్ సామర్థ్యం ఉండాలి.
- **చివరితేదీ:** ఆగస్టు 30
- **వెబ్‌సైట్:** www.tropmet.res.in

## తెలంగాణ ఎయిమ్స్‌లో

**భోపాల్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) ఆధ్వర్యంలో పనిచేస్తున్న తెలంగాణ ఎయిమ్స్‌లో ఖాళీగా ఉన్న జూనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.**




- జూనియర్ రెసిడెంట్
- మొత్తం ఖాళీలు–8 పోస్టులు
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఎంబీబీఎస్‌తో పాటు మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాలో సభ్యత్వం కలిగి ఉండాలి.
- **ఎంపిక:** రాత పరీక్ష/ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **ఇంటర్వ్యూతేదీ:** జూలై 19
- **వెబ్‌సైట్:** www.aiimsbhopal.edu.in

## నర్సింగ్ ఆఫీసర్లు

**షిల్లాంగ్‌లోని నార్త్ ఈస్టర్న్ ఇందిరా గాంధీ రీజినల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ మెడికల్ సైన్సెస్ (NEIGRIHMS) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న కింది పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.**




- **మొత్తం పోస్టులు:** 264 (నర్సింగ్ ఆఫీసర్–231, హెల్త్ ఎడ్యుకేటర్–2, వార్డెన్/లేడీ వార్డెన్–1, ఫార్మసిస్ట్–1, జూనియర్ ల్యాబ్ టెక్నీషియన్–2, సీఎస్ఎస్‌డీ అసిస్టెంట్–1, టెక్నికల్ అసిస్టెంట్–24)
- **అర్హత:** గుర్తింపు పొందిన బోర్డు/సంస్థ నుంచి పదోతరగతి, ఇంటర్/డిప్లొమా, సంబంధిత విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత.
- **వయస్సు:** 2019 ఆగస్టు 19 నాటికి 30 నుంచి 35 ఏండ్ల మధ్య ఉండాలి.
- **అప్లికేషన్ ఫీజు:** జనరల్/ఓబీసీలకు రూ. 500/–, మిగతా అభ్యర్థులకు రూ. 250/–
- **ఎంపిక:** రాతపరీక్ష/ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఆగస్టు 19
- **వెబ్‌సైట్:** www.neigrihms.gov.in

నమస్తే తెలంగాణ
# చిత్రం
[ కరీంనగర్ ]
బుధవారం 17 జూలై 2019



రెజీనా , అడివిశేష్

## 'ఎవరు' డేట్ ఫిక్స్

అడివిశేష్, రెజీనా నాయకానాయికలుగా నటిస్తున్న చిత్రం 'ఎవరు'. పీవీపీ సినిమా పతాకంపై పరమ్ వి పొట్లూరి, పెరల్ వి పొట్లూరి, కెవిన్ అన్నె నిర్మిస్తున్నారు. వెంకట్ రామెజీ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. నవీన్‌చంద్ర కీలక పాత్రధారి. ఆగస్ట్ 15న ఈ చిత్రం విడుదలకానుంది. నిర్మాతలు మాట్లాడుతూ ''క్షణం' విజయం అనంతరం అడివిశేష్‌తో మా సంస్థ రూపొందిస్తున్న చిత్రమిది. ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్‌గా ఆద్యంతం ఉత్కంఠను పంచుతుంది. ఓ పోలీస్ ఎవరి కోసం అన్వేషణ సాగిస్తున్నాడన్నది ఆకట్టుకుంటుంది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి' అని తెలిపారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: వంశీ పచ్చిపులుసు, సంగీతం: శ్రీచరణ్ పాకాల.

## ఆగస్ట్ 15న 'రణరంగం'



కల్యాణి , శర్వానంద్

శర్వానంద్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'రణరంగం'. సుధీర్ వర్మ దర్శకుడు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగ వంశీ నిర్మిస్తున్నారు. కాజల్ అగర్వాల్, కల్యాణి ప్రియ దర్శన్ కథానాయికలు. చిత్రీకరణ పూర్తయింది. ఆగస్ట్ 15న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయబోతున్నారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. 1990-2000 సంవత్సరాల మధ్య జరిగిన సంఘటనల సమాహారమే చిత్ర ఇతివృత్తం. గ్యాంగ్‌స్టర్‌గా శర్వానంద్ పాత్ర చిత్రణ వైవిధ్యంగా సాగుతుంది. 90ల నాటి ఆయన లుక్ ప్రత్యేకంగా అనిపిస్తుంది. యాక్షన్ హంగులు, భావోద్వేగాల కలబోతగా అందరిని మెప్పిస్తుంది. ఈ చిత్ర విజయంపై పూర్తి విశ్వాసంతో ఉన్నాం' అన్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: దివాకర్‌మణి, సంగీతం: ప్రశాంత్‌పిళ్లై, ఎడిటర్: నవీన్ నూలి, మాటలు: అర్జున్, సమర్పణ: పి.డి.వి.ప్రసాద్, రచన-దర్శకత్వం: సుధీర్‌వర్మ.

## ఇరవై మంది వచ్చేవారు కాదు!

**విభిన్నమైన ఇతివృత్తాలు, ప్రయోగాత్మక పాత్రలతో విలక్షణ కథానాయకుడిగా పేరుతెచ్చుకున్నారు విక్రమ్. నవ్యతకు ఆయన సినిమాలు చిరునామాగా నిలుస్తుంటాయి. ప్రతి సినిమాలో నటుడిగా తనను తాను సరికొత్త పంథాలో ఆవిష్కరించుకునేందుకు తపిస్తుంటారాయన. ఆ శైలి ఆయనకు దక్షిణాదిన తిరుగులేని అభిమానగణాన్ని తెచ్చిపెట్టింది. విక్రమ్ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'మిస్టర్ కె.కె'. రాజేష్ ఎం.సెల్వ దర్శకుడు. ఈ నెల 19న విడుదలకానుంది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో విక్రమ్ పాత్రికేయులతో పంచుకున్న ముచ్చట్లివి..**



విక్రమ్

**'మిస్టర్ కె.కె.'లో మీకు నచ్చినదేమిటి?**

• అంతర్జాతీయ ప్రమాణాలతో తెరకెక్కుతున్న స్టైలిష్ యాక్షన్ సినిమా ఇది. గ్రే షేడ్స్‌తో కూడిన క్యారెక్టర్ చేశాను. నేను హీరోగా కనిపిస్తానా? ప్రతినాయకుడినా అన్నది తెరపై ఆసక్తిని పంచుతుంది

**క్యారెక్టర్ నచ్చి ఈ సినిమా చేశారా? కథకు ప్రాముఖ్యతనిచ్చారా?**

• సినిమాకు కథే ముఖ్యం. స్టోరీతో పాటు నా పాత్ర బాగుంటేనే నటిస్తాను. ఒక రోజులో జరిగే కథ ఇది. చాలా ఫాస్ట్‌పేస్‌లో సాగుతుంది.

**సినిమాలు పరాజయం పాలైనప్పుడు మీ ఆలోచన ధోరణి ఎలా ఉంటుంది?**

• నేనే నంబర్‌వన్‌గా ఉండాలని ఎప్పుడూ అనుకోను. సినిమా కుండా ప్రతిసారి ప్రేక్షకులకు మంచి సినిమాను అందించడానికి ప్రయత్నిస్తాను. అందువల్లే ఇన్నేళ్లయినా తమిళంలో టాప్ ఫైవ్ హీరోల్లో ఒకరిగా ఉన్నాను.

**హాలీవుడ్ శైలి సినిమా అంటున్నారు . తెలుగు ప్రేక్షకులకు ఏ మేరకు కనెక్ట్ అవుతుంది?**

• హాలీవుడ్ శైలికి మనవైన భావోద్వేగాల్ని మేళవించి రూపొందించాం. నేటివిటీ కంటే ఎమోషన్ మాత్రమే సినిమాతో ప్రేక్షకుల్ని కనెక్ట్ చేయడానికి ఉపయోగపడుతుంది. 'గేమ్ ఆఫ్ థ్రోన్' హాలీవుడ్ సినిమానే అయినా ఇక్కడి ప్రేక్షకులు ఆదరించారు. అలాగే 'బాహుబలి' ఇండియన్ సినిమాగా అన్ని భాషల్లో విజయాన్ని సాధించింది. కథల్లోని ఎమోషన్స్‌తో ప్రేక్షకులు కనెక్ట్ అవ్వడం వల్లే అవి విజయవంతమయ్యాయి. కథ, భావోద్వేగాలు బాగుంటే నేటివిటీ పట్టించుకోకుండా ప్రేక్షకులు సినిమా చూస్తారు.

**'అపరిచితుడు' తర్వాత బ్లాక్‌బాస్టర్ సక్సెస్ మీ కెరీర్‌లో లేదెందుకని? కథల ఎంపికలో మీ పంథా ఏమైనా మారిందని అనుకుంటున్నారా?**

• విజయాన్ని అందుకోవాలనే తపనతోనే ప్రతి ఒక్కరూ పనిచేస్తారు. నేనూ అంతే. డబ్బు కోసం కాకుండా బ్రేక్ వస్తుందనే విశ్వాసంతో నటిస్తాను. 'సేతు' సినిమాకు ముందు పది, పన్నెండు ఏళ్ల వరకు నాకు సరైన విజయం లేదు. నా సినిమాలకు థియేటర్లలో ఇరవై మంది కూడా ఉండేవారు కాదు. ఆ తర్వాత వరుసగా ఐదారేళ్లు నా సినిమాలన్నీ విజయం సాధించాయి. ఆ సమయంలో మీ విజయరహస్యం ఏమిటని అందరూ అడిగేవారు. జయాపజయాల్ని పట్టించుకోకుండా... అంటే నాకు ఇష్టం. డబ్బులు, స్టార్‌డమ్ ఇవన్నీ పక్కనపెట్టి విభిన్నమైన చిత్రాల్లో భాగమవ్వడానికే ప్రయత్నిస్తాను. ఇరవై, ముప్పై ఏళ్ల తర్వాత కూడా సినిమాల గురించి ప్రస్తావన వచ్చినప్పుడు నా పేరు అందరూ చెప్పుకునేలా ఉండాలి.

> **• 'ఆదిత్య వర్మ'లో నటించడానికి ముందు ధృవ్ అమెరికాలో మెథడ్ యాక్టింగ్‌లో శిక్షణ తీసుకుంటున్నాడు. ఐదేళ్ల తర్వాత సినిమాల్లో నటించాలనే ఆలోచనలో ఉండేవాడు. ఆ సమయంలో ధృవ్ నటించిన ఓ డబ్‌స్మాష్ వీడియో చూసి చిత్రబృందం ఈ రీమేక్ కోసం అడిగారు. సినిమా చేయాలా అని నన్ను అడిగినప్పుడు చేయమని చెప్పాను. తెలుగు మాతృక కూడా చూడలేదు. నా మాటకు కట్టుబడి నటించాడు. రొమాంటిక్ సన్నివేశాల్లో నా కంటే బాగా నటించాడు.**

**కమల్‌హాసన్ నిర్మాణంలో సినిమా చేయడం ఎలా ఉంది?**

• ఈ సినిమాలో కమల్‌హాసన్ హీరోగా నటించాల్సింది. కానీ రాజకీయాలతో బిజీగా ఉండటంతో నాకు ఆ అవకాశం వచ్చింది. ఆయన పాత్ర అనే ఆలోచన నిరంతరం మనసులోపెట్టుకొనే నటించాను. షూటింగ్ జరుగుతున్నప్పుడు రెండు సార్లు మాత్రమే సెట్స్‌కు వచ్చారు. నాకు పూర్తిగా స్వేచ్ఛనిచ్చారు. కమల్ హాసన్ ఇతర హీరోల గురించి ఎక్కువగా మాట్లాడరు. ఆడియో వేడుకలో నా క్యారెక్టర్, లుక్ గురించి మాట్లాడటం ఆనందాన్నిచ్చింది. సినిమా చూసి ఆయన బాగుందని చెప్పినప్పుడు సంతృప్తిగా ఫీలవుతాను.

**మణిరత్నంతో 'పొన్నియన్ సెల్వన్' సినిమా చేయబోతున్నట్లు తెలిసింది?**

• జనవరిలో ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభిస్తాం. టైటిల్ పాత్ర కోసం జయం రవిని తీసుకోవాలని మణిరత్నం భావిస్తున్నారు. అతడి పాత్రనేపథ్యంలో సాగే ఈ సినిమాలో నేనూ ఓ కీలక క్యారెక్టర్ చేయబోతున్నాను.

**తదుపరి సినిమా విశేషాలేమిటి?**

• గౌతమ్ మీనన్ దర్శకత్వంలో రూపొందుతున్న 'ధృవనక్షత్రం' చివరి షెడ్యూల్ చిత్రీకరణ పూర్తిచేయాల్సివుంది. అలాగే అజయ్ జ్ఞానముత్తుతో మరో సినిమా చేయబోతున్నాను.

**'అర్జున్‌రెడ్డి' రీమేక్‌లో మీ తనయుడు ధృవ్ యాక్టింగ్ చూసినప్పుడు ఏమనిపించింది? మీరు సెట్స్‌కు వెళ్లినప్పుడు ధృవ్ టెన్షన్‌గా ఫీలయ్యాడా?**

• రొమాంటిక్ సీన్స్, ముద్దు దృశ్యాల్లో నటించే సమయంలో మీరు సెట్స్‌లో ఉంటే నేను చేయలేను బయటకు వెళ్లండి నాన్న అని చెప్పేవాడు. నాన్న అని మర్చిపోయి అసిస్టెంట్ డైరెక్టర్‌గా భావించుకోమని చెప్పాను.

## నగ్నత్వాన్ని కళాత్మకంగా..

**మహిళా ప్రధాన ఇతివృత్తాల ఎంపికలో మరింత కొత్తదనానికి ప్రాధాన్యతనివ్వాలని అంటున్నది అమలాపాల్. నవీన మగువ ప్రతిరంగంలో తనదైన ప్రభావాన్ని చూపిస్తున్నదని, వారి కథలు వెండితెరపై దృశ్యమానం కావాలన్నదే తన అభిలాష అని చెప్పింది. ఆమె కథానాయికగా నటించిన తమిళ చిత్రం 'అడై' తెలుగులో 'ఆమె' పేరుతో అనువాదమవుతున్నది. రత్నకుమార్ దర్శకుడు. ఈ నెల 19న ప్రేక్షకులముందుకురానుంది. ఈ సందర్భంగా అమలాపాల్ పాత్రికేయులతో పంచుకున్న ముచ్చట్లివి..**



అమలాపాల్

తెలుగులో ఇప్పటివరకు ఐదు సినిమాలు చేశాను. ఇటీవలకాలంలో తెలుగులో ఆఫర్లు వచ్చాయి కానీ కథలు నచ్చక అంగీకరించలేదు. ఇన్నోవేటివ్ కాన్సెప్ట్స్, మహిళా ప్రధాన సబ్జెక్ట్స్ వస్తే తెలుగు సినిమా చేద్దామనుకున్నాను. కానీ అలాంటి అవకాశాలు రాలేదు. కీర్తి సురేష్ నటించిన 'మహానటి' నాకు బాగా నచ్చింది. అభినయానికి ఆస్కారం ఉన్న అలాంటి పాత్రలు చేయాలని ఉంది. ప్రస్తుతం నేను తమిళ పరిశ్రమ మీద దృష్టిపెట్టాను. మలయాళంలో ఓ సినిమా చేస్తున్నాను. ఏ భాషా చిత్రాల్లోనైనా నవ్యమైన ఇతివృత్తాల కోసం ఎదురుచూస్తున్నాను. లేడీ ఓరియెంటెడ్ కథలు, మహిళాసాధికారతను చర్చించే ఇతివృత్తాలు చాలా వస్తున్నాయి. అలాంటి వాటికి భిన్నంగా మహిళల చుట్టూ పరిభ్రమించే వినూత్న కథలు చేయాలనుకుంటున్నాను.

**నటిగా పరిణితి సాధించాను..**

కెరీర్ ఆరంభంలో చాలా కమర్షియల్ చిత్రాలు చేశాను. అయితే ఈ ప్రయాణంలో నాలో మార్పు వచ్చింది. నటిగా ఎంతో పరిణితి సాధించాను. వినూత్న కథాంశాల్ని ఎంపిక చేసుకోవాలనే తపన పెరిగింది. సినిమాల ద్వారా డబ్బులు సంపాదించుకుందామనే ధ్యాస కన్నా అందరికి గుర్తుండిపోయే మంచి సినిమాలు చేయాలనే సంకల్పం ఎక్కువైంది. అంత మాత్రాన కమర్షియల్ సినిమాలకు దూరం కాను. వాటిలో కూడా ప్రయోగాత్మక కథలకు ప్రాధాన్యతనివ్వాలనుకుంటున్నాను.

**అశ్లీలత లేకుండా ఆవిష్కరించాం...**

'ఆమె' చిత్రంలో కథాంశపరంగా నగ్నత్వం అనే అంశం ఉంటుంది. దానిని హద్దులు మీరకుండా సినిమాలో చూపించాలనుకున్నాం. అశ్లీలత లేకుండా చక్కటి సౌందర్యభావనతో కళాత్మకంగా ఆ సన్నివేశాల్ని తెరకెక్కించాం. కథలో భాగంగానే ప్రేక్షకులు ఆ సీన్స్‌ను స్వీకరిస్తారు. ఈ సినిమాలో నేను కామిని అనే యువతి పాత్రలో కనిపిస్తాను. ఆమె ఎవరి మెప్పు పొందాలని ప్రయత్నించదు. కొంచెం స్వార్థం ఎక్కువ. ఎవరిని లెక్కచేయనితనంతో అతిచురుకైన అమ్మాయిగా కనిపిస్తుంది. భిన్న పార్శ్వాలున్న ఆ పాత్రను పోషించడం సవాలుగా తీసుకున్నాను. కొద్ది సంవత్సరాల క్రితం వరకు నేను కూడా కామినిలాంటి దృక్పథంతో ఉండేదాన్ని (నవ్వుతూ). జీవితం నేర్పిన పాఠాలతో పాటు యోగాలో శిక్షణ తీసుకోవడంతో ఇప్పుడు మనసుకు ప్రశాంతత చేకూరింది.

**పంథా మారాలి...**

సమకాలీన సినిమాలో కథానాయికను గ్లామర్ కోణంలో చూసే 80ల కాలం నాటి భావజాలం క్రమంగా తొలగిపోతున్నది. నేటి సమాజంలో మహిళలు అత్యంత శక్తివంతులుగా ఎదుగుతున్నారు. నవీన మగువ ప్రతి రంగాన్ని ప్రభావితం చేస్తున్నది. వారి చుట్టు ఉన్న కథల్ని చూపించాల్సిన అవశ్యకత ఉంది. తెలుగులో మంచి అవకాశాల కోసం ఎదురుచూస్తున్నాను. రాజమౌళిగారి దర్శకత్వంలో నటించాలన్నది నా డ్రీమ్. ప్రస్తుతం తమిళంలో 'కడావర్' అనే చిత్రాన్ని చేస్తున్నాను. ఇదొక ఫోరెన్సిక్ థ్రిల్లర్ చిత్రం. కేరళకు చెందిన లెజెండరీ ఫోరెన్సిక్ సర్జన్ ఉమా దత్తన్ జీవిత కథ ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నాం. నేనే నిర్మాతగా వ్యవహరిస్తున్నాను. ఈ చిత్రాన్ని తమిళ, తెలుగు భాషల్లో నిర్మించబోతున్నాను.